అనుదినం... జనస్వరం
www.navatelangana.com

నవతెలంగాణ

ఆదివారం 25-08-2024
సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 237 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు + వెబ్‌లో (సోపతి) వెల : 8.00


కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌తో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ఆర్థిక సాయం చేయండి

వడ్డీ రేట్లు తగ్గించండి

పెండింగ్ బకాయిలు చెల్లించాలి :
కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు
రాష్ట్ర ఆర్థిక మంత్రి భట్టి విజ్ఞప్తి

గత ప్రభుత్వం అప్పులు రూ.31,795 కోట్లను రీ షెడ్యూల్ చేసి ఉపశమనం కల్పించాలి

నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రానికి ఆర్థిక సహాయం చేయాలని, గడిచిన పదేండ్లలో నాటి బీఆర్ఎస్ సర్కార్ తెచ్చిన అప్పులకు వడ్డీ రేట్లు తగ్గించాలని డిప్యూటీ సీఎం, రాష్ట్ర ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం నాడిక్కడ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో రాష్ట్ర ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క భేటి అయ్యారు. దాదాపు అరగంట పాటు సాగిన ఈ భేటీలో రాష్ట్రానికి సంబంధించిన ఎనిమిది ఆర్థిక పరమైన అంశాలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక స్థితిగతులను కేంద్ర మంత్రికి వివరించి సహాయం అందించాలని కోరినట్టు తెలిపారు. కేంద్ర ప్రాయోజిత పథకాల నిధుల ...15లో



హైడ్రా దూకుడు..

భారీ బందోబస్తు, జేసీబీలతో అక్రమ కట్టడాలపై పంజా

మరోవైపు ఆపరేషన్ ఆపాలని ఒత్తిడి
తలొగ్గకుండా ముందుకు 3లో..
నాగార్జున ఎన్ కన్వెన్షన్ నేలమట్టం

కూల్చివేతలు ఆపండి
హైకోర్టు ఉత్తర్వులు
వివరాలు 6లో..

అనుమతుల్లేవ్
హైడ్రా కమిషనర్ రంగనాథ్
వివరాలు 3లో..



నోటీసులివ్వలేదు
నటుడు అక్కినేని నాగార్జున
వివరాలు 3లో..

వక్ఫ్‌బోర్డు చట్ట సవరణ అభ్యంతరకరం

- మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలి
- అన్ని మతాల్లో పురుషాధిక్యతను తగ్గించాలి
- అగ్రిస్టాక్‌తో రైతులకు తీవ్రనష్టం
- భూముల వివరాలు కార్పొరేట్ సంస్థలకు చేరే అవకాశం
- వ్యవసాయ చట్టాలను పరోక్షంగా అమలు చేస్తున్న కేంద్రం : సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు
- హైడ్రా.. డ్రామా కావొద్దు : తమ్మినేని

భూ సమస్యపై 29న రెవెన్యూ కార్యాలయాల వద్ద ధర్నా

బీజేపీది మత విభజన సృష్టించి ఓట్లు పొందాలన్న దుర్బుద్ధి

కమ్యూనల్ సివిల్ కోడ్ అంటూ రెచ్చగొడుతున్న ప్రధాని


మాట్లాడుతున్న బీవీ రాఘవులు. చిత్రంలో తమ్మినేని వీరభద్రం, ఎస్.వీరయ్య

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వక్ఫ్‌బోర్డు చట్టాన్ని సవరించి మార్పులు చేయాలనుకోవడం అభ్యంతరకరమని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు అన్నారు. సంకీర్ణ ప్రభుత్వాన్ని నడిపిస్తున్నాననే స్పృహ లేకుండా ప్రధాని మోడీ దూకుడుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మతతత్వ ఆలోచనలను విడిచిపెట్టకుండా కొనసాగిస్తున్నారని చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోటలో జాతినుద్దేశించి చేసిన ప్రసంగమే అందుకు నిదర్శనమన్నారు. శుక్రవారం సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశం, శనివారం ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశాన్ని హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్యతో కలిసి రాఘవులు మాట్లాడారు. ఒక మతంలో ఇంకో మతస్తులుండొద్దంటూ బీజేపీ నేతలు చెప్తారని గుర్తు చేశారు. వక్ఫ్‌బోర్డులో మాత్రం ఇతర మతస్తులను చేర్చి నియంత్రించాలని చెప్తున్నారని అన్నారు. ఈ ద్వంద్వ ప్రమాణాలేంటని ప్రశ్నించారు. దయాదాక్షిణ్యాలతో ఇచ్చిన భూములను నియంత్రించడమే వక్ఫ్‌బోర్డు పని అని చెప్పారు. వాటి మీద ప్రభుత్వం పెత్తనానికి పూనుకోవడం న్యాయం కాదన్నారు. అవినీతిపై ఫిర్యాదులు వస్తే ప్రభుత్వం స్పందిస్తే బాగుంటుందని అన్నారు. హర్యానా, జమ్ముకాశ్మీర్, మహారాష్ట్ర, జార్ఖండ్‌లో ఎన్నికలు జరుగుతున్నాయనీ, దుర్బుద్ధితో మత విభజనను సృష్టించి ఓట్లు పొందాలని బీజేపీ చూస్తున్నదని విమర్శించారు.

ప్రధాని హోదాకు తగదు

యూనిఫామ్ సివిల్ కోడ్, కామన్ సివిల్ కోడ్‌లో లోపాలుంటే సవరించుకోవచ్చునీ, దానికి కమ్యూనల్ సివిల్ కోడ్‌గా మారుపేరు పెట్టి ప్రధాని మోడీ మత దురభిప్రాయాన్ని రెచ్చగొడుతున్నారని రాఘవులు చెప్పారు. కింది స్థాయి వ్యక్తుల వ్యాఖ్యలు అర్థం చేసుకోవచ్చునీ, ఇది ప్రధాని హోదాకు తగదని అన్నారు. దేశాన్ని ఐక్యంగా ఉంచాల్సిన వ్యక్తి చీలికలు తెస్తున్నారని విమర్శించారు. యూనిఫామ్ సివిల్ కోడ్‌ను మారుస్తామంటున్నారనీ, ఉత్తరాఖండ్‌లో మార్చారనీ, అనేక పరిణామాలు జరిగాయని వివరించారు. అన్ని మతాల్లో పురుషాధిక్యత కొనసాగుతున్నదనీ, దాన్ని తగ్గించాలని కోరారు. వివిధ మతాల్లో మహిళలకు సమాన అవకాశాలను కల్పించాలని డిమాండ్ చేశారు. అలా చేయకుంటే మహిళలు, మైనార్టీలకు మేలు జరగబోదని అన్నారు. స్వార్థపూరిత, ఓట్ల రాజకీయాల కోసం మతాన్ని ఓ సాధనంగా వాడుకోవడాన్ని తీవ్రంగా వ్యవరేకిస్తున్నామని చెప్పారు.

బహుళజాతి సంస్థల లాభం కోసమే అగ్రిస్టాక్

అగ్రిస్టాక్ పేరుతో మనిషికి ఆధార్ కార్డు ఉన్నట్టు భూ యజమానులకు గుర్తింపు కార్డులను ఇచ్చి భూములను ...3లో

భూ సమస్యపై అఖిలపక్షాన్ని పిలవాలి : తమ్మినేని



భూ సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవద్దనీ, అఖిలపక్షాన్ని పిలవాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. రుణమాఫీపై కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మాటలయుద్ధం కొనసాగుతున్నదని చెప్పారు. అసలు సమస్యను పక్కదోవ పట్టిస్తున్నారని అన్నారు. ఇప్పటి వరకు రూ.రెండు లక్షల వరకు రుణమాఫీ జరిగిందనీ, రూ.18 వేల కోట్లు జమ చేశామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారని గుర్తు చేశారు. రూ.31 వేల కోట్లు జమ చేస్తామంటూ ప్రభుత్వం ప్రకటించిందన్నారు. అంటే ఇంకా 40 శాతం రుణమాఫీ కాలేదని చెప్పారు. ఈ సమస్యను ...3లో

అర్బన్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్‌కు భూమి కేటాయించండి

- సీఎం రేవంత్‌కు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎయిమ్స్ బీబీనగర్‌కు అనుబంధంగా అర్బన్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి హైదరాబాద్‌లో రెండెకరాల భూమిని కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి శనివారం లేఖ రాశారు. అప్పటి వరకూ తాత్కాలికంగా నగరంలో ఏదైనా ప్రభుత్వ భవనాన్ని కేటాయించాలని కోరారు. "ఎయిమ్స్ బీబీనగర్ హైదరాబాద్ నగరంలో ఒక అర్బన్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. కేంద్రం ద్వారా వైద్య విద్యార్థులకు అవసరమైన బోధన, శిక్షణ కార్యక్రమాలకు అనువుగా ఉంటుంది. అలాగే నగర ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడానికి వీలుగా ఉంటుంది. సీఎం ప్రత్యేక దృష్టి సారించి భూమి కేటాయించాలి" అని లేఖలో కిషన్‌రెడ్డి కోరారు.

ప్రజాస్వామ్యంలో ఎన్నికలు భాగం మాత్రమే

- ప్రొఫెసర్ హరగోపాల్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

"ఎన్నికలే ప్రజాస్వామ్యం కాదు, అందులో భాగం మాత్రమే. ప్రజాస్వామ్య పరిరక్షణ కొరకు నిరంతర ప్రక్రియ కొనసాగుతూనే ఉండాలి" అని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్‌లో శనివారం నుంచి రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న రాజకీయ శిక్షణ తరగతుల్లో మొదటి రోజు మొదటి ప్రజాస్వామ్య పరిరక్షణ - మన కర్తవ్యాలు అనే అంశంపై ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్య ప్రాముఖ్యత, సమాజం బాధ్యతపై హరగోపాల్ సుదీర్ఘంగా వివరించారు. 'సంస్థాగత నిర్మాణాలు- వ్యూహాలు" అనే అంశంపై ప్రొఫెసర్ శాంతిసీన్హా, ప్రొఫెసర్ ఆర్ వెంకటరెడ్డి ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాయకులు అన్ని వర్గాలను కలుపుకొని ముందుకు సాగాలనీ, నిత్యం ప్రజల్లో ఉంటూ పని చేయాలని కోరారు. రెండో రోజూ పార్టీ సంస్థాగత నిర్మాణం, త్వరలో జరగనున్న ప్లీనరీ గురించి చర్చించనున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి.

చంద్రబాబుతో మందకృష్ణ భేటీ



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

తెలుగుదేశం అధినేత, ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ కలిశారు. శనివారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లోని బాబు నివాసానికి వెళ్లారు. వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన నేపథ్యంలో బాబుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సమకాలీన రాజకీయాలపై కొద్దిసేపు చర్చ జరిగినట్టు తెలిసింది.

నేడు ఎన్టీఆర్ భవన్‌కు బాబు

చంద్రబాబు ఆదివారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని టీడీపీ రాష్ట్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌కు రానున్నారు. కొంతకాలంగా రాష్ట్ర అధ్యక్షుడి నియామకం పెండింగ్‌లో ఉన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ముఖ్యనేతలతో బాబు భేటీ అవుతారని సమాచారం. త్వరలో పార్టీ తెలంగాణ శాఖ అధ్యక్షుడిని నియమించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాగే పార్టీ సభ్యత్వ నమోదు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించే అవకాశాలు ఉన్నాయని తెలిసింది.

బాలగోపాల్ రచనలే వర్గీకరణకు స్ఫూర్తి: మందకృష్ణ

మానవహక్కుల నేత బాలగోపాల్ సతీమణి వసంతలక్ష్మిని మందకృష్ణ కలిశారు. నగరంలోని బాలగోపాల్ ఇంటికి వెళ్లిన మందకృష్ణ, ఎస్సీ వర్గీకరణ, సుప్రీంకోర్టు తీర్పు తదితర అంశాలపై ఆమెతో మాట్లాడారు. ఈ సందర్భంగా బాలగోపాల్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాట్లాడుతూ ప్రజాదృక్పథంతో అభిప్రాయాలను నిర్ధష్టంగా నిక్కచ్చిగా చెప్పడంలో బాలగోపాల్‌ను మించిన మేధావి లేరన్నారు.

2004లో ఎస్సీ వర్గీకరణను రద్దుచేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తప్పుపడుతూ అద్భుతమైన వ్యాసాలు రాసి, ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగబద్ధంగా ఎంత న్యాయమైనదో, రాష్ట్రాలు అధికారాలు ఎలా కలిగి ఉన్నాయో స్పష్టంగా తెలియజేశారని అన్నారు. ఆయన రాసిన రచనలు తాజా సుప్రీంకోర్టు తీర్పుకు దారిచూపాయని వ్యాఖ్యానించారు. ఇప్పుడు బాలగోపాల్ ఉండి ఉంటే ఎంతో సంతోషించేవారని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవింద్ నరేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ కంపెనీలకు వద్దు

- భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డుల ద్వారానే అమలు చేయాలి
- అడ్వయిజరీ కమిటీ నియమించాలి : కార్మిక శాఖ కమిషనర్‌కు టీబీఓసీడబ్ల్యూఎఫ్ విజ్ఞప్తి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డులో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను టెండర్ ద్వారా ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించాలనే ప్రతిపాదనను విరమించుకోవాలని తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ (టీబీఓసీడబ్ల్యూఎఫ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఫెడరేషన్ గౌరవాధ్యక్షులు వంగూరు రాములు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్ రామ్మోహన్, ఆర్ కోటంరాజు, ఉపాధ్యక్షులు ఏ రాజు శనివారం కార్మిక శాఖ డైరెక్టర్ కృష్ణ ఆదిత్యను కలిసి వినతిపత్రం సమర్పించారు. బోర్డు అడ్వయిజరీ కమిటీని నియమించి, నిధులు దుర్వినియోగం కాకుండా కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో 24 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు 54 వృత్తుల్లో పనిచేస్తున్నారనీ, వీరంతా సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన అట్టడుగు వర్గాల వారేనని తెలిపారు. ఆ కుటుంబాలకు బోర్డు ద్వారా 11 రకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. వీరికి సంబంధించి అనేక సమస్యలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయనీ, వాటిపై దృష్టి పెట్టాల్సిన సమయంలో ప్రభుత్వం టెండర్లు పిలిచి, ఉన్న సంక్షేమ పథకాలను కూడా ఇన్సూరెన్స్ కంపెనీలకు కట్టబెట్టాలని చూడటం సరికాదనీ, అలాంటి ఆలోచనలు విరమించుకోవాలని కోరారు.

ప్రజారోగ్యాన్ని గాలికొదిలేసిన సర్కార్

ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని వీడాలి : మాజీమంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



ప్రజారోగ్య సంరక్షణను ప్రభుత్వం గాలికొదిలేసిందనీ, ఇప్పటికైనా సర్కార్ తన నిర్లక్ష్యాన్ని విడాలని మాజీ మంత్రి టి హరీశ్‌రావు శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ తొమ్మిదేండ్ల పాలనలో వైద్య రంగం ఉన్నత శిఖరాలకు చేరిందని గుర్తు చేశారు. దేశానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. అనేక విప్లవాత్మక పథకాలకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. తొమ్మిది నెలల కాంగ్రెస్ పాలనలో వైద్యారోగ్య రంగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలన పుణ్యమా అని మళ్లీ.. "నేను రాను బిడ్డ సర్కారు దవాఖానానకు" అనే రోజులు పునరావృతం అయ్యాయని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో వైద్యారోగ్యశాఖ నిర్లక్ష్యం పేద ప్రజలకు శాపంగా మారిందని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఘనతను చాటేలా వార్తలు వస్తే, కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఆస్పత్రుల అధ్వాన్న పరిస్థితుల గురించి రోజూ వార్తలు వస్తున్నాయని తెలిపారు. వానాకాలం ముందస్తు చర్యలు తీసుకోకపోవడం, ఆస్పత్రుల సన్నద్ధతపై సమీక్షలు నిర్వహించకపోవడం, పారిశుధ్యాన్ని పట్టించుకోకపోవడం వల్ల మలేరియా, డెంగ్యూ లాంటి సీజనల్ రోగాలు విజృంభిస్తున్నాయని తెలిపారు. పల్లె, పట్టణం అని తేడా లేకుండా వైరల్ ఫీవర్లతో ప్రతి ఇద్దరిలో ఒకరు బాధపడుతున్నారని పేర్కొన్నారు. ఆస్పత్రుల్లో పడకలు దొరకని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. గడచిన నెలన్నర కాలంలో 5,246 డెంగ్యూ కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. గత ఏడాదితో పోలిస్తే 36శాతం డెంగ్యూ కేసులు అధికంగా నమోదయ్యాయని అధికారిక లెక్కలు తెలుపుతున్నాయని గుర్తు చేశారు. ఒక్కరోజే ఐదుగురు డెంగ్యూ వల్ల మరణించారని తెలిపారు. జ్వరాలతో ప్రజలు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి వచ్చిందంటే రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే వైద్య ఆరోగ్యశాఖపై అత్యవసర సమీక్ష నిర్వహించాలనీ, ప్రజా ఆరోగ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు.

గెస్ట్ లెక్చరర్లను నియమించాలి : టిగ్లా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో కాంట్రాక్టు అధ్యాపకులను రెన్యూవల్ చేయకపోవడం, గెస్ట్ లెక్చరర్లను కొనసాగించకపోవడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలంగాణ ఇంటర్మీడియెట్ గవర్నమెంట్ లెక్చరర్ల సంఘం (టిగ్లా) తెలిపింది. విద్యార్థులకు బోధన అందక ఇబ్బందులు పడుతున్నారని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల రామకృష్ణగౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చాలా కాలేజీల్లో మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాల్లేక విద్యార్థులు ఆవేదన చెందుతున్నారని పేర్కొన్నారు. ఆరోగ్యపరమైన సమస్యలు వచ్చే అవకాశముందని తెలిపారు. రాష్ట్రంలో వందల సంఖ్యలో ప్రయివేటు జూనియర్ కాలేజీలకు ఇంటర్ బోర్డు అనుమతులు ఇవ్వకపోవడం వల్ల వాటిలో చేరిన విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. వాటికి గుర్తింపు రాకుంటే విద్యార్థులు నష్టపోతారని తెలిపారు.

కార్పొరేట్ ఆస్పత్రుల దోపిడీపై ఉద్యమం

- పీవైఎల్, పీవోడబ్ల్యూ


నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రుల దోపిడీపై దశలవారీగా ఉద్యమం చేపడతామని పీవైఎల్, పీవోడబ్ల్యూ ప్రకటించాయి. శనివారం హైదరాబాద్‌లోని మార్క్స్ భవన్‌లో ఉమ్మడి సంఘాల రాష్ట్ర కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షులు కెఎస్ ప్రదీప్, పీవోడబ్ల్యూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి స్వరూప, సిహెచ్ శిరోమణి ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజల ఆదాయంలో సగానికిపైగా విద్యావైద్యానికే ఖర్చు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరైన వైద్యం అందకపోవడంతో ప్రయివేటు ఆస్పత్రులకు అనివార్యంగా వెళ్లాల్సిన పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని అనవసరమైన టెస్టులు, సర్జరీలు చేస్తున్నాయని విమర్శించారు. మెడికల్ మాఫియా రాజ్యమేలుతుందని తెలిపారు. ఇష్టారాజ్యంగా దోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్తే ఆస్తులను అమ్ముకునే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రుల దోపిడీపై దశలవారీ ఉద్యమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ఆ దోపిడీని అరికట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



కరెంటోళ్ల కారుణ్యం

చిన్న మార్పుతో చిన్ని ప్రాణులకు మేలు



ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద సిలికాన్ క్లాంపులు ఏర్పాటు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కరెంటు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద నిత్యం బల్లి, పిల్లి, పావురం, ఉడత, ఉడుము వంటి మూగ జీవాలు (సరీసృపాలు) తిరుగుతుండటం చూస్తూనే ఉంటాం. అనేక సందర్భాల్లో అవి ఫ్యూజ్ సెట్ల మీద, బ్రేకర్స్, లింబ్స్, లైవ్ కరెంటు పాయింట్, ఎర్త్ పాయింట్లను వేరు చేసే ఇన్సులేటర్ (పింగాణి) ప్లేట్ల మీద పాకుతుంటాయి. అనేక సందర్భాల్లో అక్కడి మెటల్ క్లాంపులకు తగిలి కరెంట్ షాక్‌తో మరణిస్తూ ఉంటాయి. అదే సమయంలో కరెంటు సరఫరా కూడా నిలిచిపోతూ ఉంటుంది. సరఫరాను పునరుద్ధరించడానికి కరెంటు సిబ్బంది కష్టపడాల్సి ఉంటుంది. ఇటీవల పవర్ కట్స్‌కు సంబంధించిన ఫైళ్లను పరిశీలిస్తున్నప్పుడు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) సీఎమ్‌డీ ముషారఫ్ ఫరూఖీ దృష్టి వీటిపై పడింది. మూగజీవాల మరణాలను నిలుపుదల చేస్తూనే, కరెంటు కోతలు లేకుండా చూడాలని పరిశీలన చేశారు. ఈ సమస్యతోనే 14 శాతం ట్రిప్పింగ్స్ జరుగుతున్నాయని గమనించారు. ఇంటర్నెట్‌లో పరిశోధించారు. చివరకు పరిష్కారాన్ని విద్యుత్ అధికారులకు సూచించారు. ప్రస్తుతం హార్న్ గ్యాప్ ఫ్యూజ్ వద్ద మెటల్ క్లాంప్‌లు వినియోగిస్తున్నారు. వీటి స్థానంలో ప్రత్యేకంగా రూపొందించిన ఫైబర్ రెయిన్‌ఫోర్స్‌డ్ పాలిమర్ సిలికాన్ క్లాంప్‌ల ఏర్పాటుతో ఈ సమస్యలకు చెక్ పెట్టొచ్చని నిర్ధారించారు. మూగ జీవాలు ఈ క్లాంపుల మీదుగా పాకినా, నడిచినా ఎలాంటి ప్రమాదం ఉండదు. కరెంటు సరఫరాకూ ఆటంకం ఏర్పడదు. ఈ సిలికాన్ క్లాంపుల్ని తొలి విడతలో చెట్లు అధికంగా వుండి సరీసృపాల బెడద అధికంగా వున్న ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అలాంటి మూడువేల ప్రాంతాలను గుర్తించి వీటిని ఏర్పాటు చేయాలని అధికారుల్ని ఆదేశించారు. ఈ చిన్న మార్పుతో మూగ జీవాల ప్రాణాలు కాపాడటంతో పాటు విద్యుత్ అంతరాయాలను కట్టడి చేసే అవకాశం వుంటుందని ఈ సందర్భంగా సీఎమ్‌డీ ముషారఫ్ ఫరూఖీ తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగానే ఉన్నాం

- ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు కృషి చేస్తున్నాం
- ప్రతి ఏడాదిలాగానే ఈ ఏడాదీ జ్వరాలొస్తున్నాయి
- అరికట్టేందుకు అన్ని రకాల చర్యలు చేపడుతున్నాం
- ప్రజలను భయపెట్టేలా ప్రకటనలు చేయొద్దు : మీడియా సమావేశంలో డీపీహెచ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగానే ఉన్నామని, ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ బి రవీంద్రనాయక్ చెప్పారు. శనివారం హైదరాబాద్‌లోని డీపీహెచ్ కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. వాతావరణం మారినప్పుడు జ్వరం, డెంగ్యూ, మలేరియా లాంటి వ్యాధులు సంభవించటం సహజమేనన్నారు. వాటి నివారణకు తగిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ ఏడాది ఇప్పటి వరకు రాష్ట్రంలో 4,648 డెంగ్యూ కేసులు నమోదయ్యాయని వెల్లడించారు. 10 జిల్లాల్లో ఆ కేసుల ప్రభావం ఎక్కువగా ఉందన్నారు. ఒక్క హైదరాబాద్ జిల్లాలోనే 1,697 కేసులు నమోదయ్యాయని వెల్లడించారు. ఆ తర్వాత ఖమ్మం, సంగారెడ్డి జిల్లాల్లో ఎక్కువ కేసులు నమోదవుతున్నాయని తెలిపారు. అయితే డెంగ్యూ కేసుల గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. డెంగ్యూతో ఎవరూ చనిపోలేదనీ, వారిని భయానికి గురిచేసేటట్టు మాట్లాడొద్దని సూచించారు. వారి మానసిక స్థైర్యాన్ని దెబ్బతీయొద్దని సూచించారు. బాధితులందరికీ తగిన విధంగా చికిత్స అందుతోందని వివరించారు. సంబంధిత మంత్రితో పాటు హెచ్‌ఓడీలు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారని తెలిపారు. జిల్లా కలెక్టర్లు సైతం క్షేత్ర స్థాయి పరిశీలన చేస్తున్నారని వివరించారు. దోమల నివారణకు కృషి జరుగుతున్నదనీ, ఇందుకోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని స్పష్టం చేశారు. ఇంటింటికి సర్వే చేస్తున్నామనీ, గ్రామాలు, మున్సిపాలిటీల్లో అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తతతో ఉన్నారని వివరించారు. రాష్ట్రంలో మొత్తం 42 ల్యాబులున్నాయనీ, 33 జిల్లాల్లో అంబులెన్స్‌లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడా మంకీ పాక్స్ కేసులు నమోదు కాలేదని తెలిపారు. అయినా డబ్ల్యూహెచ్‌ఓ ఆదేశాల మేరకు అప్రమత్తంగా ఉన్నామని చెప్పారు. ఇప్పటికే గాంధీ ఆస్పత్రిలో ప్రత్యేకంగా ఐసోలేషన్ బెడ్లను ఏర్పాటు చేశామని తెలిపారు. వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

వచ్చేనెల రెండున కలెక్టరేట్ల ముట్టడి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో సమగ్ర కులగణనను వెంటనే ప్రారంభించి, బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలనే డిమాండ్‌తో వచ్చే నెల రెండో తేదీన రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్లను ముట్టడించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 26న కలెక్టరేట్లను ముట్టడించాలని నిర్ణయించినప్పటికీ అదే రోజు శ్రీకృష్ణ జన్మాష్టమి ఉండటం వల్ల సెప్టెంబర్ రెండుకు కార్యక్రమాన్ని మార్చినట్టు తెలిపారు. ముట్టడిలో రాజకీయ పార్టీలకతీతంగా బీసీలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

తగ్గుతున్న మోడీ బ్రాండ్ ఇమేజ్

• అదే బాటలో అమిత్, యోగి • రాహుల్‌కు పెరుగుతున్న ప్రజాదరణ

ఎన్నికలొస్తే కాంగ్రెస్ స్కోరు సెంచరీ దాటేస్తుంది

- ఓట్లూ పెరుగుతాయి
- హర్యానాలో ప్రభుత్వం కాంగ్రెస్‌దే : 'ఇండియా టుడే' మూడ్ ఆఫ్ ది నేషన్ సర్వే



ప్రధాని మోడీకి ప్రజాదరణ తగ్గిపోతోందని సర్వే తేల్చి చెప్పింది. ఆయన పనితీరు పట్ల ఇప్పటికీ మెజారిటీ ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నప్పటికీ ప్రజాదరణ మాత్రం క్రమేపీ తగ్గుతూ వస్తోంది. మోడీ పనితీరు బాగుందని 2020 ఆగస్టులో ఏకంగా 78 శాతం మంది అభిప్రాయపడ్డారు. అయితే నాలుగు సంవత్సరాలకే అది 59 శాతానికి పడిపోయింది. మోడీ పనితీరుపై 22 శాతం మంది పెదవి విరవడం గమనార్హం.

న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ప్రకటించి రెండు నెలలు దాటింది. ఈ ఫలితాలు ప్రతిపక్ష పార్టీలకు...ముఖ్యంగా కాంగ్రెస్‌కు ఊపిరి పోశాయి. ఎన్నికల అనంతరం జరిగిన మొదటి పార్లమెంట్ సమావేశాల్లో ప్రతిపక్షాలు అనేక అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీసి ఇరుకున పెట్టాయి. ప్రధాని నరేంద్ర మోడీ బ్రాండ్ ఇమేజ్ కూడా క్రమేపీ మసకబారుతోంది. ఈ నేపథ్యంలో ఇప్పటికిప్పుడు దేశంలో సార్వత్రిక ఎన్నికలు జరిగితే ఫలితాలు ఎలా ఉంటాయనే దానిపై 'ఇండియా టుడే' పత్రిక మూడ్ ఆఫ్ ది నేషన్ (ఎంఓటీఎన్) పేరిట తాజాగా సర్వే నిర్వహించింది. ఇండియా టుడే కోసం సీఓటర్ సంస్థ జూలై 15వ తేదీ నుండి ఈ నెల 10వ తేదీ వరకూ సర్వే నిర్వహించింది. లోక్‌సభలోని మొత్తం 543 నియోజకవర్గాల్లోని 40,591 మంది నుండి అభిప్రాయాలు సేకరించారు.

కాంగ్రెస్ ఓట్లు, సీట్లు పెరుగుతాయి

ఇప్పుడు సార్వత్రిక ఎన్నికలు జరిగితే బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ బలంలో పెద్దగా మార్పు ఉండకపోవచ్చునని సర్వే తెలిపింది. అయితే కాంగ్రెస్ స్కోరు మాత్రం సెంచరీ దాటుతుందని చెప్పింది. మోడీ 3.0 ప్రభుత్వం మూడో నెలలో అడుగు పెట్టిన నేపథ్యంలో జరిపిన సర్వే ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. ఎన్డీఏ బలం మరో ఆరు స్థానాలు పెరిగి 299కి చేరుతుంది. ప్రతిపక్ష ఇండియా కూటమి ఒక స్థానాన్ని కోల్పోయి 233 సీట్లు కైవసం చేసుకుంటుంది. పార్టీల వారీగా చూస్తే బీజేపీకి మరో నాలుగు స్థానాలు అదనంగా వస్తాయి. అంటే ఆ పార్టీ 244 సీట్లు గెలుచుకుంటుందన్న మాట. దాని ఓట్ల శాతం కూడా స్వల్పంగా పెరుగుతుంది. ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ ఓట్ల శాతం 37.7 నుండి 36.56కి తగ్గింది. ఇప్పుడు ఎన్నికలు జరిగితే ఆ పార్టీకి 38 శాతం ఓట్లు రావచ్చునని సర్వే అంచనా వేసింది. మొత్తంగా చూస్తే ఎన్డీఏకు 43.7 శాతం ఓట్లు రావచ్చు.

ఇక ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ తన బలాన్ని గణనీయంగా పెంచుకుంటుందని ఎంఓటీఎన్ సర్వే చెబుతోంది. ఇప్పుడు ఎన్నికలు జరిగితే ఆ పార్టీకి 106 స్థానాలు వస్తాయి. 2014 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వచ్చింది కేవలం 44 సీట్లు మాత్రమే. 2019 ఎన్నికల్లో ఆ పార్టీకి 52 సీట్లు దక్కాయి. ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో 99 స్థానాలు లభించాయి. ఇప్పుడు ఎన్నికలు జరిగితే ఆ పార్టీ ఓట్ల శాతం కూడా 21.2 నుండి 25.4కు పెరుగుతుందని సర్వే అంచనా.

> **హర్యానా కాంగ్రెస్‌దే**
>
> త్వరలో జరగబోయే హర్యానా శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తన ఆధిక్యతను చాటుకుంటుందని ఎంఓటీఎన్ సర్వే అంచనా వేసింది. లోక్‌సభకు ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే ఆ రాష్ట్రంలోని పది స్థానాల్లో ఆరింటిని కాంగ్రెస్ గెలుచుకుంటుందని సర్వే చెబుతోంది. ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ చెరో ఐదు స్థానాలు గెలుచుకున్నాయి.

మోడీ, రాహుల్ మధ్య తగ్గుతున్న అంతరం

తదుపరి ప్రధానిగా ఎవరికి ఓటేస్తారని అడిగిన ప్రశ్నకు ప్రజలు ఇచ్చిన సమాధానం ఆసక్తిని కలిగిస్తోంది. నరేంద్ర మోడీ, రాహుల్ గాంధీ మధ్య రేటింగ్ తగ్గడం విశేషం. మోడీ ప్రధానిగా ఉంటే మంచిదని 49 శాతం మంది చెబుతుంటే రాహుల్ ప్రజాదరణ 22.4 శాతానికి పెరిగింది. ఈ సంవత్సరం ఫిబ్రవరిలో జరిపిన సర్వేతో పోలిస్తే మోడీ ప్రజాదరణ ఆరు పాయింట్లు పడిపోగా రాహుల్‌కు ఎనిమిది పాయింట్లు పెరిగింది.

షా, యోగికి కూడా...

నరేంద్ర మోడీ తర్వాత బీజేపీ తదుపరి ప్రధాని అభ్యర్థిగా ఎవరు ముందుకు వస్తారని అడిగిన ప్రశ్నకు 25 శాతం మంది మోడీకే మద్దతు తెలిపారు. 19 శాతం మంది ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వైపు మొగ్గు చూపారు. రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ 13 శాతం ఓట్లతో తర్వాతి స్థానంలో నిలిచారు. అయితే గత సర్వేలతో పోలిస్తే హోం మంత్రి అమిత్ షా రేటింగ్ తగ్గింది. గత సంవత్సరం ఆగస్టులో జరిపిన సర్వేలో 29 శాతం మంది అమిత్‌కు ఓటేయగా ఇప్పుడు 25 శాతం మంది మాత్రమే మద్దతు తెలిపారు. ప్రాంతాల వారీగా చూస్తే దక్షిణాదిన అమిత్ షాకు మద్దతు అధికంగా ఉంది. మోడీ వారసుడిగా అమిత్ ఉంటే బాగుంటుందని 31 శాతం మంది అభిప్రాయపడ్డారు. దేశవ్యాప్తంగా చూస్తే ఈ మద్దతు 25 శాతం మాత్రమే ఉంది. మరోవైపు యోగి ప్రజాదరణ కూడా తగ్గుతోంది. గత సంవత్సరం ఆగస్టులో యోగిని 25 శాతం మంది సమర్థించగా ఇప్పుడు 19 శాతం మంది మాత్రమే బలపరుస్తున్నారు.



వక్ఫ్‌బోర్డు చట్ట సవరణ అభ్యంతరకరం

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రం డిజిటలైజేషన్ చేస్తారని రాఘవులు అన్నారు. దీంతో ఎవరైనా భూముల వివరాలను తెలుసుకోవచ్చని వివరించారు. ఇప్పటి వరకు రైతులు, భూముల వివరాలు గోప్యంగా ఉన్నాయని గుర్తు చేశారు. అగ్రిస్టాక్ వస్తే గోప్యత ఉండబోదనీ, బహుళజాతి కార్పొరేట్ సంస్థలు, పురుగుమందులు, విత్తనాల సంస్థలకు ఆ వివరాలు చేరుతాయని అన్నారు. ఆ సంస్థల లాభం కోసమే అగ్రిస్టాక్‌ను రూపొందిస్తున్నారని విమర్శించారు. భూమి ఉన్న వారికి కంక్లూజివ్ గ్యారెంటీ టైటిల్‌ను ఇస్తామంటున్నారని చెప్పారు. కంప్యూటర్‌లోనే భూముల అమ్మకాలు, కొనుగోళ్లను పెంచడం కోసం ఇది ఉపయోగపడుతుందన్నారు. పేదలు అమ్ముతారనీ, పెద్దలు కొంటారని వివరించారు. దీని ద్వారా కాంట్రాక్టు వ్యవసాయం, కార్పొరేట్ వ్యవసాయం వస్తుందన్నారు. మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేసినా, పరోక్షంగా కేంద్రం అమలు చేస్తున్నదని విమర్శించారు. ఏపీలో జగన్ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను తెచ్చారనీ, తెలంగాణలో కేసీఆర్ ధరణి అమలు చేశారని గుర్తు చేశారు. చాలా సమస్యలొచ్చాయనీ, ఏపీలో చంద్రబాబు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేశారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం భూమాత పేరుతో అమలు చేయబోతున్నదని అన్నారు. పేదలు, గిరిజనులు, చిన్న రైతుల భూములు ఎవరెవరికో పోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములు, అన్యాక్రాంతం అయిన భూములకు పెద్దవారు కంక్లూజివ్ గ్యారెంటీ టైటిల్‌ను పొందుతారని వివరించారు. అక్రమాలు చట్టబద్ధం అవుతాయని చెప్పారు. జాగ్రత్తలు తీసుకోకపోతే పేదరైతులు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. ధరణిపై కమిటీ వేశారనీ, ఆ నివేదికను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. దానిపై రైతులతో చర్చించాలని కోరారు. కౌలురైతులు, చిన్న రైతులు, అన్యాక్రాంతం అయిన భూములను సేద్యం చేసుకుంటున్న వారికి, అసైన్డ్ భూముల రైతులకు నష్టం కలుగుతోందన్నారు. కబ్జా భూములు సొంతం చేసుకునే అవకాశముందని చెప్పారు. వాటిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో రాష్ట్ర ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు.

> **భూ సమస్యపై అఖిలపక్షం పిలవాలి : తమ్మినేని**
>
> (మొదటి పేజీ తరువాయి)
>
> వెంటనే పరిష్కరించాలనీ, రూ.రెండు లక్షల్లోపు అందరికీ రుణమాఫీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాల పర్యటనకు వెళ్తే సీపీఐ(ఎం) నాయకుల అరెస్టులు జరుగుతున్నాయని గుర్తు చేశారు. గతంలో కేసీఆర్ వెళ్లినా ఇదే తరహాలో ఉండేదని అన్నారు. ఎవరు అధికారంలో ఉన్నా ప్రజాసమస్యలపై మాట్లాడేది సీపీఐ(ఎం) నాయకులేనని అర్థమవుతున్నదని చెప్పారు. అరెస్టులు, నిర్బంధాలతో సమస్యలు పరిష్కారం కాబోవని అన్నారు. కేసీఆర్ పద్ధతినే రేవంత్‌రెడ్డి అమలు చేయడం సరైంది కాదన్నారు. రైతాంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 29న రెవెన్యూ కార్యాలయాల వద్ద ధర్నా చేయనున్నట్టు ప్రకటించారు. రైతుభరోసా అమలుపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన వైఖరిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. వెంటనే అమలు చేయాలని కోరారు. 73 షెడ్యూల్ పరిశ్రమల్లో కార్మికులకు కనీస వేతనాలను అమలు చేయాలన్నారు. రేవంత్ సర్కారు రూ.11 వేలు ఉంటే దాన్ని రూ.11,116కు పెంచుతూ ఉత్తర్వులు ఇచ్చిందని అన్నారు. ఇది కార్మికులను మోసం చేయడం, యజమానులకు కొమ్ముకాయడమేనని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం రూ.18 వేలు నిర్ణయించినా, జీవో ఇవ్వలేదని చెప్పారు. హైడ్రా... డ్రామా కావొద్దని తమ్మినేని అన్నారు. ఆక్రమణలను కూల్చివేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వం కూడా ఇలాగే ముందు హడావుడి చేసిందనీ, రేవంత్ ప్రభుత్వం అలా ఆరంభ శూరత్వానికే పరిమితం కావొద్దని సూచించారు. సెబీ చైర్మెన్ రాజీనామా చేయాలనీ, లేదంటే కేంద్ర ప్రభుత్వమే ఆమెను తొలగించాలని రాఘవులు విలేకర్లు అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు.

లైంగిక వేధింపుల కేసులో హెచ్‌డి రేవణ్ణ, ప్రజ్వల్‌లకు వ్యతిరేకంగా సిట్ చార్జిషీట్

ప్రజాప్రతినిధుల కోర్టులో సమర్పణ

బెంగళూరు : కర్నాటకలో సంచలనం రేపిన లైంగిక వేధింపుల కేసులో జేడీఎస్ ఎమ్మెల్యే హెచ్‌డి రేవణ్ణ, మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణలపై నేర దర్యాప్తు విభాగానికి చెందిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) చార్జిషీట్‌ను దాఖలు చేసింది. ప్రజ్వల్‌కు వ్యతిరేకంగా నాలుగు కేసులను దర్యాప్తు చేస్తున్న సిట్.. 2000లకు పైగా పేజీల చార్జిషీట్‌లో దాదాపు 150 మంది సాక్షుల వాంగ్మూలాలు ఉన్నాయని వివరించింది. ఈ చార్జిషీట్‌ను సిట్.. ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టులో సమర్పించింది. చార్జిషీట్‌ను దాఖలు చేసే ముందు నిపుణుల అభిప్రాయాన్ని తీసుకున్నట్టు సిట్ వివరించింది. హెచ్‌డీ రేవణ్ణ, ఆయన కుమారుడు ప్రజ్వల్‌లపై భారతీయ శిక్షా స్మృతిలోని పలు సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. ఈ లైంగిక వేధింపుల కేసు కర్నాటకను ఒక కుదుపు కుదిపింది. ముఖ్యంగా, జేడీఎస్‌తో పొత్తు పెట్టుకున్న బీజేపీకి ఒక పెద్ద తలనొప్పిగా మారింది.

ఈ ఏడాదిలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో హస్సన్ పార్లమెంటు స్థానం నుంచి ఎన్డీఏ అభ్యర్థిగా పోటీ చేసిన ప్రజ్వల్ ఓటమిపాలయ్యాడు. అయితే, లోక్‌సభ రెండో దశ ఎన్నికల సమయంలో మహిళలపై ఆయన లైంగిక వేధింపులకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టటంతో ప్రజ్వల్ నెమ్మదిగా భారత్ నుంచి జారుకున్న విషయం విదితమే.

జర్మనీలో దారుణం

- ముగ్గురు మృతి • 8మందికి గాయాలు

బెర్లిన్ : జర్మనీలో దారుణం చోటు చేసుకుంది. సోలిన్‌జెన్ నగర 650వ వార్షికోత్సవాలను పురస్కరించుకుని వరుసగా మూడు రోజులు జరగనున్న వేడుకలు, ఉత్సవాల్లో భాగంగా ఒక వీధిలో ఉత్సవాలు జరుగుతుంటే ఒక వ్యక్తి కిరాతకంగా దాడులకు పాల్పడ్డాడు. ఇద్దరు పిల్లలతో సహా ముగ్గురిని హతమార్చి 8మందిని గాయపరిచాడని జర్మనీ పోలీసులు శనివారం తెలిపారు.

శుక్రవారం రాత్రి జరిగిన ఈ దాడి గురించి పోలీసులు ప్రత్యక్ష సాక్షులను, బాధితులను ప్రశ్నిస్తున్నారు. దాడి జరిగిన ఏరియాను మూసివేశారు. గాయపడిన వారిలో ఐదుగురు పరిస్థితి విషమంగా వుందని పోలీసులు చెప్పారు. రాత్రి 9.40గంటల సమయంలో కత్తితో ఒక గుర్తు తెలియని వ్యక్తి విచక్షణారహితంగా దాడులకు పాల్పడ్డాడని, చెప్పారు.

ఆ ప్రాజెక్టులకు రుణాలు వద్దు

లోపభూయిష్టంగా వాటి పర్యావరణ, సామాజిక ప్రభావ అంచనాలు

- ఐఎఫ్‌సీ, భారతీయ పర్యావరణ చట్టాల ఉల్లంఘన
- ప్రపంచ బ్యాంకుకు లేఖ

గుజరాత్‌లోని వ్యర్థ-శక్తి ప్రాజెక్టులపై పౌర సంస్థలు, కార్యకర్తల ఆందోళన



న్యూఢిల్లీ : గుజరాత్‌లో వ్యర్థాల నుంచి శక్తిని తయారు చేసే (డబ్ల్యూటీఈ) ప్రాజెక్టుల విషయంలో పౌర సమాజం స్పందించింది. రాజ్‌కోట్, వడోదర, అహ్మదాబాద్, జామ్‌నగర్ లలో ఈ ప్రాజెక్టులను అబెలెన్ క్లీన్ ఎనర్జీ లిమిటెడ్ (ఏసీఈఎల్) ప్రతిపాదించింది. అయితే, ఈ ప్రాజెక్టులు లోపభూయిష్టంగా ఉన్నాయనీ, ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఎఫ్‌సీ), భారతీయ పర్యావరణ చట్టాలను ఉల్లంఘిస్తున్నాయని పౌర సంస్థలు ఆరోపిస్తున్నాయి. ఈ ప్రాజెక్టులు ప్రమాదకరమని చెప్తున్నాయి. దీంతో ఈ ప్రాజెక్టులకు రుణాలను ఇవ్వవద్దని ప్రపంచ బ్యాంకును కోరుతున్నాయి. ఈ మేరకు 174 పౌర సమాజ సంస్థలు, నెట్‌వర్క్స్, కార్యకర్తల కూటమి లేఖను రాసింది.

సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ అకౌంటబిలిటీ, ఇంటర్నేషనల్ అకౌంటబిలిటీ ప్రాజెక్ట్, నేషనల్ హాకర్స్ ఫెడరేషన్, గ్లోబల్ అలయన్స్ ఫర్ ఇన్‌సినిరేటర్ ఆల్టర్నేటీవ్స్ (జీఏఐఏ)-ఏసియా పసిఫిక్, బ్రేక్ ఫ్రీ ఫ్రమ్ ప్లాస్టిక్స్‌లు కూడా ఈ లేఖను రాసినవాటిలో ఉన్నాయి. ప్రతిపాదిత ప్రాజెక్టులు రోజుకు 3,750 టన్నుల చెత్తను కాల్చివేస్తాయని, 18.75 లక్షల కార్లు విడుదల చేసేంత కార్బన్‌డై యాక్సైడ్ వాయువుకు విడుదల చేస్తాయని వారు లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. 2021 నవంబర్ నుంచి జామ్‌నగర్‌లో పని చేస్తున్న డబ్ల్యూటీఈ ప్రాజెక్టుల హానికర ప్రభావాన్ని లేఖ లేవనెత్తింది. ఈ ప్రాజెక్టులు ప్రారంభమైనప్పటి నుంచి స్థానిక ప్రజలు శబ్ద, వాయు, నీటి కాలుష్యాలను, వారి నివాసాలపై పొగమంచు ప్రసరించటం, ఆరోగ్య సమస్యలు వంటి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వివరించింది. అనేక వాతావరణ, సామాజిక ప్రభావాలు ఉన్న ఈ ప్రాజెక్టులకు భారత్‌లో 'రెడ్ క్యాటగిరి' కింద పరిగణించబడతాయనీ, అయినప్పటికీ.. ఐఎఫ్‌సీ నుంచి వీటికి తక్కువ ప్రమాద రేటింగ్ అయిన 'క్యాటగిరి బీ'ను అందిందని ఆందోళన వ్యక్తం చేసింది.

ఇలాంటి ప్రాజెక్టులకు నిధులను అందిస్తే.. పర్యావరణ పరిరక్షణ, సమాజ హితం అనే ప్రపంచ బ్యాంకు నిబద్ధతకు ఇది విరుద్ధమవుతుందని పౌర కూటమి సూచించింది. స్థిరమైన ఇంధన పరిష్కారాలకు ప్రాధాన్యతనివ్వాలనీ, ఏసీఈఎల్ వ్యర్థ-శక్తి ప్రాజెక్టులకు నిధులను తిరస్కరించాలని ప్రపంచబ్యాంకును కోరింది.



సెప్టెంబర్ 1 నుంచి శౌర్యయాత్ర

పోస్టర్ ఆవిష్కరించిన జూలకంటి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

వీరులు నడిచిన దారుల్లో వచ్చే నెల ఒకటవ తేదీ నుంచి 17వ తేదీ వరకు ప్రజానాట్యమండలి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శౌర్యయాత్ర జరగనుంది. దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శనివారం హైదరాబాద్ ఎంబీ భవన్‌లో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, టీ జ్యోతి, టీ సాగర్, తెలంగాణ సాహితి ప్రధాన కార్యదర్శి కే ఆనందాచారి, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కట్టా నర్సింహ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జూలకంటి మాట్లాడుతూ వీరతెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో అనేకమంది అమరులయ్యారని చెప్పారు. వారి త్యాగాలను గుర్తుచేసుకుంటూ, స్థూపాలను సందర్శించి నివాళులు అర్పిస్తామని తెలిపారు. వీరతెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని కొందరు వక్రీకరిస్తున్నారనీ, వాస్తవ చరిత్రను ప్రజలకు తెలియచేయడం కోసమే శౌర్యయాత్రను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ యాత్రను ప్రజలు ఆదరించి, జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

గాజాలో గత 48గంటల్లో 69మంది మృతి

భారీ మూల్యం చెల్లిస్తున్న బాల్యం ఐక్యరాజ్య సమితి ఆందోళన

మానవ కవచంలా మారుతున్న పాలస్తీనియన్లు ?

గాజా : గాజాపై ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న దాడుల్లో గత 48గంటల్లో 69మంది మరణించారని, 212 మంది గాయపడ్డారని పాలస్తీనా ఆరోగ్యశాఖ వర్గాలు తెలిపాయి. గత పది మాసాల కాలంలో 40,334మంది మరణించగా, 93,356మంది గాయపడ్డారు. గాజా దాడులకు పాలస్తీనా బాలలు అతి భారీ మూల్యాన్ని చెల్లిస్తున్నారని ఐక్యరాజ్య సమితి అధికారి ఒకరు ఆందోళన వ్యక్తం చేస్తూ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం గాజాలో కీలకమైన మానవతాసాయం అందడం లేదు. దీంతో పిల్లల్లో పోషకాహార లోపం తీవ్రంగా పెచ్చరిల్లుతోందని విమర్శించారు. మరోపక్క ఉత్తర గాజాలోని ప్రాంతాలను ఖాళీ చేయాల్సిందిగా ఇజ్రాయిల్ మిలటరీ కొత్త ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి ఉత్తర, సెంట్రల్, దక్షిణ గాజా ప్రాంతాల్లో ముమ్మరంగా దాడులు కొనసాగుతున్నాయి. జులై 22 నుండి ఇప్పటివరకు గత నెల రోజుల కాలంలో ఇజ్రాయిల్ మిలటరీ ఏకంగా 13సార్లు ప్రజలను ఆయా ప్రాంతాల నుండి ఖాళీ చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేస్తూ వచ్చింది. దక్షిణ గాజాలో ఇటువంటి ఆదేశాలు మరీ వేగంగా చోటు చేసుకున్నాయి. వెంటవెంటనే వస్తున్న ఈ ఆదేశాలతో వందల వేల సంఖ్యలో పాలస్తీనియన్లు ఇప్పటికే కిక్కిరిసి పోయి వున్న శిబిరాల్లోనే తల దాచుకుంటున్నారు. ఇటీవలి ఆదేశాలు వెలువడని సమయానికే శిబిరాల్లో అస్సలు చోటు లేకుండా పోయింది. ఆహారం, నీరు, మందుల సరఫరాల కొరత తీవ్రంగా నెలకొంది. ఆకలి తీవ్రత ఎంతలా వుందో తెలియచేసే ఒక వీడియో బాగా వైరల్ అవుతోంది. ఇసుకలో పడిపోయిన గోధుమ పిండిని ఎత్తడానికి ఇద్దరు పిల్లలు తంటాలు పడుతున్న దృశ్యం సోషల్ మీడియాలో కనిపిస్తోంది.

లైంగిక వేధింపులు, వివక్ష నిజమే

సినీ పరిశ్రమపై కేరళ ప్రభుత్వ కమిటీ నివేదిక

- వ్యవస్థలో మార్పులు అవసరమన్న ప్రముఖులు

తిరువనంతపురం : కేరళలో ప్రముఖ నటీమణిపై 2017లో జరిగిన లైంగిక దాడి నేపథ్యంలో మళయాళ సినీ పరిశ్రమకు చెందిన 18 మంది మహిళలు 'ఉమెన్ ఇన్ సినిమా కలెక్టివ్' (డబ్ల్యూసీసీ) పేరిట ఓ సంస్థను ఏర్పాటు చేశారు. సినీ పరిశ్రమను మహిళలకు మెరుగైన పని ప్రదేశంగా చేయడమే దీని ఉద్దేశం. డబ్ల్యూసీసీ సిఫార్సుల ఆధారంగా కేరళ ప్రభుత్వం జస్టిస్ కె.హేమ (రిటైర్డ్) నేతృత్వంలో త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసింది. సినీ పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించిన ఈ కమిటీ 2019లో ప్రభుత్వానికి నివేదిక సమర్పించగా ఈ నెల 19న దానిని ప్రజలకు బహిర్గతం చేశారు. పురుషాధిక్య పరిశ్రమలో మహిళలు లైంగిక వేధింపులు, లింగపరమైన పక్షపాతం, వివక్షను ఎదుర్కొంటున్నారని 235 పేజీల నివేదిక తేల్చింది.

త్రిసభ్య కమిటీ నివేదికపై 'ది క్వింట్' పోర్టల్ సినీ ఎడిటర్, డబ్ల్యూసీసీ వ్యవస్థాపక సభ్యురాలు బీనా పాల్ స్పందన కోరింది. భారతీయ సినీ పరిశ్రమలో నెలకొన్న ఫ్యూడల్, తిరోగమన మనస్తత్వాన్ని ఆమె ఈ సందర్భంగా ప్రస్తావించారు. మళయాళ సినీ పరిశ్రమలోని వారందరితో సంప్రదింపులు జరిపి వ్యవస్థలో అవసరమైన మార్పులు చేయాలని ఆమె సూచించారు. మీటూ ఉద్యమం, డబ్ల్యూసీసీ ఏర్పడిన తర్వాత మహిళల నుండి పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు వచ్చాయి. ఈ నేపథ్యంలో నివేదిక ప్రాధాన్యత సంతరించుకుంది. అది లైంగిక వేధింపు అయినా, వేతనాల చెల్లింపులో వ్యత్యాసం అయినా, గౌరవానికి సంబంధించిన విషయమైనా... ఇవన్నీ మహిళలను చిన్నచూపు చూసేవే. ఇది కేవలం మళయాళ సినీ పరిశ్రమకు సంబంధించిన సమస్య మాత్రమే కాదని, దేశంలోని అన్ని పరిశ్రమల్లోనూ ఉన్నదేనని బీనా పాల్ తెలిపారు. పరిస్థితులు ఊహించిన దాని కంటే దారుణంగా ఉన్నాయని ఆమె వ్యాఖ్యానించారు. నకిలీ ప్రకటనలు చూసి ఊహాలోకంలో తేలిపోయిన మహిళలు మాత్రమే ఇలాంటి అనుభవాలను ఎదుర్కొం టున్నారని కమిటీ ఎదుట హాజరైన కొందరు పురుషులు వాదించారు. పైగా ఈ పరిణామాలు కేవలం సినీ పరిశ్రమకు మాత్రమే పరిమితం కావని, దేశంలోని అన్ని పరిశ్రమలలోనూ చోటుచేసుకుంటున్నవేనని కూడా వారు తెలిపారు. నివేదికలో వ్యక్తుల పేర్లు కన్పించకపోవడంపై అడిగిన ప్రశ్నకు బీనా పాల్ బదులిస్తూ కొందరిని లక్ష్యంగా చేసుకొని వేటాడడం తమ పని కాదని చెప్పారు. ఎవరు ఏ తప్పు చేశారో తెలుసుకోవడం తమ పని కాదని, దానిపై ప్రజలే ఆలోచించాలని తెలిపారు. మరోసారి బయటికి వచ్చి మాట్లాడమని మహిళలను కోరడం చాలా కష్టమని, ప్రజలు చర్యను కోరుకుంటేనే అది జరుగుతుందని అన్నారు. మళయాళ సినీ పరిశ్రమలో ఓ శక్తివంతమైన గ్రూపు ఉన్నదన్న విషయం తనకు తెలియదని బీనా పాల్ చెప్పారు.

హైడ్రా దూకుడు...

భారీ బందోబస్తు, జేసీబీలతో అక్రమ కట్టడాలపై పంజా



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైడ్రా దూకుడు కబ్జాదారుల్లో దడ పుట్టిస్తోంది. హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) బ్రేకులు లేకుండా బుల్డోజర్లతో దూసుకెళ్తుండటంతో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. ప్రముఖ నాయకులు, సినీహీరోలు, బిల్డర్లు, పలుకుబడి వున్న బడా నేతలు అనే తేడా లేదు.. ఎవరైనా సరే.. చెరువుల ఆక్రమణలు, ఎఫ్‌టీఎల్‌లో అక్రమ నిర్మాణాలు, లే ఔట్లు వేసినా భారీ పోలీస్ బందోబస్తు మధ్య జేసీబీలతో కూల్చేస్తున్నారు. అందరూ ఊహించిన దానికంటే హైడ్రా చాలా దూకుడుగా వెళ్తుండటంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లతో పాటు ప్రముఖ నాయకులు, బిల్డర్లు, రియల్టర్లు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఎలాగైనా ఈ హైడ్రా ఆపరేషన్‌లను ఆపాలని శాయశక్తులా ఎవరికి వారు ప్రయత్నం చేస్తున్నారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను బదిలీ చేయాలని ఒత్తిడి చేస్తున్నట్టు తెలుస్తోంది. కొద్ది నెలల్లోనే జీహెచ్‌ఎంసీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీవారు సైతం ముఖ్యమంత్రిని కలిసి తీవ్ర ఆందోళన వ్యక్తం చేసినట్టు సమాచారం. హైడ్రా వెనక్కు తగ్గేలా ఆదేశాలివ్వాలని ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేసినప్పటికీ ఎక్కడ రాజీ లేకుండా హైడ్రా కమిషనర్ దూసుకెళ్తున్నారు. రెండు మూడ్రోజుల్లో మాజీ మంత్రి మల్లారెడ్డితోపాటు ఇతర ప్రజాప్రతినిధుల అక్రమ నిర్మాణాలు, ఫామ్‌హౌజ్‌లను కూల్చేస్తారన్న వార్తలు వస్తున్నాయి.

అనుమతుల్లేవ్ హైడ్రా కమిషనర్

ప్రముఖ సినీ నటుడు నాగార్జునకు చెందిన మాదాపూర్‌లోని ఎన్ కన్వెన్షన్‌ను శనివారం హైడ్రా అధికారులు కూల్చేశారు. తుమ్మిడికుంట చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలోని ఆక్రమణలను హైడ్రా, జీహెచ్‌ఎంస్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ సిబ్బంది కూల్చి వేశారని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. తుమ్మిడికుంట చెరువులోని అనధికార నిర్మాణాల్లో ఎన్ కన్వెన్షన్ సైతం ఒకటని, చెరువులోని ఎల్‌టీఎఫ్‌లో ఎకరా 12 గుంటల్లో ఎన్ కన్వెన్షన్ నిర్మించారని చెప్పారు. బఫర్ జోన్‌లోని 2 ఎకరాల 18 గుంటల్లో ఎన్ కన్వెన్షన్ నిర్మించారని, ఎన్ కన్వెన్షన్‌కు జీహెచ్‌ఎంసీ నుంచి నిర్మాణ అనుమతులు లేవని తెలిపారు. బీఆర్‌ఎస్ కింద అనుమతుల కోసం ఎన్ కన్వెన్షన్ యత్నించిందనీ, అయితే, సంబంధిత అధికారులు అనుమతించలేదని అన్నారు. ఎన్ కన్వెన్షన్‌కు సంబంధించి ఇప్పటి వరకు ఏ కోర్టూ స్టే ఇవ్వలేదన్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌కు సంబంధించి కన్వెన్షన్ సెంటర్ తప్పుదోవ పట్టించిందన్నారు. వాణిజ్య కార్యక్రమాలు సాగించిందని తెలిపారు.

నోటీసులివ్వలేదు: నాగార్జున

ఎన్ కన్వెన్షన్ కూల్చివేతకు ముందు కనీసం నోటీసులు సైతం ఇవ్వలేదని, ఒకవైపు కేసు కోర్టులో ఉన్నప్పుడు అర్ధాంతరంగా ఎలా కూల్చివేస్తారని ప్రముఖ హీరో అక్కినేని నాగార్జున అన్నారు. దీనిపై హైకోర్టులో హౌస్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ టి.వినోద్‌కుమార్ విచారణ చేపట్టి కూల్చివేత ఆపాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసినట్టు తెలిపారు. స్టే ఆర్డర్‌లు, కోర్టు కేసులకు విరుద్ధంగా ఎన్ కన్వెన్షన్‌ను కూల్చివేయడం బాధాకరమన్నారు. అది పట్టా భూమి అని, ఒక్క అంగుళం కూడా ఆక్రమణకు గురికాలేదని, ప్రయివేటు స్థలంలో భవనం నిర్మించామని అన్నారు. తప్పుడు సమాచారంతో కూల్చివేశారన్నారు. అధికారులు చేసిన ఈ చట్ట విరుద్ధ చర్యలకు వ్యతిరేకంగా తాము న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని, అక్కడ తమకు న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నానని అన్నారు.

నిరక్షరాస్యతను, వెనుకబాటుతనాన్ని, పేదరికాన్ని నిర్మూలించకుండా నిజమైన ప్రజాస్వామ్యాన్ని కాంక్షించలేము - సర్వేపల్లి రాధాకృష్ణన్

కులం పోవాలని, వివక్షతలతో కూడుకున్న, వర్ణవ్యవస్థ విస్తరణతో వేయి పడగల హైంధవ నాగరాజులా బుసలు కొడుతున్న కుల డైనోసార్‌ను అంతమొందించి, మనుషులంతా ఒకటే అనే సమతా సమాజం ఎప్పుడు నెలకొంటుందోనని ఎదురుచూసేవారు, పాంచజన్య సంపాదకీయం మనల్ని ఎటునడుపుతుందో అర్థమవుతుంది. ఆరెస్సెస్ అనేది బీజేపీకి సైద్ధాంతిక పునాదిని ఏర్పరచే సంస్థ. అదిప్పుడు కులం మనుషుల్ని కలిపి ఉంచుతుందని సుద్దులు చెబుతోంది. మూతికి ముంత, ముడ్డికి చీపురుకట్టి, ఊరవతల కొందరిని ఉంచిన వ్యవస్థను, కొందరు అంట రానివారు కనుక వాళ్లు అందరికీ దూరంగా ఉండాలని కోరుకున్న వాళ్లు. పనిచేయడానికి, ఇతరులకు సేవ చేయటానికే కొందరున్నారని, విభజించిన కులవ్యవస్థ కొనసాగాలని కోరుకోవడంలో వీరి ఆధిపత్య, మత దురహంకార లక్షణం అర్థమవుతోంది.

సుద్దులు



సంపాదకీయం

'**కు**లం పునాదుల మీద మనం దేనినీ నిర్మించలేము. ఒక నీతిని కానీ, ఒక జాతిని కానీ' అని అంబేద్కర్ మహాశయుడు స్పష్టంగానే సెలవిచ్చారు. అతను మన రాజ్యాంగ నిర్మాత, రూపశిల్పి. ఈ దేశం ఏ విలువలతో నడవాలో, నవభారతాన్ని ఎలా నిర్మించుకోవాలో రాజ్యాంగం మనకు చెబుతుంది. నిర్దేశిస్తుంది. **'కులం కులం అని కుత్సితాలు పెంచుకోకు, ఓ కూటికి లేనివాడా... మతం మతం అని మాత్సర్యం పెంచుకోకూ'...** అని చిన్నపుడు పాడుకునేవాళ్లం. **'కులమతాలు గీచుకున్న గీతలజొచ్చి, పంజరానగట్టు వడనునేను, నిఖిలలోకమెట్లు నిర్ణయించినగాని తరుగులేదు విశ్వనరుడ నేను'** అని జాషువా మహాకవి కులాల, మతాల పంజరాన్ని తన దరికి రానీయనని తేల్చిచెప్పారు. ప్రపంచంలో ఎక్కడా లేని ఈ నిచ్చెనమెట్ల కులవ్యవస్థే, మన దేశం అభివృద్ధిలో వెనకపడటానికి ప్రధాన కారణమని ఎన్నో విశ్లేషణలు వచ్చాయి. ఇప్పటికీ కుల,మత భేదాలతో, వివక్షతలతో మనుషులనే హతమారుస్తున్న సంఘటనలు కోకొల్లలు. చదువుకున్న వాళ్లలోనూ, చదువురాని వాళ్లలోనూ, పట్టణాల్లో, గ్రామాల్లో ఎక్కడ చూసినా ఈ కుల దుర్వాసన వీడటంలేదు మనల్ని.

మన సమాజంలో ఎన్నో మార్పులొచ్చాయి. అనేక సంప్రదాయాలు చెదిరిపోయాయి. కానీ కులం మాత్రం చెదరలేదు. చెదిరినా, కులంగానే చెదిరింది. పొద్దంతా కూటికోసం పనిచేసే మనుషులు సాయంత్రానికి గూటిలోకి చేరుకున్నట్లు, కులంలోకి చేరుకుంటారు. వివక్షతలు, ఘర్షణలు, తగాదాలు, చంపుకోడాలు, రక్తప్రవాహాలు, సమీకరణలు, పదవులు, ఉద్యోగాలు, చదువులు, సంబంధాలు...అన్నిట్లో అన్ని సందర్భాల్లోనూ కులం వెన్నెంటే ఉంటుంది. ఆ మధ్య ఒక యాడ్‌లో 'వేర్ యు గో, ఐ ఫాలో' అన్నట్లుగా మన కళ్లలో కులం చూపుకొనసాగుతునే ఉంది. కులం గురించి కులపరంగానే మాట్లాడుతాం, కులం పోవాలనీ చర్చలు చేస్తాం. అన్ని మాటలకే పరిమితం. ఆఖరికి చర్చల్లోనే కుల నిర్మూలన మిగిలింది. ఇది అసలైన విషాదం! ఆఖరికి కులం వల్ల అనేక బాధలకు, ఇబ్బందులకు గురవుతున్న వాళ్లు కూడా నిర్మూలన మాటెత్తడంలేదు. ఎందుకంటే వివక్షతనే నిర్మూలించలేకపోయామనే నిస్పృహ కావచ్చు.

ఆ చర్చనలా ఉంచితే, ఈ మధ్య ఆరెస్సెస్. వారి పాంచజన్య పత్రిక సంపాదకీయంలో కులం గురించి వారి నిజమైన నైజాన్ని బయటపెట్టింది. ఇదే సందర్భంలో పార్లమెంట్‌లో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని ఉద్దేశించి, కులగణన ప్రస్తావనలో బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాగూర్ అసలు 'నీ కులమేమిటి' అని అనుచితమైన వ్యాఖ్య చేశారు. ఇప్పుడీ పాంచజన్య - భారతీయ సమాజంలో కులం అనేది ఏకీకృత కారకమని తెలిపింది. మనుషుల మధ్య ఐక్యతను కులం పెంపొందిస్తుందని, కులవ్యవస్థ గొలుసు లాంటిదని, వివిధ తరగతులను అది కలుపుతుందని వివరించారు. అంటే కులవ్యవస్థ మన దేశానికి అవసరమైనదిగా బీజేపీ పరివారం భావిస్తున్నదన్న విషయం స్పష్టంగా మనమంతా అర్థం చేసుకోవాలి. హిందూమతంలోని వైవిధ్య, సంప్రదాయాలను ధ్వంసం చేయాలని, భారతీయ పరిశ్రమలను నాశనం చేయాలని, దేశ గుర్తింపును మార్చడంపై ఆక్రమణదారులు బ్రిటీషర్స్ దృష్టిపెట్టారని విమర్శ చేశారు. బానే ఉంది మరి వాళ్లకు వత్తాసుగా నాటి స్వాతంత్ర్యోద్యమంలో నిలిచింది వీళ్లేగా! ఎప్పటికెయ్యది... అనేది వీరి విధానం.

కులం పోవాలని, వివక్షతలతో కూడుకున్న, వర్ణవ్యవస్థ విస్తరణతో వేయి పడగల హైంధవ నాగరాజులా బుసలు కొడుతున్న కుల డైనోసార్‌ను అంతమొందించి, మనుషులంతా ఒకటే అనే సమతా సమాజం ఎప్పుడు నెలకొంటుందోనని ఎదురుచూసేవారు, పాంచజన్య సంపాదకీయం మనల్ని ఎటునడుపుతుందో అర్థమవుతుంది. ఆరెస్సెస్ అనేది బీజేపీకి సైద్ధాంతిక పునాదిని ఏర్పరచే సంస్థ. అదిప్పుడు కులం మనుషుల్ని కలిపి ఉంచుతుందని సుద్దులు చెబుతోంది. మూతికి ముంత, ముడ్డికి చీపురుకట్టి, ఊరవతల కొందరిని ఉంచిన వ్యవస్థను, కొందరు అంటరానివారు కనుక వాళ్లు అందరికీ దూరంగా ఉండాలని కోరుకున్నవాళ్లు. పనిచేయడానికి, ఇతరులకు సేవ చేయటానికే కొందరున్నారని, విభజించిన కులవ్యవస్థ కొనసాగాలని కోరుకోవడంలో వీరి ఆధిపత్య, మత దురహంకార లక్షణం అర్థమవుతోంది.

ఇలాంటి భావాలు, నీతి కలిగినవారు మూడోసారి అధికారంలోకి వచ్చి కొనసాగుతున్నారు. మత ప్రాతిపదికపైన కులవ్యవస్థ కొనసాగాలనీ, ఆధిపత్యం యథావిధిగా పాలించాలనీ చెప్పకనే పాంచజన్య చెప్పింది. దేశంలో ఉన్న ఆదివాసీలు, దళితులు, వెనుకబడిన వర్గాలు అప్రమత్తమవ్వాల్సిన తరుణమిది. మనతెలంగాణలో ఏ శక్తులు బలపడుతున్నాయో, అవి ఏ తిరోగమన వ్యవస్థకు వారసులో అర్థం చేసుకోవాలి! రాజ్యాంగస్ఫూర్తిని, విలువలను కాపాడుకోవాలి!

కాంగ్రెస్, కాన్ఫరెన్స్‌లు చివరిసారిగా 2008లో కలసిపోటీ చేసి విజయం సాధించాయి. 2014లో విడివిడిగా తలపడ్డాయి. ఆ ఎన్నికల నాటికి మొహబూబా ముఫ్తీ తండ్రి ముఫ్తీ మహ్మద్‌సయ్యద్ జీవించి వున్నారు.28 స్థానాలతో పీడీపీ పెద్దపార్టీగా రాగా కాన్ఫరెన్స్ 15కు పరిమితమైంది. బీజేపీకి 25,కాంగ్రెస్‌కు 12 వచ్చాయి. జమ్మూలో స్థానాలు తెచ్చుకున్న బీజేపీని వదలిపెట్టి మిగిలిన లౌకికపార్టీలు ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ప్రజాస్వామికవాదులు భావించినా అదిసాధ్యం కాలేదు. ప్రాంతీయ పార్టీలుగా ఎన్‌సి, పీడీపీ మధ్య వైరుధ్యాలే అందుకు కారణమయ్యాయి. జమ్మూలో స్థానాలు తెచ్చుకున్న బీజేపీతో కలిపి సర్కారు ఏర్పాటు చేయడం తనకు ప్రయోజనమని పీడీపీ భావించింది తప్ప తర్వాత జరిగే పర్యవసానాలు పట్టించుకోలేదు.

ముఖ్యమంత్రిగా పదవి చేపట్టిన ముఫ్తీ మరణం,దీర్ఘకాల అనిశ్చితి తర్వాత మెహబూబా పదవి చేపట్టినా ఇరుపార్టీల మధ్య సఖ్యత కుదిరింది లేదు. ఈలోగా తీవ్రవాదులు, విచ్ఛిన్నశక్తుల కుట్రలకు తోడు తమ ఆధిపత్యం పెంచుకోవాలన్న బీజేపీ ఆరాటం పరిస్థితిని ఇంకా దిగజార్చింది. చివరకు 2018 నవంబరులో అప్పటి గవర్నర్ సత్యపాల్‌మాలిక్ శాసనసభ రద్దుకు సిఫార్సు చేశారు. ఆ కాలంలో జరిగిన కుటిల రాజకీయాలేమిటో ఆయనే తర్వాత బయటపెట్టారు కూడా. వీటన్నిటి కారణంగా పరిస్థితి మరింత దిగజారింది. కాశ్మీర్‌లోనే తాము అధికారంలో భాగస్వాములు కావడం గొప్పమార్పుగా భావించిన బీజేపీ దాన్ని నిలబెట్టుకోవడమే ఏకైక లక్ష్యంగా దుస్సాహసాలకు పాల్పడింది. 2019లో 370 రద్దు దానికి పరాకాష్ట.

కాశ్మీర్ ఎన్నికలతో మోడీకి మరోపాఠం?



తెలకపల్లి రవి

సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఎన్నికల సంఘం(ఇసి) అనివార్యంగా నిర్వహిస్తున్న జమ్మూకాశ్మీర్ ఎన్నికలపై ప్రపంచమంతా దృష్టి పెట్టింది.2019లో మోడీ రెండోసారి గెలిచిన తర్వాత 370వ అధికరణం రద్దు తర్వాత కేంద్రం చెప్పుకున్న గొప్పల నిజానిజాలేమిటో తెలుసుకునే సందర్భంగా అందరూ ఈ ఎన్నికలను చూస్తున్నారు.2014లో చివరిసారి జరిగిన ఎన్నికల్లో ఏర్పడిన శాసనసభ 2018లో రద్దయిన తర్వాత ఇంతవరకూ కాశ్మీర్‌లో ఎన్నికైన ప్రభుత్వమే లేకుండా పోయింది. సుప్రీంకోర్టు కచ్చితమైన ఆదేశాలిచ్చి వుండకపోతే ఇప్పుడైనా ఎన్నికలు జరిగేవా? అనేది సందేహమే. ఇప్పటికైనా కోర్టు చెప్పినట్టు ఇసి సెప్టెంబరు 30 గడువు కొంచెం పొడ గించి సెప్టెంబరు 18,25, అక్టోబరు 2 తేదీల్లో మూడు దశలుగా జరుపుతున్నది. దాంతోపాటే హర్యానా ఎన్నికలు కూడా నిర్వహించేందుకు సిద్ధమైంది. మహారాష్ట్ర ఎన్నికలు మాత్రం తర్వాతకు వాయిదా వేసింది. ఇందుకు ఇసి చెబుతున్న కారణం చూస్తే కాశ్మీర్ పరిస్థితిపై ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్‌షా చేసిన హడా వుడి అవాస్తవమని తేలిపోతుంది. కాశ్మీర్ ఎన్నికల్లో శాంతిభద్రతల రీత్యా అధిక సంఖ్యలో సాయుధ దళాలు అవసరం గనక మహారాష్ట్రలో ఎన్నికలు జరపలేమన్నది దాని సమాధానం. ఏమైనా అసలంటూ ఎన్నికలు జరపడం ఆహ్వానించదగిన పరిణామం. 370రద్దుతో కాశ్మీర్ స్వయం ప్రతిపత్తిని రద్దుచేయడం,రాష్ట్ర హోదా తొలగించి కేంద్రపాలిత ప్రాంతంగా చేయడం స్థానిక ప్రజలు ఏ మాత్రం ఆమోదించలేకపోయారు. దాన్ని వివిధ రూపాలలో వ్యక్తం చేస్తూ వస్తున్నారు కూడా. ఇప్పుడు పూర్తిస్థాయిలో ప్రకటించేందుకు, బీజేపీని దానితో చేతులు కలిపే పక్షాలనూ ఓడించేందుకు ఇది సరైన అవకాశమని భావిస్తున్నట్లు సంకేతాలిస్తున్నారు. ఈ కారణం వల్లనే ఒకవైపున బీజేపీ, మరోవైపున దాంతో గతంలో చేతులు కలిపిన పీడీపీ(పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ) రకరకాల మల్లగుల్లాలు పడుతుంటే అతి కీలకమైన పార్టీ నేషనల్ కాన్ఫరెన్స్ కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుని విజయం సాధించేందుకు వ్యూహాలు రచిస్తున్నది. ఆగష్టు 26 నామినేషన్ల ప్రారంభం కాగా ఈలోగానే ఏదో ఒక అవగాహనకు రావాలన్నది ఆ రెండు పార్టీల లక్ష్యంగా వుంది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే,లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ తదితరులు నేషనల్ కాన్ఫరెన్స్ అధినేతలైన ఫరూక్ అబ్దుల్లా, ఓమర్ అబ్దుల్లాలతో చర్చలు జరిపి దాదాపు ఒక అవగాహనకు వచ్చినట్టు ప్రకటించడం ఈ దిశలో పెద్ద ముందడుగేనని చెప్పొచ్చు.

బలాబలాల తీరు

కాంగ్రెస్, కాన్ఫరెన్స్‌లు చివరిసారిగా 2008లో కలసిపోటీ చేసి విజయం సాధించాయి.2014లో విడివిడిగా తలపడ్డాయి. ఆ ఎన్నికల నాటికి మొహబూబా ముఫ్తీ తండ్రి ముఫ్తీ మహ్మద్‌సయ్యద్ జీవించి వున్నారు.28 స్థానాలతో పీడీపీ పెద్దపార్టీగా రాగా కాన్ఫరెన్స్ 15కు పరిమితమైంది. బీజేపీకి 25,కాంగ్రెస్‌కు 12 వచ్చాయి. జమ్మూలో స్థానాలు తెచ్చుకున్న బీజేపీని వదలిపెట్టి మిగిలిన లౌకికపార్టీలు ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ప్రజాస్వామికవాదులు భావించినా అదిసాధ్యం కాలేదు. ప్రాంతీయ పార్టీలుగా ఎన్‌సి, పీడీపీ మధ్య వైరుధ్యాలే అందుకు కారణమయ్యాయి. జమ్మూలో స్థానాలు తెచ్చుకున్న బీజేపీతో కలిపి సర్కారు ఏర్పాటు చేయడం తనకు ప్రయోజనమని పీడీపీ భావించింది తప్ప తర్వాత జరిగే పర్యవసానాలు పట్టించుకోలేదు. వాస్తవానికి ఈ రెండుపార్టీల రాజకీయ వ్యూహాలు పూర్తి విరుద్ధంగా వుంటాయి. ఎన్నికలలోనూ ఒకరినొకరు తీవ్రంగా తిట్టుకున్నారు. అయినా సరే ఎన్‌సిని రాకుండా చేయడం ధ్యేయంగా బీజేపీ-పీడీపీ చేతులు కలిపి అధికారంలోకి వచ్చాయి. ముఖ్యమంత్రిగా పదవి చేపట్టిన ముఫ్తీ మరణం, దీర్ఘకాల అనిశ్చితి తర్వాత మెహబూబా పదవి చేపట్టినా ఇరుపార్టీల మధ్య సఖ్యత కుదిరింది లేదు. ఈలోగా తీవ్రవాదులు, విచ్ఛిన్నశక్తుల కుట్రలకు తోడు తమ ఆధి పత్యం పెంచుకోవాలన్న బీజేపీ ఆరాటం పరిస్థితిని ఇంకా దిగజార్చింది. చివరకు 2018 నవంబరులో అప్పటి గవర్నర్ సత్యపాల్‌మాలిక్ శాసనసభ రద్దుకు సిఫార్సు చేశారు. ఆ కాలంలో జరిగిన కుటిల రాజకీయాలేమిటో ఆయనే తర్వాత బయట పెట్టారు కూడా. వీటన్నిటి కారణంగా పరిస్థితి మరింత దిగజారింది. కాశ్మీర్‌లోనే తాము అధికారంలో భాగస్వాములు కావడం గొప్పమార్పుగా భావించిన బీజేపీ దాన్ని నిలబెట్టుకోవడమే ఏకైక లక్ష్యంగా దుస్సాహసాలకు పాల్పడింది. 2019లో 370 రద్దు దానికి పరాకాష్ట. ఒక విధంగా ఈ నిరంకుశ చర్య ఎన్‌సి, పీడీపీని ఇతర లౌకిక ప్రజాస్వామిక శక్తులను ఒకతాటి మీదకు తెచ్చింది. ముందునుంచి ప్రజాస్వామ్య పోరాటంలోనూ తీవ్రవాదాన్ని ఎదుర్కోవడం లోనూ ముందున సీపీఐ(ఎం) సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మహ్మద్ యూసఫ్ తరిగామి వంటివారు ఈ కృషిలో చొరవచూపారు. 370 రద్దు తర్వాత ఏడాదికి గుప్కార్ అలయన్స్ పేరిట ఒక తాటిమీదకు వచ్చి ఉమ్మడిగా పోరాడతామని ప్రకటించారు.

డీడీసీ, లోక్‌సభ సంకేతాలు

అందుకు తగినట్టే 2020 డిసెంబర్‌లో కాశ్మీర్‌లో జిల్లా అభివృద్ధి సంఘాలకు(డీడీసీ) జరిగిన ఎన్నికలలో గుప్కార్ అలయన్స్ ఆధిక్యత సాధించగా బీజేపీ జమ్మూలో ప్రభావం చూపించింది. మొన్నటి లోక్‌సభ ఎన్నికలలోనైతే జమ్మూలోని ఉద్ధంపూర్, జమ్మూ స్థానాలు బీజేపీ గెల్చుకోగా, శ్రీనగర్, అనంతనాగ్ రాజౌరిలో నేషనల్ కాన్ఫరెన్స్ విజయం సాధించింది. కాశ్మీర్ లోయలోని బారాముల్లా స్థానం నుంచి పీడీపీపై నేషనల్ కాన్ఫరెన్స్ తరఫున ఒమర్ అబ్దుల్లా విజయం సాధిస్తారని ఎగ్జిట్‌పోల్స్ అంచనా వేయగా వేర్పాటువాద అవామీ ఇత్తేహాద్ పార్టీ అభ్యర్థి, మూడుసార్లు ఎమ్మెల్యే షేక్ అబ్దుల్ రషీద్ ఇంజనీర్ స్వతంత్రుడుగా విజయం సాధించారు. ప్రస్తుతం జైలుశిక్ష అనుభవిస్తున్న ఆయన ప్రత్యేకంగా కోర్టుద్వారా వచ్చి ప్రమాణ స్వీకారం చేయడం మీడియాను ఆకర్షించింది.లోక్‌సభ ఎన్నికలలో వచ్చిన ఓట్ల ప్రకారం చూస్తే నేషనల్ కాన్ఫరెన్స్ 36చోట్ల, బీజేపీ 29 చోట్ల ఆధిక్యతలో వుండగా మొహబూబా ముఫ్తి పీడీపీ కేవలం అయిదు చోట్ల, కాంగ్రెస్ ఏడు చోట్ల ఆధిక్యత తెచ్చుకోగలిగాయి. కాంగ్రెస్,ఎన్‌సి,'ఇండియా'లో వున్నా లోక్‌సభ ఎన్నికల్లో విడివిడిగానే పోటీచేశారు. ఈ ఫలితాల ప్రభావంతో కూడా కేంద్రం సుప్రీంకోర్టు ఆదేశించినా ఎన్నికలు వాయిదా వేస్తూ వచ్చింది.పైగా హోం శాఖ లెఫ్టినెంట్ గవర్నర్ పాలనాధికారాలు, నియామక అధికారాలు మరింత పెంచేసింది. జమ్మూలో సీట్లు పెంచుకోవడంతో పాటు రిజర్వేషన్ల పాచికనూ ఉపయోగించింది. టెర్రరిజం అణచివేత పేరిట సైనిక దళాల చర్యలు, రాజకీయంగా గవర్నర్ అధికారాలు పెంపు, కార్పొరేట్లకు నజరానాల పెంపు, మతపరమైన విభజన తీవ్రంచేయడం ఉధృతంగా సాగించింది.మరోవైపున తీవ్రవాద కార్యకలాపాలు కాశ్మీర్ నుంచి జమ్మూకు వ్యాపించాయంటూ అక్కడ ప్రత్యేకంగా సైనిక బలగాలను పెంచింది.ఇంత జరుగుతున్నా ప్రధాన ప్రాంతీయ పార్టీలైన



మరోవైపున లోక్‌సభ ఎన్నికల్లో మెజార్టీ కోల్పోయిన బీజేపీ కాశ్మీర్‌లోనూ ఆశలు సన్నగిల్లిన స్థితిలో వుంది. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికితోడు ఇప్పటివరకూ దూరం పెట్టిన రామ్‌మాధవ్‌ను తీసుకొచ్చి బాధ్యత అప్పగించడంలోనూ ఈ సంగతి బోధపడుతుంది. గతంలో కాశ్మీర్ ఈశాన్య రాష్ట్రాలలో ఆయన చాలా బాగా పనిచేశారనేది ఆరెస్సెస్ అంచనాగా చెబుతారు. ముఖ్యంగా పీడీపీతో కూటమి కట్టడంలో ఆయన పాత్ర చాలా వుంది గనక ఆపద్ధర్మంగా పిలిపించారంటున్నారు. దీంతోపాటు స్వయంగా అమిత్‌షాతో సహా రంగంలోకి దిగి విద్వేష ప్రచారం తీవ్రం చేస్తున్నారు. రాహుల్‌గాంధీ కాశ్మీర్‌కు ప్రత్యేక పతాకం వుండాలనే ఎన్‌సి కోర్కెకు ఒప్పుకుంటారా, పాకిస్తాన్‌తో చర్చలకు ఒప్పుకుంటారా అంటూ మతపరమైన పది ప్రశ్నలు వదలడం ఇందుకో నిదర్శనం.

పీడీపీ,ఎన్‌సి మాత్రం పరస్పర వైరుధ్యాలనే ప్రధానంగా చూస్తూ చేతులు కలపడానికి నిరాకరించడమే లోపం, కాని ప్రజల్లో మాత్రం వ్యతిరేకత పెరిగింది. మొదట్లో ప్రాంతీయ పార్టీలను కేంద్రానికి ఏజెంటుగా చూసినవారే ఈ పరిణామాల తర్వాత బలపర్చడం మొదలుపెట్టారు. ఆఖరుకు కొంతకాలం ఎన్నికలకు దూరంగా వుండిపోయిన పార్టీలు కూడా ఓట్లతోనే సమాధానమిస్తామని రంగంలోకి దిగాయి. రషీద్‌ఇంజనీర్ విజయం అలాంటిదే. లోక్‌సభ ఎన్నికల్లో ఆయన అవామీ పార్టీకి 14 చోట్ల ఆధిక్యత వచ్చింది.కాశ్మీర్ లోయలో ఎన్‌సి, పీడీపీలకు కలిపితే 70శాతం ఓట్లున్నాయి. కానీ అవి కలిసిపోటీ చేసే అవకాశం కనిపించదు. బీజేపీ గెలిచిన జమ్మూ స్థానం ఉద్ధంపూర్‌లో కూడా దానికి పదిశాతం ఓట్లు తగ్గగా కాంగ్రెస్ ఓట్లు పెరిగాయి.ఇదేగాక జమ్మూ కాశ్మీర్ పీపుల్స్ పార్టీ,ఆప్నీ పార్టీ కూడా ఓట్లు తెచ్చుకున్నాయి.

లౌకిక పార్టీల సమీకరణ- బీజేపీ ఎత్తుగడలు

మొత్తంగా చూస్తే కాశ్మీర్‌లో లౌకిక పార్టీలన్నిటికీ కలిపితే గణనీయమైన ఆధిక్యత వుంది.వారంతా ఒక తాటిపైకి వచ్చి పోటీ చేయాలని, బీజేపీని ఓడించాలని సీపీఐ(ఎం) ఎప్పుడూ చెబుతున్నది.కానీ పీడీపీకి స్థానాలు కేటాయించే అవకాశం లేదని ఎన్‌సి ముందే ప్రకటించింది.ఇక ఆ పార్టీ కూడా చాలా విషయాల్లో కలసిరాకుండా విడిగానే వ్యవహరిస్తూ వస్తోంది. ఈపూర్వరంగంలో కాంగ్రెస్, ఎన్‌సి నాయకులు సమావేశం తర్వాత ఒక ఏకాభిప్రాయానికి వచ్చినట్టు ప్రకటించడం హర్షనీయమైన పరిణామమే. పునర్విభజన తర్వాత మొత్తం 90 స్థానాలలో 47 కాశ్మీర్‌లో, 43 జమ్మూలో వున్నాయి. ఇప్పుడు యాభైచోట్ల ఎన్‌సి పోటీచేస్తే 35-38 చోట్ల కాంగ్రెస్ పోటీ వుంటుందని భావిస్తున్నారు. మిత్రపక్షాలకు కూడా చోటు కల్పించనున్నట్టు ఎన్‌సి నాయకులు సూచనగా చెప్పారు. పీడీపీని కూడా వస్తే కలుపుకుంటారా? అని అడగ్గా ఎవరికీ తలుపులు మూయలేదని వ్యాఖ్యానించారు. మరోవైపున లోక్‌సభ ఎన్నికల్లో మెజార్టీ కోల్పోయిన బీజేపీ కాశ్మీర్‌లోనూ ఆశలు సన్నగిల్లిన స్థితిలో వుంది. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికితోడు ఇప్పటివరకూ దూరం పెట్టిన రామ్‌మాధవ్‌ను తీసుకొచ్చి బాధ్యత అప్పగించడంలోనూ ఈ సంగతి బోధపడు తుంది. గతంలో కాశ్మీర్ ఈశాన్య రాష్ట్రాలలో ఆయన చాలా బాగా పనిచేశారనేది ఆరెస్సెస్ అంచనాగా చెబుతారు. ముఖ్యంగా పీడీపీతో కూటమి కట్టడంలో ఆయన పాత్ర చాలా వుంది గనక ఆపద్ధర్మంగా పిలిపించారంటున్నారు. దీంతోపాటు స్వయంగా అమిత్‌షాతో సహా రంగంలోకి దిగి విద్వేష ప్రచారం తీవ్రం చేస్తున్నారు. రాహుల్‌గాంధీ కాశ్మీర్‌కు ప్రత్యేక పతాకం వుండాలనే ఎన్‌సి కోర్కెకు ఒప్పుకుంటారా, పాకిస్తాన్‌తో చర్చలకు ఒప్పుకుంటారా అంటూ మతపరమైన పది ప్రశ్నలు వదలడం ఇందుకో నిదర్శనం. ఇదే విషయమై కూడా తరిగామిని అడిగినపుడు కాశ్మీర్ పార్టీలు మొదటి నుంచి ఆ వైఖరితోనే వున్నాయని గుర్తు చేశారు. బీజేపీ- పీడీపీ కూటమి కట్టినప్పుడు కూడా ఇదే వైఖరితో వున్నాయి గనక ఇప్పుడేదో కొత్తగా వివాదం చేయడంలో అర్థమేముంది? కాశ్మీరియత్, ఇన్సానియత్, జంబోరియత్ అనే మూడు అంశాలను కాపాడటం కీలకంగా ఎన్నికల్లో పాల్గొని విజయం సాధించాలని లౌకికవాదులు కోరుతున్నారు.మీడియా పైనా గతంలో విధించిన ఆంక్షలు సడలించాలని సీపీఐ(ఎం) నేత తరిగామి కోరారు. మానవహక్కులపై దాడి,సైనిక వలయంలా మారిన పరిస్థితి సడలించకుండా ఎన్నికల పోరాటం సాధ్యం కాదు. మరి మోడీ సర్కారు ఆ విజ్ఞత చూపకపోతే కేంద్రంపై నిరసన ఇంకా పెరుగుతుంది. అది ఎన్నికల ఫలితాల్లోనూ ప్రతిబింబించవచ్చు. ■

విచార(ణ) యాత్ర!

ఎవరైనా తప్పుచేస్తే విచారణ నిమిత్తం ఆయనకు తోడుగా స్నేహితులనో, బంధువులనో వెంట బెట్టుకునిపోతారు. కొంత ఆత్మస్థైర్యం కల్పించేందుకు రక్త సంబంధీకులు వెంబడి వస్తారు. అదేందో కానీ బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు మహిళా కమిషన్‌పై దండయాత్రకు వచ్చినట్టుగా వచ్చారు. ఈ విషయాన్ని బయటి వారెవరో కాదు, ఆయన వెంటవచ్చిన మహిళా నాయకులే మాట్లాడుకున్నారు. 'బస్సుల్లో మహిళలు రికార్డు డ్యాన్సులు, బ్రేక్ డ్యాన్సులు చేయవచ్చంటూ' కేటీఆర్ తననోటి దురుసుతనాన్ని బయటపెట్టుకున్నారు. ఆయన వ్యాఖ్యలను మహిళా కమిషన్ సుమోటోగా స్వీకరించి విచారణకు హాజర వ్వాలని ఆదేశించింది. అయితే విచారణకు ఒక్కరే వస్తారని అందరూ భావించారు. కానీ ఆయన మహిళానాయకులు, కార్యకర్తలను వెంటేసుకుని తెలంగాణభవన్ నుంచి బుద్ధభవన్‌కు పదుల సంఖ్యలో వాహనాల్లో చేరుకున్నారు. అందులో మాజీ మంత్రులు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు కూడా ఉన్నారు. వీరంతా కేటీఆర్ వ్యాఖ్యలను సమర్థిస్తూ వచ్చారు. లేకపోతే మహిళా కమిషన్ ఆయన్ను అరెస్టు చేయిస్తే అక్కడే ధర్నా చేద్దామని వచ్చారా? అనేది తెలియదు. కానీ పెద్ద ప్రదర్శన మాత్రం చేశారు. తానేదో మహిళల భద్రతపై వినతిపత్రం సమర్పించడానికి వచ్చినట్టు కేటీఆర్ రోడ్డుమీద కలరింగ్ ఇచ్చారు. అయితే విచారణకు ముందు విచారం వ్యక్తం చేసిన ఆయన విచారణయాత్ర చేస్తారనుకుంటే దండయాత్రలా వచ్చారని అక్కడున్న జనం గుసగుసలాడుకున్నారు.

\- గుడిగ రఘు

ఆరంభ శూరత్వమేనా?

ఒక సినిమా చూసో, ఒక సంఘటన నుంచి స్ఫూర్తి పొందో, మనకు కావల్సిన వారు చెబితేనో, మనంతట మనం ఇష్టపడో ఒక పనిని ప్రారంభించి మొదట్లో తెగ హడావిడి చేస్తాం. మనం తలపెట్టిన పని వల్ల వచ్చే చిక్కుముడులు, సమస్యలను ఎదుర్కో లేక ఆ పనిని మధ్యలోనే వదిలేస్తాం. దాన్నే ఆరంభ శూరత్వం అంటారు. గత వారం రోజులుగా నెట్టిం ట్లోనే కాదు నలుగురు గుమిగూడిన చోట హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్(హైడ్రా)పై రసవత్తర మైన చర్చ సాగుతోంది. వాదోపవాదాలు, వ్యంగాస్త్రాలు, పరస్పర విమర్శలు రక్తి కట్టిస్తున్నాయి. ఈ ట్రోలింగ్‌లు, చర్చలు, బెట్టింగులు కాసే వరకువెళ్లాయి. ఫలానా పార్టీ వారినే టార్గెట్ చేస్తున్నారని ఒకరంటే, లేదు లేదు అందరిపై కొరఢా ఝులిపి స్తున్నారని మరి కొందరూ, హైదరాబాద్‌లో ఆక్రమణలకు చెక్ పెట్టేం దుకేనని ఇంకొందరూ వాదులాడుకుంటు న్నారు. మనం తప్పటడుగు వేయనంత వరకు భయపడాల్సిన పనిలేదు. అదే సందర్భంలో తరతమ భేదాలు చూపిస్తే అభాసుపాలుకాక తప్పదు. మొత్తానికి తెలంగాణలో ప్రస్తుతం హైడ్రా హాట్ టాపి గ్గా మారింది. చిన్నవాటి నుంచి మొదలుకుని పెద్ద పెద్ద భవంతుల వరకు దాదాపు 70 నిర్మాణాలను కూల్చే శారు. గతంలో హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ లాంటి సంస్థలు అక్రమ నిర్మాణాలకు చిన్న చిన్న రంధ్రాలు చేసి వదిలిపెట్టేవారు. కాని నేడు పూర్తిగా నేలమట్టం చేస్తున్నారు. నగరంలోని చెరువులు, కుంటలను ఆక్ర మించి బంగళాలు, ఫాంహౌజ్‌లు కట్టినవారు మాత్రం హైడ్రా దెబ్బకు నిద్రలేని రాత్రులు గడుపు తున్నారు. ఇలాంటి మంచి పనులు చేసేట ప్పుడు అనేక సవాళ్లు ఎదురవుతాయి. అలాంటి సంద ర్భంలో సహనం చాలా అవసరం. అది వ్యక్తుల కైనా, ప్రభు త్వానికైనా వర్తిస్తుంది. విమర్శలకు బెదిరిపోకుం డా సమాధానం చెప్పాలి. విసుగుచెందితే లక్ష్యాలు నీరు గారడమే గాకుండా అప్పటివరకు పడ్డ శ్రమంతా వృధా అవు తుంది. సమస్యలకు భయపడి మొదలు పెట్టిన పనిని మధ్యలో వదిలేస్తే నిజంగానే ఆరంభ శూరత్వమే అవుతుంది. హైడ్రా. కడవరకు నిలుస్తుం దా? మధ్యలోనే బిస్తర్ సర్దుకుంటుందా? వేచి చూడాలి.

\-ఊరగొండ మల్లేశం

విగ్రహం...నిగ్రహం



జంధ్యాల రఘుబాబు
9849753298

విగ్రహం నిగ్రహానికి గురుతు. దాన్నేమన్నా తానేమనదు. పిట్టలు వాలినా, వర్షమూ ఎండా పడినా, చలికైనా విగ్రహం తన నిగ్రహాన్ని కోల్పోదు. దేశ కాల ప్రాంత తేడాలకూ ఆ విగ్రహం తలొంచదు. అంబేద్కర్ విగ్రహాన్నే చూసుకొండి చూపుడు వేలు పైకి చూపిస్తూ ఉంటుంది. తల వంచవద్దు అన్నట్టు తల నిటారుగా ఉంటుంది. అలాగే ప్రపంచానికే మార్గం చూపించిన మార్క్స్, లెనిన్, గాంధీ, నెహ్రూ, మార్టిన్ లూథర్ కింగ్, మదర్ థెరిసా, మండేలా.... ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఆ విగ్రహాల్లో మనకు స్ఫూర్తి ఉంటుంది. ఈ భూమిపైన లేనివాళ్లను, వారి మంచితనాన్ని గుర్తు చేసుకునేలా ఈ విగ్రహాలు మనకు రోజూ కనిపించేటట్టు పెట్టుకుంటాం. అంటే వాళ్లు ఇంకా జీవించినట్టు లెక్కన్నమాట. విగ్రహం పెట్టడానికి చనిపోవడమొక్కటే ప్రామాణికమనుకుంటే ఈపాటికి ప్రపంచం విగ్రహాలతో నిండిపోయి ఉండేది. అందుకే అంతో ఇంతో ప్రజలకు, మానవాళికి మేలు చేసిన వాళ్లకి మాత్రమే విగ్రహాలను పెడతారు. మిగతా వాళ్ల వారసులను బట్టి వాళ్లకు సమాధులు వెలుస్తాయి.అయితే కొన్ని సమాధులు కూడా విగ్రహాల్లాగే దర్శనీయ స్థలాలుగా మారిపోతాయి.

ఇక నేటి రాజకీయాల్లోనూ విగ్రహాలకు ప్రాముఖ్యత పెరిగింది. అసలు రాజకీయాలకు విగ్రహాలకు అవినాభావ సంబంధం ఉందేమోనని మనకనిపించడంలో ఎలాంటి తప్పూ లేదు. అసలు అలా అనిపించకపోతేనే తప్పేమో అనిపిస్తుంది. సూర్యుడి చుట్టూ గ్రహాలు, గ్రహాల చుట్టూ ఉపగ్రహాలు తిరిగినట్టు, ఈ విగ్రహాల చుట్టూ రాజకీయాలు తిరుగుతూ ఉంటాయన్నది మరచిపోకూడదు. విగ్రహానికి ప్రాణం లేదనుకుంటాం కాని అందరి ప్రాణాలూ ఆ విగ్రహాల చుట్టూతా తిరుగుతుంటాయి. అది దేవుడి విగ్రహం కావచ్చు, రాజకీయ నాయకుడి విగ్రహం కావచ్చు, లేదా మంచి విషయాలు బోధించిన ప్రవక్తల, కవుల, కళాకారుల విగ్రహాలు కావచ్చు.

పోయినోళ్లు అందరూ మంచోళ్లు అన్నట్టు ఈ విగ్రహాలు పోయినోళ్లకు మాత్రమేనా ఉండేది అన్న అపోహను మొదట తీసేయాలి మనసులోంచి. పెద్ద పెద్ద స్టార్లు అంటే వాళ్లు క్రీడాకారులు కావచ్చు, సినిమా వాళ్లు కావచ్చు, సైంటిస్టులు కావచ్చు, డాక్టర్లు, ఇంజనీర్లు కావచ్చు, ఇంకా సమాజ సేవకులు కావచ్చు, వాళ్లలో కొందరికి బతికుండగానే తమ తమ విగ్రహాల్ని చూసుకునే అవకాశం దొరుకుతుంది. కొన్ని మ్యూజియాల్లో మైనపుబొమ్మలు అదేనండి విగ్రహాలు చేసి అసలు అందులో ప్రాణం ఉన్నట్టుగా తయారు చేస్తారు. ఉదాహరణకు అమితాబ్ బచ్చన్ తన మైనపు విగ్రహం ముందు నిలబడి ఫొటో తీసి సాంఘిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తే ఆ రెండింటిలో విగ్రహమేది, ఆయన ఏది అన్న విషయం అస్సలు కనుక్కోలేం. అలా ఉంటుంది ఆ మైనపు విగ్రహం.

సురుకు

ప్రభుత్వాలు మారినప్పుడల్లా స్కీముల పేర్లు, వాటి చిత్రాలు, ప్రభుత్వ ఆఫీసుల్లో ఫొటోలు, బ్యాగులు ఇతర సామగ్రి ఇస్తుంటే వాటిపై ఉండే బొమ్మలు, సాంఘిక మీడియాలో కనిపించే లోగోలు ఇలా ఎన్నో మారిపోతాయి. ఆర్టీసీ బస్సుల పేర్లు, ఆఫీసులు, విశ్వవిద్యాలయాల పేర్లు మారిపోతాయి. ఆ అలవాటు అంటే ఈ మార్పుల ఆనవాయితీ జరుగుతునే ఉంటుంది. తామున్నప్పుడు చేసిన అలాంటి మార్పులను ఇతరులు చేస్తే సహించలేనివాళ్లు తామొచ్చాక అంటే అధికారంలోకి అన్నమాట, మళ్లీ అన్నింటినీ సమూలంగా మారుస్తామని, చెత్తను బయట పారబోస్తామని ప్రకటిస్తారు. ఇక్కడ చెత్త అంటే ఏమిటో అందరూ బాగా అర్థం చేసుకోవాలి. తమకు సువాసన కలిగింది, కంటికి బాగా కనిపించేది ఇతరులకు చెత్తగా కనిపించడంలో ఏమంత వింత లేదు. అయితే అవతలివాళ్లకు కూడా ఇలాగే కనిపిస్తుంది అన్న చిన్న విషయం కూడా గ్రహించలేరు, గ్రహించినా సహించలేరు. అదే తమాషా.


అలా మార్చే లిస్టులోకి ఈమధ్య విగ్రహాలు కూడా చేరాయి. పాతవాటిని తీసి కొత్తవి పెట్టడం వేరు, అసలు విగ్రహమే లేనిచోట కొత్తది పెట్టడం వేరు. తాము పోయాక తమ విగ్రహం ఎక్కడ పెట్టాలి అన్న విషయాన్ని కూడా చూచాయిగా చెప్పడం లోలోన చరిగే ప్రక్రియ. అవి బయటకు రావు. ఎందుకంటే ఈయన లేదా ఈమె పోయాక వారి విగ్రహం ఫలానా చోట పెడతాం అని ప్రకటించడం బాగుండదు కాబట్టి చెప్పరు. అన్న రామారావు ట్యాంక్ బండ్‌పై వరుసగా విగ్రహాలు పెట్టినప్పుడు చివరలో ఒకదానికి దిమ్మ కట్టారు కాని ఇంకా విగ్రహం పెట్టలేదు, అప్పుడు ఒక కార్టూను కూడా వచ్చింది నవ్వుతున్న ఎన్టీయార్ బొమ్మతో, అక్కడ తన విగ్రహం పెట్టుకుంటాడని. మొత్తం మీద విగ్రహాలు ఏర్పాటు చేసే, మార్చడం అన్నది చాలా సీరియస్ విషయం, దాన్ని కొందరు నాయకులు పలుచనగా చేసి, మాట్లాడి ప్రజల్లో తాము పలుచనైపోతున్నామన్న విషయాన్ని కూడా మరచిపోతున్నారు.

ఇక విగ్రహాల్లోని రకాలను చూస్తే తాత్కాలిక విగ్రహాలు, శాశ్వత విగ్రహాలు, శంకుస్థాపన విగ్రహాలు అంటే వాటికి శిలాఫలకం పెడతారు కాని విగ్రహం ఏనాటికీ రాదు, ముసుగేసిన విగ్రహాలు, నాయకుల విగ్రహాలు, ప్రతినాయకుల విగ్రహాలు ఇలా ఎన్నో రకాలుగా వాటిని వర్గీకరణ చేసుకోవచ్చు. ఒకరికి నాయకుడైన వాడు ఇంకొకరికి ప్రతినాయకుడు కావచ్చు, నష్టం చేసి ఉండవచ్చు, నష్టం చేసేవారిని ఎందరినో తయారుచేసి ఉండొచ్చు. అలాంటప్పుడు మా నాయకుడూ తక్కువేం కాదని అతని విగ్రహాన్ని కూడా పెట్టే రోజులివి.

ప్రభుత్వాలు మారినప్పుడల్లా స్కీముల పేర్లు, వాటి చిత్రాలు, ప్రభుత్వ ఆఫీసుల్లో ఫొటోలు, బ్యాగులు ఇతర సామగ్రి ఇస్తుంటే వాటిపై ఉండే బొమ్మలు, సాంఘిక మీడియాలో కనిపించే లోగోలు ఇలా ఎన్నో మారిపోతాయి. ఆర్టీసీ బస్సుల పేర్లు, అఫీసులు, విశ్వవిద్యాలయాల పేర్లు మారిపోతాయి. ఆ అలవాటు అంటే ఈ మార్పుల ఆనవాయితీ జరుగుతునే ఉంటుంది. తామున్నప్పుడు చేసిన అలాంటి మార్పులను ఇతరులు చేస్తే సహించలేనివాళ్లు తామొచ్చాక అంటే అధికారంలోకి అన్నమాట, మళ్లీ అన్నింటినీ సమూలంగా మారుస్తామని, చెత్తను బయట పారబోస్తామని ప్రకటిస్తారు. ఇక్కడ చెత్త అంటే ఏమిటో అందరూ బాగా అర్థం చేసుకోవాలి.

ఉదాహరణకు రావణాసురుణ్ణి ప్రతినాయకుడుగా చూసి మనదేశంలో పదితలల రావణుని బొమ్మచేసి దాన్ని కాలుస్తారు.అదే శ్రీలంకలోనైతే అతణ్ణి ఆరాధిస్తారు.

స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ అంటే స్వేచ్ఛా విగ్రహం ఒకటుంది అమెరికాలోని న్యూయార్క్ సముద్రతీరంలో ఉంటుంది. దాన్ని ఫ్రెంచివారు అమెరికా ఏర్పడిన వందేళ్ల సందర్భంగా ఈ విగ్రహాన్ని కానుకగా ఇచ్చారు. ఆ విగ్రహం చేతిలో ఉండే కాగడా స్వేచ్ఛా కాంతిని వెదజల్లుతుంటుందని సందేశం. తమాషా ఏమిటంటే ప్రపంచంలో స్వేచ్ఛను ఎంత అందించిందో తెలియదు కాని అమెరికా మాత్రం స్వేచ్ఛగా దేశాలన్నీ తిరుగు తుంటుంది, యుద్ధాలు చేయిస్తుంటుంది. అందుకే ఈ విగ్రహాల కాన్సెప్టును మేము నమ్మము అని కొందరు చెబుతూఉంటారు. అదీ నిజమేనేమో అనిపిస్తుంటుంది ఒక్కోసారి. ఏమైనా ఆ విగ్రహాల గొడవ పక్కనబెట్టి ప్రజలు చాలా నిగ్రహంగా ఉన్నారన్న విషయం మనకు తెలిసిపోతోంది. ఏ విగ్రహాన్ని, ఏ గ్రహాన్ని ఎప్పుడు ఎక్కడ పెట్టాలో వాళ్లకి బాగా తెలుసు. ■



తల్లి స్వార్జిత ఆస్తిపై పిల్లలకు హక్కుండదు

- ఆమె తన ఇష్టానుసారంగా ఎవరికైనా ఇచ్చుకోవచ్చు : హైకోర్టు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తల్లి స్వార్జిత ఆస్తిపై పిల్లలు హక్కులు ఉండబోవనీ. దాన్ని తనకు ఇష్టం వచ్చిన వారికి ఇచ్చుకునే అధికారం ఆమెకు ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. ఆస్తిపై హక్కులను ఆధారాలతో కోరాలేగానీ విభిన్న ప్రకటనలతో, ఊహాజనితంగా కోరేందుకు వీల్లేదని పేర్కొంది. హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఇంట్లో మూడో వంతు వాటాను ఇవ్వకుండా పెద్ద కుమారుడి పేరుతో గిఫ్ట్ సెటిల్మెంట్‌ను డీడ్ చేసిన ఒక తల్లి చర్యను సివిల్ కోర్టు సమర్ధించింది. దీన్ని సవాల్ చేస్తూ భజరంగ్‌లాల్ అగర్వాల్ హైకోర్టులో దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌ను కొట్టేస్తూ జస్టిస్ మౌసమీ భట్టాచార్య, జస్టిస్ ఎంజి ప్రియదర్శినిలతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది.

పిటిషనర్ తరపు లాయర్ వాదిస్తూ, 1988లో తన క్లైయింట్ తండ్రి ఇంటిని కొనుగోలు చేసి ఆయన భార్య పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించారని తెలిపారు. తండ్రి మరణానంతరం ముగ్గురు కొడుకుల పేరుతో విల్‌డీడ్ చేశారనీ, ఆ తర్వాత దాన్ని రద్దు చేసి పెద్ద కొడుకు రాజేంద్ర అగర్వాల్ పేరుతో గిఫ్ట్ సెటిల్మెంట్ డీడ్ చేయడం చెల్లదని వాదించారు. మూడో వంతు వాటా తన క్లైయింట్‌కు కూడా వస్తుందని అన్నారు. అయితే ఇది తల్లి సుశీల్‌అగర్వాల్ స్వార్జిత ఆస్తి అని ఆమె తరపు లాయర్ వాదించారు. దీనిపై హైకోర్టు, తల్లి విల్‌డీడ్ చేసినప్పుడు సమర్ధించిన పిటిషనర్, దాన్ని రద్దు చేశాక అన్యాయమంటూ కోర్టుకు రావడాన్ని తప్పుపట్టింది. విల్ డీడ్‌లో ముగ్గురికీ వాటాలు ఇచ్చినప్పుడు తల్లికి హక్కులున్నాయని అంగీకరించిన పిటిషనర్, గిఫ్ట్ డీడ్ చేశాక తల్లికి హక్కులు లేవంటూ వాదించటం చెల్లదంటూ తేల్చి చెప్పింది. ఆస్తిని ఉమ్మడి కుటుంబ ఆస్తిగా ప్రకటించాలనే వాదన చట్ట వ్యతిరేకమని తేల్చింది. ఈ విషయంలో తల్లికే పూర్తి హక్కులు ఉంటాయని తీర్పు వెలువరించింది.

అబద్ధాలు మాట్లాడటం మానుకో

- కేటీఆర్‌కు మధుయాష్కీగౌడ్ హెచ్చరిక

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తనకు ఫామ్‌హౌస్ ఉందనీ, అది ఎఫ్‌టీఎల్‌లోనే ఉందంటూ మాజీ మంత్రి కేటీఆర్ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మెన్ మధుయాష్కీగౌడ్ విమర్శించారు. అవగాహన లేకుండా అలాంటి మాటలను మానుకోవాలని హెచ్చరించారు. ఈమేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కేటీఆర్ నీలాగా రాజభోగాలు అనుభవించేందుకు నాకు ఫామ్ హౌస్ లేదు. వారానికి నాలుగు సార్లు వెళ్లి ఎంజాయ్ చేసేందుకు మీకు జన్వాడలో ఫామ్ హౌస్ ఉంది.111 జీవోకు వ్యతిరేకంగా నిర్మించిన ఆ ఫామ్ హౌస్‌ను బినామీ పేర్లతో నిర్వహిస్తున్నారు. తమకు గండిపేట దగ్గర మామిడి తోట, సపోటా తోట ఉన్న మాట వాస్తవమే. అక్కడ వాచ్‌మెన్ కుటుంబం ఉండేందుకు పాతబడిన చిన్న నిర్మాణం తప్పా. ఫామ్ హౌస్ లేదు. అయినా ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో వ్యవసాయం, తోటల పెంపకం చేయొచ్చు అనే కనీస అవగాహన కూడా కేసీఆర్‌కు లేదు' అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

అందరికీ నాణ్యమైన విద్యకోసం పోరాటం

- ఏఐఎఫ్ఈఏ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశంలో అనేక సంస్కరణలు, విద్యారంగ విధానాలు వచ్చినా సంక్షోభాన్ని పరిష్కరించలేకపోతున్నాయని అఖిల భారత విద్యాసంఘాల సమాఖ్య (ఏఐఎఫ్ఈఏ) విమర్శించింది. అందరికీ నాణ్యమైన విద్య కోసం పోరాడాలని పిలుపునిచ్చింది. శనివారం హైదరాబాద్‌లో ఏఐఎఫ్ఈఏ జాతీయ కార్యవర్గ సమావేశాన్ని ఆ సంఘం జాతీయ అధ్యక్షులు సుధీర్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ప్రధాన కార్యదర్శి నబ్‌కుమార్ కర్మకార్ నివేదికను ప్రవేశపెట్టారు. అనంతరం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలో బడిఈడు పిల్లలందరికీ ఉచితంగా నాణ్యమైన విద్యనందించాలని డిమాండ్ చేశారు. కొఠారి కమిషన్ సిఫారసుల ప్రకారం జీడీపీలో ఆరు శాతం, కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి పది శాతం నిధులను కేటాయించాలని కోరారు. విద్యావ్యాపారాన్ని అరికట్టాలని తెలిపారు. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని సూచించారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ నియామకాల స్థానంలో పూర్తిస్థాయి నియామకాలను చేపట్టాలని కోరారు. జాతీయ నూతన విద్యావిధానంలో ఉన్న విద్యా, ప్రజా వ్యతిరేక విధానాలను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్ఈఏ నాయకులు సంధ్యా ప్రధాన్, మిథిలేష్ శర్మ, మనోజ్‌కుమార్, కమల్ లోచక్, బిశ్వాల్, కావలి అశోక్‌కుమార్, కటకం రమేష్, మారెడ్డి అంజిరెడ్డి, జి హృదయరాజు, ఎస్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ చేసినన్నీ తప్పులు ఎవరూ చేయలేదు

- బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పురపాలక మంత్రిగా కేటీఆర్ చేసినన్నీ తప్పులు ఎవరూ చేయలేదని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు ఆరోపించారు. శనివారం హైదరాబాద్‌లోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్ కన్వెన్షన్‌ను కూలగొట్టాలని 2014లోనే హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని గుర్తుచేశారు. పదేండ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఎన్ కన్వెన్షన్‌ను ఎందుకు కూలగొట్టలేదని ప్రశ్నించారు. కేటీఆర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి బాధ్యతలు మర్చిపోయి మాట్లాడుతున్నారని విమర్శించారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో ఉన్న అక్రమ నిర్మాణాలు కూల్చాలనీ 2010 లోనే హైకోర్టు తీర్పు ఇచ్చిందని పేర్కొన్నారు. కొత్తగా రేవంత్‌రెడ్డి ఏదో చేసినట్టు డ్రామా నడిపిస్తున్నారని వ్యాఖ్యానించారు. సీఎంకు చిత్తశుద్ధి ఉంటే హైకోర్టు గుర్తించిన రెండు వేల ఐదు వందల చెరువులు కాపాడాలని సూచించారు. ఎంఐఎం నాయకులు, కార్పొరేటర్లకు భయపడి మీరాళం ట్యాంక్ విషయంలో హైడ్రా వెనక్కి తగ్గిందన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న అన్ని నిర్మాణాలను కూల్చాలని రఘునందన్ రావు డిమాండ్ చేశారు.

గుజరాత్ 'సైబర్' ఆపరేషన్ సక్సెస్



- సైబర్ నేరాళ్లకు హైదరాబాద్ పోలీసుల భారీ షాక్
- దేశంలో 983 కేసుల్లో మోస్ట్ వాంటెడ్ నేరగాళ్ల అరెస్ట్
- మిస్టరీ వీడిన 20 కేసులు : వివరాలు వెల్లడించిన సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-సిటీబ్యూరో

సైబర్‌క్రైమ్ పోలీసుల గుజరాత్ ఆపరేషన్ సక్సెస్ అయింది. 983 కేసుల్లో మోస్ట్ వాంటెడ్ గుజరాత్ జాదూలను అరెస్టు చేశారు. 7 బృందాలతో గుజరాత్‌లో కీలక ఆపరేషన్ చేశారు. చార్టెడ్ అకౌంటెంట్ సహా 36 మంది సైబర్ నిందితులను అరెస్టు చేశారు. వీరిలో ఏడుగురు దేశవ్యాప్తంగా పలు కేసుల్లో కీలక నిందితులుగా ఉన్నట్టు హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. పెట్టుబడుల పేరుతో మోసాల్లో 11 మంది, ట్రేడింగ్ మోసంలో నలుగురు, కేవైసీ మోసంలో ఒకరిని అరెస్టు చేసినట్టు తెలిపారు. నిందితులపై దేశవ్యాప్తంగా 983 కేసులు ఉన్నట్టు గుర్తించామన్నారు. శనివారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని పాత పోలీస్ కమిషనరేట్‌లో విలేకరుల సమావేశంలో సీపీ వివరాలు వెల్లడించారు.

గుజరాత్‌కు చెందిన సాగర్ గోరధన్ ప్రజాపతి, పర్మార్ కిరీట్ నాథుభాయ్, కనాని నికుంజ్ కిషోర్ భాయ్, ప్రవీణ్ కాళుభాయ్, చూడాసమా కులదీప్ సిన్హ్, జెడేజా దైవత్, సినోజియా కేతన్ సురేశ్ భాయ్‌తోపాటు మరికొంత మందితో కలిసి అంతర్రాష్ట్ర ముఠాగా ఏర్పడ్డారు. పెట్టుబడులు, ట్రేడింగ్, కేవైసీ, రుణాలిపిస్తామని వివిధ రకాల మోసాలతో అమాయకులను నమ్మించి కోట్లకు కోట్లు దోచుకున్నారు. ఈ క్రమంలో వారిని పట్టుకునేందుకు సైబర్ క్రైమ్ డీసీపీ కవిత నేతృత్వంలో గుజరాత్ ఆపరేషన్ మొదలు పెట్టారు. ఈ బృందంలో ఏసీపీలు శివమారుతి, చాంద్‌పాషా, ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, కె.మధుసూధన్‌రావు, పీఎస్ అభిషేక్, మన్మోహన్, కె.సతీష్ రెడ్డి, సిబ్బంది పివి శ్రీనివాస్, భాస్కర్, సతీష్, కాంతికుమార్ భాస్కర్, బి.సందీప్, సంపత్ ఉన్నారు. చివరకు 36 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై హైదరాబాద్ పరిధిలో 20 కేసులు ఉన్నాయి. నిందితుల నుంచి రూ.40 లక్షలు, 27 బ్యాంక్ ఖాతా పాస్ బుక్‌లు, 40 డెబిట్ కార్డులు, 226 బ్యాంకు చెక్కులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆపరేషన్ చేపట్టిన సైబర్ క్రైమ్ పోలీసులను కమిషనర్, సీసీఎస్ డీసీపీ శ్వేతారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

అప్రమత్తంగా ఉండాలి: కొత్తకోట శ్రీనివాస్

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వాట్సప్, ఆన్‌లైన్‌లో వచ్చే ప్రకటనలను చూసి నమ్మొద్దని సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులతో మాట్లాడొద్దని, ముఖ్యంగా చాటింగ్‌లు చేయొద్దని సూచించారు. వెబ్‌సైట్ల ద్వారా పెట్టుబడి పెట్టొద్దన్నారు. ఇంట్లో కూర్చొని తక్కువ మొత్తంలో పెట్టుబడి పెట్టడం ద్వారా అధిక రాబడులు వస్తాయని సైబర్ నేరస్థులు చెప్పేమాటలను నమ్మొద్దన్నారు.

రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయాలని సీబీఐ డైరెక్టర్‌ను కోరాం

మరోవైపు ఫోన్ ట్యాపింగ్ కేసులోనూ దర్యాప్తు కొనసాగుతోందని సీపీ వెల్లడించారు. కేసులో కీలక నిందితులను ఇప్పటికే అరెస్టు చేశామన్నారు. ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు, శ్రవణ్ రావుపై రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయాలని సీబీఐ డైరెక్టర్‌ను కోరామన్నారు. సీబీఐ రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేసిన తర్వాత వారిని దేశానికి తీసుకొస్తామన్నారు. ఫోన్‌ట్యాపింగ్ కేసుతో సంబంధమున్న వారందర్నీ విచారిస్తామని స్పష్టం చేశారు.

సెప్టెంబర్ 1 నుంచి ఐసెట్ కౌన్సెలింగ్

- 3 నుంచి ధ్రువపత్రాల పరిశీలన
- 11 వరకు వెబ్‌ఆప్షన్ల నమోదు
- షెడ్యూల్ విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన ఐసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ వచ్చేనెల ఒకటో తేదీ నుంచి ప్రారంభం కానుంది. శనివారం హైదరాబాద్‌లో ఐసెట్ ప్రవేశాల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఐసెట్ ప్రవేశాల కన్వీనర్ శ్రీదేవసేన పాల్గొన్నారు. అనంతరం షెడ్యూల్‌ను విడుదల చేశారు. వచ్చేనెల ఒకటి నుంచి ఎనిమిదో తేదీ వరకు ఆన్‌లైన్‌లో ప్రాథమిక సమాచారం అందుబాటులో ఉంటుందనీ, ప్రాసెసింగ్ ఫీజు చెల్లించేందుకు అవకాశముందని తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలనకు స్లాట్‌ను బుక్ చేసుకోవచ్చని సూచించారు. అదేనెల మూడు నుంచి తొమ్మిదో తేదీ వరకు ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని వివరించారు. నాలుగు నుంచి 11 వరకు వెబ్‌ఆప్షన్లను నమోదు చేసేందుకు అవకాశముందని పేర్కొన్నారు. ఈనెల 14న మొదటి విడత సీట్లను కేటాయిస్తామని వివరించారు. 14 నుంచి 17 వరకు ట్యూషన్ ఫీజు చెల్లించి వెబ్‌సైట్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని కోరారు. వచ్చేనెల 20 నుంచి ఐసెట్ ప్రవేశాల కోసం తుదివిడత కౌన్సెలింగ్ ప్రక్రియను నిర్వహిస్తామని తెలిపారు. 20న ప్రాసెసింగ్ ఫీజు చెల్లించొచ్చని పేర్కొన్నారు. 21న ధ్రువపత్రాల పరిశీలన, 21,22 తేదీల్లో వెబ్‌ఆప్షన్ల నమోదు చేయొచ్చని సూచించారు. 25న సీట్లు కేటాయిస్తామని తెలిపారు. 25 నుంచి 27 వరకు ట్యూషన్ ఫీజు చెల్లించి వెబ్‌సైట్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని పేర్కొన్నారు. అదేనెల 25 నుంచి 28 వరకు కాలేజీల్లో రిపోర్టు చేయాలని కోరారు. వచ్చేనెల 27న స్పాట్ అడ్మిషన్ల కోసం మార్గదర్శకాలను విడుదల చేస్తామని తెలిపారు. ఇతర వివరాల కోసం ఈనెల 29 నుంచి https://tgicet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

గురుకుల కాలేజీలో బీఏ యానిమేషన్ కోర్సు

- దరఖాస్తు గడువు పొడిగింపు : ఎంజేపీ కార్యదర్శి బడుగు సైదులు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

డిమాండ్‌లో ఉన్న బీఏ యానిమేషన్ కోర్సు మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో అందుబాటులో ఉందనీ, దీనిలో చేరడానికి ఈ నెల 31 లోగా దరఖాస్తు చేసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి బడుగు సైదులు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ ఉన్న ఈ కోర్సులో ప్రవేశం పొందడానికి ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు అర్హులనీ, ఆసక్తి కలిగిన విద్యార్థులు వెబ్ సైట్ https://mjptbcwreis.telangana.gov.in లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9032644463, 9063242329 సంప్రదించాలని ఆయన సూచించారు.

ఎయిర్‌పోర్టుల్లాగా రైల్వే స్టేషన్లు

- అభివృద్ధి పనులు వేగవంతం
- సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సందర్శించిన కేంద్రమంత్రి రవనీత్ సింగ్



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

దేశవ్యాప్తంగా ఎయిర్‌పోర్టుల తరహాలో రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేస్తున్నామని కేంద్ర రైల్వే, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల సహాయమంత్రి రవణీత్‌సింగ్ తెలిపారు. శనివారంనాడాయన సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న ఆధునీకరణ పనుల్ని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సికింద్రాబాద్ స్టేషన్ దక్షిణ వైపున నిర్మాణంలోనున్న బేస్‌మెంట్ భవన నిర్మాణ కార్యకలాపాలు, మల్టీ లెవల్ కార్ పార్కింగ్ సౌకర్యం, నూతన స్టేషన్ భవన విస్తరణ పనులను సందర్శించారు. ఈ పనులకు ప్రధాని నరేంద్రమోడీ రూ.700 కోట్ల అంచనా వ్యయంతో శంకుస్థాపన చేశారనీ, 2026 నాటికి ఇవి పూర్తవుతాయనీ, ఇప్పటికి 27 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. రైల్వే స్టేషన్లలో ప్రపంచ స్థాయి ప్రయాణీకుల సౌకర్యాలు ఉంటాయని చెప్పారు. ఈ స్టేషన్‌ను పర్యావరణ హితంగా తీర్చిదిద్దుతూ ఇంధన పొదుపు కోసం సోలార్ ప్యానల్స్, నీటి కాలుష్యాన్ని తగ్గించేందుకు శుద్ధి కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వచ్చే 50 ఏండ్ల వరకు ప్రయాణీకుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద 119 రైల్వే స్టేషన్లను దాదాపు రూ. ఐదు వేల కోట్ల అంచనా వ్యయంతో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ మాట్లాడుతూ సికింద్రాబాద్, చర్లపల్లి అభివృద్ధి పనులతో పాటు హైదరాబాద్, కాచిగూడ రైల్వేస్టేషన్ల ప్రతిపాదనలు తుది దశలో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ భరతేష్‌కుమార్ జైన్, నిర్మాణ విభాగం చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నీరజ్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ పునరుద్ధరణే ఏకైక పరిష్కారం

- కేంద్రం ఏకీకృత పెన్షన్ పథకం ప్రకటనపై ఎస్‌టీఎఫ్ఐ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశంలో సీపీఎస్ స్థానంలో ఏకీకృత పెన్షన్ పథకం పేరుతో కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం పెన్షన్ విధానాన్ని మసిపూసి మారెడుకాయ చేయడమేనని స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీఎఫ్ఐ) విమర్శించింది. దాన్ని అంగీకరించేది లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు ఎస్‌టీఎఫ్ఐ జాతీయ ఉపాధ్యక్షులు, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 25 ఏండ్ల సర్వీసు పూర్తి చేసిన ఉద్యోగులకు 50 శాతం పెన్షన్‌ను గ్యారెంటీ చేస్తున్నట్టు కేంద్రం ప్రకటించిందని తెలిపారు. సర్వీసులో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు 60 శాతం కుటుంబ పెన్షన్ ఇస్తామని వెల్లడించిందని పేర్కొన్నారు. చందాతో కూడిన పెన్షన్ పథకాన్ని రద్దు చేసే విషయాన్ని ప్రస్తావించకపోవడం, పైగా ఐచ్ఛికం అని ప్రస్తావించడంలోనే అసలు మోసం ఉందని విమర్శించారు. ఒక్క రూపాయి చందా చెల్లించకుండానే సర్వీసును బట్టి 50 శాతం పెన్షన్ ఇచ్చే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించడమే పరిష్కారమని సూచించారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాల్సిందేనని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

'బాస్'కు నిధులు విడుదల చేయండి

- డిప్యూటీ సీఎం భట్టికి మాజీ మంత్రి హరీశ్‌రావు లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రయివేటు స్కూళ్లలో చదివే పేద విద్యార్థులకోసం ఉద్దేశించిన 'బెస్ట్ అవైలబుల్ స్కూల్స్' (బాస్) పథకానికి నిధులను విడుదల చేయాలని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తద్వారా దాదాపు 25 వేల మంది పిల్లలను ఆదుకోవాలని కోరుతూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఆయన శనివారం లేఖ రాశారు. గతంలో పెండింగ్‌లో ఉన్న రూ. 80 కోట్లతోపాటు ఈ యేడాదికి అవసరమైన రూ. 130 కోట్లను కూడా వెంటనే విడుదల చేయాలని కోరారు.

వరంగల్ నగరాభివృద్ధికి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయండి



- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వరంగల్ పట్టణాన్ని మహా నగరంగా తీర్చిదిద్దడానికి మాస్టర్ ప్లాన్ తక్షణమే సిద్ధం చేయాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వరంగల్ నగర అభివృద్ధిపై శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) అధికారులు, సంబంధిత శాఖలతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, హైదరాబాద్ నగరం తర్వాత వరంగల్ పట్టణాన్ని అభివృద్ధి చేయనున్నట్టు పేర్కొన్నారు. గతంలో ఉన్న 2041 మాస్టర్ ప్లాన్‌ను 2050 నాటి జనాభాను దృష్టిలో ఉంచుకొని పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. అవసరమైన భూముల సేకరణ చేపట్టాలని ఆదేశించారు. ఇప్పటి వరకు కన్సల్టెంట్లు తయారు చేసిన మాస్టర్ ప్లాన్‌లను మంత్రి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ పరిపాలన ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, రోడ్లు భవనాలు శాఖ ప్రత్యేక కార్యదర్శి హరిచందన, కుడా వైస్ చైర్మెన్ అశ్విని, తదితరులు పాల్గొన్నారు.

ఏపీవైతో సామాజిక భద్రత

- పీఎఫ్ఆర్‌పి సమావేశంలో నిపుణులు



హైదరాబాద్ : అటల్ పెన్షన్ యోజన (ఏపీవై) స్కీంతో అసంఘటిత రంగంలోని కార్మికులకు సామాజిక భద్రత లభిస్తుందని కేంద్ర ప్రభుత్వంలోని పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అథారిటీ (పీఎఫ్ఆర్‌డీఏ) హోల్ టైం మెంబర్ మమ్‌తా శంకర్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని వెస్ట్ మారేడ్‌పల్లిలో పీఎఫ్ఆర్‌డీఏ, ఎస్ఎల్‌బీసీ తెలంగాణ నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. ఏపీవైతో భారతీయులకు సామాజిక భద్రత లభిస్తుందన్నారు. ముఖ్యంగా అట్టడుగు అసంఘటిత రంగాల వారికి ఇది బాగా ఉపయోగపడుతుందన్నారు. ఈ స్కీంలో చేరడానికి 18-40 ఏండ్ల వారు అర్హులని తెలిపారు. ఈ పథకంలో కనీసం రూ.1,000 నుంచి రూ.5,000 వరకు పెన్షన్ లభిస్తుందన్నారు. 60 ఏండ్లు రాగానే పెన్షన్ ప్రారంభమవుతుందన్నారు. 2024 జూన్ ముగింపు నాటికి తెలంగాణలో 19.37 లక్షల మంది.. దేశ వ్యాప్తంగా 6.62 కోట్ల మంది ఏపీవై పథకంలో సభ్యులుగా ఉన్నారన్నారు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ జనరల్ మేనేజర్ ప్రియాబ్రత మిశ్రా మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు తెలంగాణలో కొత్తగా 1,21,259 మంది ఈ పథకంలో ఖాతా దారులుగా చేరారని తెలిపారు. దీనిపై ప్రజల్లో ఆర్థిక అక్షరాస్యత పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పీఎఫ్ఆర్‌డీఏ ఏజీఎం వినాయక్ భావోసాగర్, నాబార్డు ఏజీఎం పి హరీష్, యూనియన్ బ్యాంక్ ఏజీఎం బి శ్రీనివాస్, కెనరా బ్యాంక్ డీజీఎం రాకేష్ రోషన్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

'మెట్రో' పెయిడ్ పార్కింగ్ అమలు వాయిదా

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్‌లోని నాగోల్, మియాపూర్ మెట్రో స్టేషన్ల ఆవరణలో పెయిడ్ పార్కింగ్ అమలు వాయిదా పడింది. అయితే, త్వరలోనే అమల్లోకి తీసుకురానున్నట్టు ఇటీవల ఎల్అండ్‌టీ మెట్రో సంస్థ ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రస్తు తానికి ఈ నిర్ణయాన్ని వాయిదా వేస్తున్నట్టు సంస్థ శనివారం ప్రకటించింది. ప్రయాణీకుల నుంచి మరిన్ని సలహాలు, సూచనలు తీసుకున్న తర్వాత.. త్వరలోనే కొత్త తేదీలను ప్రకటిస్తామని ఎక్స్‌లో పేర్కొంది. తొలుత ఆగస్టు 25వ తేదీ నుంచి నాగోల్, సెప్టెంబర్ 1 నుంచి మియాపూర్ మెట్రో పార్కింగ్ లాట్‌లో పార్కింగ్ ఫీజు వసూలు చేస్తామని ఎల్ అండ్ టీ మెట్రో అధికారులు ప్రకటించారు. అయితే, దీనిపై ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు.

పెన్ను, గన్నులతో కలిపి సాగిన దాశరథి రంగాచార్య పయనం

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, సాహితీవేత్త దాశరథి రంగాచార్య పయనం పెన్ను, గన్నులతో కలిపి సాగిందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అన్నారు. దాశరథి జయంతిని పురస్కరించుకుని శనివారం నాడిక్కడ తుగ్లక్ రోడ్‌లోని తన అధికారిక నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్, నల్గొండ ఎంపీలు బలరాం నాయక్, రఘువీర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, కాంగ్రెస్ నాయకులు రోహిన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం సీఎం మాటా డుతూ. తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొన్న రంగాచార్య.. తదనంతర కాలంలో నాటి పరిస్థితులను కండ్లకు కట్టినట్టు తన చిల్లర దేవుళ్లు, జీవనయానం వంటి గ్రంథాల ద్వారా అక్షరీకరించారని కొనియాడారు. వేదాలను తెలుగులోకి అనువదించిన ఘనత రంగాచార్యదేనని కీర్తించారు.

ముగిసిన సీఎం ఢిల్లీ పర్యటన

రెండు రోజులు ఢిల్లీ పర్యటనను ముగించుకొని శనివారం సాయంత్రం సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్ చేరుకున్నారు. ఢిల్లీ పర్యటనలో ఆయన బిజీబిజీగా గడుపారు. ఒకవైపు పార్టీ బలోపేతం, కొత్త పీసీసీ చీఫ్ ఎంపిక, మంత్రి వర్గ విస్తరణపై పార్టీ చీఫ్ ఖర్గే, అగ్రనేత రాహుల్‌తో భేటీ వంటి కీలక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రాష్ట్రంలో ప్రజల సంక్షేమం, అభివృద్ధి విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను తెలిపి భేష్ అనిపించుకన్నారు. మరోవైపు రాష్ట్రానికి సంబంధించిన అభివృద్ధి అంశాలపై కేంద్ర మంత్రులు జ్యోతిరాదిత్య సింధియా, మన్ సుఖ్ మాండవీయలతో వరస భేటీల్లో పాల్గొన్నారు. టి-ఫైబర్ ద్వారా రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీలు, మండలాలు, జిల్లాలకు ఆప్టికల్ ఫైబర్ ప్రాజెక్టు ద్వారా కనెక్టివిటీని కల్పించడం తమ ఉద్దేశమని కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా దృష్టికి తీసుకెళ్లి, సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే తెలంగాణ యువతలోని క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు స్పోర్ట్స్ యూ నివర్సిటీ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం అందుకు సహకారం ఇవ్వాలని కేంద్ర క్రీడలు, యువజన వ్యవహారాల శాఖ మంత్రి మాండవీయను కోరారు.

విచారణకు వెళ్లారా? దాడికి వెళ్ళారా?

- కేటీఆర్‌కు బండ్రు శోభారాణి ప్రశ్న

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మహిళా కమిషన్ ముందు విచారణకు హాజరయ్యారా? లేక దాడికి వెళ్లారా? సమాధానం చెప్పాలని రాష్ట్ర మహిళా కార్పొరేషన్ చైర్మెన్ బండ్రు శోభారాణి డిమాండ్ చేశారు. మహిళలను బహిరంగంగా తిట్టి ఇప్పుడు లోపల విచారణ వ్యక్తం చేస్తే ఎలా? బహిరంగంగా మహిళలకు క్షమాపణ చెప్పాలని నిలదీశారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆమె విలేకర్లతో మాట్లాడారు. మహిళా కమిషన్ ముందు తన తప్పును ఒప్పుకునేందుకు మంది మార్బలంతో ఎందుకు వెళ్లారని ప్రశ్నించారు. చట్టాలను గౌరవించే నాయకులెవరైనా దాడికి పోయినట్టు పోతారా? అని నిలదీశారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థిక వెసులుబాటు కోసం కృషి చేస్తుంటే, బీఆర్ఎస్ నేతలు ఓర్వలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ కుటుంబం మొత్తం సంస్కార హీనంగా ప్రవర్తిస్తున్నదని ఆమె విమర్శించారు.

రాష్ట్రంలో భూ కబ్జాదారులకు స్థానం లేదు

- చనగాని దయాకర్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ప్రజాపాలనలో భూకబ్జాదారులకు స్థానం లేదని టీపీసీసీ అధికార ప్రతినిధి దయాకర్ హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి సాహసోపేతంగా హైడ్రాను ఏర్పాటు చేశారని తెలిపారు. ఆ నిర్ణయంతో అక్రమార్కుల గుండెల్లో హడల్ రేగుతున్నదని చెప్పారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. హైద్రాబాద్ నగర ప్రజలకు ప్రాణ వాయువును అందించే చెరువులను, కుంటలను గత ప్రభుత్వంలోని పెద్దలు నాశనం చేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో అలాంటి చెరువులెన్నో కబ్జాకు గురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. సహజ వనరులను కాపాడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని చెప్పారు. చెరువుల కబ్జాలను రాష్ట్ర ప్రభుత్వం ఉపేక్షించబోదని హెచ్చరించారు. ఎన్ కన్వెన్షన్ రెండు ఎకరాల్లో నిర్మించారనీ, అది బఫర్ జోన్‌లో ఉందని చెప్పారు. తమ్మిడికుంట చెరువును ఆక్రమించారని విమర్శించారు. ఆ నిర్మాణం పూర్తిగా అక్రమమైందని తెలిపారు. అందుకే హైడ్రా ఆ నిర్ణయం తీసుకున్నదని చెప్పారు.

సెబీ చీఫ్‌ను తొలగించాలి

- కేసులో సుప్రీంకోర్టు వైఫల్యం కన్పిస్తోంది
- ఆ ప్రశ్నలకు సమాధానాలు కావాలి : హిందూ గ్రూప్ డైరెక్టర్ ఎన్.రామ్



న్యూఢిల్లీ : అదానీ గ్రూపుతో సెబీ చైర్‌పర్సన్ మాధబి పురి బచ్‌కు పరస్పర విరుద్ధ ప్రయోజనాలు ఉన్నాయంటూ హిండెన్‌బర్గ్ రిసెర్చ్ చేసిన తాజా ఆరోపణల నేపథ్యంలో ఆమెను పదవి నుండి తొలగించాలని ది హిందూ గ్రూప్ పబ్లిషింగ్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ ఎన్.రామ్ సూచించారు. మాధబి బచ్ చర్యలు సమర్థనీయం కావని, హిండెన్‌బర్గ్ లేవనెత్తిన ప్రశ్నలకు కూడా ఆమె సమాధానం ఇవ్వలేదని ఆయన చెప్పారు. హిండెన్‌బర్గ్ నివేదిక, అదానీ గ్రూప్, సెబీ : స్వతంత్ర విచారణ ఆవశ్యకత' అనే అంశంపై ఇండియన్ స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ శుక్రవారం ఏర్పాటు చేసిన సెమినార్‌లో రామ్ ప్రసంగిస్తూ హిండెన్‌బర్గ్ ప్రచురించిన సమగ్ర నివేదిక పరిశోధనాత్మక జర్నలిజానికి ఒక గొప్ప ఉదాహరణ అని వ్యాఖ్యానించారు.

'ఏ ఆర్థిక కుంభకోణంలో అయినా...అది బోఫోర్స్ కావచ్చు. లేదా రోఫెల్ కుంభకోణం కావచ్చు. కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నించడం సహజం. ఆ కప్పిపుచ్చుకోవడం సమర్థవంతంగా జరిగిందా లేక పచ్చిగా జరిగిందా అన్నదే ప్రశ్న. మన సంస్థలు ఘోరంగా విఫలమయ్యాయి' అని రామ్ తెలిపారు. సెబీ సభ్యులు, దాని చైర్‌పర్సన్‌ను ఎవరు నియమించారని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు ఉద్దేశాలను తాను ప్రశ్నించడం లేదని అంటూ ఈ కేసును న్యాయస్థానం లోతుగా పరిశీలించలేదని అభిప్రాయపడ్డారు. 'ఎన్నికల బాండ్ల కేసులో సుప్రీంకోర్టును మనం ప్రశంసించాలి. కానీ అంతే ప్రాధాన్యత కలిగిన ఈ కేసులో న్యాయస్థానం విఫలమైంది. ముఖ్యంగా ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య బెంచ్ వైఫల్యం కన్పిస్తోంది. సెబీ హామీలను అత్యున్నత న్యాయస్థానం ఎందుకు అంగీకరించింది? సెబీ దర్యాప్తుల ఫలితాలను ఎందుకు విచారించలేదు?' అని ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో రెండు మూడు ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుందని రామ్ అన్నారు. 'సెబీ చైర్‌పర్సన్ లేదా సభ్యులు పెట్టిన పెట్టుబడులు ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా ఉన్నాయా? దర్యాప్తులో ఏం తేలింది? అదానీపై జరిపిన విచారణలో సెబీ చైర్‌పర్సన్ తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకున్నారా? ఈ ప్రశ్నలకు సమాధానాలు కావాల్సి ఉంది' అని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయనకు, అదానీ గ్రూపునకు మధ్య ఉన్న సంబంధాలను ఆర్థికవేత్త ప్రొఫెసర్ వెంకటేష్ ఆత్రేయ ప్రస్తావించారు. అదానీ గ్రూపు సహకారంతో 'వైబ్రంట్ గుజరాత్'ను నిర్వహించారని చెప్పారు. సమస్య అదానీయా లేక సెబీ చైర్‌పర్సనా అన్నది కాదని, భారత ప్రభుత్వ ఆర్థిక విధానాలతోనే సమస్య ఉన్నదని ఆయన వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎం) నాయకుడు జి.రామకృష్ణన్, సీనియర్ న్యాయవాది ఆర్.వైగై కూడా ప్రసంగించారు.

మిడిల్‌క్లాస్‌కు కారు కలే..

- గతంలో కంటే తగ్గిన వాహనాల కొనుగోలు
- జీతాలు పెరగక కొందరు..ఉద్యోగాలు ఊడుతాయన్న భయంతో మరికొందరు..ఈఎంఐల భారంతో ఇంకొందరు
- కేంద్ర ఆర్థిక విధానాలే కారణమంటున్న నిపుణులు



న్యూఢిల్లీ : భారత్ వంటి దేశంలో మధ్యతరగతి ప్రజలకు కారు అనేది ఒక కలగా ఉంటుంది. జీవితంలో ఆ కలను నేరవేర్చుకోవాలని వారు అనుకుంటుంటారు. కొందరైతే ఏండ్లుగా కష్టపడిన సంపాదించిన డబ్బును పోగు చేసి, కారును కొనుగోలు చేసి వారు తమ కలను తీర్చుకుంటారు. అయితే, ప్రస్తుత తరుణంలో మధ్యతరగతి ప్రజలు గతంలో కొనుగోలు చేసినంతగా కార్లను మాత్రం కొనలేకపోతున్నారు. ఇందుకు మార్కెట్ నిపుణులు పలు కారణాలను ఉదహరిస్తున్నారు. 1990 ముగింపు, 2000 ప్రారంభంలో ఒక మధ్య తరగతి వ్యక్తి ఉద్యోగంలో చేరిన మూడేండ్లకు జీతంలో మంచి పెరుగుదలను చూసేవాడు. అయితే, ఒక్కసారి వారు వాహనాన్ని కొన్నాక.. వారు ఈఎంఐ ప్రపంచంలోకి వస్తారు. ప్రతి ఏడాది జీతంలో పెరుగుదల ఉండటంతో ఏటికేడు వారిపై కొంత ఈఎంఐ భారం తగ్గుతుంది. ప్రస్తుత డిజిటల్ యుగంతో పోల్చితే అప్పట్లో అదనపు ఖర్చులూ తక్కువగానే ఉండేవని కొందరు మార్కెట్ నిపుణులు చెప్తున్నారు. ప్రస్తుత కాలంలో యువత నిరుద్యోగంతో తీవ్ర సమస్యను ఎదుర్కొంటున్నది. సంపన్నులు మరింత సంపన్నులుగా మారుతున్నారు. అయితే, మధ్యతరగతి ప్రజలు మాత్రం అనేక కష్టాలను ఎదుర్కొంటున్నారు. మరీముఖ్యంగా, కేంద్రంలోని మోడీ పాలనలో ద్రవ్యోల్బణం పెరగటంతో మధ్యతరగతి ప్రజల జేబులకు చిల్లులు పడుతున్నాయి. ధరల పెరుగుదలతో వారు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో వారికి ఇళ్లు గడవటమే కష్టమవుతున్నదనీ, ఇక కారు కొనుగోలు వంటి ఆలోచనలే వారు చేయటంలేదని మార్కెట్ నిపుణులు వివరిస్తున్నారు.

మధ్యతరగతి ప్రజలలో చాలా మంది ఈఎంఐ భారాన్ని ఇప్పటికీ ఎదుర్కొంటున్నారు. ఇది వారికి ప్రధాన సమస్యగా పరిణమించింది. ఇక మరికొందరు జీతాల్లో పెరుగుదల లేకపోవటం, ఉద్యోగ అభద్రత, ప్రభుత్వ అస్తవ్యస్త ఆర్థిక విధానాలు.. వెరసి మధ్యతరగతిని కారును కొనే సాహసానికి దూరంగా ఉంచుతున్నాయి. వారి కొనుగోలు శక్తిని పెంచలేకపోతున్నాయి. దీంతో నాలుగు చక్రాల స్వంత వాహనమనేది మధ్య తరగతికి కలగానే మిగిలిపోతున్నది. మార్కెట్‌లో ప్రస్తుతం పలు బ్రాండ్ల కార్లు అందుబాటులో ఉన్నాయి. అందులో ఉండే సదుపాయాలను బట్టి వీటి రేట్లు మారుతూ ఉంటాయి. అయితే, భారత్ వంటి దేశంలో మధ్యతరగతి ప్రజలను దృష్టిలో పెట్టుకొని రూ.1 లక్షలకు నానో కారు అందుబాటులోకి తెచ్చినా.. అది అంతగా విజయం సాధించలేదు. మధ్యతరగతి ప్రజలు బ్రాండ్ విలువతో పాటు అందులో సదుపాయాలు, కారు విలువ, సమాజంలో ఆ కారు విలువతో తమకు వచ్చే పరపతి వంటి అంశాలను సైతం చూస్తున్నారని మార్కెట్ నిపుణులు అంటున్నారు. ఆలస్యమైనా.. మంచి విలువైన బ్రాండెడ్ కంపెనీ కార్లను కొనాలన్న ఆలోచన కూడా మధ్యతరగతి ప్రజలను కారు కొనాలన్న ఆలోచన వెనక్కి లాగుతున్నదని చెప్తున్నారు. ఇలాంటి కారణాలతో మార్కెట్ కూడా తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని ఎదుర్కొంటున్నదని అంటున్నారు.

ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఏడీఏ) సమాచారం ప్రకారం.. భారత్‌లో ఏడు లక్షలకు పైగా కార్లు అమ్ముడు పోకుండా ఉన్నాయి. వాటి విలువ రూ.70 వేల కోట్లు. పదేండ్ల క్రితం భారత్‌లో అమ్ముడైన అన్ని కార్లలో మధ్యస్థ సైజ్ కార్ల వాటా 64 శాతంగా ఉండేది.

ప్రస్తుతం అది 35 శాతానికి పడిపోవటం గమనార్హం. 2013-14లో 19.9 లక్షల చిన్న, మధ్యస్థ సైజు కార్లు భారత్‌లో అమ్ముడుపోగా.. గతేడాది ఈ సంఖ్య 17.2 లక్షలకు పడిపోయింది. ఇక, 2013-14లో సంపన్నులు కొనుగోలు చేసిన బహుళ-వినియోగ వాహనాలు(ఎంయూవీలు) కార్ల అమ్మకాల్లో 18 శాతం (దాదాపు 5.7 లక్షల కార్లు) ఉండగా.. అది 2023-24 నాటికి 57 శాతానికి(27.8 లక్షల కార్లు) ఎగబాకటం గమనార్హం. కోవిడ్-19 విజృంభణ, వరుస లాక్‌డౌన్లు కూడా దేశంలో మధ్య తరగతి ప్రజలను కోలుకోని దెబ్బ తీశాయనీ, వీటి కారణంగానూ ఈ వర్గం వారు కార్లను కొనే సంఖ్య దారుణంగా పడిపోయిందని మార్కెట్ నిపుణులు చెప్తున్నారు. ప్రస్తుత తరుణంలో కేంద్ర విధానాలే మధ్యతరగతి ప్రజల కొనుగోలు శక్తిని పెంచలేకపోతున్నాయని ఆర్థిక నిపుణులు అంటున్నారు. ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచి, వీరి కొనుగోల శక్తిని పెంచగలిగితే దేశ ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుందని వారు సూచిస్తున్నారు. భారత్ వంటి దేశంలో మధ్య తరగతి ప్రజల జనాభా అధికంగా ఉంటుందనీ, వీరి కొనుగోలు శక్తి మీదనే ఆధారపడి ఇటు కార్ల పరిశ్రమ, అటు దేశ ఆర్థిక వ్యవస్థ ఆధారపడి ఉంటుందని ఆర్థిక, మార్కెట్ నిపుణులు అంటున్నారు.

పర్యాటక అభివృద్ధికి చేయూతనివ్వండి

- ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణ ప్రక్రియను వేగవతం చేయండి : కేంద్ర మంత్రులు షెకావత్, గడ్కరీలకు రాష్ట్ర మంత్రి జూపల్లి విజ్ఞప్తి



నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణ పర్యాటక రంగ అభివృద్ధికి చేయూతనివ్వాలని రాష్ట్ర టూరిజం, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కేంద్రాన్ని కోరారు. శనివారం నాడిక్కడ కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌తో ఆయన కార్యాలయంలో మంత్రి జూపల్లి భేటీ అయ్యారు. ఈ భేటీలో మంత్రి వెంట తెలంగాణ పర్యాటక శాఖ సెక్రటరీ వాణిప్రసాద్, పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ ప్రకాష్ రెడ్డి, ఇతర అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో టూరిజం అభివృద్ధికి కావాల్సిన వనరులు పుష్కలంగా ఉన్నాయని కేంద్ర మంత్రికి వివరించారు. పర్యాటకాభివద్ధికి నిధులిస్తే టూరిజాన్ని కొత్త పుంతలు తొక్కిస్తామని తెలిపారు. భేటీ అనంతరం జూపల్లి మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ పర్యాటకాన్ని అభివృద్ధి చేసేందుకు అన్ని రకాల మార్గాలను అన్వేషిస్తున్నామని, ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామన్నారు. ఎకో, వాటర్ బాడీస్, టెంపుల్, హెల్త్ అండ్ వెల్నెస్ టూరిజంకు తెలంగాణ అనుకూలంగా ఉందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని వార్షిక బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించిందని చెప్పారు. దీనికి కేంద్ర ప్రభుత్వ సహకారం కూడా అవసరమని, నిధులు కేటాయించాలని గజేంద్ర సింగ్ షెకావత్ ను కోరినట్టు ఆయన తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో నూతన పర్యాటక విధానం తీసుకొచ్చి, తెలంగాణను దేశంలోనే మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నామన్నారు.

ఐకానిక్ బ్రిడ్జ్ నిర్మాణం వేగవంతం చేయండి

కృష్ణా నదిపై సోమశిల (తెలంగాణ)-సంగమేశ్వర (ఏపీ) మధ్య డబుల్ డెక్కర్ కేబుల్ ఐకానిక్ బ్రిడ్జ్ నిర్మాణ ప్రక్రియ వేగవంతం అయ్యేలా చూడాలని కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని మంత్రి జూపల్లి కోరారు. ఐకానిక్ బ్రిడ్జ్ నిర్మాణం, ఉమ్మడి మహబూబ్ నగర్‌లోని వివిధ జాతీయ రహదారుల అభివృద్ధి ప్రాజెక్టుల గురించి సుదీర్ఘంగా చర్చించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రతిష్టాత్మకంగా రెండు తెలుగు రాష్ట్రాల నడుమ కృష్ణా నదిపై రూ.1,082.56 కోట్ల వ్యయంతో నిర్మించ తలపెట్టిన ఐకానిక్ తీగల వంతెన నిర్మాణ ప్రక్రియ వివిధ కారణాల వల్ల గత రెండేండ్లుగా పెండింగ్‌లో ఉందని, పనులు పునఃప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని గడ్కరీని కోరారు. ఈ వంతెన నిర్మాణంతో తెలుగు రాష్ట్రాల్లో పర్యావరణ, దేవాలయ పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడమే కాకుండా, రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలకు మరింత సులువైన మార్గం ఏర్పడుతుందన్నారు. దీంతో పాటు తెలంగాణ నుంచి తిరుపతికి కనీసం 70 నుంచి 80 కిలో మీటర్ల మేర దూరం, గంటన్నర ప్రయాణ సమయం తగ్గే అవకాశం ఉందన్నారు. ప్రజలు పడవ ప్రమాదాల బారిన పడకుండా దోహద పడుతుందని వివరించారు. చుట్టూ విశాలమైన శ్రీశైల జలాశయం, నల్లమల అడవి, ఎత్తైన పర్వతాల మధ్య నిర్మించే ఈ వంతెన తెలంగాణ వైపున లలితా సోమేశ్వర ఆలయం, ఆంధ్రప్రదేశ్ వైపున సంగమేశ్వర ఆలయంతో ఒక పర్యాటక కేంద్రంగా మారుతుందని తెలిపారు. దీనిపై నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందిం చినట్టు మంత్రి జూపల్లి తెలిపారు. అవసరమైన ప్రక్రియలన్నింటినీ పూర్తి చేసి సెప్టెంబర్ నెలాఖరులోగా టెండర్లు ప్రారంభ మయ్యేలా చర్యలు తీసుకుంటామని హామిని చ్చినట్టు వెల్లడించారు. అలాగే అలంపూర్ 'ఎక్స్' రోడ్ (ఎన్ హెచ్-44) నుంచి నల్గొండ (ఎన్‌హెచ్-565) వరకు 203.5 కిలో మీటర్ల రోడ్డు మార్గం, కృష్ణా నదిపై 1.5 కిలో మీటర్ల ప్రధాన వంతెనను కలిగి ఉన్న రోడ్డును నేషనల్ హైవేగా అప్‌గ్రేడ్ చేయాలని కోరినట్టు తెలిపారు.

ఆక్రమణదారులపై చర్యలు తప్పవు

ప్రభుత్వ ఆస్తులు ఎవరు ఆక్రమించినా చర్యలు తప్పవని మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆస్తి అంటే ప్రజల ఆస్తి అని, దాని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని గుర్తు చేశారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాల వల్ల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయని, భవిష్యత్ తరాల వారికి సంపదను కాపాడవలసిన అవసరం ఉందన్నారు. అందుకే వాటి పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా మంత్రి జూపల్లి పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ లను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ భేటీల్లో రాష్ట్ర ప్రభుత్వ పనితీరు, రాష్ట్రంలోని తాజా పరిస్థితులు, ఇతర అంశాలపై చర్చించారు.

కొనుక్కునే పెన్షన్ మాకొద్దు

- ఎన్ఎంఓపీఎస్ సెక్రెటరీ జనరల్ స్థితప్రజ్ఞ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ ఉద్యోగి కాంట్రిబ్యూషన్ ఇచ్చి కొనుక్కునే పెన్షన్ తమకొద్దనీ, దాన్ని అంగీకరించేది లేదని నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం (ఎన్ఎంఓపీఎస్) సెక్రెటరీ జనరల్ గంగాపురం స్థితప్రజ్ఞ తెలిపారు. 1970 సెంట్రల్ సివిల్ సర్వీసెస్ రూల్స్ ప్రకారం ప్రభుత్వ ఉద్యోగికి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని శనివారం ఒక ప్రకటనలో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగి నెల జీతం కాంట్రిబ్యూషన్‌తో సర్వీసు కాలంలో 50 శాతం జమ చేస్తే 20 శాతం తీసుకుని 30 శాతం తిరిగి ఇస్తుందా?అని ప్రశ్నించారు.

25 ఏండ్ల తర్వాత 20 శాతం నష్టంతో ఆ డబ్బులు చెల్లిస్తారని తెలిసి ఎవరైనా పెట్టుబడి పెడతారా?అని అడిగారు. కేంద్ర ప్రభుత్వం ఏకీకృత పెన్షన్ విధానంపై పునరాలోచించాలని కోరారు. రాష్ట్రంలో పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని టీఎస్‌సీపీఎస్‌ఈయూ ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, కోశాధికారి నరేష్‌గౌడ్ డిమాండ్ చేశారు.

కూల్చివేతలు ఆపండి

- హైకోర్టులో అత్యవసర విచారణ
- జస్టిస్ వినోద్ కుమార్ మధ్యంతర ఉత్తర్వులు జారీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్ మాదాపూర్‌లోని ఎన్ కన్వెన్షన్ కూల్చివేతలకు శ్రీకారం చుట్టిన హైడ్రా చర్యలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు శనివారం అత్యవసరంగా విచారించింది. ప్రముఖ నటుడు అక్కినేని నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ కూల్చివేత చర్యలను సవాల్ చేస్తూ మేనేజింగ్ డైరెక్టర్ నల్లా ప్రీతమ్‌రెడ్డి హైకోర్టులో హౌస్‌మోషన్ పిటిషన్‌ను దాఖలు చేశారు. న్యాయమూర్తి జస్టిస్ టి.వినోద్ కుమార్ శనివారం ఆ పిటిషన్‌ను విచారించారు. కూల్చివేత చర్యలపై స్టేటస్‌కో (యథాతథస్థితి) ఆర్డర్‌ను జారీ చేశారు. తదుపరి ఉత్తర్వులను జారీ చేసే వరకు యథాతథస్థితిని కొనసాగించాలంటూ హైడ్రాను, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్ కన్వెన్షన్ చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని పిటిషనర్ తరఫు లాయర్ చేసిన వినతిని న్యాయమూర్తి తోసిపుచ్చారు. ప్రస్తుతం స్టేటస్‌కో ఆర్డర్ ఇస్తున్నామనీ, పూర్తి స్థాయిలో విచారణ జరిగాకే తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని స్పష్టం చేస్తూ, తదుపరి విచారణను వాయిదా వేశారు. ప్రతివాదులైన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి, జీహెచ్ఎంసీ కమిషనర్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్, నీటి పారుదల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్, హైడ్రా కమిషనర్ తమ వాదనలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించారు.

'అక్కినేని నాగార్జున పట్టా భూమిని కొనుగోలు చేసిననాటి సర్వే ప్రకారం ఎన్ కన్వెన్షన్‌ను నిర్మించారు. ఇది 2010-12 మధ్య కాలంలో పూర్తయింది. అయితే, ఎన్ కన్వెన్షన్ ఉన్న భూమి తుమ్మిడికుంట చెరువు సరిహద్దు పరిధిలోకి వచ్చిందంటూ గత కేసీఆర్ ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. ముందుగా ఆ కన్వెన్షన్ బాధ్యులకు నోటీసు ఇచ్చి, ఆ తర్వాత వారి వాదన వినిపించుకునే అవకాశం కూడా అధికారులు ఇవ్వలేదు. కనీసం నోటీసు కూడా ఇవ్వలేదు. రంగారెడ్డి శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ గ్రామంలోని సర్వే నెం.201/1, 11/2, 11/3, 11/36లోని 27063 చదరపు మీటర్ల స్థలంలో ఎన్ కన్వెన్షన్ ఉంది. శనివారం ఉదయం 8 గంటల సమయంలో అధికారులు కూల్చివేత చర్యలు ప్రారంభించారు. హైడ్రా చేపట్టిన ఈ ఆకస్మిక చర్య చట్ట వ్యతిరేకం. పిటిషనర్‌కు అక్కడ 6.30 ఎకరాల రిజిస్టర్ భూమి ఉంది. సేల్ డీడ్‌ల ద్వారా దాన్ని 1992లో కొనుగోలు చేశారు. ఇది పట్టా భూమి. రెవెన్యూ రికార్డుల్లో అక్కినేని నాగార్జున పేరు మీద మ్యుటేషన్ అయ్యింది. అక్కడి చెరువు భూమిని ఒక్క అంగుళం కూడా ఆక్రమించలేదు.

భూమి తమ్మిడికుంట ట్యాంక్‌కు ఆనుకుని ఉంది, ఇది సర్వే నెం.36లో ఉంది. రెవెన్యూ రికార్డుల ప్రకారం ఆ చెరువు పరిధి 20 ఎకరాల 07 గుంటలు. బిల్డింగ్ బైలాస్/జోనల్ నిబంధనల ప్రకారం ఎఫ్‌టీఎల్ పరిధి 9 మీటర్లు మాత్రమే. అయితే, ప్రయివేటు సర్వే నివేదిక ఆధారంగా తమ్మిడికుంట చెరువు విస్తీర్ణాన్ని 29 ఎకరాలుగా పేర్కొంటూ గత ప్రభుత్వం ప్రొసీడింగ్స్ ఇచ్చింది. దీంతో ఎఫ్‌టీఎల్ పరిధి 30 మీటర్లకు పెరిగింది. తమ్మిడికుంట ట్యాంక్ 20.07 ఎకరాలా? లేక 29 ఎకరాలా? అనే వివాదం కొలిక్కిరాలేదు. దీనిపై సివిల్ కోర్టులో 2017 నుంచి వివాదం పెండింగ్‌లో ఉంది. తమ్మిడికుంట ట్యాంక్ విస్తీర్ణం 20.07 ఎకరాలేనంటూ కలెక్టర్, హెచ్ఎండీఏ ఇచ్చిన నివేదిక ప్రకారం భూసేకరణ కోర్టు రికార్డుల్లో నమోదు చేసింది. ఎన్ కన్వెన్షన్ భవన నిర్మాణాలను క్రమబద్ధీకరించాలనే (బీఆర్ఎస్) అప్లికేషన్‌ను అధికారులు తిరస్కరించారు. దీనిపై ప్రభుత్వాన్ని ఆశ్రయిస్తే స్టేటస్‌కో ఆర్డర్ 2021లో ఇచ్చింది. ఆ ఆర్డర్ ఇప్పటికీ అమల్లో ఉంది. అయినా మళ్లీ ప్రభుత్వం కూల్చివేత చర్యలకు శ్రీకారం చుట్టింది. అయ్యప్ప సొసైటీ వ్యాజ్యంలో భాగమైన సర్వే నెం.11కి సంబంధించిన అంశం సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉంది. ఆ కోర్టు యథాతథ స్థితి ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్ కన్వెన్షన్ కూడా అయ్యప్ప సొసైటీ పరిధిలోనే ఉంది...' అని పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది శ్రీరఘురాం వాదించారు. వాదనల తర్వాత హైకోర్టు.. నోటీసు ఇచ్చిన వెంటనే కూల్చివేత చర్యలను ఎలా ప్రారంభిస్తారంటూ హైడ్రా అధికారులను ప్రశ్నించింది. నోటీసుకు వివరణ ఇచ్చే గడువు ఇవ్వకపోవడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని అభిప్రాయపడింది. ఎన్ కన్వెన్షన్ సెంటర్ కూల్చివేత పనులు నిలిపివేస్తూ మధ్యంతర స్టేటస్‌కో ఆర్డర్ జారీ చేసింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

వాయనాడ్ ప్రజలకు సీతక్క చేయూత

- వరద బాధితులకు రూ.20 లక్షల చెక్కును అందించిన మంత్రి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రకృతి విలయానికి అతలాకుతలమైన కేరళలోని వాయనాడ్‌లో తెలంగాణ మంత్రి సీతక్క శనివారం పర్యటించారు. ములుగు డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్‌తో కలిసి ఆమె ప్రభావిత ప్రాంతాలను సందర్శించారు. కేరళ ప్రజలకు చేయూ తనందించారు. వరద బాధితుల సహాయార్థం తాను సేకరించిన రూ.20 లక్షల చెక్కును స్థానిక ఎమ్మెల్యే టి సిద్దీకీకి అందించారు. దీంతోపాటు సుమారు పది లక్షల విలువ గల దుస్తులు, నిత్యావసర వస్తువులను స్థానిక నాయకులను అందజేశారు. వందల సంఖ్యలో సామూహిక ఖననం చేసిన ముండక్కై శ్మశాన వాటికలో మృతులకు శ్రద్ధాంజలి ఘటించారు. అక్కడే మృతుల కుటుంబ సభ్యులను ఆమె ఓదార్చారు. ఈ సమయంలో మంత్రి భావోద్వేగానికి గురయ్యారు. అనంతరం సీతక్క స్థానిక మీడియాతో మాట్లాడుతూ ఇలాంటి కష్టం పగవాడికీ రావొద్దని అన్నారు. ఈ ప్రాంతాలను చూసి హృదయం ద్రవించిపోయిందన్నారు.వాయనాడ్ ప్రజలకు నైతిక మద్దతు ఇవ్వడం కోసమే ఇక్కడికి వచ్చానని చెప్పారు. 24 గంటలూ పనిచేస్తున్న రెస్క్యూ టీమ్‌లు, స్థానిక అధికారులు, వాలంటీర్ల అవిశ్రాంత ప్రయత్నాలను ఆమె అభినందించారు. విపత్తు వల్ల నష్టపోయిన వారి జీవితాలను పునర్నిర్మించడంలో సాధ్యమైనంత సహాయాన్ని అందిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు.

క్రిమీలేయర్ పేరుతో రిజర్వేషన్లను తొలగించే కుట్ర

- సతీష్ మాదిగ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ప్రధాని మోడీ క్రిమిలేయర్‌ను అడ్డం పెట్టుకుని రిజర్వేషన్లను ఎత్తేసే కుట్ర చేస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత సతీష్‌మాదిగ ఆరోపించారు. మాల, మాదిగల మధ్య గొడవ పెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నేత గజ్జల కాంతంతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లలో మోడీ క్రిమిలేయర్ విధానాన్ని తెచ్చే కుట్రను ఆయన ఖండించారు. క్రిమిలేయర్ విధానంతో తాత్కాలిక ప్రయోజనమే తప్పా, దీర్ఘకాలిక ప్రయోజనం ఉండదని అభిప్రాయపడ్డారు. అంటరానితనం ఉందనే రిజర్వేషన్లు కల్పించారని గుర్తు చేశారు. ఎస్సీ వర్గీకరణను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నేతలు ఎక్కడా స్వాగతించలేదని తెలిపారు. మందకృష్ణ మాదిగ కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా, బీజేపీకి అనుకూలంగా మాట్లాడుతున్నారని తెలిపారు. మల్లికార్జున ఖర్గేను తిట్టడమంటే కాంగ్రెస్‌ను తిట్టినట్టేనన్నారు. కాంగ్రెస్‌లో ఉన్న మాల, మాదిగ ప్రజా ప్రతినిధులెవ్వరూ రిజర్వేషన్లకు వ్యతిరేకం కాదనీ, ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

సెస్ ఆఫీస్ ఎదుట ఆసాముల ధర్నా

- వస్త్ర పరిశ్రమకు విద్యుత్ సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్



నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్

సహకార విద్యుత్ సరఫరా సంఘం సిరిసిల్ల కార్యాలయం ఎదుట శనివారం ఆసాముల సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. వస్త్ర పరిశ్రమకు సబ్సిడీ అందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షుడు సిరిసిల్ల రవీందర్ మాట్లాడుతూ.. వస్త్ర పరిశ్రమలో ఏర్పడిన సంక్షోభంతో 10 నెలల నుంచి ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. విద్యుత్ సబ్సిడీపై గత నెలలో 13రోజులు రిలే దీక్షలు చేస్తే ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కలెక్టరేట్‌లో జౌళిశాఖ ఏడీ, సెస్ చైర్మెన్ చిక్కాల రామారావుతో సమావేశాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. కరెంట్ బిల్లు మీద 25 శాతం కడితే 4వ కేటగిరీ చేస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు మాట మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వస్త్ర పరిశ్రమకు సబ్సిడీ అందించి 4వ కేటగిరీలో ఉంచాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఐ యూనిట్ సభ్యులు చేర్యాల అశోక్, పోరండ్ల రమేష్ పాల్గొన్నారు.



మళ్లీ క్షమాపణ కోరా..

- మహిళలన్నా..చట్టమన్నా ఎనలేని గౌరవం
- యథాలాపంగా అన్న మాటకు వివరణ ఇచ్చా : మహిళా కమిషన్ ఎదుట హాజరైన కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మహిళలంటే తనకు ఎనలేని గౌరవముందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఇటీవల ఓ సమావేశంలో ఆయన చేసిన వ్యాఖ్యలకు మహిళా కమిషన్ నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కేటీఆర్ శనివారం మహిళా కమిషన్ చైర్ పర్సన్‌ను కలిసి సమాధానమిచ్చారు. మహిళా కమిషన్ కార్యాలయానికి చేరుకునేందుకు ఉదయం పది గంటలకే తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి 11 గంటలకు పార్టీ సీనియర్ మహిళా నేతలతో కలిసి మహిళా కమిషన్ ఎదుట హాజరై తాను చేసిన వ్యాఖ్యలపై రాత పూర్వక వివరణ ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ యథాలాపంగా తాను చేసిన వ్యాఖ్యలకు ఇదివరకే క్షమాపణలు కోరానన్నారు. మహిళలన్నా, చట్టమన్నా, రాజ్యాంగబద్ధ సంస్థలన్నా తనకు గౌరవముందనీ, అందుకే స్వయంగా హాజరై సమాధానమిచ్చానని చెప్పారు. రాజకీయాల్లో హుందాతనం ఉండాలనీ, ఒక్కోసారి మాట దొర్లితే క్షమాపణ చెప్పే సంస్కారం ఉండాలన్నారు. అయితే కేటీఆర్ మహిళా కమిషన్ కార్యాలయానికి వచ్చిన సందర్భంగా కాంగ్రెస్ మహిళా నేతలు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ సందర్భం గా బీఆర్ఎస్, కాంగ్రెస్ మహిళా నాయకుల మధ్య తోపులాట జరిగింది. ఇలాంటి ఘటనలను కూడా కాంగ్రెస్ నాయకులు రాజకీయం చేసే ప్రయత్నం చేస్తున్నారని కేటీఆర్ ఈ సందర్భంగా విమర్శించారు.

రాష్ట్రంలో మహిళలపై పెరుగుతున్న దాడులు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో మహిళలపై దాడులు, అకృత్యాలు భారీగా పెరిగాయని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. గత ఎనిమిది నెలల్లో జరిగిన సంఘటనల వివరాలతో కమిషన్‌కు ఫిర్యాదు చేసే ప్రయత్నం చేశారు. అయితే మరోసారి వచ్చి ఫిర్యాదు చేయాలని కమిషన్ కోరడంతో తప్పకుండా మళ్లీ వస్తామని అన్నారు. మహిళా జర్నలిస్టులపై జరిగిన దాడులకు సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ వెంట ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ కార్పొరేటర్లు, మహిళ నేతలు ఉన్నారు.

మహిళా కమిషన్ సభ్యులకు నోటీసులు

- కార్యదర్శిని ఆదేశించిన చైర్మెన్ నేరెళ్ల శారద
- ఆఫీసులో మాజీమంత్రి కేటీఆర్‌కు రాఖీ కట్టిన ఫలితం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆరుగురు మహిళా కమిషన్ సభ్యులకు నోటీసులు జారీ చేయాలని ఆ కమిషన్ చైర్మెన్ నేరెళ్ల శారద కార్యదర్శిని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా, కమిషన్ నిష్పాక్షికత, విశ్వసనీయతకు భంగం కలిగించేలా ప్రవర్తించినందుకు వారికి నోటీసులు జారీ చేస్తున్నట్టు తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్న మహిళల్ని ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు (కేటీఆర్) వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై మహిళా కాంగ్రెస్ నేతలు మహిళా కమిషన్‌లో ఫిర్యాదు చేశారు. కమిషన్ ఇచ్చిన నోటీసులకు వివరణ ఇచ్చేందుకు శనివారంనాడాయన బుద్ధభవన్‌లోని కమిషన్ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా కమిషన్ సభ్యులు కేటీఆర్‌కు రాఖీ కట్టారు. నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన కమిషన్ సభ్యులు అందుకు భిన్నంగా వ్యవహరించడం పట్ల చైర్మెన్ నేరెళ్ల శారద ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషన్ కార్యాలయంలోకి మొబైల్ ఫోన్లను అనుమతి లేదు. కానీ అక్రమంగా ఫోన్లను కార్యాలయంలోకి తెచ్చి, రాఖీలు కడుతున్న దృశ్యాలను సభ్యులు చిత్రీకరించారు. దీన్ని కూడా నిబంధనల ఉల్లంఘనగా చైర్మెన్ పేర్కొన్నారు. తక్షణం ఆరుగురు కమిషన్ సభ్యుల నుంచి వివరణ కోరుతూ నోటీసులు ఇవ్వాలని కార్యదర్శిని ఆదేశించారు. దీనిపై న్యాయనిపుణులతోనూ చర్చించి, చర్యలు తీసుకుంటానని చైర్మెన్ చెప్పారు.

24 గంటల్లో 17 ఆపరేషన్లు

- వేములవాడ ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రి ఘనత




నవతెలంగాణ - వేములవాడ

రాజన్న సిరిసిల్లలోని వేములవాడ ప్రాంతీయ ఆస్పత్రి వైద్యులు 24 గంటల్లో 17వివిధ రకాల ఆపరేషన్లు నిర్వహించి రికార్డు సృష్టించారు. శనివారం నిర్వహించిన ఈ శస్త్ర చికిత్సల్లో 6-ప్రసవాలు, 1-గర్భసంచి గడ్డ తొలగింపు, 3-సాధారణ శస్త్ర చికిత్సలు, 2-కంటి ఆపరేషన్లు, 5-ఆర్థో ఆపరేషన్లు ఉన్నాయి. ఈ సందర్భంగా డీసీహెచ్ఎస్ సూపరింటెండెంట్ సీనియర్ సర్జన్ డాక్టర్ పెంచలయ్య మాట్లాడుతూ.. వంద పడకల ఆస్పత్రిలో ప్రస్తుతం అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సహకారంతో మరిన్ని సేవలు ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ ఆపరేషన్‌లలో సూపరింటెండెంట్, గైనకాలజిస్ట్ డాక్టర్ సంధ్య, డాక్టర్ రత్నమాల, ఆర్థో డాక్టర్ అనిల్, అనస్తీషియా నిపుణులు డాక్టర్ రాజశ్రీ, డాక్టర్ తిరుపతితోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

జనగామ ఎమ్మెల్యే పల్లాపై కేసు

- చెరువు బఫర్‌జోన్‌లో అనురాగ్ విద్యాసంస్థల నిర్మాణాలు



నవతెలంగాణ-ఘట్కేసర్

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై కేసు నమోదైంది. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఘట్కేసర్ మండలం, వెంకటాపూర్ పంచాయతీ, కొర్రెముల రెవెన్యూ పరిధి సర్వేనెంబర్ 813లోని నాదెం చెరువు బఫర్ జోన్ పరిధిలో ఉంది. ఆ ప్రాంతంలో ఎమ్మెల్యేకు చెందిన అనురాగ్ విద్యాసంస్థలు, గాయత్రీ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ పలు నిర్మాణాలు చేపట్టాయని మండల ఏఈ పరమేష్ ఈ నెల 22న పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అనురాగ్ యూనివర్సిటీ చైర్మెన్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

న్యాయ వ్యవస్థపై నమ్మకముంది.. పోరాడతా : బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కక్షపూరితంగా తనపైనా, తన అనురాగ్ యూనివర్సిటీపైనా కేసులు నమోదు చేయటం ద్వారా ప్రభుత్వం రాజకీయంగా ఇబ్బందులకు గురి చేస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తనకు న్యాయ వ్యవస్థపై నమ్మకముందనీ, చట్ట ప్రకారం నడుచుకుంటూ పోరాడుతానని శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం ఎన్ని అక్రమ కేసులు బనాయించినా, ఎన్ని ఒత్తిళ్లకు గురి చేసినా లొంగేది లేదని స్పష్టం చేశారు. అనురాగ్ వర్సిటీకి సంబంధించి చట్ట ప్రకారమే అన్ని అనుమతులు తీసుకున్నామని వివరించారు. 25 సంవత్సరాల తమ విద్యా సంస్థల ప్రస్థానంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా విద్యాబోధన సాగించామని తెలిపారు.

ఎన్‌పీఎస్ స్థానంలో యూపీఎస్

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కొత్త పెన్షన్ స్కీం

- సర్వీసులో 25 ఏండ్లు పూర్తయితే పూర్తి పెన్షన్
- సైన్స్ అండ్ టెక్నాలజీలో విజ్ఞాన్ ధార పేరుతో కొత్త పథకం
- బయో ఈ-3 విధానానికి ఓకే : కేంద్ర క్యాబినెట్ నిర్ణయాలు



నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సామాజిక భద్రత కోసం కొత్తగా యూనిఫైడ్ పెన్షన్ స్కీం (యూపీఎస్)ను నూతన పెన్షన్ పథకం (ఎన్‌పీఎస్) స్థానంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. దీనికి కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. శనివారం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన కేంద్ర మంత్రి వర్గం సమావేశం జరిగింది. అనంతరం నేషనల్ మీడియా సెంటర్ (ఎన్ఎంసీ)లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ కేంద్ర మంత్రి వర్గం తీసుకున్న నిర్ణయాలను వివరించారు. రూ.10,579 కోట్ల వ్యయంతో సుమారు 23 లక్షల మంది ఉద్యోగులకు లబ్ది చేకూరే ఏకీకృత పెన్షన్ పథకానికి కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపినట్టు వెల్లడించారు. 25 ఏండ్ల సర్వీసు పూర్తి చేసిన ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణకు ముందు 12 నెలల సగటు బేసిక్ జీతంలో 50 శాతం పెన్షన్‌గా ఈ పథకం హామీ ఇస్తుందని తెలిపారు. 2025 ఏప్రిల్ 1 నుంచి ఈ పథకం అమల్లోకి వస్తుందని, కొత్త



పథకంతో పదేండ్ల సర్వీస్ ఉన్న ఉద్యోగులకు రూ. 10 వేలు పెన్షన్, 25 ఏండ్ల సర్వీస్ ఉన్నవారికి పూర్తి పెన్షన్ అందించనున్నట్టు స్పష్టం చేశారు. ఎన్‌పీఎస్‌పై అనేక బీజేపీయేతర పాలిత రాష్ట్రాల్లో వెల్లువెత్తున్న నిరసనల మధ్య కేంద్ర ప్రభుత్వం ఈ యూపీఎస్ ప్రారంభించినట్టు తెలిపారు.

బయో ఈ-3 విధానానికి ఆమోదం

డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీకి సంబంధించిన 'బయో ఈ-3 (ఎకానమీ, ఎన్విరాన్‌మెంట్, ఎంప్లాయ్‌మెంట్ ఫర్ బయోటెక్నాలజీ) పాలసీ'ని పెంపొందించే ప్రతిపాదనకు కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. ఈ విధానం వల్ల త్వరలో బయో విప్లవం రానున్నట్టు, బయో టెక్నాలజీ, బయో సైన్స్ రంగాల్లో అధిక ఉపాధి అవకాశాలున్నాయని ఆయన తెలిపారు.

సైన్స్ అండ్ టెక్నాలజీలో విజ్ఞాన్ ధార పథకం

సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖలో మూడు పథకాలను కొనసాగించేందుకు కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ (డీఎస్‌టీ) 'విజ్ఞాన్ ధార' అనే ఏకీకృత కేంద్ర రంగ పథకంలో మూడు విభాగాలను కలిపారు. సైన్స్ అండ్ టెక్నాలజీ సంస్థాగత, మానవ సామర్థ్యాల నిర్మాణం, అలాగే పరిశోధన, అభివృద్ధి, ఇన్నోవేషన్, టెక్నాలజీ డెవలప్‌మెంట్, డిప్లాయ్‌మెంట్ ఉంటాయి. 2021-22 నుంచి 2025-26 వరకు 15వ ఆర్థిక సంఘం కాలంలో ఏకీకృత పథకం 'విజ్ఞాన్ ధార' అమలుకు రూ.10,579.84 కోట్లు వ్యయం చేయనున్నట్టు తెలిపారు.

ప్రభుత్వం హామీల అమల్లో వేగం పెంచాలి

ఎలాంటి షరతులూ లేకుండా రుణమాఫీ చేయాలి

- ప్రకటనలతో రైతులను సంతృప్తి పరచలేరు
- ఆలస్యమైతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు :సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



నవతెలంగాణ-వరంగల్

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలు, ఇతర హామీలు ఒక అడుగు ముందుకు రెండడుగులు వెనక్కు అన్న రీతిలో అమలవుతున్నాయని.. వేగం పెంచాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. హన్మకొండ జిల్లాలో సీపీఐ రాష్ట్ర సమితి నిర్మాణ సమావేశాలు జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అధ్యక్షతన ఈ నెల 22న ప్రారంభమై శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు హామీ సక్రమంగా కొనసాగుతున్నదని హర్షం వ్యక్తం చేశారు. అయితే, ఆరోగ్యశ్రీ రూ.10 లక్షలకు పెంచుతున్నట్టు ప్రకటించినా.. బకాయిలు ఉన్నందున ఈ పథకం ఆశించిన స్థాయిలో అమలు కావడం లేదన్నారు. పేదలందరికీ రేషన్‌కార్డులు లేకపోవడం, పలు సాంకేతిక కారణాల వల్ల 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సిలిండర్ పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదన్నారు. రూ.31వేల కోట్ల రుణమాఫీ ఆగస్టు 15నాటికి పూర్తి చేస్తామని ప్రకటించి మూడు విడతలుగా 21.66లక్షల మంది రైతులకు రూ.18,540.24కోట్లు మాత్రమే ఇచ్చిందని తెలిపారు. రేషన్ కార్డు, పాస్‌బుక్కు, రెండు లక్షలకు మించి రుణముంటే పై మొత్తం కట్టాలనే నిబంధనలు, ఇతర సాంకేతిక కారణాలతో చాలా మందికి రుణమాఫీ జరగలేదని వివరించారు. ఈ విషయంపై ప్రభుత్వ ప్రకటనలతో రైతులు సంతృప్తి చెందే పరిస్థితి లేదని, వారిలో తీవ్ర అసంతృప్తి, నిరాశ నెలకొన్నాయని చెప్పారు. తక్షణం స్పష్టమైన ప్రకటన చేసి ఎలాంటి షరతులూ లేకుండా కుటుంబానికి రూ.2 లక్షల రుణమాఫీ త్వరితగతిన పూర్తి చేయకపోతే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో పాలక, ప్రతిపక్షాల ఆరోపణలు, ప్రత్యారోపణలు, దూషణలకే ఎక్కువ సమయం వృథా అయిందని, ప్రజల సమస్యలపై చర్చ అంతంత మాత్రంగానే జరిగిందని అన్నారు. అసెంబ్లీ సమావేశాల తీరు మారాలని, అర్థవంతమైన చర్చలకు శాసనసభ వేదికగా ఉండాలని, అప్పుడే ప్రజల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. తక్షణం అర్హులైన రైతులందరికీ రైతు భరోసా అందించి, పంటల బీమా పథకం, కొత్త రేషన్ కార్డులు, ఇండ్లు, ఇండ్ల స్థలాలు, పింఛన్ల పెంపు లాంటి హామీల అమలుకు పూనుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు భరోసాకు సంబంధించి ఖరీఫ్ సీజన్ సగం పూర్తయినా కూడా విధివిధానాల కోసం అభిప్రాయ సేకరణ పేరుతో కాలయాపన చేయడం సరికాదన్నారు. ధరణి స్థానంలో కొత్తగా రూపొందించిన ఆర్ఓఆర్ చట్టం ముసాయిదాపై మరింత లోతుగా చర్చించి, అందరి అభిప్రాయాలు తీసుకుని కొత్త చట్టం తీసుకురావాలని సూచించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తంగా ఉన్న మాట వాస్తవమే అయినప్పటికీ, హామీల అమలు కాకుంటే ప్రజల్లో వ్యతిరేకత వచ్చే పరిస్థితి ఉందని చెప్పారు. ఈ సమావేశంలో సీపీఐ జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, సయ్యద్ అజీజ్‌పాషా, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, పశ్య పద్మ, జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తక్కెళ్లపల్లి శ్రీనివాస్, ఎన్.బాల మల్లేష్, ఇటి.నరసింహ, కలవేణ శంకర్, ఎం.బాలనరసింహ తదితరులు పాల్గొన్నారు.

ట్రిబుల్ ఆర్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలి

- భూమికి బదులుగా భూమి ఇవ్వాలి :తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొంతల చంద్రారెడ్డి
- చౌటుప్పల్‌లో భూనిర్వాసితుల ధర్నా

నవతెలంగాణ-చౌటుప్పల్

ట్రిబుల్‌ఆర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చాలని రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొంతల చంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ట్రిబుల్ ఆర్ రింగ్ రోడ్డులో భూములు, ప్లాట్లు, ఇండ్లు కోల్పోతున్న నిర్వాసితులు శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ రెవెన్యూ డివిజన్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చౌటుప్పల్ మండలం, మున్సిపల్ పరిధిలో ట్రిబుల్‌ఆర్ రింగ్ రోడ్డుకు 40 కిలోమీటర్ల దూరం నుంచి అలైన్‌మెంట్ కావాల్సి ఉండగా.. దానిని మార్చి 28 కిలోమీటర్ల లోపలే అలైన్‌మెంట్ చేయడం చాలా అన్యాయమన్నారు. దీని వల్ల భవిష్యత్‌లో చౌటుప్పల్ పట్టణ అభివృద్ధికి అవరోధంగా మారుతుందని తెలిపారు. వెంటనే రోడ్డు, రవాణాశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని ట్రిబుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని డిమాండ్ చేశారు. భూములు, ప్లాట్లు, ఇండ్లను కోల్పోతున్న బాధితులను ఆదుకోవాలని కోరారు. భూమికి బదులుగా భూమి కేటాయించి న్యాయం చేయాలన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న చంద్రారెడ్డి

అనంతరం ఆర్డీఓ శేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆ తర్వాత నిర్వాసితులు ప్రదర్శనగా వెళ్లి చౌటుప్పల్ బస్టాండ్ 65వ నెంబర్ జాతీయ రహదారిపై బైటాయించారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మాటూరి బాలరాజు, జీఎంపీఎస్ జిల్లా గౌరవ అధ్యక్షులు బండారు నర్సింహా, రైతుసంఘం రాష్ట్రకమిటీ సభ్యులు బూర్గు కృష్ణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మెన్ బత్తుల శ్రీశైలం, సీపీఐ(ఎం) మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ గోపగోని లక్ష్మణ్, నాయకులు, భూ నిర్వాసితులు ఆకుల ధర్మయ్య, చీరిక సంజీవరెడ్డి, బాత రాజు సత్యం, గుజ్జుల సురేందర్‌రెడ్డి, ఉష్కాగుల రమేశ్, మంచికంటి భాస్కర్, సందగల్ల మల్లేశ్‌గౌడ్, బొమ్మిరెడ్డి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చట్టానికి లోబడే కూల్చివేతలు

- ముందే నోటీసులిస్తున్నాం
- చెరువుల్లో కట్టిన నిర్మాణాలే ఫస్ట్ టార్గెట్
- హైడ్రాను ప్రజలు స్వాగతిస్తున్నరు, వ్యతిరేకించి అభాసుపాలు కావొద్దు
- ఇందులో అధికార, ప్రతిపక్ష పార్టీ అన్న అంశమే లేదు
- పదేండ్లలో చెరువుల ఆక్రమణలపై రిమోట్ సెన్సార్ ఫొటోలు ఇస్తాం : ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

చట్టానికి లోబడి మాత్రమే చెరువులను కబ్జా చేసి నిర్మించిన అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపడతున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రజల ఆస్తులను కాపాడడం ప్రభుత్వ బాధ్యత అని చెప్పారు. ఇందుకు సంబంధించి త్వరలోనే అన్నీ లెక్కలతో సహా ప్రజల ముందు పెడతామన్నారు. సినీ హీరో నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ కూల్చివేతపై శనివారం నాడిక్కడ ఆయన స్పందించారు. చెరువుల పరిరక్షణ కోసమే హైడ్రా ను ప్రభుత్వం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. హైడ్రా ఏర్పాటు నిర్ణయాన్ని ప్రజలందరూ ఆహ్వానిస్తున్నారని చెప్పారు. అక్రమ కూల్చివేతలపై తమకు ముందుగా నోటీసులు ఇవ్వలేదని ఆక్రమణదారులు చెబుతున్న దాంట్లో వాస్తవం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూల్చబోయే ప్రతీ పనికి ముందుగానే నోటీసులు ఇస్తున్నట్టు క్లారిటీ ఇచ్చారు. హైదరాబాద్ నగరం అంటేనే లేక్స్, రాక్స్ (సరస్సులు, రాళ్లు) అని చెప్పారు. వీటిని కాపాడుకోవాలంటూ పర్యావరణవేత్తలు పెద్దఎత్తున ఆందోళనలు చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. బఫర్ జోన్‌లో కాకుండా, నేరుగా చెరువులోనే కట్టిన నిర్మాణాలను ఫస్ట్ టార్గెట్‌గా కూల్చేస్తున్నట్టు స్పష్టం చేశారు.

ఈ చర్యలకు ప్రజలందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. తన దగ్గర ఉన్న ప్లానింగ్ శాఖలో శాటిలైట్ ద్వారా రిమోట్ సెన్సింగ్ ఫొటోలు తీసే టెక్నాలజీ ఉందన్నారు. దీని సహకారంతో రాష్ట్ర విభజనకు ముందు, గత పదేండ్లలో చెరువులు ఎంత మేర ఆక్రమణకు గురయ్యాయనే అంశాన్ని పరిశీలిస్తున్నట్టు వెల్లడించారు. ఈ చెరువుల్లో ఎన్ని పెద్ద పెద్ద సంస్థలు, వ్యవస్థలు టవర్స్, బిల్డింగ్స్ కట్టాయో రిమోట్ సెన్సింగ్ సాటిలైట్ ఫొటోలను తీసి ప్రజల ముందు పెడతామన్నారు. కూల్చివేతల్లో అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీ అనే అంశం ఉండదన్నారు. ప్రజలకు సంబంధించిన నగరాన్ని, చెరువులను కాపాడటమే తన ప్రధాన బాధ్యత అన్నారు.



త్వరలో ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

- రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- ఘనంగా ప్రగతి చక్రం పురస్కారాల ప్రదానోత్సవం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆర్టీసీ కార్మికుల సమస్యల త్వరలో పరిష్కరిస్తామని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సంస్థకు సంబంధించి ఇప్పుడిప్పుడే ఒక్కో చిక్కుముడి విప్పుకుని ముందుకు సాగుతున్నామనీ, త్వరలో అన్నీ పరిష్కారమవుతాయని ఆశాభావం వ్యక్తంచేశారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ఏటా ఉత్తమ ఉద్యోగులకు ఇచ్చే ప్రగతి చక్రం పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం శనివారంనాడిక్కడి ఆర్టీసీ కళ్యాణమండపంలో జరిగింది. దీనికాయన ముఖ్యఅతిథిగా హాజరై, 124 మంది ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులకు పురస్కారాలు ప్రదానం చేశారు. అలాగే ఇటీవల మరణించిన ఆర్టీసి డ్రైవర్ మెరుగు సంపత్ కుటుంబానికి రూ.1.15 కోట్ల ప్రమాదబీమా చెక్కును అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆర్టీసీలో పదేండ్లుగా ఒక్క కొత్త బస్సు కొనలేదన్నారు. 15 ఏండ్లు దాటిన బస్సులు తుక్కు కిందకు పోతున్నాయనీ, సంస్థలో ఉగ్యోగుల రిటైర్‌మెంట్లు పెరిగి, ఉన్నవారిపై పనిభారం పడుతున్నదని చెప్పారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని సంస్థలో 3,035 ఉద్యోగ నియామకాలకు అనుమతి ఇచ్చామనీ, మరికొన్ని ఖాళీలుకూడా భర్తీ చేయాలని యాజమాన్యం ప్రభుత్వానికి లేఖలు రాసిందని తెలిపారు. మహాలక్ష్మి స్కీం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రమాణం సక్సెస్ అయ్యిందనీ, దీనికి కారణం ఆర్టీసీ కార్మికులేనని చెప్పారు. ఈ స్కీం అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఆర్టీసీ బస్సుల్లో మహిళలు రూ.2,750 కోట్ల విలువైన ప్రయాణాలు చేశారని వివరించారు. జోనల్ స్థాయిలో కూడా ఇలాంటి అవార్డుల కార్యక్రమాలు నిర్వహించాలనీ, దీనివల్ల ఉద్యోగుల్లో అంకితభావం, పోటీతత్వం పెరుగుతాయని అభిప్రాయపడ్డారు. ఆర్టీసీ కార్మికుల బాండ్స్ డబ్బులు ఇప్పటి వరకు రూ.80 కోట్లు చెల్లించామనీ, మరో రూ.200 కోట్లు ఇవ్వాల్సి ఉందన్నారు. త్వరలో వాటిని ఇస్తామని హామీ ఇచ్చారు. రాఖీ పండుగ రోజు ఆర్టీసీ కార్మికుల కృషి ఫలితంగా సంస్థకు రికార్డు స్థాయి ఆదాయం వచ్చిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే అన్ని రకాల బెనిఫిట్స్ ఆర్టీసీ కార్మికులకు కూడా వర్తించేలా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ మాట్లాడుతూ సంస్థ మనుగడకు క్రమశిక్షణ కలిగిన కార్మికుల శ్రమే ప్రధాన కారణమనీ, వారి సంక్షేమానికి తొలి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. టీజీఎస్ఆర్టీసీ ఈడీలతో పాటు పలువురు అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఎన్ కన్వెన్షన్ నేలమట్టం

- నటుడు నాగార్జునకు చెందిన కన్వెన్షన్‌ను కూల్చిన హైడ్రా
- దశాబ్ద కాలం నుంచి అనేక ఫిర్యాదులు
- లోకాయుక్తలో కేసులు వేసిన ప్రజాసంఘాలు, పలువురు నాయకులు
- ఎట్టకేలకు హైడ్రా ఆధ్వర్యంలో కూల్చివేత
- ఆపాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

నవతెలంగాణ-మియాపూర్

హీరో నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్‌ను హైడ్రా అధికారులు శనివారం కూల్చేశారు. ఉదయం రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మాదాపూర్ కానమెట్ విలేజ్‌లోని ఎన్ కన్వెన్షన్‌కు వద్దకు చేరుకున్న అధికారులు జేసీబీల సాయంతో దాన్ని నేలమట్టం చేశారు. ఈ అంశంపై నాగార్జున హైకోర్టును ఆశ్రయించడంతో.. కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, అప్పటికే కన్వెన్షన్ సెంటర్ పూర్తిగా నేలమట్టం అయింది. కన్వెన్షన్‌కు అనుమతులు లేవని హైడ్రా కమిషనర్ రంగనాథ్ వివరణ ఇచ్చారు. కూల్చివేతకు ముందు కనీసం నోటీసు ఇవ్వలేదని నాగార్జున ఆవేదన వ్యక్తం చేశారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే..

మాదాపూర్ కానమెట్ విలేజ్ పరిధిలోని సర్వే నెంబర్ 36లో 29 ఎకరాల 44 గుంటల భూమిలో తుమ్మిడికుంట చెరువు ఉండేది. అయితే, చెరువు పూర్తిగా కబ్జాకు గురైంది. ప్రస్తుతం ఎనిమిది ఎకరాల విస్తీరంలో మాత్రమే చెరువు ఉంది. కబ్జాకు గురైన చెరువు స్థలంలో ప్రధానంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న సినీ నటుడు నాగార్జునకు సంబంధించి ఎన్ కన్వెన్షన్ కూడా ఉంది. ఇది దాదాపు మూడు ఎకరాల్లో ఉంది. అయితే, ఈ చెరువు ఆక్రమణకు గురవుతుందని 2012 లోకాయుక్తలో కేసు సైతం నమోదైంది. కేసు నంబర్ 2815/2012 ఈ కేసు కొనసాగుతోంది. అధికారులు 24/08/2013లో సర్వే నిర్వహించి చెరువు గుర్తింపు నెంబర్ 3717 ఇచ్చారు. అయితే, గత ప్రభుత్వం ఎన్ కన్వెన్షన్‌ను కూల్చేయాలని భావించి తరువాత వెనక్కి తగ్గింది. ప్రస్తుత ప్రభుత్వం చెరువులు, కుంటల రక్షణకు అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపేందుకు హైడ్రాను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా మూడ్రోజుల కిందట అందిన ఫిర్యాదు మేరకు సినీ హీరో నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్‌ను హైడ్రా కూల్చేసింది. తుమ్మిడికుంట చెరువును ఆక్రమించి మూడు ఎకరాల్లో ఎన్-కన్వెన్షన్ సెంటర్‌ను నాగార్జున నిర్మించారని ఫిర్యాదు అందినట్టు హైడ్రా తెలిపింది. పక్కా ఆధారాలతో భారీ పోలీసు బందోబస్తు మధ్య ఈ కూల్చివేత కార్యక్రమం జరిగింది. అయితే, కూల్చివేతలతో ఆపకుండా చెరువులను కాపాడాలని, ఎలాంటి ఒత్తిళ్లకూ తలొగ్గకుండా అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాలు, వామపక్ష పార్టీల నాయకులు ప్రభుత్వాన్ని కోరారు.

అలాగే, గండిపేట్ గ్రామంలో సర్వే నంబర్ 60, 61లో నిర్మించిన అక్రమ విల్లాలను నార్సింగి అధికారులు కూల్చేశారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అక్రమ భవనాలను పోలీసు భద్రత నడుమ నేలమట్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల మెస్ చార్జీలు, స్కాలర్‌షిప్ పెంచాలి



- రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య
- సంక్షేమ భవన్ ముట్టడి

నవతెలంగాణ-మెహిదీపట్నం

ప్రభుత్వం వెంటనే విద్యార్థుల మెస్ చార్జీలు, స్కాలర్‌షిప్ పెంచాలని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల మెస్ చార్జీలు, స్కాలర్‌షిప్ పెంచాలని కోరుతూ శనివారం వందలాది మంది విద్యార్థులు బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షులు వేముల రామకృష్ణ నాయకత్వంలో హైదరాబాద్ మాసబ్ ట్యాంక్‌లోని సంక్షేమ భవన్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. ఆరు సంవత్సరాల కిందట.. ఆనాటి ధరల ప్రకారం నిర్ణయించిన మెస్ చార్జీలు, స్కాలర్‌షిప్ నేటికీ కొనసాగుతున్నాయని తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలు మూడు రేట్లు పెరిగాయని.. నిధులు సరిపోక హాస్టల్, గురుకుల పాఠశాలల విద్యార్థులకు నాసిరకం ఆహారం పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందక రోగాల పాలవుతున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు ఒక్క రోజు కూడా హాస్టళ్లను సందర్శించి విద్యార్థుల సమస్యలు తెలుసుకోవడం లేదని విమర్శించారు. హాస్టల్ విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించాలనే ఆలోచన ప్రభుత్వానికి రావడం లేదన్నారు. హెూటల్లో ఒక పూట భోజనం రూ.80 ఉంటే.. విద్యార్థులకు పూటకు రూ.10ఎలా సరిపోతాయని ప్రశ్నించారు. నాసిరకం భోజనం పెడితే వారు బావిభారత పౌరులుగా ఎలా ఎదుగుతారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు నీలా వెంకటేష్ గుజ్జ కృష్ణ, మల్లేష్, ఉదయ్, శేఖర్, వీరన్న చంద్రశేఖర్ గౌడ్, బాలస్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శూర్‌వీర్ వెనుక లక్ష్యమిదే..!



హిందూ రాష్ట్ర ఏర్పాటుకు కుట్ర
- మత ఛాందసవాదులతో సంబంధాలు
- నిలువెల్లా ముస్లిం వ్యతిరేకత
- విషం చిమ్మే ప్రసంగాలు
- కేంద్రమంత్రి వత్తాసు

హిందూ జనజాగృతి సంస్థ జూన్‌లో గోవాలో వైశ్విక్ హిందూ రాష్ట్ర మహోత్సవాన్ని నిర్వహించింది. 'హిందూ దేశం నుండి హిందూ ప్రపంచం' అనే నినాదంతో దీనిని ఏర్పాటు చేశారు. హిందువులకు అవసరమైన సాయం అందించడానికి హిందువులు ఏర్పాటు చేసుకున్న శూర్‌వీర్ కార్యక్రమం వ్యవస్థాపకుడు వీరేంద్ర పాండే దీనికి హాజరై ఇరవై నిమిషాల పాటు ప్రసంగించారు. ఇంటిలోకి 'ఆ వ్యక్తులను అనుమతించవద్దు' అని ఆయన హిందువులను హెచ్చరించారు. ఆ వ్యక్తులంటే ఆయన ఉద్దేశంలో ముస్లిం మైనారిటీలు.

న్యూఢిల్లీ : శూర్‌వీర్ ప్రోగ్రామ్ వెబ్‌సైటులో కూడా దాదాపు ఇలాంటి పదజాలమే కన్పిస్తుంది. అది అర్బన్ కంపెనీ మాదిరిగా ఉండాలని అనుకుంటోంది. అందులో సేవలు అందించే వారు, పొందే వారు అందరూ హిందువులే. శూర్‌వీర్ వెబ్‌సైటులో సిక్కుల గురువు గురు గోవింద సింగ్ చిత్రాలు కన్పిస్తాయి. ఆయన మొఘల్ సైన్యంతో అనేక పోరాటాలు చేశారు. 'మనం సంపాదించే ప్రతి రూపాయి మన ప్రజలకే చేరాలి. ఆ దిశగా మనమంతా నిర్మాణాత్మకంగా ఏకం కావాలి' అని శూర్‌వీర్ ప్రోగ్రామ్ మిషన్ ఓ ప్రకటనలో పిలుపునిచ్చింది. శూర్‌వీర్ ప్రోగ్రామ్ విచ్ఛిన్నకర, వివక్షాపూరిత విధానాలను హర్షించే వారిలో కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిజా సింగ్ కూడా ఉన్నారు. ఆయన శూర్‌వీర్‌ను పొగడ్తలతో ముంచెత్తారు.

పెరుగుతున్న 'బహిష్కరణ' పిలుపులు

ముస్లింలను ఆర్థికంగా బహిష్కరించాలని పిలుపునివ్వడం ఇటీవలి కాలంలో తరచుగా కన్పిస్తోంది. 2022 అక్టోబరులో ఢిల్లీలో వీహెచ్‌పీ ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో బీజేపీకి చెందిన పశ్చిమ ఢిల్లీ ఎంపీ ప్రవేష్ వర్మ బహిరంగంగానే ఇలాంటి పిలుపు ఇచ్చారు. 2023లో గుజరాత్‌లో మతపరమైన హింస చెలరేగింది. ముస్లింలతో ఆర్థికపరమైన లావాదేవీలు జరపబోమని కొన్ని గ్రామాల ప్రజలు వీడియోలు విడుదల చేశారు. అదే ఏడాది హర్యానాలోని నుహ్‌లో మత హింస జరిగింది. ఆ తర్వాత గుర్‌గావ్‌లో నిర్వహించిన మహా పంచాయత్‌కు పలు గ్రామాల ప్రతినిధులు హాజరయ్యారు. ముస్లింలను ఆర్థికంగా, సామాజికంగా బహిష్కరించాలని ఆ సమావేశం పిలుపునిచ్చింది.

ఇలా విష బీజాలు

'నగరాల్లో అనేక మంది పనికి వెళతారు. ఇంట్లో తల్లి, అక్క, చెల్లి ఉంటారు. అలంటప్పుడు ఏదో ఒక పనికి ఆ వ్యక్తిని పిలిచారనుకోండి. అతను మీ ఇంటి సమాచారం మొత్తాన్నీ తెలుసుకుంటాడు. కుటుంబ సభ్యుల వివరాలు ఆరా తీస్తాడు. ఎవరు ఎప్పుడు బయటికి వెళతారో గ్రహిస్తాడు. విశ్వసనీయుడు కాని అలాంటి వ్యక్తిని ఇంటిలోకి అనుమతిస్తే 80-90 శాతం జిహాద్ అక్కడే వేళ్లూనుకుంటుంది' అని వీరేంద్ర పాండే హెచ్చరికలు జారీ చేశారు. ముస్లిం సమాజాన్ని లక్ష్యంగా చేసుకొని ఆయన ఈ వ్యాఖ్యలు చేశాడని ఇట్టే అర్థమవుతోంది. 'సేవలు అందించే హిందూ వ్యక్తి ఓ పనికి రూ.300-400 తీసుకుంటే అదే పనికి వారు (ముస్లింలు) రూ.250 తీసుకుంటారు. మనం హిందూత్వ గురించి చర్చిస్తాం. కానీ మన ఇంటిలో హిందూ యేతర వ్యక్తి కూర్చుంటాడు. ఇలా పది సంవత్సరాలు గడిస్తే చాలా ప్రాంతాల్లో హిందువులు దొరకడమే గగనమవుతుంది. కాబట్టి వారిని ఆర్థికంగా బహిష్కరించాలి. వారితో భౌతికంగా పోరాడేందుకు ప్రజలు సమర్థులా కాదా అన్నది నాకు తెలీదు. అయితే మన సమాజంలో చాలా మంది పోరాడగలరు. భౌతికంగా పోరాడలేని వారు ఆర్థికంగా వారిని బహిష్కరించండి' అని పిలుపునిచ్చారు.

ఇటీవల కన్వర్ యాత్ర సందర్భంగా ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ అధికారులు వివాదాస్పద ఆదేశాలు జారీచేశారు. యాత్ర సాగే మార్గంలో ఉండే హోటళ్లు, దాభాలు, వీధి వ్యాపారులు తమ పేర్లను ప్రదర్శించాలని సూచించారు. అయితే కోర్టు జోక్యంతో ఆ ఆదేశాలు అమలు కాలేదు.

ఎన్జీఓనని చెప్పుకుంటుంది

శూర్‌వీర్ ప్రోగ్రామ్ న్యాయపరమైన లొసుగుల నుండే కాకుండా రాజకీయ పార్టీ సభ్యుల నుండి కూడా ప్రయోజనం పొందుతోంది. తాను ఏడువేలకు పైగా సేవలు అందిస్తున్నానని శూర్‌వీర్ తన వెబ్‌సైటులో తెలిపింది. న్యూ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ సొసైటీ పేరిట ఉన్న ప్రభుత్వేతర సంస్థ బ్రాండ్ పేరే శూర్‌వీర్ ప్రోగ్రామ్ అని చెప్పుకుంది. కానీ శూర్‌వీర్ ప్రోగ్రామ్ హిందూ రాష్ట్రాన్ని గురించే ప్రబోధిస్తుంది.

అందరిదీ విద్వేషమే

దీనిలోని కొందరు నాయకులు ముస్లింలకు వ్యతిరేకంగా విద్వేష ప్రసంగాలు చేస్తుంటారు. ఈ ప్రోగ్రామ్‌తో మిలిటెంట్ హిందూ పూజారి యతి నరసింహానంద సరస్వతికి సంబంధం ఉంది. ఆయన యూపీలోని దస్నా దేవి ఆలయానికి అధిపతి. ఆయనపై 20 కేసులు ఉన్నాయి. 2022లో ముస్లిం వ్యతిరేక ఉపన్యాసం ఇచ్చినందుకు అరెస్టయ్యాడు కూడా. ఈ భూమి నుండి ఇస్లాంను తుడిచివేయాలని, ముస్లింలందరూ ఉగ్రవాదులేనని ఆయన తన ప్రసంగంలో విషం చిమ్మారు. శూర్‌వీర్ ప్రోగ్రామ్‌తో హిందూ జాగృతి సమితికి కూడా సంబంధం ఉంది. భారతదేశాన్ని హిందూ రాష్ట్రంగా ప్రకటించి హిందువులను ఏకం చేయడమే దాని ఉద్దేశం. 2014లో ఏర్పడిన అడ్మినిస్ట్రేటర్ కమిటీకి శూర్‌వీర్‌తో అనుబంధం ఉంది. దానికి 2,200 వాట్సప్ గ్రూపులు, ఇతర మీడియా వేదికలు ఉన్నాయి. వాటి ద్వారా మతపరమైన విద్వేషాలను వ్యాపింపజేస్తుంది. ముస్లిం వ్యతిరేక ప్రచారం చేసే జైపూర్ డైలాగ్స్ అనే వెబ్‌సైట్ శూర్‌వీర్ ప్రోగ్రామ్‌ను వెనకేసుకొస్తోంది.

అన్ని సేవలూ వారికే

శూర్‌వీర్ ప్రోగ్రామ్‌లో ఎవరైనా తన పేరు నమోదు చేసుకోవచ్చు. కానీ సభ్యత్వం పొందాలంటే ఆరు నెలలకు రూ.600, ఐదు సంవత్సరాలకు రూ.5,100 చెల్లించాలి. ఇది సమాజం కోసం చేసే పని అని, అందిస్తున్న సేవలకు ఎలాంటి రుసుము వసూలు చేయబోమని దాని వెబ్‌సైట్ చెబుతోంది. ఇది అందించే సేవలు అనేకం. ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, రిసెప్షనిస్టులు, ఆఫీస్ సిబ్బంది, ఇంజినీర్లు, మెకానిక్కులు, డ్రైవర్లు, డెలివరీ సిబ్బంది, టైలర్లు, సెక్యూరిటీ గార్డులు, బార్బర్లు, కేర్‌టేకర్లు, కార్మికులు, సాంకేతిక సిబ్బంది, టిఫిన్ సర్వీస్ అందించే వారు, కళాకారులు, బ్యూటీషియన్లు, ట్రైనర్లు, వైద్య సేవలు అందించే వారు, ఫొటోగ్రాఫర్లు, కార్పెంటర్లు, టెంట్ సామగ్రి అందించే వారు, డెకొరేటర్లు, కేటరర్లు, డాన్స్ నేర్పేవారు...ఇలా అందరూ హిందువులే ఉంటారు. వీరిని హిందువుల ఇళ్లకు మాత్రమే పంపుతారు. దీంతో చాలా మందికి చాలినంత ఉపాధి లభించడం లేదు.



25కు పైగా పతకాలే లక్ష్యం

- భారత పారా ఒలింపిక్స్ కమిటీ అధ్యక్షులు దేవేంద్ర

28 నుంచి పారా ఒలింపిక్స్

పారిస్: 17వ పారా ఒలింపిక్స్‌లో భారత్ ఈసారి 25కు పైగా పతకాలు సాధించడం ఖాయమని భారత పారా ఒలింపిక్స్ కమిటీ అధ్యక్షులు దేవేంద్ర ఝుంఝారియా తెలిపాడు. 2020 టోక్యో పారా ఒలింపిక్స్‌తో పోల్చిచూస్తే ఈసారి భారత్‌కు అత్యధిక పతకాలు దక్కనున్నట్లు ఆయన తెలిపాడు. 54మంది అథ్లెట్లతో టోక్యో పారా ఒలింపిక్స్‌లో పాల్గొన్న భారత్ ఐదు స్వర్ణ, 8రజత, ఆరు కాంస్య పతకాలతో సహా మొత్తం 19 పతకాలు సాధించింది. ఈసారి 84మంది అథ్లెట్ల భారీ బృందంతో బయల్దేరిన భారత్.. సునాయాసంగానే 25పతకాల పై మార్క్‌ను అందుకోవడం ఖాయమని తెలిపాడు. గత పారా ఒలింపిక్స్‌లో అథ్లెటిక్స్ విభాగంలో ఎనిమిది, షూటింగ్‌లో ఐదు, బ్యాడ్మింటన్‌లో నాలుగు పతకాలు దక్కాయి. టోక్యో ఒలింపిక్స్ టేబుల్ టెన్నిస్ విభాగంలో భావినా పటేల్, ఆర్చరీలో హర్విందర్ సింగ్ ఒక్కో పతకం సాధించిన రికార్డు పుటల్లోకెక్కారు. అలాగే అవని లేఖరే మహిళల ఎస్‌హెచ్-1 10మీ. ఎయిర్ రైఫిల్ షూటింగ్‌లో స్వర్ణ పతకం సాధించిన చరిత్ర సృష్టించింది. పారిస్ వేదికగా జరిగే పారా ఒలింపిక్స్‌లో ప్రపంచ వ్యాప్తంగా 4,400మంది అథ్లెట్లు పాల్గొనున్నారు.



మూడేళ్లుగా ఒలింపిక్స్‌కు సాధన..

గత మూడేళ్లుగా పారా ఒలింపిక్స్ కోసం తమ అథ్లెట్లందరూ సన్నద్ధమవుతున్నారని దేవేంద్ర తెలిపాడు. అథ్లెట్లందరూ పతకాలు సాధించగల సమర్థులేనని, వారందరికీ ఓ ప్రణాళిక ప్రకారం శిక్షణ పొందారని తెలిపాడు. ఇండియా గేమ్స్, టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్(టిఒపిఎస్) ప్రభుత్వ పథకం క్రింద అందించిన సౌకర్యాలపట్ల ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 2028 పారా ఒలింపిక్స్‌కు ఇప్పటినుంచే సన్నద్ధమవుతున్నామని తెలిపాడు.



క్రికెట్‌కు శిఖర్ ధావన్ గుడ్ బై

న్యూఢిల్లీ: టీమిండియా ఎడమచేతివాటం బ్యాటర్, మాజీ కెప్టెన్ శిఖర్ ధావన్ క్రికెట్ అన్ని ఫార్మాట్‌ల గుడ్‌బై చెబుతున్నట్లు ప్రకటించాడు. సోషల్ మీడియా వేదికగా తన రిటైర్మెంట్ ప్రకటనను వెల్లడించాడు. క్రికెట్ అధ్యాయాన్ని ముగిస్తున్నట్లు శనివారం 'ఎక్స్'లో ఒక వీడియోను విడుదల చేశాడు. కెరీర్ ముగిసినట్లు, ఎన్నో జ్ఞాపకాలను మోసుకెళ్తున్నట్లు అందులో వెల్లడించాడు. 'మీ ప్రేమ, అభిమానానికి థ్యాంక్స్.. గుండెల్లో శాంతిని నింపుకుని.. క్రికెట్‌కు అల్విదా చెబుతున్నా..' అంటూ పేర్కొన్నాడు. టీమిండియాకు సుదీర్ఘ కాలం ఓపెనర్‌గా రాణించిన ధావన్.. 17వన్డేల్లో, ఏడు టెస్టుల్లో కెప్టెన్‌గా ఉన్నాడు. టీమిండియా తరఫున శిఖర్ ధావన్ చివరిసారి డిసెంబర్ 2022లో బంగ్లాదేశ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో ఆడాడు. తన కెరీర్‌లో 34టెస్టులు, 167వన్డేలు, 68టీ20లు ఆడిన ధావన్. టెస్టుల్లో 2315, వన్డేల్లో 6793, టీ20ల్లో 1759 పరుగులు చేశాడు. ఇందులో 40 ప్లస్ సగటుతో.. 90 ప్లస్ స్ట్రయిక్ రేట్‌తో.. మొత్తం 24సెంచరీలు చేశాడు. వన్డేల్లో 5వేల పరుగులు చేసిన 8మంది బ్యాటర్లలో అతను ఒకడు. ఈ జాబితాలో ఇండియా నుంచి రోహిత్, కోహ్లి మాత్రమే ఉన్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో పంజాబ్ కింగ్స్ తరఫున ఐపిఎల్‌లో చివరి టోర్నీ ఆడాడు.

ముష్ఫికర్ భారీ శతకం

డ్రా దిశగా పాకిస్తాన్-బంగ్లాదేశ్ తొలి టెస్ట్



రావల్పిండి: పాకిస్తాన్-బంగ్లాదేశ్ జట్ల మధ్య జరుగుతున్న తొలిటెస్ట్ డ్రా దిశగా పయనిస్తోంది. బంగ్లాదేశ్ సీనియర్ వికెట్ కీపర్ ముష్ఫికర్(191) భారీ శతకంతో చెలరేగడంతో తొలి ఇన్నింగ్స్‌లో 117పరుగుల ఆధిక్యత లభించింది. ఓవర్‌నైట్ స్కోర్ 6వికెట్ల నష్టానికి 495పరుగులతో శనివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లాదేశ్ మరో 70పరుగులు జతచేసి చివరి నాలుగు వికెట్లు కోల్పోయింది. పాకిస్తాన్ బౌలర్లు నసీమ్ షాకు మూడు, షాహీన్ అఫ్రిది, షాజాద్, మహ్మద్ అలీకి రెండేసి, ఆయుబ్‌కు ఒక వికెట్ దక్కాయి. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన పాకిస్తాన్ జట్టు నాల్గోరోజు ఆట ముగిసే సమయానికి ఆయుబ్(1) వికెట్ కోల్పోయి 23పరుగులు చేసింది. షఫీక్(12), కెప్టెన్ మసూద్(9) క్రీజ్‌లో ఉన్నారు. తొలి ఇన్నింగ్స్‌లో పాకిస్తాన్ జట్టు 6వికెట్ల నష్టానికి 448పరుగుల వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసిన సంగతి తెలిసిందే.

ఇంగ్లండ్ లక్ష్యం 205పరుగులు

శ్రీలంకతో తొలిటెస్ట్



మాంచెస్టర్: శ్రీలంకతో జరుగుతున్న తొలిటెస్ట్‌లో ఇంగ్లండ్ జట్టు 205పరుగుల లక్ష్యాన్ని ఛేదించాల్సి ఉంది. శనివారం శ్రీలంక రెండో ఇన్నింగ్స్‌లో 326పరుగులకు ఆలౌటైంది. కమిందు మెండీస్(113)సెంచరీకి తోడు ఛండీమాల్(79), మాథ్యూస్(65) అర్ధసెంచరీలతో రాణించారు. ఇంగ్లండ్ బౌలర్లు వోక్స్, పోట్స్‌కు మూడేసి, అట్కిన్సన్, వుడ్, రూట్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ఆ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఇంగ్లండ్ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 19ఓవర్లలో 3వికెట్ల నష్టపోయి 77పరుగులు చేసింది. ఓపెనర్లు డకెట్(11), లారెన్స్(34), పోప్(6) త్వరగా పెవీలియన్‌కు చేరగా.. రూట్, బ్రూక్ క్రీజ్‌లో ఉన్నారు. తొలి ఇన్నింగ్స్‌లో శ్రీలంక 236పరుగులు, ఇంగ్లండ్ 358పరుగులు చేసిన సంగతి తెలిసిందే.



ఇండస్ట్రీ ఫ్యామిలీలా సపోర్ట్ చేసింది : తబితా సుకుమార్

విలక్షణ నటుడు రావు రమేష్ కథానాయకుడిగా నటించిన సినిమా 'మారుతీ నగర్ సుబ్రమణ్యం'. ఈ చిత్రానికి లక్ష్మణ్ కార్య దర్శకత్వం వహించారు. దర్శకుడు సుకుమార్ సతీమణి తబితా సుకుమార్ సమర్పణలో పీబీఆర్ సినిమాస్, లోకమాత్రే సినిమాటిక్స్ సంస్థలపై రూపొందిన చిత్రానికి బుజ్జి రాయుడు పెంట్యాల, మోహన్ కార్య నిర్మాతలుగా వ్యవహరించారు.

అంకిత్ కొయ్య, రమ్య పసుపులేటి జంటగా నటించిన ఈ చిత్రం ఈనెల 23న విడుదలైంది. సినిమాకు మంచి రివ్యూలు, ఆడియెన్స్ నుంచి మంచి మౌత్ టాక్ రావడంతో యూనిట్ అంతా సక్సెస్ సెలబ్రేషన్స్‌ను చేసుకుంది. ఈ క్రమంలో శనివారం నిర్వహించిన థ్యాంక్స్ మీట్ ఈవెంట్‌లో తబితా సుకుమార్ మాట్లాడుతూ, 'నన్ను నమ్మి నాకు సపోర్ట్‌గా నిలిచిన నా భర్త సుకుమార్‌కి థ్యాంక్స్. రామ్ చరణ్, ఉపాసన, అల్లుఅర్జున్, సమంత, స్వప్నా దత్, రష్మిక, నవీన్ పొలిశెట్టి వంటి వారు ఎంతో సపోర్ట్‌గా నిలిచారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఇండస్ట్రీ అంతా ఫ్యామిలీలా మాకు సపోర్ట్‌గా నిలిబడింది. మైత్రీ శశి, హరి, రవి, అశోక్, శ్రీనివాస్, వేమ ఇలా అందరూ నాకు ఎంతో సపోర్ట్‌గా నిలిచారు. మా సినిమాకు వస్తున్న ఫలితాన్ని చూస్తే నాకు ఎంతో ఆనందంగా ఉంది. నేను ఏం ఊహించానో అదే నిజమైంది. నా జడ్జ్‌మెంట్ కరెక్ట్ అని చెప్పిన ఆడియెన్స్ అందరికీ థ్యాంక్స్' అని అన్నారు.

డైరెక్టర్ లక్ష్మణ్ కార్య మాట్లాడుతూ, 'మా చిత్రానికి ఆడియెన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది. టికెట్లు సేల్ అవుతున్నాయి. షోలు హౌస్ ఫుల్ అవుతున్నాయి. ఫ్యామిలీ అంతా వచ్చి హాయిగా నవ్వుకుని వెళ్లేలా సినిమా ఉంటుంది' అని చెప్పారు. మ్యూజిక్ డైరెక్టర్ కళ్యాణ్, కథానాయిక రమ్య పసుపులేటి, హీరో అంకిత్ కొయ్య, లైన్ ప్రొడ్యూసర్ శ్రీహరి, నటి ఇంద్రజ తదితరులు ఈ చిత్ర విజయంపై తమ ఆనందం వ్యక్తం చేశారు.

> మా సినిమాకు మంచి రివ్యూలు వచ్చాయి. జనాలు థియేటర్లకు వస్తున్నారు. చాలా హ్యాపీగా ఉంది. మిడిల్ క్లాస్ స్క్రిప్ట్ ఎంచుకోవడం తప్పా? అని అనుకున్నాను. మిడిల్ క్లాస్ ఎక్కువగా కాంప్రమైజ్ అవుతుంది. వాళ్లను కించపర్చకుండా ఈ సినిమాను లక్ష్మణ్ గొప్పగా తీశాడు. అలాగే అన్ని పాత్రలను అద్భుతంగా రాశారు. ఈ సినిమా బ్యూటీ అదే. కళ్యాణ్ ఈ సినిమాకు మంచి మ్యూజిక్, ఆర్ఆర్ ఇచ్చారు.
> - రావు రమేష్



లక్ష్మణ మూర్తి రతన, భ్రమరాంబిక తూటిక

సీతారాం సిత్రాలు రిలీజ్‌కి రెడీ

లక్ష్మణ మూర్తి రతన, భ్రమరాంబిక తూటిక ప్రధాన పాత్రల్లో రైజింగ్ హాండ్స్ ప్రొడక్షన్స్ పి.పార్థసారథి, డి.నాగేంద్ర రెడ్డి, కృష్ణ చంద్ర విజయబట్టు నిర్మాతలుగా డి.నాగ శశిధర్ రెడ్డి దర్శకత్వంలో వస్తున్న సినిమా 'సీతారాం సిత్రాలు'. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ శనివారం హీరో ఆకాష్ జగన్నాథ్ చేతుల మీదుగా జరిగింది. ఈ సినిమాని ఈనెల 30న విడుదల చేస్తున్నారు.

ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ, 'ప్రతి ఒక్కరు ఇది తమ సొంత సినిమా లాగా కష్టపడి పని చేశారు. ఈ సినిమా డిజిటల్‌గా ట్రైలర్ లాంచ్ చేసిన డైరెక్టర్ మారుతికి, రెండు పాటల్ని విడుదల చేసిన హీరో విశ్వక్‌సేన్‌కి, హీరో సందీప్ కిషన్‌కి కృతజ్ఞతలు. చిన్న సినిమా అయిన సపోర్ట్ ఇస్తున్న హీరో కార్తికేయకి, ట్రైలర్ లాంచ్ చేసి మమల్ని సపోర్ట్ చేసిన ఆకాష్ జగన్నాథ్‌కి థ్యాంక్స్. ప్రేక్షకులు అందరూ ఈ చిన్న సినిమాని ఆదరించి పెద్ద సక్సెస్ చేయాలని కోరుకుంటున్నాం' అని అన్నారు. కోవిడ్ టైంలో ఎక్కువ స్ట్రెస్ రిలీఫ్ ఇచ్చింది సినిమాలే. జంధ్యాల, ఈవివి, రేలంగి నరసింహారావు సినిమాలు ఎక్కువ చూశాను. మా సినిమా కూడా అలాంటి స్ట్రెస్ రిలీఫ్ సినిమానే' అని డైరెక్టర్ డి.నాగ శశిధర్ రెడ్డి చెప్పారు.

నవచిత్రం

విక్రమ్ తర్వాత అమరన్



శివకార్తికేయన్

శివకార్తికేయన్, రాజ్‌కుమార్ పెరియసామి కాంబినేషన్‌లో కమల్ హాసన్‌కి చెందిన రాజ్‌కమల్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ సంస్థ, సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్, గాడ్ బ్లెస్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో కలిసి నిర్మిస్తున్న ద్విభాషా చిత్రం 'అమరన్'.

ఈ చిత్ర తెలుగు థియేట్రికల్ హక్కులను శ్రేష్ఠ్ మూవీస్ అధినేతలు సుధాకర్ రెడ్డి, నిఖిత రెడ్డి పొందారు. తెలుగు, తమిళ భాషల్లో శివకార్తికేయన్ నటిస్తున్న యాక్షన్ చిత్రమిది. ఈ చిత్రం దీపావళి కానుకగా అక్టోబర్ 31న థియేటర్‌లలో విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ నేపథ్యంలో హీరో నితిన్ తండ్రి సుధాకర్ రెడ్డి, ఆయన సోదరి నిఖితారెడ్డి ఈ సినిమా ఏపీ, టీఎస్‌ల థియేట్రికల్ హక్కులను సొంతం చేసుకున్నారు. సెన్సేషనల్ హిట్ 'విక్రమ్' తర్వాత కమల్ హాసన్ ప్రొడక్షన్ హౌస్‌తో శ్రేష్ఠ్ మూవీస్‌కి ఇది రెండవ చిత్రం కావడం విశేషం. ఈ చిత్రంలో శివకార్తికేయన్ సరసన సాయి పల్లవి కథానాయికగా నటిస్తోంది. ఈ చిత్రం 'ఇండియాస్ మోస్ట్' అనే పుస్తకంలోని 'మేజర్ వరదరాజన్' కథ ఆధారంగా తెరకెక్కుతోంది.



వెట్రి

థ్రిల్ చేసే బంపర్

తమిళంలో 2023న విడుదలై విజయవంతమైన 'బంపర్' సినిమా తెలుగులో రాబోతోంది. బంపర్ అనే టైటిల్ కేరళ లాటరీ నేపథ్యంగా రూపొందింది. ఈ చిత్రంలో వెట్రి, శివాని నారాయణన్ ప్రధాన పాత్రలు పోషించారు.

ఎం.సెల్వ కుమార్ రచన, దర్శకత్వం వహించిన ఈ చిత్ర తెలుగు టైటిల్, ట్రైలర్ లాంచ్ ప్రసాద్ ల్యాబ్‌లో జరిగింది. స్నేహితులతో కలిసి అయ్యప్పమాల వేసుకుని కేరళ వెళ్ళిన ఓ యువకుడికి అక్కడ కొన్న లాటరీ టిక్కెట్‌కు ప్రైజ్ మనీ వస్తుంది. దాన్ని చేజిక్కించుకునేందుకు అతను పడ్డ కష్టాలు, స్నేహితులతో ఇబ్బందులు అనేవి ఎంటర్‌టైన్‌మెంట్‌లో చూపిస్తూ ఓ థ్రిల్లర్ అంశాన్ని జోడించిన ఈ చిత్ర ట్రైలర్ ఆద్యంతం ఆసక్తి రేపుతూ ప్రేక్షకులను ఆకర్షించింది.

ఈ చిత్రాన్ని సెప్టెంబర్ నెలలో తెలుగులో విడుదల చేయనున్నామని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమా తమిళంలో మంచి విజయాన్ని సాధించింది. తెలుగులో కూడా మంచి ఆదరణ పొందుతుందనే విశ్వాసాన్ని నటీనటులు వ్యక్తం చేశారు. ఈ చిత్రాన్ని తూత్తుకుడి, పునలూర్, తిరువనంతపురం, ఎరుమేలి, శబరిమలలో చిత్రీకరించారు.

యుఎస్‌ఏ రైట్స్ సుహాస్ సొంతం

దిల్‌రాజు ప్రొడక్షన్స్ పతాకంపై రూపొందుతోన్న సినిమా 'జనక అయితే గనక'. శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత రెడ్డి నిర్మించారు. సుహాస్ హీరోగా నటించారు. సందీప్ రెడ్డి బండ్ల డైరెక్ట్ చేశారు. సెప్టెంబర్ 7న ఈ సినిమా గ్రాండ్‌గా విడుదల కానుంది. సంగీర్తన హీరోయిన్‌గా నటించారు. ఈ సినిమా ఫైనల్ వెర్షన్‌ని చూసి యుఎస్‌ఏ హక్కులను హీరో సుహాస్ సొంతం చేసుకున్నారు.

ఈ సందర్భంగా హీరో సుహాస్ మాట్లాడుతూ, 'ఫైనల్ వెర్షన్ చాలా బాగా నచ్చింది. అందుకే యుఎస్‌ఏ రైట్స్ తీసుకున్నా. పక్కా ఎంటర్‌టైనింగ్ సినిమా. ప్రతి దానికీ లెక్కలు చెప్పే మిడిల్ క్లాస్ అబ్బాయిగా కనిపిస్తాను. సినిమా చూస్తూ ప్రేక్షకులు పడీ పడీ నవ్వుకుంటారు. మా డైరెక్టర్ చాలా మంచి సినిమా చేశారు. దిల్‌రాజు సపోర్ట్ చేసిన తీరు మర్చిపోలేం' అని అన్నారు. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: అకుల్.



సుహాస్, సంగీర్తన



అంజి, నార్నే నితిన్, బన్నీవాస్

మరోసారి నిరూపించారు

నార్నే నితిన్, నయన్ సారికలు హీరో హీరోయిన్లు జీఏ2 పిక్చర్స్ బ్యానర్‌లో అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాస్, విద్యా కొప్పినీడు నిర్మాతలుగా వచ్చిన చిత్రం 'ఆయ్'. ఈ సినిమాకు అంజి కే మణిపుత్ర దర్శకత్వం వహించారు. ఈనెల 15న ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా విడుదల చేశారు. ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంటున్న తరుణంలో చిత్రయూనిట్ సక్సెస్ మీట్‌ను నిర్వహించింది.

నిర్మాత బన్నీ వాస్ మాట్లాడుతూ, '110 స్క్రీన్‌లతో మొదలై.. 382 స్క్రీన్‌లకు వెళ్లింది. యూఎస్‌లో 27 స్క్రీన్లతో మొదలై 86 వరకు వెళ్లింది. మంచి కంటెంట్‌తో సినిమా వస్తే.. మౌత్ టాక్ బాగుంటే.. సినిమా ఏ రేంజ్ వరకు వెళ్తుందో, ఆడియెన్స్ ఎంతగా ఆదరిస్తారో ఈ సినిమా నిరూపించింది. 11 కోట్ల గ్రాస్‌కి పైగా కలెక్ట్ చేసింది. ఇప్పటికీ 60, 70 శాతం ఆక్యుపెన్సీ కనిపిస్తోంది. గీతా ఆర్ట్స్ నుంచి వచ్చే సినిమాలను జనాలు ఆదరిస్తుంటారు. ఇలాంటి అద్భుతమైన సినిమా చేసిన దర్శకుడు అంజి మా బ్యానర్‌లోనే మరో సినిమా చేస్తున్నారు' అని తెలిపారు.

మెప్పించే సోలో బాయ్

'సోలో బాయ్' టైటిల్ సాంగ్ లాంచ్ ఈవెంట్ శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సోలో బాయ్ టైటిల్ సాంగ్ హుక్ స్టెప్ ఛాలెంజ్ గురించి మేకర్స్ తెలిపారు.

హుక్ స్టెప్‌లో మెప్పించిన వారికి మొదటి బహుమతిగా రూ.30,000, రెండవ బహుమతి రూ. 20,000 మూడో బహుమతి రూ.10,000 ఇవ్వనున్నట్లు చెప్పారు. బిగ్ బాస్ 7 కంటెస్టెంట్ గౌతమ్ కృష్ణ హీరోగా సెవెన్ హిల్స్ ప్రొడక్షన్స్ పై సెవెన్ హిల్స్ సతీష్ కుమార్ నిర్మాతగా పి. నవీన్ కుమార్ దర్శకత్వంలో వస్తున్న సినిమా 'సోలో బాయ్'. జుడా షాండి మ్యూజిక్ అందిస్తున్న ఈ సినిమాకి ఆట సందీప్ కొరియోగ్రాఫర్. ఈ సందర్భంగా నిర్మాత సెవెన్ హిల్స్ సతీష్ కుమార్ మాట్లాడుతూ, 'సోలో బాయ్' సాంగ్ చూసిన అందరి నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది. డైరెక్టర్ నవీన్ సైలెంట్‌గా మంచి సినిమాను అందించాడు. నా తమ్ముడు గౌతమ్ కృష్ణ ఈ సినిమాతో హీరోగా పరిచయం అవుతున్నాడు. భవిష్యత్‌లో గౌతమ్ కచ్చితంగా పెద్ద హీరో అవుతాడు' అని అన్నారు.



గౌతమ్ కృష్ణ, శ్వేతా అవస్థి

రోడ్లకు మరమ్మతులు చేయించిన కార్పొరేటర్



నవతెలంగాణ - వనస్థలిపురం

బీఎన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని గాయత్రి నగర్ బ్యాంక్ కాలనీలో వర్షాల కారణంగా రోడ్లు ఇబ్బందికరంగా మారాయని కాలనీవాసులు జీహెచ్ఎంసీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డికి సమాచారం అందించారు. ఈ విషయంపై స్పందించిన కార్పొరేటర్ శనివారం జేసీబీ సహకారంతో రోడ్లకు మరమ్మతులు చేయించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు లక్ష్మీపతి, ఏపీ ఆర్ క్రిస్టల్ విల్లాస్ అధ్యక్షులు సత్యనారాయణ, జాగృతి అభ్యుదయ సంఘం అధ్యక్షులు భావన శ్రీనివాస్, కాలనీ కార్యదర్శి రవికుమార్, అశోక్ రెడ్డి, పార్టీ డివిజన్ ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడమే లక్ష్యం

ఎమ్మెల్యే అహ్మద్ బలాల



నవతెలంగాణ - మలక్‌పేట్

యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడమే లక్ష్యమని మలక్‌పేట్ ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. చదర్ఘాట్‌లోని ఇంపీరియల్ ఫంక్షన్ హాల్లో శనివారం 66 ప్రైవేటు కంపెనీలతో జాబ్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ జాబ్ మేళాలో 3000 మంది పైగా హాజరు కాగా.. 350 మందిని ఎంపిక చేసినట్టు తెలిపారు. మరొక 400 మందికి ఇంటర్వ్యూ నిర్వహించి విధుల్లోకి తీసుకుంటామని కంపెనీ ప్రతినిధులు తెలిపారని చెప్పారు. ఉద్యోగం రాని వారు నిరుత్సాహం చెందకుండా స్వయం ఉపాధి వైపు మొగ్గు చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, కంపెనీ హెచ్ఆర్‌లు, మేనేజర్లు, పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభించిన మేయర్





నవతెలంగాణ- బడంగ్ పేట్

బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కోట్లాది రూపాయల నిధులతో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ ముందుకు సాగుతున్నట్లు మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధి బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 19వ డివిజన్ సాయి నగర్ కాలనీ ఫెస్.2 నుండి ఎల్లమ్మ దేవాలయం వరకు రూ.40లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి శనివారం కార్పొరేటర్ రామోజీ అమిత శ్రీశైలం చారితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఈ. సాయిరాం, నాయకులు సుభన్ యాదవ్, మనోహర్, భాను, పురుషోత్తం గౌడ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 25వ డివిజన్ ఆర్‌వీఆర్ కాలనీ, మారుతీ నగర్ కాలనీలలో చేపట్టిన డ్రైనేజీ నిర్మాణ పనులను మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి శనివారం కార్పొరేటర్ ముత్యాల లలిత కృష్ణతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఈ వినీల్ గౌడ్, నాయకులు బోయపల్లి రాఘవేందర్ రెడ్డి, నవారు మల్లారెడ్డి, తిరుమల్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

అదే విధంగా బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 31వ డివిజన్ రాఘవేంద్ర కాలనీలో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఈ. బిక్కు నాయక్, కాలనీవాసులు శ్రీనివాస్ రెడ్డి, రామచంద్రయ్య పాల్గొన్నారు.



జాతీయ రహదారి విస్తరణ పనుల పరిశీలన



నవతెలంగాణ - హయత్ నగర్

విజయవాడ జాతీయ రహదారి రోడ్ విస్తరణ పనులను మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ శనివారం సెంట్రల్ అథారిటీ ఆఫ్ జాతీయ రహదారి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ రోడ్డు విస్తరణలో భాగంగా పనామా చౌరస్తా, హయత్ నగర్ లో అండర్ పాస్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు ఉండడంతో అక్కడి కాలనీవాసులకు, రోడ్డుకు ఇరువైపులా ఉన్న వ్యాపారులకు కలిగే సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పార్లమెంట్ సమావేశలలో పనామా, హయత్ నగర్‌లో పిల్లర్‌లతో కూడిన ఫ్లైఓవర్ నిర్మాణానికి ప్రతిపాదనతో పాటు నిధులు మంజూరు చేయాలని కేంద్ర రోడ్ రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరిని కోరినట్లు తెలిపారు. ఇల్లు, షాప్ ఉన్న వారికే కాకుండా సొంత ఖాళీ స్థలం ఉన్నవారికి కూడా నష్టపారిహారం చెల్లించాలని అధికారులను ఆదేశించారు. స్థానికంగా ఉండే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకొని అండర్ పాస్ నిర్మాణాలకు బదులుగా పిల్లర్ లతో కూడిన ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జాతీయ రోడ్డు రవాణా శాఖ అధికారులు అడిషనల్ డైరెక్టర్ జనరల్ రాజీవ్ సింగ్, రీజినల్ ఆఫీసర్ ఆఫ్ తెలంగాణ ఎస్ కె పుష్ప, ఆర్ అండ్ బీ అధికారి ధర్మ రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ అధికారి వెంకటేశ్వర్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ శరత్ చంద్ర, బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సామ రంగా రెడ్డి, కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్ రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, బీఎన్ రెడ్డి కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణ సురేంద్రనాథ్ యాదవ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కళ్లెం రవీందర్ రెడ్డి, బీజేపీ మల్కాజ్గిరి పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ బండారి భాస్కర్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీ ఈటలను కలసిన చింతల



నవతెలంగాణ-నాగోల్

నాగోలు డివిజన్‌లోని పలు కాలనీలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్‌ను బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేంద్రనాథ్ యాదవ్ కోరారు. శనివారం షామీర్‌పేట్‌లోని ఎంపీ నివాసంలో ఈటల రాజేందర్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సురేందర్ నాథ్ యాదవ్ మాట్లాడుతూ.. నాగోలు డివిజన్‌లోని శ్రీనివాస కాలనీతో పాటు పలు కాలనీలలో నెలకొన్న రోడ్లు, డ్రైనేజీ సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. త్వరితగతిన తగినన్ని నిధులను మంజూరు చేయించి.. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాన్ని ఎంపీకి అందజేసినట్టు తెలిపారు. స్పందించిన ఎంపీ మాట్లాడుతూ.. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాగోల్ డివిజన్‌లోని పలు కాలనీల సంక్షేమ సంఘం నాయకులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

'చెరువుల కబ్జాదారులపై చర్యలు తీసుకోండి'



నవతెలంగాణ - మీర్ పేట్

మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అక్రమ నిర్మాణ దారులపై, చెరువుల కబ్జాదారులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 12, 29, 34వ డివిజన్ల కార్పొరేటర్లు ఇంద్రావత్ రవి నాయక్, నీల రవి నాయక్, చెవ్వ మణెమ్మ హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చాలా కాలనీల్లో ఎలాంటి అనుమతులు లేకుండా తమ ఇష్టానుసారంగా ప్రభుత్వ భూమి(మీర్ పేట్ రెవెన్యూ సర్వే నెంబర్ 119, జిల్లెలగూడ రెవెన్యూ 120, 121, 122, 123) తదితర భూముల్లో అక్రమ నిర్మాణాలు చేస్తున్నా. అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మీర్ పేట్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న మూడు చెరువులు(చందన చెరువు, మంత్రాల చెరువు, పెద్ద చెరువు) కబ్జా చేసి ఫంక్షన్ హాల్స్, కమర్షియల్ షెడ్లు నిర్మాణం చేసి యథేచ్ఛగా వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. కొందరు రాజకీయ నాయకులు తప్పుడు పత్రాలు సృష్టించి ప్లాట్లు చేసి అమ్ముకుంటున్నారని ఆరోపించారు. అధికారులు అక్రమ నిర్మాణాల యజమానులతో కుమ్మక్కై చర్యలు తీసుకోకుండా కేవలం నోటీసు అందజేస్తూ చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. బాలాపూర్ చౌరస్తాలో మున్సిపల్ నుండి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా దర్జాగా పెద్ద షెడ్డు వేసి హోటల్ నడిపిస్తున్నారని వివరించారు. దానిపై పలుమార్లు ఫిర్యాదులు చేసినా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోకపోవడం చూస్తుంటే పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకొని ప్రభుత్వ ఆదాయాన్ని పెంచాలని కోరారు. ఈ అక్రమ నిర్మాణాలపై హైడ్రా, కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు.

పోగొట్టుకున్న సెల్ ఫోన్లు అప్పగింత



నవతెలంగాణ- చంపాపేట్

సంతోష్‌నగర్ ఏసీపీ మహమ్మద్ గౌస్ ఆదేశం మేరకు పోగొట్టుకున్న ఫోన్లను నూతన సాంకేతిక పరిజ్ఞానం (సీఈఐఆర్)తో వెతికి పట్టుకుని సీఐ వెంకట్ రామయ్య ఆధ్వర్యంలో శనివారం బాధితులకు అందజేశారు. వేర్వేరుగా నమోదైన కేసులను సీఈఐఆర్ అప్లికేషన్ ఉపయోగించి 5 సెల్ ఫోన్లను వెతికి తీసుకొచ్చి బాధితులకు అందజేసినట్టు పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఐ సైదయ్య, ఎస్ఐలు ఉదయ్ కుమార్, సంజీవ, సందీప్, శ్యాంసుందర్ రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

లైంగికదాడి ఘటన నిందితులను శిక్షించాలి



నవతెలంగాణ - చంపాపేట్

పశ్చిమ బెంగాల్ కోల్‌కత్తాలో ఆర్జే కార్ వైద్య కళాశాలలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన లైంగికదాడి ఘటన నిందితులను వెంటనే కఠినంగా శిక్షించాలని, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా న్యాయ విచారణ జరపాలని డిగ్రీ కళాశాల నర్సింగ్ విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పూజ్య శ్రీ మాధవ్ జీ, డిగ్రీ కళాశాల ప్రాజెక్టు డైరెక్టర్ వరుణ్ కుమార్, ప్రిన్సిపాల్స్ సతీష్ కుమార్, పార్వతమ్మ నర్సింగ్ మురారిని ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్ రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ పరిధిలోని కర్మన్ ఘాట్ చంపాపేట్ సాగర్ రింగ్ రోడ్ చౌరస్తాలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దీపిక, అనిషా, సంధ్య, అరుణ, ప్రియాంక, కల్పన, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'దళిత ఆడబిడ్డ పెండ్లికి ఉప్పల ఫౌండేషన్ చేయూత'



నవతెలంగాణ - నాగోల్

ఓ దళిత ఆడబిడ్డ పెండ్లికి ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో సహాయ సహకారాలను అందించి, చేయూత ఇచ్చినట్టు టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాక అధ్యక్షుడు, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస గుప్త తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని నాగోల్‌లో ఉప్పల శ్రీనివాస్ గుప్త క్యాంపు కార్యాలయంలో సింగ రాము జంగయ్య శాంతల కుమార్తె లావణ్య వివాహానికి సహాయ సహకారాలు అందించాలని కోరుతూ ఉప్పల శ్రీనివాస గుప్తను మర్యాదపూర్వకంగా కలిశారు. వెంటనే స్పందించిన ఉప్పల శ్రీనివాస్ గుప్త వారి ఆర్థిక పరిస్థితులను అడిగి తెలుసుకుని లావణ్య వివాహానికి మంగళసూత్రం, మెట్టెలు, చీర, గాజులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పల ఫౌండేషన్ ద్వారా కులాలకు అతీతంగా ఎంతోమంది పేద కుటుంబాలకు చెందిన వారికి మంగళసూత్రం, మెట్టెలు, చీర, గాజులను అందజేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రవి కుమార్, లావణ్య తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార రంగంలో ఉన్నత స్థాయికి ఎదగాలి : ఉప్పల



వినియోగదారులకు సరసమైన ధరలతో పాటు మెరుగైన సేవలను అందిస్తూ వ్యాపార రంగంలో ముందుకెళ్లి మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాక అధ్యక్షుడు, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస గుప్త వ్యాపారస్తులకు సూచించారు. వనస్థలిపురంలోని గణేష్ కాన్ఫిడెన్స్ హాల్లో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ మొదటి ఇన్స్టలేషన్ ప్రోగ్రాం ఆఫ్ ఐసిఐ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆల్ ఈజ్ వెల్ చాప్టర్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ నంద కిషోర్ ఆధ్వర్యంలో వ్యాపారస్తులకు వ్యాపార రంగంలో నూతన ఉత్తేజాన్ని, ప్రేరణ కలిగించిన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఇటువంటి కార్యక్రమాలు సమాజానికి ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మొగుళ్ళపల్లి ఉపేందర్, శ్రీధర్, రామచంద్రుడు, మాధవి తదితరులు పాల్గొన్నారు

మెడికల్‌లో పీజీ సీట్ సాధించిన వినయ్ కుమార్



నవతెలంగాణ- బడంగ్‌పేట్

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం, బడంగ్‌పేట్ గ్రామానికి చెందిన గుడ్ల దేవయ్య-స్వరూపల కుమారుడు డాక్టర్ గుడ్ల వినయ్ కుమార్ ఆల్ ఇండియా మెడికల్ పీజీలో సీట్ సాధించి..బడంగ్‌పేట్ గ్రామంలో ప్రథమ వ్యక్తిగా నిలిచారు. ఈ మేరకు శనివారం డాక్టర్ వినయ్ కుమార్ మాట్లాడుతూ నా తల్లీదండ్రుల ప్రోత్సాహం, కుటుంబ సభ్యుల సహకారంతో ఈ స్థాయికి వచ్చానని తెలిపారు. తాను బడంగ్‌పేట్‌లోని సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో 1వ తరగతి నుండి 10 వరకు చదువుకున్నానని చెప్పారు. ఇంటర్మీడియట్ చంపాపేట్‌లోని శ్రీ గాయత్రి కళాశాలలో పూర్తి చేసినట్లు తెలిపారు. డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్. టి.ఎస్.సోషల్ వెల్ఫేర్ సెక్రెటరీ సూచనతో లాంగ్ టర్మ్ తెలంగాణ సోషల్ వెల్ఫేర్ గురుకులాలో చదివి, మహబూబ్ నగర్ ప్రభుత్వ హాస్పిటల్‌లో సీట్ సాధించి..ఎంబీబీఎస్ పూర్తి చేసి డాక్టర్ పట్టా పొందానని వివరించారు. ప్రస్తుతం ఈ రెండు సంవత్సరాలు కష్టపడి చదివి పీజీ సాధించినట్టు చెప్పారు. భవిష్యత్‌లో డాక్టర్ వృత్తిలో పేద ప్రజలకు వైద్య సేవలు అందిస్తానని అన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించిన ట్రాఫిక్ పోలీసులు



నవతెలంగాణ - సంతోష్ నగర్

ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ చౌరస్తా, భారత్ గార్డెన్, యాదిరెడ్డి గార్డెన్ వద్ద సంతోష్ నగర్ ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. సౌత్ జోన్ ఈస్ట్ జోన్ ట్రాఫిక్ అదనపు డీసీపీ శ్రీనివాస్ చార్యులు, ఏసీపీ సత్యనారాయణ ఆదేశం మేరకు సీఐ నరసింహా నాయక్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు నిర్వహించగా.. సుమారు 15 కేసులను నమోదు చేసినట్టు ట్రాఫిక్ సీఐ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన 15 మంది ద్వి చక్ర వాహనదారులపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఎన్ని అవగాహన కార్యక్రమాలను నిర్వహించినా వాహనదారుల్లో మార్పు రావడం లేదన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మీర్ చౌక్ ట్రాఫిక్ ఎస్ఐ అమర్నాథ్ రెడ్డి, ఏఎస్ఐలు, ట్రాఫిక్ పోలీసులు ఠాకూర్ నాయక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుశాల్ గార్డెన్ వద్ద...



ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ కర్మన్ ఘాట్ రోడ్డులో కుశాల్ గార్డెన్ వద్ద ఎల్బీనగర్ ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో సుమారు 14 కేసులను నమోదు చేసినట్టు ట్రాఫిక్ ఏసీబీ నవీన్ రెడ్డి, సీఐ నాగరాజు, సీఐ సర్వర్ అహ్మద్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన 14 మందిపై కేసులు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు : మేయర్ పారిజాత



నవతెలంగాణ- బడంగ్‌పేట్

సమాజంలో విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులేనని మేయర్ పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. శనివారం మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బడంగ్‌పేట్ ప్రాథమిక పాఠశాలలో నూతనంగా బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులకు, ఇక్కడి నుండి బదిలీపై వెళ్ళే ఉపాధ్యాయులకు ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి మాట్లాడుతూ నేటి సమాజంలో ఉపాధ్యాయుల కృషి మరువలేనిదని, సమ సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులేనని కొనియాడారు. నేటి విద్యార్థులే రేపటి భావి భారత పౌరులని, కృషి పట్టుదలతో బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరికీ విద్యతోనే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందని తెలిపారు. అందుకోసం విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత స్థాయికి ఎదిగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పలు చోట్ల ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



నవతెలంగాణ - అబ్దుల్లాపూర్‌మెట్

అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని అనాజ్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలలో ఊయలలు ఊగుతూ, ఉట్టి కొడుతూ, నృత్యాలు చేస్తూ అలరించారు. చిన్న పిల్లల ఆట పాటలు, కోలాటాలు అందరినీ ఆకర్షించాయి. అనంతరం హెడ్ మాస్టర్ పవన కుమారి మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుండే భారత దేశ గొప్పతనాన్ని చెప్పేందుకు ప్రతి పండుగలను నిర్వహిస్తున్నామని తెలిపారు. చదువుతోపాటు అన్ని విషయాలను విద్యార్థులకు నేర్పిస్తున్నామని, పాఠశాల స్థాయి నుండి పరిపూర్ణ విద్యార్థులుగా తీర్చిదిద్దడమే మా లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేశ్వర్ రెడ్డి, లావణ్య, వెంకటేష్ గౌడ్, జంగయ్య, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



హయత్ నగర్ మెగాసిటీ హైస్కూల్లో కృష్ణాష్టమి వేడుకలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

హయత్‌నగర్‌లోని మెగా సిటీ హైస్కూల్లో శనివారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించినట్టు స్కూల్ చైర్మెన్ సుబ్బారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ కృష్ణుడు ధర్మవైపు నిలబడి ధర్మాన్ని రక్షించాడని అన్నారు. కౌరవులు అధర్మంతో గెలవాలని ప్రయత్నించినా కృష్ణుడు ధర్మం వైపు నిలబడి ధర్మాన్ని రక్షించారని వివరించారు. విద్యార్థులు కూడా న్యాయ అన్యాయ విలువలు తెలుసుకోవాలని, ఎన్ని కష్టాలు వచ్చినా ధర్మం వైపే నిలబడాలని సూచించారు. విద్యార్థులు మన సంస్కృతి సాంప్రదాయాలను తెలుసుకొని ఆచరించాలని అన్నారు. విద్యార్థులు కృష్ణుడు, గోపిక వేషధారణలో వచ్చి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ స్వాతి, ప్రిన్సిపాల్ వాసు, వైస్ ప్రిన్సిపాల్ స్వాతి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



తట్టిఅన్నారం కేశవరెడ్డి హై స్కూల్లో శ్రీ కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు..



నాగోల్ అజయ్నగర్ కాలనీలోని కృష్ణవేణి టాలెంట్ హైస్కూల్లో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న ప్రిన్సిపాల్ కె. ప్రేమానంద చారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు..

నవతెలంగాణ - మీర్ పేట్



మీర్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని నారాయణ స్కూల్లో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలు ధరించి ఊయలాలు ఊగుతూ, ఉట్టి కొడుతూ, నృత్యాలు చేస్తూ అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



నవతెలంగాణ - నాగోల్

ఓ మహిళ అదృశ్యమైన ఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగోలు డివిజన్ జైపూర్ కాలనీ నువ్వుల బండలో నివాసం ఉంటున్న పరాశరం గీత అనే మహిళ.. తన సోదరుడికి రాఖీ కట్టడానికి వచ్చింది. తిరిగి ఫలక్నామాలోని జంగంమెట్టుకు వెళ్లేందుకు ఈ నెల 22న సాయంత్రం జైపూర్ కాలనీ బస్ స్టాప్‌లో 72జే ఆర్టీసీ బస్సులో బయలుదేరినట్లు బాధితురాలి సోదరుడు కుతాడి రాజు తెలిపారు. ఆమె సాయంత్రం 6 గంటల వరకు కూడా ఇంటికి చేరుకోలేదు. దీంతో ఆమె ఆచూకి కోసం పరిసర ప్రాంతాలలో, బంధువులను విచారించిన ఫలితం లేకపోవడంతో.. బాధితురాలి సోదరుడు రాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్ స్పెక్టర్ రమేష్ తెలిపారు.

సర్వసభ్య సమావేశంలో పలు అభివృద్ధి పనులకు తీర్మానం



నవతెలంగాణ - తుర్కయంజాల్

తుర్కయంజాల్ మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశంలో పలు అభివృద్ధి పనులకు తీర్మాణం చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ మల్ రెడ్డి అనురాధ అధ్యక్షతన శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ చైర్మెన్ మల్ రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీని సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో అభివృద్ధి చేస్తామన్నారు. దాదాపు రూ.176 కోట్లలతో అభివృద్ధి పనులకు తీర్మాణం చేసినట్లు తెలిపారు. మున్సిపాలిటీలో 90 శాతం అంతర్గత మురుగు కాలువ పనులను పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఈ సమవేశంలో వివిధ వార్డుల కౌన్సిలర్లు పలు సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా లోవోల్టాజ్, తాగునీటి సమస్యలపై పలువురు, అక్రమ లే ఔట్ల పై కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కళ్యాణ్ నాయక్ ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అమరేందర్ రెడ్డి, డీఈ సత్యనారాయణ, వైస్ చైర్ పర్సన్ గుండ్లపల్లి హరిత ధన్ రాజ్, కౌన్సిలర్లు ఐలయ్య, పుల్లగుర్రం కీర్తన, మర్రి మాధవి, కుంట ఉదయశ్రీ, కుమాను సునీల్, కంబలపల్లి ధన్ రాజ్, రెవల్లి హరిత, మేతరి అనురాధ, అధికారులు కృష్ణ కుమారి, శ్రీధర్ రెడ్డి, భిక్షపతి, ట్రఫిక్ ఇన్ స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా రెడ్డిపల్లి జ్ఞానేశ్వర్



నవతెలంగాణ - మీర్ పేట్

మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సెలవుపై వెళ్లడంతో పూర్తి అడిషనల్ ఛార్జి(ఎఫ్ఏసీ)గా రెడ్డిపల్లి జ్ఞానేశ్వర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మెప్మా జిల్లా ఏడి బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థిని హత్యచేసిన నిందితుల అరెస్ట్

నవతెలంగాణ - బడంగ్ పేట్

ఇంజనీరింగ్ విద్యార్థిని హత్య చేసిన ఏడుగురు నిందితులను బాలాపూర్ పోలీసులు శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ తోట భూపతి తెలిపిన వివరాల ప్రకారం.. బాలాపూర్‌కు చెందిన మోంద్రు అనిత, శాంతయ్యల కుమారుడు మోంద్రు ప్రశాంత్(21) నాదర్‌గూల్ లోని ఎంవీఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. అదే ప్రాంతానికి చెందిన పోచబోయిన మాధవ్ యాదవ్‌తో గత కొంత కాలం కిందట పరిచయం ఏర్పడింది. కానీ మాధవ్ యాదవ్ తన ప్రియురాలితో చాటింగ్ చేస్తున్నాడన్న అనుమానంతో ప్రశాంత్‌తో 10 నెలలుగా గొడవ పడుతూ ఉండేవాడు. అలా మొదలైన గొడవ కారణంగా ప్రశాంత్‌ను ఎలాగైన హత్య చేయాలని మాధవ్ యాదవ్ అనుకున్నాడు. అందుకోసం మహేష్ యాదవ్, సుమంత్ చారి, నల్లపూసల మహేష్, దొడ్డి హరీష్, అఖిల్ కిరణ్ కుమార్, కొహెడ యశ్వంత్‌లతో కలిసి మాధవ్‌యాదవ్ హత్యకు పథకం రూపొందించాడు. ఈ నెల 22న బాలాపూర్ గణేష్ చౌక్ ప్రాంతంలో మండి 37 బిర్యాని సెంటర్ ఆవరణలోని పాన్‌షాప్‌కు ప్రశాంత్‌ను పిలిపించి.. తన స్నేహితులతో కలిసి హత్య చేశాడు. అప్పటి నుంచి తప్పించుకు తిరుగుతున్న మాధవ్ యాదవ్‌తో పాటు అతని స్నేహితులను పోలీసులు శనివారం అదుపు లోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్టు పోలీసులు తెలిపారు.



టీజీఎస్‌పీడీసీఎల్

గ్రేటర్ హైదరాబాద్‌లో ఎస్ఈలు బదిలీ

నవతెలంగాణ-సిటీబ్యూరో

దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పలువురు సూపరింటెండెంట్ ఇంజినీర్లు బదిలీ అయ్యారు.

ఈ మేరకు శనివారం సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ఉత్వర్వులు జారీ చేశారు. సైబర్ సిటీ సర్కిల్ ఎస్ఈగా టి.చంద్రశేఖర్, రాజేంద్రనగర్ సర్కిల్ ఎస్ఈగా డీఎస్.మోహన్, మేడ్చల్ సర్కిల్ ఎస్ఈగా ఎం.రవికుమార్, హైదరాబాద్ సౌత్ సర్కిల్ ఎస్ఈగా డి.సోమిరెడ్డి(ఇటీవల ఎస్ఈగా ప్రమోషన్ వచ్చింది), సరూర్‌నగర్ సర్కిల్ ఎస్ఈగా సి.మాధవరెడ్డి, సికింద్రాబాద్ సర్కిల్ ఎస్ఈగా ఎల్.గోపయ్య, బంజారాహిల్స్ సర్కిల్ ఎస్ఈగా పి.కరుణాకర్ బాబు, హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్ ఎస్ఈగా పి.వెంకన్న, సంగారెడ్డి సర్కిల్ ఎస్ఈగా ఐ.శ్రీనాథ్‌లను బదిలీ అయ్యారు. కొద్ది రోజుల క్రితం హబ్సిగూడ సర్కిల్ ఎస్ఈగా బ్రహ్మం బదిలీపై వచ్చారు.

శామీర్‌పేటలో 26న వాలీబాల్ పోటీలు



నవతెలంగాణ-హైదరాబాద్ డెస్క్

కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా శామీర్ పేట ఎస్‌హెచ్ఓ శ్రీనాథ్ ఆధ్వర్యంలో ఈ నెల 26న శామీర్‌పేట మండలంలోని జైన్ హెరిటేజ్ స్కూల్ ఆవరణలో యువకులకు వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్టు ఎస్‌హెచ్ఓ శ్రీనాథ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు పోలీసులకు ప్రజలకు మధ్య స్నేహపూర్వక ఆహ్లాదకరమైన వాతావరణం కోసం శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల యువతను క్రీడలవైపు ప్రోత్సహించడం, వారిలోని ప్రతిభను వెలికితీయడం కోసం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలలోని 18 ఏండ్లు పైబడిన యువకులు వాలీబాల్ పోటీలలో పాల్గొనడానికి అర్హులని తెలిపారు. ఆసక్తి గల వారు ఎస్ఐ మునీందర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఎంటమాలజీ సిబ్బందితో సమీక్ష



నవతెలంగాణ-కాప్రా

మల్లాపూర్ డివిజన్ వార్డు కార్యాలయంలో స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి శనివారం ఎంటమాలజీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లోని ప్రజలు డెంగ్యూ, చికెన గున్యా, మలేరియా లాంటి వ్యాధుల బారిన పడుతున్నారని డివిజన్‌లో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ఎంటమాలజీ సిబ్బందికి సూచించారు. ప్రజలకు ఎలాంటి జ్వరాలు వచ్చినా సూర్యనగర్ కాలనీలోని ప్రభుత్వ ఆస్పత్రిలో, బస్తీ దవాఖానాలో వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆస్పత్రిలో ఉచితంగా ఇచ్చే మందుల సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంటమాలజీ ఏఈ రమేష్, కనకరాజు, నర్సింహా, స్థానిక నాయకులు పైళ్ల ప్రవీణ్, ఎంటమాలజీ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీదేవిని కలిసిన ఓల్డ్ సోనియా గాంధీ నగర్ కార్యవర్గం



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్‌లోని ఓల్డ్ సోనియాగాంధీ నగర్ నూతన కార్యవర్గ సభ్యులు శనివారం చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవియాదవ్‌ను ఆమె నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ను శాలువాతో సన్మానించారు. కలిసిన వారిలో ఓల్డ్ సోనియా గాంధీనగర్ నూతన కార్యవర్గ ప్రెసిడెంట్ ప్రభావతి, వైస్ ప్రెసిడెంట్ వెంకట్‌రావు, రామ్ చందర్, జనరల్ సెక్రెటరీ ప్రసాద్ బాబు, జాయింట్ సెక్రెటరీస్ యాకూబ్, కృష్ణ, సతీష్, ఆర్గనైజింగ్ సెక్రెటరీస్ ప్రతాప్ రెడ్డి, వెంకటేష్, కోశాధికారి ఆంజనేయులు, గిరిజ ఉన్నారు. వారందరినీ కార్పొరేటర్ శాలువాలతో సన్మానించి స్వీట్స్ అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాలనీ అభివృద్ధికి సహకరిస్తానని హామీ ఇచ్చారు.

పంచాయతీల విలీనంపై గ్రామసభ



నవతెలంగాణ-ఘట్కేసర్ రూరల్

గ్రామ పంచాయతీల విలీనంపై మండల పరిధిలోని కాచవాని సింగారం గ్రామ పంచాయతీ సెక్రటరీ ఆధ్వర్యంలో శనివారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్‌లో కాచవాని సింగారం గ్రామాన్ని విలీనం చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామని బీజేపీ నాయకులు బస్వ రాజు గౌడ్ అన్నారు. కాచవాని సింగారం చిన్న గ్రామమని ఇంకా గ్రామ పంచాయతీ వాతావరణంలో ఉందని పేర్కొన్నారు. జీహెచ్ఎంసీలో విలీనమైతే పన్నులు అధికమై ప్రజలపై భారం పడే అవకాశం ఉందన్నారు. గ్రామం పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందిన తర్వాతనే జీహెచ్ఎంసీలో విలీనం చేయాలన్నారు. అప్పటి వరకు గ్రామ పంచాయతీగానే కొనసాగించాలని కోరారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పార్టీలకు అతీతంగా వ్యతిరేకిస్తున్నామని, దీనికి అందరూ సహకరించాలని గ్రామ యువకులను, పెద్దలను, కుల సంఘాల నాయకులను కోరారు. అదేవిధంగా గ్రామంలోని వివిధ కాలనీల్లో డ్రయినేజీ, వీధి దీపాల సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు వివిధ కాలనీల వాసులు, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

శానిటేషన్, పేషంట్ కేర్ కార్మికులకు వేతనాలు చెల్లించాలి



- ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. నరసింహా
- ఘట్కేసర్ ఆస్పత్రి ఎదుట ధర్నా

నవతెలంగాణ-ఘట్కేసర్

తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని ఘట్కేసర్ హెల్త్ సెంటర్‌లో పని చేస్తున్న శానిటేషన్, పేషంట్ కేర్ సెక్యూరిటీ కార్మికులకు రెండు నెలల వేతనాలు చెల్లించాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి ఎం. నరసింహ డిమాండ్ చేశారు. శనివారం ఘట్కేసర్ ఆస్పత్రి ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో వారి కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఉందన్నారు. సంబంధిత కాంట్రాక్టర్లను వేతనాలు ఎందుకు ఆలస్యం అవుతున్నాయని అడిగితే ఏడు నెలల నుంచి ప్రభుత్వం నుంచి బిల్లులు అందడం లేదని చెబుతున్నారని తెలిపారు. అందువలన జీతాలు చెల్లించలేకపోతున్నామని చెప్పారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కార్మికులకు వేతనాలు అందేలా చూడాలనిన్నారు. వేతనాలు చెల్లించని పక్షంలో విధులు బహిష్కరించి సమ్మె చేస్తామని హెచ్చరించారు. ఘట్కేసర్ ఆస్పత్రిలో బెడ్ల సంఖ్యను పెంచాలని కోరారు. కార్మికులపై అధిక పని భారం తగ్గించాలని కోరారు. వేతనాలు సకాలంలో చెల్లించకపోవడంతో పేషెంట్లకు సరైన సేవలు అందించలేకపోతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు కే. జయచంద్ర, సీపీఐ ఘట్కేసర్ కార్యదర్శి ఎల్. ఈశ్వర్, శివమ్మ లక్ష్మి, లూథియా, ఇందిరా, స్వరూప, సత్యనారాయణ, ఊర్మిళ కార్మికులు పాల్గొన్నారు.

చిన్న మార్పుతో చిన్ని ప్రాణులకు మేలు..!

- ఫీడర్స్ ట్రిప్‌తో విద్యుత్ సరఫరాలో అంతరాయం
- త్వరలో 3వేల ఎఫ్ఆర్‌బీ సిలికాన్ క్లాంప్‌ల ఏర్పాటు

నవతెలంగాణ-సిటీబ్యూరో

బల్లి, పిల్లి, పావురం, ఉడత, ఉడుం వంటి మూగ జీవాలు ట్రాన్స్ ఫార్మర్ల వద్ద గల హార్న్ గ్యాప్ ఫ్యూజ్ సెట్ల మీద, బ్రేకర్స్, లింబ్స్ మీద లైవ్ కరెంటు పాయింట్, ఎర్త్ పాయింట్‌ను వేరు చేసే ఇన్సులేటర్ (పింగాణి) మీద పాకుతున్నప్పుడు ప్రమాదవశాత్తు ఎర్త్ పాయింట్ (మెటల్ క్లాంపు), లైవ్ పాయింట్ (మెటల్ క్లాంపు)కు టచ్ అవడంతో అవి విద్యుత్ షాక్‌కు గురై చనిపోవడంతో పాటు ఫీడర్ ట్రిప్ అయి విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నాయి.

14శాతం ట్రిప్పింగ్స్

ఫీడర్ల ట్రిప్పింగ్లకు గల కారణాల విశ్లేషణలో ఈ సమస్య కారణంగా 14 శాతం ట్రిప్పింగ్స్ అవుతున్నాయని గ్రహించిన దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ చిన్న మార్పును సూచించారు. విద్యుత్ పనుల్లో ఉపయోగించే పరికరాల్లో ప్రస్తుతం హార్న్ గ్యాప్ ఫ్యూజ్ వద్ద మెటల్ క్లాంప్‌లు వినియోగిస్తున్నారు. వీటి స్థానంలో ప్రత్యేకంగా రూపొందించిన ఎఫ్ఆర్‌బీ సిలికాన్ క్లాంప్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఈ సిలికాన్ క్లాంపులు విద్యుత్ ప్రవాహకంగా పని చేయవు కనుక మూగ జీవాలు వాటి మీదుగా పాకినా/నడిచినా ఎలాంటి ప్రమాదం ఉండదు.

3వేల క్లాంపుల ఏర్పాటు

ముందుగా, చెట్లు అధికంగా ఉండి ఈ సరీసపాల బెడద అధికంగా ఉన్న ప్రాంతాల్లో దాదాపు 3వేల ఎఫ్ఆర్‌బీ సిలికాన్ క్లాంప్‌లను ఫ్యూజ్, బ్రేకర్స్, లింబ్స్ వంటి చోట ఏర్పాటు చేయనున్నారు. ఈ చిన్న మార్పు మూగ జీవాలకు శ్రేయస్కరంగా, విద్యుత్ అంతరాయాలను కట్టడి చేసే అవకాశం ఉంటుందని సీఎండీ ముషారఫ్ ఫరూఖీ అభిప్రాయపడ్డారు.





మత్తు పదార్థాల తయారీ కేంద్రంపై దాడి





- రూ. 30 లక్షల ముడిసరుకు స్వాధీనం
- నిందితులపై కేసు నమోదు..రిమాండ్‌కు తరలింపు

నవతెలంగాణ-ఘట్కేసర్ రూరల్

గుట్టు చప్పుడు కాకుండా అల్ప్రాజోలం (మత్తుపదార్థాలు) తయారు చేస్తున్న కేంద్రంపై స్టేట్ ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడి చేసి రూ.30 లక్షలు విలువ చేసే ముడిసరుకు స్వాధీనం చేసుకున్నారు. మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ ఎగ్జామ్ పోలీస్ స్టేషన్ దివ్య నగర్‌లో శనివారం డైరెక్టర్ ఆఫ్ అనౌన్స్‌మెంట్ ప్రొవిబిషన్ అండ్ ఎక్సైజ్ ఏబీ కమలహాసన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేటకు చెందిన మీనా శ్రీనివాస్ (49), పోలిశెట్టి రాంబాబు (47), దాడి లక్ష్మయ్య (50), వనస్థలిపురానికి చెందిన కాకర్ల చంద్రశేఖర్‌లు (48), ఘట్కేసర్ మండలం సింగారం దివినగర్‌లోని ఓ ఇంటిని ఈనెల 5వ తేదీన అద్దెకు తీసుకున్నారు. మీనా శ్రీనివాస్ డబ్బు సంపాదించాలనే అత్యాశతో లక్ష రూపాయలు వేచించి అల్ప్రాజోలం తయారు చేసే ఫార్ములను కూకట్‌పల్లిలోని నర్మద కెమికల్స్ యజమాని రాజేశ్వరరావు నుంచి కొనుగోలు చేశారు. మత్తు పదార్థాలను తయారు చేయడానికి వాడే ట్రోక్లోరో బెంజీన్, బెంజీన్ సైనేట్, హైడ్రోజన్ హైడ్రేట్ మాత్రలను పలు దుకాణంలో కొనుగోలు చేసి 15 రోజుల్లో 7 విడతలుగా 2కిలోల 91 గ్రాముల అల్ప్రాజోలం తయారు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు స్టేట్ ట్రాన్స్‌పోర్ట్ అధికారులు అల్ప్రాజోలం తయారీ కేంద్రంపై దాడి చేశారు. రూ.30 లక్షల విలువ చేసే ముడి సరుకు, 2.91 కిలోల అల్ప్రాజోలం, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురి నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో చాక చాక్యంగా వ్యవహరించిన అధికారులను అభినందించారు.

సైబర్ క్రైమ్, యాంటీ డ్రగ్స్‌పై అవగాహన



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

సైబర్ క్రైమ్, యాంటీ డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై వాజ్‌పేయి నగర్‌లోని గవర్నమెంట్ జూనియర్ కాలేజీ విద్యార్థులకు నేరేడ్‌మెట్ ఎస్ఐ శ్రీనివాస్, పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆధ్వర్యంలో శనివారం కళాశాలలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్‌కు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని, ఎవరైనా డ్రగ్స్‌ను విక్రయిస్తున్నా, డ్రగ్స్ వినియోగిస్తున్నా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని విద్యార్థులకు సూచించారు. మత్తు పదార్థాల జోలికి పోకుండా తమ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేరేడ్‌మెట్ పోలీస్ సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

మెట్రో ఫ్రీ పార్కింగ్ కొనసాగించాలి

- ప్రోగ్రెసివ్ యూత్ లీగ్ ఆధ్వర్యంలో ధర్నా పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-ఉప్పల్

నాగోల్ మెట్రో స్టేషన్ వద్ద ఫ్రీ పార్కింగ్ తీసివేసి పెయిడ్ పార్కింగ్ ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తూ ప్రోగ్రెసివ్ యూత్ లీగ్ (పీవైఎల్) ఆధ్వర్యంలో నేడు (ఆగస్టు 25న) ఆదివారం ఉదయం 9 గంటలకు పార్కింగ్ స్థలం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు పీవైఎల్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షులు కె.ఎస్. ప్రదీప్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష, కార్యదర్శులు, రవి కుమార్, కృష్ణలు మాట్లాడుతూ.. ఎన్నో ఏండ్ల నుండి ఉచితంగా కొనసాగుతున్న ఫ్రీ పార్కింగ్ తీసేసి పేడ్ పార్కింగ్ ఏర్పాటు చేయటం దుర్మార్గం అన్నారు. ఎటువంటి వసతులు కల్పించుకోకుండా 12 గంటలకు ఒక్కో బైక్‌కు రూ.40 వసూలు చేయడం సిగ్గు చేటన్నారు. మరిన్ని వసతులు కల్పిస్తే ఇంకా ఎన్ని డబ్బులు వసూలు చేస్తారని వారు ప్రశ్నించారు. ఇప్పటికే అనేక రకాల చార్జీలతో ప్రయాణికులు ఆర్థిక భారాన్ని మోయలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెయిడ్ పార్కింగ్ మూలంగా ప్రయాణికులు చాలా ఇబ్బంది పడాల్సి వస్తుంన్నారు. మెట్రో సంస్థ, ఎల్ అండ్ టీ సంస్థ ఉచిత పార్కింగ్ కొనసాగించుకోకుండా మొండి వైఖరి అవలంభిస్తే ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఉచిత పార్కింగ్ అమలు చేస్తామని ప్రకటించే వరకు ఉద్యమిస్తామని వారు తెలిపారు. నేడు నిర్వహించే ధర్నాకు నాయకులు, ప్రజలు, ప్రయాణికులు సకాలంలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో బంగారి శ్రీనివాస్, భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయదారుడి అరెస్ట్



నవతెలంగాణ-ఉప్పల్

ఆంధ్రప్రదేశ్ నుంచి గంజాయి తీసుకొచ్చి, హైదరాబాద్ ఉప్పల్ పారిశ్రామిక ప్రాంతంలో గుట్టు చప్పుడు కాకుండా గంజాయి విక్రస్తున్నారనే పక్కా సమాచారంతో ఒక వ్యక్తిని ఉప్పల్ ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. ఉప్పల్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఓంకార్, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, నరేష్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపెల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన గుండేటి మహర్షి సీలేరు, ఆంధ్రప్రదేశ్ బార్డర్‌లో నుంచి అక్రమంగా గంజాయి తీసుకొచ్చి హైదారాబాద్‌లో ఉప్పల్ పారిశ్రామిక ప్రాంతంలో విక్రయిస్తున్నాడు. అతడి వద్ద నుండి శనివారం (2.190) కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో సీలేరు నుండి కిలోకు రూ.3000 చొప్పున ఎండు గంజాయిని కొనుగోలు చేసినట్టు అంగీకరించాడు. దానిని చిన్న ప్యాకెట్లుగా చేసి అవసరమైన వారికి విక్రయించి లాభం పొందుతున్నాడు. ఈ గంజాయి విలువ దాదాపు రూ. 1,00,000 ఉటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

మౌలాలి డివిజన్ అభివృద్ధే ధ్యేయం



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మౌలాలి డివిజన్‌లోని అన్ని కాలనీలు, బస్తీల అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని కార్పొరేటర్ సునీత శేఖర్ యాదవ్ అన్నారు. మౌలాలి డివిజన్ లోని మారుతీ నగర్‌లో రూ.64 లక్షలతో 1000 డయా ఆర్‌సీసీ పైపులైను పనులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడు తూ.. పైపులైను ఏర్పాటుతో కొన్ని కాలనీలకు వరద ముంపు నుంచి ఉపశమనం కలుగుతుందన్నారు. డివిజన్‌ను అధికారుల సహకారంతో మరింత అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ మధురిమ, వర్క్ ఇన్‌స్పెక్టర్ నరేంద్ర, మహేందర్, కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, మూర్తి, శ్రీనివాస్, ఐఎస్ రావు, కిరణ్, నాగరాజ, రవీంద్ర రుద్రరాజు, జయనంద్, మౌలాలి డివిజన్ బీజేపీ అధ్యక్షులు అనిపెద్ది సాయిబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు లింగారావు, డివిజన్ కార్యదర్శి శివ గౌడ్, రమణ, రాము, తదితరులు పాల్గొన్నారు.

రేపు 65వ శ్రీకృష్ణ జయంత్యుత్సవం



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర యాదవ మహాసభ ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీన సాయంత్రం 7 గంటలకు సికింద్రాబాద్ హరిహర కళాభవన్‌లో 65వ శ్రీకృష్ణ జయంత్యుత్సవం నిర్వహించనున్నట్టు ఆ మహాసభ అధ్యక్షుడు యల్లావుల చక్రధర్ యాదవ్ తెలిపారు. శనివారం సికింద్రాబాద్‌లో ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని ఏటా నిర్వహించే ఈ ఉత్సవాలకు రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన యాదవ ప్రముఖులంతా హాజరు కానున్నట్టు పేర్కొన్నారు. జంట నగరాలకు చెందిన యాదవులంతా ఈ కార్యక్రమానికి కుటుంబ సమేతంగా తరలి వచ్చి విజయంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాగెల్లి అంజన్ యాదవ్, జంగిటి ప్రవీణ్ యాదవ్, ఎంటీ కృష్ణ యాదవ్, మొడికె శ్రీనివాసులు, కీర్తి సుధాకర్‌రావు యాదవ్, రాంప్రసాద్ యాదవ్, ఉడుత పరమేశ్వర్ యాదవ్, బొట్టు మధు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే మర్రి కూతురి నిశ్చితార్థం



నవతెలంగాన-సిటీబ్యూరో

మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్, మమతా రెడ్డిల ఏకైక కుమార్తె మర్రి శ్రేయారెడ్డి నిశ్చితార్థం ఆదిత్యతో రాజస్థాన్ (జైపూర్)లో జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, మల్లారెడ్డి, మర్రి లక్ష్మన్‌రెడ్డి, మర్రి అరుంధతి, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటే ప్రజా ఆయుధం

● కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ రంగ ప్రదీప్ గౌడ్



నవతెలంగాణ-అంబర్‌పేట

ప్రజాస్వామ్యంలో ఓటే ప్రజాయుధమని 18 సంవత్సరాలు నిండిన అర్హులైన వారందరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ రంగ ప్రదీప్ గౌడ్ అన్నారు. శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడు తూ ఓటు హక్కుల ద్వారా ప్రజలు ప్రజాస్వామ్యాన్ని మరింత బలబోతాకానికి కృషి చేసే విధంగా అర్హత పొందుతారని ఓటే ప్రజా ఆయుధమని అందుకు ప్రతి ఒక్కరూ ఓటరు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు.

'లక్ష్యం ద పాఠశాల'లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సూరారంలోని 'లక్ష్యం ద పాఠశాల' లో శనివారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నా రులు చిన్ని కృష్ణులు, ముద్దులొలికే గోపికమ్మల వేషధార ణలో వచ్చి అల్లరి చేష్టలతో అందరినీ అలరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనుపమ, ఉపాధ్యా యుల బృందం పాల్గొన్నారు. అనంతరం పిల్లల కళ నైపుణ్యాలను ఉపాధ్యాయులు బృందం అభినందిం చారు. రానున్న రోజుల్లో విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవా లని ప్రధానోపాధ్యాయురాలు కోరారు.

అభిప్రాయ సేకరణ హర్షనీయం

● మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్
● కలెక్టరేట్‌లో తెలంగాణ హక్కుల రికార్డుల చట్టం-2024 ముసాయిదాపై చర్చా కార్యక్రమం



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ధరణి సమస్యలను పరిష్కరించేందుకు గాను తెలంగాణ హక్కుల రికార్డుల చట్టం-2024 రూపకల్పనకు అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని చేపట్టడం ఎంతో హర్షనీయమని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అభిప్రాయపడ్డారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం ఏర్పాటు చేసిన తెలంగాణ హక్కుల రికార్డుల చట్టం-2024 ముసాయిదాపై చర్చ కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. 1971లో ఆర్‌ఓఆర్ చట్టం వచ్చిందనీ, 1989 నుంచి ఈ ఇదే చట్టం ప్రకారం పట్టాదారు పాసు పుస్తకాల ద్వారా భూ పంపిణీ చేసినట్టు తెలిపారు. 2020 వరకూ ఈ చట్టం ప్రకారమే రెవెన్యూ శాఖ వ్యవహరించిందన్నారు. కోర్టులలో కూడా ఈ చట్ట నిబంధనల మేరకు కేసులను పరిష్కరించినట్టు తెలిపారు. అక్టోబరు 2020 నుంచి ధరణి పోర్టల్ ద్వారా, ఆన్‌లైన్ ద్వారా అప్‌డేషన్ చేసినట్టు తెలిపారు. ధరణిలో రిజిస్ట్రేషన్ అయిన వెంటనే జాప్యం లేకుండా పాసుపుస్తకం అందించేవారనీ, ఈ సమయంలో కొన్ని సమస్యలను ఎదుర్కొన్నట్టు గుర్తు చేశారు. తెలంగాణ హక్కుల రికార్డుల చట్టం-2024 రూపొందించడానికి రాష్ట్రమంతటా అభిప్రాయ సేకరణ జరిపించాలని ప్రభుత్వం ఆదేశించినందున, అందులో భాగంగా ఈ చర్చా కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రిటైర్డ్ రెవెన్యూ అధికారులు, నల్సార్ యూనివర్సిటి ప్రొఫెసర్లు, ప్రజాప్రతినిధులు, రైతులు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు తెలంగాణ హక్కుల రికార్డుల చట్టం -2024 బిల్లులోని అంశాలపై సలహాలు, సూచనలు అందించాలని కోరారు. అభిప్రాయాలను రాతపూర్వకంగా కూడా అందించవచ్చని తెలిపారు. ఇలా సేకరించిన అభిప్రాయాలను క్రోడికరించి ప్రభుత్వానికి నివేదక అందజేస్తామని తెలిపారు. వికారాబాద్ రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ సురేష్ పొద్దార్ తన అభిప్రాయాన్ని తెలుపుతూ.. గ్రామస్థాయిలో గ్రామ సభలు నిర్వహించాలన్నారు. చిన్న చిన్న సమస్యలను తహశీల్దారు స్థాయిలోనే పరిష్కరించాలనీ, మ్యూటేషన్ తప్పకుండా చేసిన అనంతరం పాసు బుక్కులు అందజేయాలని తెలిపారు. 1971లోని భూ సంస్కరణ చట్టాలను బేస్ చేసుకుని ప్రజలకు, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నూతన చట్టాలను రూపొందించాలని తెలిపారు. నల్సార్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.మల్లికార్జున్ మాట్లాడుతూ భూ సంస్కరణల్లో పట్వారీ సిస్టం చాలా పాతదనీ, చాలా ఖచ్చితమైనదనీ, ఈ పద్ధతిలో చిన్న చిన్న పొరపాట్లు తప్ప ఇబ్బందులు ఎక్కువగా ఉండేవి కావని తెలిపారు. నూతన చట్టాలను రూపొందించేప్పుడు గతంలో జరిగిన తప్పులను సవరిస్తూ సర్వే డిపార్టుమెంటు వారి సహకారం తీసుకుంటూ రికార్డులను తప్పుల్లేకుండా సవరించి వాటి ద్వారా కొత్త చట్టాలను రూపొందించాలని అభిప్రాయపడ్డారు. రెవెన్యూ ట్రిబ్యులనల్స్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ రవీంద్రబాబు తన అభిప్రాయాన్ని తెలియజేస్తూ.. గ్రామ స్థాయిలో ఐఆర్‌ఓ వ్యవస్థ తప్పనిసరిగా ఉండాలనీ, గ్రామాల్లో జరిగే చిన్న చిన్న భూ సమస్యలను వీఆర్‌ఓలు తహశీల్దార్ల దష్టికి తీసుకొచ్చి పరిష్కరిస్తారని తెలిపారు. మ్యూటేషన్ తప్పనిసరిగా చేయాలన్నారు. నల్సార్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.అశ్విన్‌కుమార్ మాట్లాడుతూ చట్టాలను రూపొందించేప్పుడు స్పష్టమైన ఆదేశాలను పొందుపర్చాలన్నారు. చట్టం తయారు చేసే వారికి చట్టం అమలు చేసే వారికి గ్యాప్ రాకుండా ఉండాలన్నారు. ఎవరి కోసం చట్టాలు రూపొందిస్తున్నామో, వారికి ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. భూ తగాదాలు కోర్టులలో పరిష్కారానికి చాలా కాలం పడుతుందనీ, భూ సంస్కరణలకు సంబంధించి ట్రిబ్యునల్ ఏర్పాటు చేయానీ, ఇందులో జడ్జి, రెవెన్యూ ఉన్నతాధికారులను కమిటీలుగా ఏర్పాటు చేయాలన్నారు. గ్రామ స్థాయిలలో ఉచితంగా సలహాలు, సూచనలు అందించేందుకు కస్టమర్ కేర్ సర్వీసును ఏర్పాటు చేయాలని సూచించారు. వీరే కాకుండా ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు, పాల్గొని వారి వారి సలహాలను సూచనలను కలెక్టర్‌కు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో హరిప్రియ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రామ్మోహన్, ఆర్డీఓలు, తహశీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌కు మద్దతుగా మహిళా కార్పొరేటర్లు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మహిళల పట్ల చేసిన వ్యాఖ్యలను, వెనక్కి తీసుకుంటూ బహిరంగ క్షమాపణ చెప్పడం జరిగింది. తర్వాత కూడా, మహిళా కమిషన్ ఇచ్చిన నోటీసుకు వ్యవస్థను గౌరవించి, ఇదే విషయం మహిళా కమిషన్ ఎదుట వివరించడానికి వచ్చిన కేటీఆర్‌ని, కాంగ్రెస్ పార్టీ రాజకీయ కుట్రలో భాగంగా మహిళలను పంపించి అడ్డుకున్నారని.. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కి మద్దతుగా.. బీఆర్‌ఎస్ మహిళా కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలతో కలిసి, వివేకానంద నగర డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ శాసనసభ్యులు సబితఇంద్రరెడ్డి, సునీత లక్ష్మారెడ్డి, శాసనమండలి సభ్యులు సత్యవతి రాథోడ్ పార్టీ మహిళ కార్పొరేటర్లు మహిళా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయి..

● కేపీహెచ్‌బీ ఎస్‌ఐ లింగయ్య



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

క్రీడలు మానసిక ఉత్తేజంతో పాటు, శారీరక దారుఢ్య పరంగా బలంగా ఉండేందుకు సైతం ఉపయోగపడుతాయని కేపీహెచ్‌బీ ఎస్.ఐ లింగయ్య అన్నారు. 78వ జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జేఎన్‌టీయూహెచ్ విశ్వ విద్యాలయం మైదానంలో జేఎన్‌టీయూహెచ్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో... శనివారం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన జట్లకు బహుమతులను అందజేశారు. ఈ సంధర్బంగా లింగయ్య మాట్లాడుతూ క్రీడల ద్వారా విద్యార్థుల మానసిక స్థైర్యం బలపడుతుందన్నారు. విద్యార్థులతో క్రీడల ద్వారా ఐకమత్యాన్ని పెంపోందించే ప్రయత్నం చేస్తూ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించిన జేఎన్‌టీయూహెచ్ ప్రొజెక్షన్ ఫోర్స్ బృందానికి అభినందనలు తెలిపారు. ఆనాడు స్వాతంత్ర్య సమరయోధులతో ఆనాటి పరిస్థితులకనుగుణంగా దేశం కోసం ప్రాణాలనర్పించి దేశభక్తిని చాటేవారని, ఇప్పుడున్న పరిస్థితులకనుగుణంగా నేటి యువత, విద్యార్థులు, వారి మేధస్సును భవిష్యత్తు తారాల కోసం ఉపయోగ పడే విధంగా సమాజంలోని సమస్యల పరిషాణానికి నూతన ఆవిష్కరణలకు వినియోగించాలని పిలుపినిచ్చారు. ఈ కార్యక్రమంతో ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్.దిలీప్,డాక్టర్ అశోక్, జేఎన్‌టీయూహెచ్ ప్రొటెక్షన్ ఫోర్స్ నాయకులు రాహుల్ నాయక్, చంద్రశేఖర్ పటేల్, రంజిత్ యాదవ్, పిల్లి సిద్ధార్థ, బ్రహ్మం కుమార్ రెడ్డి,

ఉపాధ్యాయురాలు మాధవి జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

చేయూత ఫౌండేషన్ చైర్మెన్ ప్రముఖ కవి మానస టూల్ టెక్ అధినేత వాకిటి రామ్ రెడ్డి ఆధ్వర్యంలో .. రంగారెడ్డినగర్ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం ఉపాధ్యాయురాలు మాధవి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ ఉపాధ్యాయులు మార్గదర్శకులని, సమాజ నిర్దేశకులని గురువులను గౌరవించడం అదృష్టం అని కొనియాడారు.అనంతరం ఉపాధ్యాయురాలు మాధవితో కేక్ కట్ చేయించి, శాలువతో ఘనంగా సన్మానించి, మొక్కను బహుకరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులకు బిస్కిట్లు, చాక్లెట్స్ పంపిణీ చేశారు. ఉపాధ్యాయురాలు మాధవి మాట్లడుతూ చిన్నారి పిల్లల మధ్య,చేయూత ఫౌండేషన్ ప్రతినిధులు నా జన్మదిన వేడుకలు జరుపడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నానని, మరింత రెట్టింపు ఉత్సాహంతో విద్యార్థులకు ఉత్తమ విద్యనందించి ప్రయివేటు పాఠశాల విద్యార్థులకు దీటుగా మా విద్యార్థులను తిర్చిదిద్దుతామని పేర్కొన్నారు. చేయూత ఫౌండేషన్ ప్రతినిధి వాకిటి రామ్ రెడ్డికి కృత్జతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కల్పన రెడ్డి, కుమార్, శాంతి, విశ్రాంతి ప్రధానోపాధ్యాయులు మోహన్ రెడ్డి తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

వివేకానంద విద్యా మందిర్ పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజక వర్గం, 130 డివిజన్ పరిధిలోని 'వివేకానంద విద్యా మందిర్ హై స్కూల్ " కేటన్ ష్లే స్కూల్ " లలో శనివారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు ఉత్సాహంగా చిన్ని కృష్ణులు, సత్యభామ, ముద్దులొలికే గోపికమ్మల వేషధారణలో వచ్చి చేసిన అల్లరి చేష్టలు, నృత్యాలు, పాటలు, ఉట్టి కొట్టే విధానం చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మండవ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కృష్ణ భగవానుడు మనకిచ్చిన సందేశం కర్మ యోగము , భక్తి యోగము, జ్ఞాన యోగము అనే భగవద్గీత మానవాళికి ఎంతగానో ఉపయోగ పడుతుందని, దానిని మనం తప్పక ఆచరించాలని సూచించారు. కృష్ణుడు చేసిన అల్లరి చేష్టలు మన బాల్యదశలో అందరం చేసాము అని గుర్తు చేశారు. పిల్లల కళా నైపుణ్యాలను అభినందించారు. రానున్న రోజుల్లో విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో కరెస్పాండెంట్ సునీత, వైస్ ప్రిన్సిపల్ లత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ లలో..

టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లలో చిన్నారులు శనివారం శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను కన్నుల పండుగ నిర్వహించారు. ఎస్ ఆర్ నాయక్ నగర్ లోని "సత్యవాణి విద్యా నికేతన్" , అపురూప కాలనీలోని 'టీవీఆర్ మోడల్ హై స్కూల్ 'లలో టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ మేనేజింగ్ డైరెక్టర్ టి. వంశీకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో.. ఈ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎల్కేజీ, యూకేజీ, నర్సరీ చిన్నారులు పాల్గొన్నారు.

ముద్దులొలికే బాలకృష్ణుడు, చిన్ని కృష్ణుడు, గోపికమ్మల వేషధారణలో చేసిన అల్లరి చేష్టలు అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఉట్టికొట్టే కార్యక్రమంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రేమానురాగాలకు ప్రతిరూపుడైనా అవతార పురుషుడు శ్రీకృష్ణుడికి బాల్యం నుండి స్నేహమంటే మితిమీరిన ప్రేమ, స్నేహితులతో అల్లరి చిలిపి పనులతో అందరి మనసులు దోచుకోవడం, దైవాంశ సంభూతుడైన శ్రీ విష్ణువు మరో అవతారం శ్రీకృష్ణుడు అలాంటి దేవుడు కృష్ణుడి రూపంలో జన్మించి లోక కళ్యాణార్థం తాను చేసిన లీలను విద్యార్థులకు, ఉపాధ్యాయులు తెలియపరుస్తూ... వేడుకల్ని ఘనంగా జరుపుకున్నారు. టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ మేనేజింగ్ డైరెక్టర్ టి.వంశీకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. హిందూ సంప్రదాయాలను మరువకుండా విద్యార్థులకు గుర్తు చేసినందుకే ఇలాటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మెన్ టి.కోటి రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ సూర రవిచంద్ర రెడ్డిలు 'శ్రీ కృష్ణాష్టమి' శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కృషి హై స్కూల్‌లో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు..



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సూరారంలోని 'కృషి హై స్కూల్ 'లో శనివారం శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు చిన్ని కృష్ణులు, ముద్దులొలికే గోపికమ్మల వేషధారణలో వచ్చి చేసిన అల్లరి చేష్టలు అందరినీ ఎంతగానో అలరించారు. ఈ సందర్భాన్ని పురస్కరించు కొని ఉట్టికొట్టే కార్యక్రమం చేపటారు. ఈ ఉట్టికొట్టే కార్యక్రమంలో చిన్ని కృష్ణుల గోపికలు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ శ్యామ్ కుమార్ చిన్నారుల కళా నైపుణ్యాలను అభినందించారు. రానున్న రోజుల్లో విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరుకున్నారు. విద్యార్థులకు శ్రీకృష్ణుని యొక్క గొప్పతనాన్ని వివరించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు, పిల్లలు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



కోర్టు ఆదేశాలతో భవనం కూల్చివేత

● భవనాన్ని కూల్చివేసిన జీహెచ్‌ఎంసీ బృందం
● మాకు అన్యాయం జరిగిందని బాధితులు ఆక్రందనాలు
● మాకు న్యాయం జరిగింది : స్థలం యజమాని



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

తమ స్థలాన్ని ఆక్రమించారని ఒక వ్యక్తి కోర్టును ఆశ్రయించడంతో శనివారం జీహెచ్‌ఎంసీ అధికారులు ఆ నిర్మాణాన్ని కూల్చివేసిన సంఘటన సూరారం కాలనీలో చోటు చేసుకుంది. సూరారం కాలనీలో ఇంటి నెంబర్ 5-232 ఇంటి ఓనర్ నుంచి 2010లో నేరుగా విక్రయించామని, అయితే ఆ స్థలం ఓ వ్యక్తి తనదంటూ కోర్టును ఆశ్రయించడంతో కోర్టు విచారణ చేపట్టిన తర్వాత ఇంటిని అక్రమంగా నిర్మించారని కూల్చివేయాలని ఉత్తర్వులు జారీ చేయడంతో శనివారం జీహెచ్‌ఎంసీ బృందం ఆ ఇంటిని కూల్చివేశారు.

ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ 2010లో ఇంటి లబ్దిదారుల నుంచి కొనుగోలు చేశామని, తమ వద్ద ఇంటికి సంబంధించిన అన్ని దస్తావేజులు ఉన్నాయని కోర్టును ఆశ్రయించిన వ్యక్తి తప్పుడు దస్తావేదులతో కోర్టును మోసం చేశాడని ఆరోపించారు. జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ ఓ అధికారి తమకు న్యాయం చేశానని మాయ మాటలు చెప్పి తమతో బాండ్ పేపర్ పైన సంతకాలు చేయించుకొని దానిపై తప్పుడు రాతలు రాసి కోర్టుకు సమర్పించి మాకు అన్యాయం చేశారని వాపోయారు. మాకు ఇంటిని అమ్మిన వ్యక్తి 1995లో చనిపోగా.. కోర్టును ఆశ్రయించిన వారు చనిపోయిన వ్యక్తితో రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్టుగా తప్పుడు దస్తావేదులు కోర్టుకు సమర్పించారని బాధితులు ఆరోపించారు. జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారిపై చర్యలు తీసుకోవాలని తమకు న్యాయం చేయాలని కోరారు.

మాకు న్యాయం జరిగింది... కోర్టు ఉత్తర్వులతో మాకు న్యాయం జరిగిందని స్థలం యజమాని హరికృష్ణ ఆనందం వ్యక్తం చేశారు. సూరారం కాలనీలోని ఓం జెండా సమీపంలో ఇంటి నెం. 5-246 లోని తమ స్థలంలో మేకలు కట్టేసుకుంటాం... తాము చాలా బీదవాళ్లం అని ఇద్దరు వ్యక్తులు తన నాన్నకి చెప్పడంతో నాయన దయ గుణంతో అద్దె కూడా తీసుకోకుండా మేకలు కట్టేసుకోవడానికి అనుమతించాడు. అదే అదునుగా ఏండ్ల తరబడి కట్టేసుకుంటూ... సొంత స్థలంలా ఏండ్ల తరబడి వారి ఆధీనంలో ఉంచుకొని మాకు ఇవ్వకుండా ముప్పుతిప్పలకు గురి చేశారు. పైగా ఇంటి నంబర్ మార్చి అదే స్థలంలో అక్రమ భవనాన్ని చేపట్టారు. దీనిపై కోర్టును ఆశ్రయించడంతో తమకు న్యాయం చేసిందన్నారు.

1999 బ్యాచ్ సిల్వర్ జూబ్లీ వేడుకలు...



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

చరిత్రాత్మక హెచ్ఎంటీ వాకో హై స్కూల్ 1999 బ్యాచ్ విద్యార్థులు సిల్వర్ జుబిలీ వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఇది వారు పట్టా పొందిన 25 సంవత్సరాల తర్వాత జరుపుకునే ఈ ప్రత్యేక సందర్భం.. 70 మంది పూర్వ విద్యార్థులు హాజరైన.. ఈ పునర్మిళను వాక్సన్ ఇంటర్నేషనల్ స్కూల్ క్యాంపస్‌లో నిర్వహించారు. ఇది హెచ్ఎంటీ వాకో హై స్కూల్‌తో ఎటువంటి సంబంధం లేకపోయినా.. ఈ ప్రదేశం ప్రత్యేకంగా గుర్తు చేసుకోవడానికి ఎంపిక చేసుకున్నారు. హెచ్ఎంటీ వాకో హై స్కూల్ విద్యార్థులుగా ఉన్న రోజులకి గౌరవార్పణగా.. సంప్రదాయ పాఠశాల అసెంబ్లీతో ప్రారంభమయ్యాయి. విద్యార్థుల జీవితాల్లో కీలక పాత్ర పోషించిన 20 మందికి పైగా పూర్వ గురువులు ఈ వేడుకకు హాజరయ్యారు. ఈ సందర్భాన్ని మరింత ప్రత్యేకంగా మార్చారు. పూర్వ విద్యార్థులు తమ పూర్వోపాధ్యాయులతో మళ్లీ కలుసుకుని, తమ పాఠశాల జ్ఞాపకాలను తిరిగి గుర్తు చేసుకుంటూ.. భావోద్వేగానికి లోనయ్యారు. తరువాత, విద్యార్థులు తమ పూర్వోపాధ్యాయులను సత్కరించి, పాఠశాల రోజులలో పొందిన విలువైన మార్గదర్శకత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రతిఒక్క విద్యార్థి, టీచర్‌కు గ్రూప్ ఫోటో మెమోంటోను అందజేశారు. గురువులు పాత స్నేహాలను పునరుద్ధరించుకుంటూ, తమ హెచ్ఎంటీ వాకో హై స్కూల్ కాలాన్ని గుర్తు చేసుకున్నారు. సిల్వర్ జుబిలీ వేడుకలు విజయవంతంగా ముగిశాయి. ఈ పాఠశాలలో ఉన్న సమయంలో ఏర్పడిన బంధాలు, విద్యార్థుల జీవితాలపై దీర్ఘకాలంగా ప్రభావం చూపిన సాంఘిక విలువలను ఆవిష్కరించాయి.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

● పాపిరెడ్డి నగర్ బస్తీ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ బస్తీలోని శ్రీశ్రీశ్రీ వీరాంజనేయ శివాలయములో, శనివారం మల్లారెడ్డి నారాయణ ఆస్పత్రిల సౌజన్యంతో నిర్వహించిన, ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరానికి బస్తీ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన పలు చికిత్సలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మల్లారెడ్డి ఆస్పత్రి నిర్వాహకులు వాడవాడలా ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. పేదలకు అన్ని రకాల పరీక్షలను నిర్వహించి, మందులను ఉచితంగా అందజేస్తూ సహకరించడం పట్ల అభినందించారు. ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ముఖ్యంగా సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉంటూ.. రోగాలను దరిచేరకుండా చూసుకోవాలన్నారు. పిల్లలకు ఎలాంటి రోగాలు వ్యాపించిన తక్షణమే వైద్యుల సలహాల మేరకు చికిత్సలు నిర్వహించుకొని సకాలంలో మందులు వేసుకుంటూ రోగాలను నివారించుకోవాలని చంద్రారెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి డాక్టర్లు నిహారిక, శ్రేయ నర్సులు సునీత, లావణ్య వైద్య శిబిరం ఆర్గనైజర్ ఓబుల్ రెడ్డి, ఫార్మసిస్ట్ దేవదాస్‌తోపాటుగా బస్తీ ప్రధాన కార్యదర్శి భగవంత రెడ్డి కోశాధికారి నరసింహులు ముదిరాజ్ సీనియర్ నాయకులు అనంతరాములు, కిరణ్ కుమార్, దామోదర్ రెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

'దీక్ష స్కూల్ 'లో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సూరారంలోని 'దీక్ష స్కూల్ ' లో శనివారం శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు చిన్ని కృష్ణులు, ముద్దులొలికే గోపికమ్మల వేషధారణలో వచ్చి చేసిన అల్లరి చేష్టలు అందరినీ ఎంతగానో అలరించారు.ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఉట్టికొట్టే కార్యక్రమం చేపట్టారు.ఈ ఉట్టికొట్టే కార్యక్రమంలో చిన్ని కృష్ణులు, గోపికలు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. అనంతరం పిల్లల కలా నైపుణ్యాలను ఉపాధ్యాయులు అభినందించారు. రానున్న రోజుల్లో విద్యార్థులు ఉన్నంత స్థాయికి చేరుకోవాలని పాఠశాల డైరెక్టర్ పి శివయ్య కోరారు.ఈ సందర్భంగా పాఠశాల వైస్ ప్రిన్సిపల్ వీరేశం మాట్లాడుతూ... జీవితాన్ని సత్యం, ధర్మం, శాంతి, ఆనందంతో గడపాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు శ్రీకృష్ణుని యొక్క గొప్పతనాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు, పిల్లలు తల్లిదండ్రులు పాల్గొని విజయవంతం చేశారు.

తహసీల్దారు, ఆర్.ఐ డబ్బులు తీసుకున్నారని వచ్చిన కథనాలలో ఎలాంటి వాస్తవం లేదు..

● అధికారులు

నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం, బాలనగర్ మండల పరిధిలోని తహసీల్దారు, ఆర్.ఐ బోర్ బండి విషయంలో డబ్బులు తీసుకున్నారని జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని ఆర్‌ఐ, అధికారులు తెలిపారు. ఆర్‌ఐ మాట్లాడుతూ తహసీల్దారు ఆదేశాల మేరకు తాను హస్మతపేటలో ఎఫ్‌ఎల్లో ఉన్న ఇండ్లకు నోటీ సులు జారీచేయడంలో నిమగ్నమై ఉండగా, తహసీల్దారు నుంచి ఆదేశాలు మేరకు సిబ్బందిని పంపించి బోరు బండి పనులు నిలిపి వేయించాము. సిబ్బంది వెనక్కి వచ్చాక ఇంటి యజమాని తిరిగి బోరు పనులు మొదలుపెట్టాడనే సమాచారం రావడంతో ప్రత్యక్షంగా వెళ్లి బోరు పనులను నిలిపి వేసి అక్కడి నుంచి పంపించాను. ఇందులో డబ్బులు తీసుకున్నారనేది పూర్తిగా అవాస్తవం. నిజానిజాలు నిర్ధారణ చేసుకోకుండా ప్రచారం చేస్తూ పరువుకు భంగం కలిగించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అధికారులు బాలానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
ఆదివారం | ఆగస్టు 25, 2024 | www.navatelangana.com

వాటర్ బోర్డు కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు

నవతెలంగాణ-బంజారా హిల్స్

బంజారాహిల్స్ వాటర్ బోర్డు కార్యాలయంలో శనివారం వాటర్ బోర్డు నూతన ఈడీ మాయాంక్ అగర్వాల్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.వాటర్ బోర్డు కార్యాలయంలో రోజుకు ఎన్ని ట్యాంకర్ వెళుతున్నాయి. కన్స్యూమర్ డాటా ఉందా లేదా మేనేజర్ శివకుమార్ ని అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్‌లో, అలాగే ఆన్‌లైన్‌లో పక్క సమాచారం ఉంచాలన్నారు. అనంతరం సీజీఎం ప్రభు. జీఎం హరిశంకర్లను వాటర్ కెపాసిటీ ఎన్ని ప్రాంతాలకు ఎంత ఎంఎం రేంజ్‌లో సప్లై చేస్తున్నారు నూతనంగా ఎన్ని పైప్ లైన్లు వేశార.. సివరేజి సమస్యలు ఎందుకు ఉత్పన్నమవుతున్నాయి. ఇంత పెద్ద స్థాయిలో ఎందుకు ఫిర్యాదులు వస్తున్నాయి వాటిని పరిష్కరించడంలో ఎందుకు జాప్యం అవుతుందని ప్రశ్నించారు. అనంతరం రోడ్ నెంబర్ 12 లోని నూతనంగా చేసిన సివరేజీ పైప్‌లైన్ పనులను పరిశీలించారు. త్వరితగతన సమస్యలన్నిటిని పరిష్కరించి తనకు పూర్తి సమాచారాన్ని మాసం చివరికల్లా అందజేయాలని ఆదేశించారు.



ఇటీవల జాతీయ అవార్డు అందుకున్న జానీ మాస్టర్ ను తెలుగు యువత ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో తెలుగు యువత అధ్యక్షుడు ఉమ్మడి సతీష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దైవజ్ఞ శర్మ, డ్యాన్స్ మాస్టర్ గణేష్ లు హాజరై ఆయనను సన్మానించారు. తెలుగు డాన్స్ మాస్టర్ జానీ జాతీయస్థాయిలో గుర్తింపు పొందడం తెలుగు రాష్ట్రాలకు గర్వకారణం అని అన్నారు. తీవ్ర పోటీ కలిగిన చిత్రపరిశ్రమలోకి ప్రవేశించి ఎంతో శ్రమించి గుర్తింపు పొందడం అభినందనీయమని అన్నారు. జాతీయ అవార్డులు అందుకోవడం సంతోషాన్ని ఇచ్చిందని జానీ మాస్టర్ అన్నారు.
నవతెలంగాణ-బంజారాహిల్స్

వీసీల నియామకాల్లో జాప్యం..!

- అలసిపోయిన ఆశావహులు
- చివరికి వస్తేరాని, పోతే పోనీ అనే ధోరణి..!
- వర్సిటీలపై ప్రభుత్వం సవతి ప్రేమ చూపిస్తోందని విమర్శలు
- 17 మందితో జాబితా సిద్ధమైందా..?
- కొత్తగా స్కిల్ , స్పోర్ట్స్ యూనివర్సిటీలపై ప్రకటన



నవతెలంగాణ-ఓయూ

వారికి విశ్వవిద్యాలయలకు వైస్ చాన్స్‌లర్లు (వీసీ) అయ్యే అవకాశం ఉంది. ప్రయత్నం చేస్తే ఎదో ఒక యూనివర్సిటీ వీసీ పక్కా అంటు గత 5 నెలలుగా అవిశ్రాంతంగా పట్టు విడవని విక్రమార్కుడిలా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. వీసీ కావడం కోసం చేయని ప్రయత్నాలు, తొక్కని గడపలు, కలవని ప్రజా ప్రతినిధులు లేరంటే అతిశయోక్తి కాదు. అయితే రాష్ట్రంలో వీసీల నియామక విషయం ఒక కొలిక్కిరాకపోవడంతో.. తిరిగి తిరిగి యాష్టకు వచ్చిందని.. ఇక వస్తే రాని పోతే పోనీ అని వీసీ పోస్టుల కోసం దరఖాస్తు చేసుకున్న ఆశావహులు అలసిపోయి నిరాశతో నిస్పహలతో కొట్టుమిట్టాడుతున్న పరిస్థితి నెలకొంది. ఇక తిరుగుడు మానేసి ఫోన్ ద్వారా సంప్రదింపులు చేస్తున్నారని తెలిసింది.

ఇంత జాప్యం ఏలా ?

రాష్ట్ర ప్రభుత్వం ఈ సారి గత వీసీల పదవీకాలం ముగియ డానికి ముందే వీసీ లను ప్రకటిస్తామని, దానిలో భాగంగానే నాడు రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికలు ఉన్నా ఎన్నికల కమిషన్ నుంచి అనుమతి కూడా తీసుకున్నారు. కానీ నేడు కట్ చేసి చూస్తే ఎన్నికలు ముగిసి ఇన్ని రోజులు గడిచినా ఐఏఎస్ అధికారులను ఇన్‌చార్జ్ వీసీలుగా నియమించి చేతులు దులుపుకుంది. ఇప్పటి వరకు కనీసం సెర్చ్ కమిటీల డేట్స్ అయినా ప్రకటించకపోవడంతో ఇటు వర్సిటీలో అటు మేధావులు, విద్యావంతుల్లో తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. సీఎం అమెరికా పర్యటన అయ్యాక ఒక కొలిక్కి వస్తుందనుకున్నారు కానీ నేటికీ ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉంది. వీసీల నియామకం లో ఇంత జాప్యం ఎందుకు జరుగుతోందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఇదేనా ఉన్నత విద్యా రంగానికి ప్రజా ప్రభుత్వం ఇచ్చే ప్రాధాన్యత ? విద్యా శాఖ మంత్రి ఎక్కడ ? విశ్వవిద్యాలయలకు వీసీలు ఎక్కడ ? వర్సిటీలకు పాలక మండళ్లు ఏరి? అన్న చర్చ రాష్ట్రంలో మరింత జోరు అందుకుంది..

స్కిల్ , స్పోర్ట్స్ యూనివర్సిటీలు సరే ఉన్న యూనివర్సిటీల దుస్థితి ఏంటి ?

రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న అతి ప్రాచీన ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఇతర యూనివర్సిటీలకు అక్కడ కనీస కర్తవ్యంగా వీసీ లేకా, నిధులు ,నియామకాలు లేక ? కనీస సౌకర్యాలు కరువై అగమ్యగోచరంగా సమస్యలతో నిత్యం సావాసం చేస్తున్నాయి. వీటిని గాడిలో పెట్టేందుకు ప్రయత్నాలు చేయకుండా స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీలు అంటూ కాలయాపన ఎందుకు..? ఎన్నాళ్లు అని పలువురు మేధావులు ప్రశ్నిస్తున్నారు. ఓయూలో ఉన్న ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల, ఇంటర్ యూనివర్సిటీస్ టోర్నమెంట్, డిపార్ట్మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ స్విమింగ్ పూల్ నాడు ఎంతోమంది క్రీడాకారులను దేశానికి అందిస్తే నేడు ఆ విభాగాల్లో "జీరో" బడ్జెట్ దుస్థితి ఏర్పడిందని అక్కడ ప్రొఫెసర్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధిక లాబీయింగే జాప్యానికి కారణమా ?

ఇక రాష్ట్ర ప్రభుత్వం వీసీల ఆశావహుల నుంచి గల్లి నుంచి ఢిల్లీ స్థాయిలో లాబియింగ్‌తోనే వేచి చూసే ధోరణిలో ఉందని సమాచారం. వీసీ పదవుల కోసం యూనివర్సిటీల ప్రొఫెసర్లు పెట్టే పరుగులు... చేసే ప్రయత్నాలు చూసి వీరికి ఉన్న పదవి కాంక్షతోనే రాష్ట్ర ప్రభుత్వం ఇలా చేస్తోందని ఒక మాజీ వీసీ అన్నారు. ఏదైనా రాష్ట్ర ప్రభుత్వం కనీసం సెప్టెంబర్ 5 టీచర్స్ డే వరకైనా వీసీలను నియమిస్తారా..? లేక సాగాదిత ధోరణిలో ఉంటారా ? వేచి చూడాల్సిందే.

17 పేర్లతో జాబిత సిద్ధం..?

14 యూనివర్సిటీలకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మెన్, ఇద్దరు వైస్ చైర్మెన్ల నియామకం కోసం 17 పేర్లతో జాబితా సిద్ధంగా ఉన్నట్టు తెలుస్తోంది. సీఎం ఆమోదించడమొక్కటే మిగిలిందని ఆయన ఆమోదిస్తే ప్రకటించే అవకాశాలు ముమ్మరంగా ఉన్నట్టు తెలుస్తోంది. ఇక దానికి ముందే సెర్చ్ కమిటీలను భేటీ నామమాత్రంగా చేసి జాబిత విడుదలకు ప్రయత్నాలు చేస్తున్నారని సమాచారం

కారిడార్ నిర్మాణాలపై సుదీర్ఘ చర్చ..



- కంటోన్మెంట్ బోర్డు సమావేశం
- హాజరైన ఎంపీ, ఎమ్మెల్యే
- కారిడార్ నిర్మాణాలపై సుదీర్ఘ చర్చ..

నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ బోర్డు సమావేశం శనివారం సాఫీగా జరిగింది. బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ ప్రశాంత్ బజపాయ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎక్స్ అఫిషియో హోదాలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్, బోర్డు సీఈఓ మధుకర్ నాయక్, జాయింట్ సీఈఓ పల్లవి, బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకష్ణులు హెచ్ఎండీ అధికారులు పాల్గొని పలు అంశాలపై చర్చలు జరిపారు. ముఖ్యంగా చేపట్టనున్న కారిడార్ల గురించి సుదీర్ఘ చర్చ జరిపారు

జూబ్లీ బస్ స్టేషన్ నుంచి శామీర్‌పేట వరకు కడుతున్న ఫ్లైఓవర్, పారడైజ్ చౌరస్తా నుంచి మేడ్చల్ వరకు నిర్మాణం అవుతున్న ఫ్లై ఓవర్లపై సభ్యులు చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మొట్టమొదటిసారి రక్షణ రంగానికి సంబంధించిన భూమిని ఇచ్చి హైదరాబాద్ అభివద్ధికి తోడ్పాటు అందిస్తున్నదన్నారు. బీజేపీ అభివద్ధిని కాంక్షిస్తూనే ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడడం బాధ్యతగా తీసుకుందన్నారు. 30-40 ఏండ్లుగా 60-70 గజాల జాగాలో ఇల్లు కట్టుకొని ఉంటున్న పేదలకు రాష్ట్ర ప్రభుత్వపరంగా భూములు కంపన్సేట్ చేసి వాటన్నిటిని రెగ్యులరైజ్ చేయాలని అధికారులను ఆయన కోరారు. అలాగే కంటోన్మెంట్‌లో పనిచేసే కార్మికులు చాలా మంది 40-45 సంవత్సరాలకే చనిపోతున్నారని..ఐదు శాతం మందికి మాత్రమే కారుణ్య నియామకాలు చేపడుతున్నారని.. 100 శాతం చేపట్టాలని కోరారు. మురికి కాలువల, పార్కులు నిర్మాణంలో ప్రజలకు ఎక్కడా ఇబ్బంది కలగని పద్ధతిలో చేయాలని చెప్పారు. అంతకుముందు ఎమ్మెల్యే మాట్లాడుతూ అనేక అభివద్ధి పనులపై సుదీర్ఘ చర్చ జరిపారు. బోర్డుకు ఎన్నికల నిర్వహించాలని సూచించారు.

సంస్కృతి సాంప్రదాయాలకు పెద్దపీట వేయాలి



- ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ రామచంద్రు నాయక్
- కోలాహలంగా సాంస్కృతిక కార్యక్రమాలు

నవతెలంగాణ-ఓయూ

గిరిజన విద్యార్థులు సంస్కృతి సాంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ వాటి పరిరక్షణకు కృషి చేస్తూ వాటిని రానున్న భావి తరాలకు అందించాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ రామచంద్రు నాయక్ పిలుపునిచ్చారు. యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల వద్ద శనివారం తొమ్మిది రోజులుగా భక్తి శాతంతో జరుపుకున్న తీజ్ మొలకలను నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అంతకుముందు ప్రత్యేక పూజలు చేసి, భోగ్ బండర్ పూజ చేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రామ చంద్రు హాజరై మాట్లాడుతూ. గిరిజన విద్యార్థులు ఉన్నత విద్యలో రాణిస్తూ స్థిరపడాలని ఆశీర్వాదాలు అందజేశారు. అనంతరం వైరా ఎమ్మెల్యే రామ్ దాస్ నాయక్ మాట్లాడుతూ ఓయూ ఎస్సీ ఎస్టీ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి. మంగు నాయక్ ఆధ్వర్యంలో ఇంత ఘనంగా కోలాహలంగా సాంస్కృతి సంప్రదాయాలు పెద్దపీట వేస్తూ తీర్చు ఉత్సవాలు నిర్వహించడం అదర్శనీయం అన్నారు. గిరిజన విద్యార్థులు తమ మూలాలు మరవకుండా సంస్కృతికి పెద్దపేట వేస్తూ జీవితంలో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన ప్రొపెసర్స్ , ఉద్యోగులు ,విద్యార్థులు , సంస్కృత కార్యక్రమాల్లో సందడి చేశారు. ఈ నిమజ్జన కార్యక్రమంలో ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పప్పుల లక్ష్మీనారాయణ, ఓఎస్టీ రెడ్యానాయక్ , ఎస్సీ ఎస్టీ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి మంగు నాయక్ , ప్రధాన కార్య దర్శి ప్రో. శ్రీను నాయక్ , సూర్య ధనుంజయ్, విద్యార్థి నేత లు విజయచరణ్ , రమాదేవి , సుశీల , పద్మ ,డా. బాలు నాయక్, విద్యార్థి నాయకులు శరత్ నాయక్ , సుబ్బు నాయక్, అశోక్ నాయక్ ,సంతోష్ , డా.కరాటే రాజు పాల్గొన్నారు.

50 ఏండ్ల గోస నుంచి విముక్తి కల్పించాం



- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-బేగంపేట్

బేగంపేట నాలా అభివృద్ధి, నాలా వెంట బస్తీలలో డ్రయినేజీ, రోడ్ల నిర్మాణం చేపట్టి 50 సంవత్సరాల గోస నుంచి విముక్తి కల్పించామని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. నాలా వెంట ఉన్న వడ్డెర బస్తీ, బ్రాహ్మణ వాడి ప్రాంతాలు గతంలో ఎంతో అధ్వాన్నంగా ఉండేవని, వర్షాకాలంలో రోడ్లన్నీ నీటితో నిండిపోయి బయటకు వెళ్లలేని పరిస్థితులు ఉండేవని గుర్తు చేశారు.

శనివారం బేగంపేట డివిజన్ వడ్డెర బస్తీలో ఎమ్మెల్యే తన వ్యక్తిగత నిధులతో పునర్నిర్మించిన శ్రీ ఈదమ్మ ఎల్లమ్మ ఆలయ ప్రారంభోత్సవ, విగ్రహ ప్రతిష్ఠ పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. పూజల అనంతరం ఎమ్మెల్యేను నిర్వాహకులు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రజల కోరిక మేరకు ఈ ఆలయాన్ని పునర్నిర్మించడం జరిగిందని, కాలనీ ప్రజలు ఐక్యంగా ఉంటూ నిత్యం పూజలు నిర్వహిస్తూ అభివృద్ధి చేసుకోవాలని చెప్పారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కా రానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ టి.మహేశ్వరి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, నాయకులు శ్రీహరి, నరేందర్, శేఖర్, ఆరీఫ్, ఆలయ కమిటీ సభ్యులు స్వామి, నర్సింహ, యాదగిరి, సునీల్, రేణుక తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం ప్రజల విశ్వాసం కోల్పోయింది

- ఎల్‌జేడీ జాతీయ అధ్యక్షులు జావేద్ రాజా



నవతెలంగాణ - బంజారాహిల్స్

కేంద్ర ప్రభుత్వం ప్రజల విశ్వాసం కోల్పోయిందని అందుకే ఎన్నికల్లో వారనుకున్న నంబర్‌ను కూడా రీచ్ కాలేదని లోక్ తంత్ర జన దళ్ పార్టీ జాతీయ అధ్యక్షులు జావేద్ రాజా అన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎల్‌జేడీ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ఎం సంజయ్ ఆనంద్‌ను ఎన్నుకొని నియామక పత్రాన్ని అందజేసి మాట్లాడారు. గతంలో మాదిరిగా కేంద్ర ప్రభుత్వం పార్లమెంటు తలుపులు పెట్టి బిల్లులు పాస్ చేయడం అంత సులభం కాదని, ప్రస్తుతం ప్రతిపక్షం ప్రజల మద్దతు ఆ పార్టీకి లేవని అన్నారు. బీజేపీ ఎన్డీఏ కూటమి అన్న సంగతి మర్చిపోవద్దని సింగిల్‌గా ఆ పార్టీ ఏ రోజు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేదని అన్నారు. 400కు రీచ్ అవ్వడం ఇక ఓ కల అన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పరిపాలనలో అన్ని వర్గాలకు ఇచ్చిన హామీలకు కట్టుబడి పనిచేయాలని కోరారు.రాబోయే గ్రామీణ ప్రాంత ఎన్నికలైన గ్రామపంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేస్తుందని.. మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ జాతీయ అధ్యక్షులు శ్యాంపాల్, తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల కోఆర్డినేటర్ రత్నం, మహిళా నాయకురాలు యమ్మి మధ్యల, పల్లవి తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు పట్టించుకోని డిప్యూటీ మేయర్

- బీఆర్ఎస్ యూత్ వింగ్ అధ్యక్షుడు ఆలకుంట హరి

నవతెలంగాణ-ఓయూ

తార్నాక డివిజన్‌లో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి అసమర్థత కారణంగా సమస్యలు విలయతాండవం చేస్తున్నాయని బీఆర్ఎస్ యూత్ వింగ్ అధ్యక్షుడు ఆలకుంట హరి ఆరోపించారు. నవరాత్రులను దష్టిలో పెట్టుకుని పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ ఆదేశాలతో లాలాపేట్‌లో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్య నగర్, ఆర్య సమాజ్ వెనకవైపు ఉన్న బస్తీలో సుమారుగా నాలుగు నెలల క్రితం ఉన్న రోడ్డును తొలగించి నూతన రోడ్డు వేయకుండా కాలయాపన చేస్తుండడంతో స్థానిక ప్రజలు నిత్యం ప్రమాదాల బారిన పడుతూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సునీల్ ముదిరాజ్, బలరాం , ప్రదీప్ , నర్సింగ్, ప్రకాష్, దేవన్న పాల్గొన్నారు.

రజక కులాన్ని ఎస్సీ జాబితాలో చేర్చాలి

- డాక్టర్ గాలి వినోద్ కుమార్



నవతెలంగాణ-ఓయూ

రజక కులాన్ని షెడ్యూల్ కులాల్లో చేర్చాలని డిమాండ్ చేస్తున్న రజక రిజర్వేషన్ సమితి డిమాండ్‌ను తాను స్వాగతిస్తున్నానని దక్షిణ భారత రాజకీయ జేఏసీ చైర్మెన్ ప్రొఫెసర్ వినోద్ కుమార్ తెలిపారు. శనివారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక చేసిన విజ్ఞప్తి మేరకు ఆయన మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. దేశంలో 18 రాష్ట్రాల్లో ఎస్సీ జాబితాలో ఉన్న రజకులను తెలంగాణలో కూడా ఎస్సీ జాబితాలో చేర్చాలని కోరారు. అగ్రవర్ణాల నుండి ఎదుర్కొంటున్న కుల వివక్షతను దష్టిలో పెట్టుకొని వారిని ఎస్సీ జాబితాలో ఆయన డిమాండ్ చేశారు.

'29న యూనివర్సిటీల్లో డిమాండ్స్ డే'



నవతెలంగాణ-ఓయూ

ఆగస్టు 29న రాష్ట్ర వ్యాప్తంగా విశ్వవిద్యాలయ ఉద్యోగుల ఆధ్వర్యంలో చేపట్టిన డిమాండ్స్ డే విజయవంతం చేయాలని యూనివర్సిటీస్ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జ్ఞానేశ్వర్ కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలు, ఉద్యోగులు, ఎదుర్కొంటున్న పలు సమస్యలపై వెంటనే అన్ని విశ్వవిద్యా లయాల వీసీలను నియమించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, ఖాళీగా ఉన్న బోధన ,బోధనేతర ఖాళీలు భర్తీ చేయాలని, పాలక మండలిలో బోధనేతర ఉద్యోగులకు సభ్యులుగా అవకాశం కల్పించా లని కోరారు. టైం స్కేల్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఔట్సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా యూనివర్సిటీ ఉద్యోగులకు హెల్త్ కార్డ్స్ ఇవ్వాలన్నారు. రాష్ట్ర కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్లో 6 శాతం నిధులు ఉన్నత విద్యకు కేటాయించాలన్నారు. నాన్ టీచింగ్ అడ్మినిస్ట్రేషన్ పోస్టులో ప్రొఫెసర్లను నియమించరాదన్నారు. హెల్త్ సెంటర్‌లో పర్మినెంట్ వైద్యులను నియమించాలని కోరారు.

రాష్ట్రపతి నిలయం మార్గంలో కూలిన భారీ వక్షం

- తెగిన కరెంటు వైర్లు
- తక్షణమే స్పందించిన అధికారులు



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ పరిధిలోని బొల్లారం లోతుకుంట వయా రాష్ట్రపతి నిలయం మార్గంలో శనివారం మధ్యాహ్నం భారీ వక్షం ఈదురుగాలికి అకస్మాత్తుగా రోడ్డు మధ్యలో కుప్పకూలింది. దాంతో రెండు హై టెన్షన్ ఎలక్ట్రిక్ పోల్స్ పడిపోయి కరెంటు తీగలు రోడ్డుపై వేలాడుతుండగా సమాచారం అందుకున్న విద్యుత్ సిబ్బంది, డిజాస్టర్ ఎన్ఫోర్స్‌మెంట్ టీం తక్షణమే రంగంలోకి దిగి ఎవరికీ ఎలాంటి హానీ కలగకుండా చర్యలు చేపట్టారు. చెట్టు పడిపోవడంతో ఆ మార్గంలో తీవ్ర ట్రాఫిక్ జామ్ అయింది. దాంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

పేదింటి పిల్లల వివాహానికి సహాయ సహకారాలు అందిస్తా



- ఎమ్మెల్యే శ్రీ గణేష్

నవతెలంగాణ-కంటోన్మెంట్

సామాజిక బాధ్యతతో పేదింటి వారిని ఎంచుకొని సామూహిక వివాహాలు చేస్తున్న పబ్బ శ్రీనివాస్ వాసవి దంపతులు సమాజానికి ఆదర్శప్రాయులని ఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు. శనివారం పబ్బా శ్రీనివాస్ డైమండ్ పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని జరగబోయే సామూహిక వివాహాలకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తన వంతు నుంచి కూడా ఇలాంటి మంచి సహాయ కార్యక్రమాలకు ఉంటాయని అంతేకాకుండా ప్రభుత్వం తరపున షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి లాంటివి కూడా ప్రయత్నాలు చేస్తానని హామీ ఇచ్చారు.

అంతకుముందు నిర్వాహకుడు పబ్బ శ్రీనివాస్ మాట్లాడుతూ నవంబర్ డిసెంబర్ మాసాలలో 116 జంటలకు పెండ్లిలకు వేదికతో పాటు అన్ని ఏర్పాట్లు చేసి తమ సొంత ఖర్చుతో వివాహాలు జరిపించనున్నట్టు తెలిపారు. తాళిబొట్టు, బంగారం వివాహ వేదికతో పాటు భోజన సౌకర్యం కూడా కల్పించనున్నట్టు వెల్లడించారు. పేద ప్రజలకు సహాయం చేయాలన్న ముఖ్య ఉద్దేశంతో 116 జంటలకు వివాహాలు చేయనున్నట్టు తెలిపారు. ప్రస్తుత సమాజంలో నిరుపేద ప్రజలు పెండ్లీలకయ్యే ఖర్చును భరించలేక, ఆర్థిక స్థితి సరిగా లేని పరిస్థితి ఏర్పడిన నేపథ్యంలో ఇలాంటి సామాజిక దృక్పథంతో కూడుకున్న కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు దండుగల యాదగిరి, తేజ్ పాల్, సదానంద గౌడ్ , సంకి రవీందర్ తదితరుల పాల్గొన్నారు .

మట్టి గణపతి విగ్రహాల తయారీ సదస్సు





నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్‌లో ప్రభుత్వ బాలికల పాఠశాలలో శనివారం మట్టి గణపతి విగ్రహాల తయారీ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీజీపీసీబీ ప్రాజెక్ట్ ఆఫీసర్ కె. సత్తయ్య పాల్గొని వర్క్‌షాప్, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో తయారుచేసిన గణపతి విగ్రహాలను నిషేధించాలన్నారు. మట్టితో తయారు చేసన విగ్రహాలను వినియోగించడం వల్ల పర్యావరణానికి ఎలాంటి హానీ జరగదన్నారు. అదే ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన విగ్రహాలను చెరువుల్లో నిమజ్జనం చేస్తే నీటిలో ఉన్న ప్రాణులు చనిపోవడంతో పాటు నీరు కలుషితం అవుతుందన్నారు. వినాయకచవితికి ప్రతి ఒక్కరూ మట్టితో చేసిన గణపతులను వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రినిసాల్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడల్లో సత్తా చాటిన 'శ్రీ గంగోత్రి' విద్యార్థులు..



నవతెలంగాణ-బంజారాహిల్స్

ఎంజీ గాయత్రి స్పోర్ట్స్ చాంపియన్ షిప్‌లో దర్గాలోని శ్రీ గంగోత్రి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. నగర వ్యాప్తంగా 30 కి పైగా వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. అండర్ 16 కబడ్డీలో మొదటి స్థానం, అండర్ 14 కబడ్డీలో మొదటి స్థానం,అండర్ 12 కబడ్డీలో రెండో స్థానం, అండర్ 12 రన్నింగ్ రేస్‌లో ఏ.ప్రవీణ్ రెండో స్థానంలో పతకాలు సాధించినట్లు శనివారం పాఠశాల చైర్మెన్ సలికూటి సర్వేశ్వర్ రెడ్డి తెలిపారు. క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులను శనివారం పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ కన్నా నాయుడు, పీఈటీ రమేష్ ప్రత్యేకంగా అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో నగరంలోని వివిధ టోర్నమెంట్లలో జరిగిన క్రీడల్లో తమ పాఠశాల విద్యార్థులు 30 పైగా పతకాలు సాధించారని తెలిపారు.

కర్నాటక టూ హైదరాబాద్..

- కాలం చెల్లిన పాల పౌడర్ సరఫరా
- రూ.11.5లక్షల విలువగల 5280 కిలోలు స్వాధీనం



నవతెలంగాణ-సిటీబ్యూరో

కర్నాటకా రాష్ట్రానికి చెందిన కాలం చెల్లిన పాల పొడిని విక్రయిస్తున్న నిందితుడిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. శనివారం టాస్క్‌ఫోర్స్ డీసీపీ సుధీంద్ర తెలిపిన వివరాల మేరకు సికింద్రా బాద్‌లోని బోలక్‌పూర్‌కు చెందిన సీ. దామోదర్ పాలవ్యాపారం చేస్తున్నాడు. తర్నాకాలోని విజయ్‌పురి కాలనీలో గోదాంను ఏర్పాటు చేసుకున్నాడు. సులువుగా డబ్బులు సంపాదించాలని పథకం వేశాడు. ఈ క్రమంలో కర్నాటక రాష్ట్రంలోని పాఠశాలల విద్యార్థుల కోసం కర్నాటక రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'క్షీర భాగ్య పథకం'లో భాగంగా పాల పౌడర్‌ను ఉచితంగా సరఫరా చేస్తున్న విషయాన్ని తెలుసు కున్నాడు. (ఎక్స్‌పైర్ అయిన) కాలం చెల్లిన పాల పొడిని అక్రమంగా కొనుగోలు చేసి నగరంలో విక్రయించి డబ్బులు సంపాదించాలని నిర్ణయించు కున్నాడు. ఈ క్రమంలో సోలాపూర్‌కు చెందిన రవి కిరణ్ అనే వ్యాపారి నుంచి కిలో పాలపౌడర్ ప్యాకెట్‌ను రూ.180కొనుగోలు చేస్తున్నాడు. ఆ తర్వాత ఎవరికి అనుమానం రాకుండా కొనుగోలు చేసిన పాలపౌడర్‌లో పన్నీర్, స్వీట్ కలిపి ఫుట్‌పాత్‌ల పైవ్యాపారం చేసేవారికి, టీ దుకాణాలతో పాటు కావాల్సిన వారికి రూ.210కి విక్రయిస్తు న్నాడు. సమాచారం అందుకున్న ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులతోపాటు జీహెచ్‌ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారులు సంయుక్తంగా గోదాంపై దాడి చేశారు. నిందితుని నుంచి రూ.11.5లక్షల విలువగల 5280 కిలోల పాల పొడిని స్వాధీనం చేసుకున్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

- గెలుపోటములు సహజంగా తీసుకోవాలి
- టెక్స్ బుక్స్ బాగా చదవాలి
- ఉపాధ్యాయులు చదువులో వెనుకబడిన పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- బాపూజీ నగర్ ప్రభుత్వ గిరిజన వాటర్ స్పోర్ట్స్ అకాడమీ వసతి గృహంను ఆకస్మికంగా తనిఖీ
- జిల్లా కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టి



నవతెలంగాణ సిటీబ్యూరో

చదువుతో పాటు క్రీడాల్లో రాణించి రాష్ట్రానికి బాగా పేరు తీసుకొని రావాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి విద్యార్థులను కోరారు. శనివారం సికింద్రాబాద్ తిరుమలగిరి మండలం బోయిన్ పల్లి బాపూజీనగర్ ప్రభుత్వ గిరిజన గిరిజన వాటర్ స్పోర్ట్స్ అకాడమీ వసతి గృహంను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలోని వంటగది, స్టోర్ రూమ్, కంప్యూటర్ ల్యాబ్, పిల్లల విశ్రాంతి గదులను హాజరు రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్ స్టాక్ నిల్వలు పరిశీలించారు. వంటగదిని పరిశీలించి పిల్లలకు సన్న బియ్యంతో పెడుతున్నారని అడిగి తెలుసుకున్నారు. అనంతరం 5వ తరగతి గదిని సందర్శించి విద్యార్థులతో ఇంగ్లీష్, తెలుగు పాఠ్య పుస్తకాలు చదివించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్య అత్యంత శక్తివంతమైన ఆయుధమని దానికి ప్రపంచాన్ని మార్చే శక్తి ఉందని విద్యార్థులు బాగా చదివి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో ఆల్ రౌండ్ ఛాంపియన్‌గా రాణించి రాష్ట్రానికి గర్వకారణం కావాలన్నారు. విద్యార్థులు తమకు అర్థమయ్యేంత వరకు ఉపాధ్యాయుల ను అడిగి తెలుసుకోవాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారు విద్యలో రాణించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఆర్.కోటాజి, సికింద్రాబాద్ ఆర్డీవో దశరథ్ సింగ్, వసతి సంక్షేమ అధికారి ఎం నీలిమ, తహసిల్దార్ ఎస్ అశోక్ కుమార్, హెడ్మాస్టర్ అనిత తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి చిత్రిక పట్టేది రచయితలే



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

సమాజ సంస్కరణ, సమస్యల చిత్రణ రచయితల బాధ్యత అని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ అన్నారు. శనివారం తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో డా.దేవులపల్లి రామానుజరావు 107వ జయంతి సందర్భం గా ప్రముఖ కవి డాక్టర్ సీతారాంకు దేవులపల్లి రామానుజరావు సాహితీ పురస్కారాన్ని ప్రదానం చేశారు. పరిషత్తు ప్రాంగణంలోని దేవులపల్లి రామాను జరావు కళామందిరంలో జరిగిన ఉత్సవంలో జస్టిస్ లక్ష్మణ్ పరిషత్ అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డితో కలిసి సీతారామ్‌ను రూ.25 వేల నగదు, జ్ఞాపిక, శాలువా, ప్రశంసాపత్రంతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జస్టిస్ లక్ష్మణ్ మాట్లాడుతూ 80 సం.గా సారస్వత పరిషత్తు తెలుగు భాషా సంస్కృ తుల పరిరక్షణకు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. పరిషత్తు అభ్యుదయంలో లోకనంది శంకర నారాయణరావు, సురవరం ప్రతాపరెడ్డి,దేవులపల్లి రామానుజరావు, డాక్టర్ సి.నారాయణరెడ్డి వంటి పెద్దల కృషి ఎంతో ఉందని అన్నారు. పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షోపన్యాసం చేస్తూ సారస్వత పరిషత్తు కృషి వెనుక డాక్టర్ దేవులపల్లి రామానుజరావు, డాక్టర్ సి నారాయణ రెడ్డి కృషి కీలకమని తెలిపారు. రామానుజ రావు ప్రతాపరెడ్డి వంటి పెద్దల మంచి స్ఫూర్తి పొంది తెలుగు భాష కోసం సాహిత్యం కోసమే తమ జీవితాన్ని ధారవోశారని శివా రెడ్డి వివరించారు. పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె. చెన్నయ్య స్వాగతో పన్యాసం చేస్తూ 50 సం. పాటు వివిధ హోదాల్లో సారస్వత పరిషత్తుకు సేవ చేస్తూనే ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ కార్యదర్శిగా, అధ్యక్షునిగా, రచయితగా, కవిగా, విమర్శకునిగా, పరిశోధకునిగా రామానుజ రావు బహుముఖీనమైన సేవలు అందించారని తెలిపారు. రామానుజరావు అల్లుడు, పరిషత్తు కోశాధికారి మంత్రి రామారావు మాట్లాడుతూ రామానుజరావు ఏ స్థాయిలో ఉన్నా క్రమశిక్షణ, సమయపాలన, నిస్వార్థ సేవా గుణం అనుసరించారని తెలిపారు. పురస్కార స్వీకర్త డాక్టర్ సీతారాం తమ స్పందన ప్రసంగం చేశారు.

జిల్లాలోని పాఠశాలల్లో ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం



నవతెలంగాణ-సిటీబ్యూరో

జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా శుక్రవారం చార్మినార్ మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల సుల్తాన్ షాహిలో ప్రధానోపాధ్యాయులు పి.వి. నర్సా రాజు సమక్షంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోస్టర్ పెయింటింగ్ , వ్యాసరచన , క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి సి. ధర్మేందర్ రావ్, ప్రాథమిక పాఠశాల మిర్జంలా ప్రధానోపాధ్యాయులు మొహమ్మద్ యూసఫ్, ఇస్రో రిటైర్డ్ సైంటిస్ట్ జి.వి.రమణ, నవం ఫౌండేషన్, ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రావణ్ కుమార్, స్కూల్ అసిస్టెంట్‌లు పుట్టి రాజు, తుకారాం, అర్స హిందీ పండిత్ రజిని సుందరం, పీడీ రాజేందర్, జూనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీట్ ధ సైంటిస్ట్ జి.వి. రమణ విద్యార్థులకు ఉపగ్రహాలపై పూర్తి అవగాహన కల్పించారు. డీఎస్‌వో ధర్మేందర్ రావ్ మాట్లాడుతూ విద్యార్థులు పెయింటింగ్, వ్యాసరచన, క్విజ్ పోటీలలో చురుగ్గా పాల్గొన్నారని, జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలు జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారన్నారు.

రికార్డ్ స్థాయిలో సభ్యత్వాన్ని నమోదు చేయించాలి



నవతెలంగాణ-అంబర్‌పేట

ప్రతి బూత్ నుండి భారీగా సభ్యత్వాలను నమోదు చేయించాలని భారతీయ జనతా పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డా. ఎన్. గౌతమ్‌రావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అనంతరం బీజేపీ నగర కార్యాలయంలో గౌతమ్ రావు అధ్యక్షతన నిర్వహించిన 'జిల్లా సభ్యత్వ వర్క్ షాప్' కార్యక్రమానికి రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గౌతమ్‌రావు మాట్లాడుతూ హైదరాబాద్ సెంట్రల్ జిల్లాలో రికార్డ్ స్థాయిలో సభ్యత్వాలను చేయించి రాష్ట్ర పార్టీ నుండి ప్రశంసలు అందుకునే విధంగా పనిచేయాలని గౌతమ్ రావు సూచించారు. సెప్టెంబర్ 1న ప్రధానమంత్రి నరేంద్రమోడీ బీజేపీ సభ్యత్వాన్ని ప్రారంభిస్తారని, 4న జిల్లాలలో, 5న డివిజన్లలో ప్రారంభిస్తారని గౌతమ్ రావు అన్నారు. కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూనే బీజేపీని బలోపేతం చేయాలని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం మంచి వాతావరణం ఉందని, ఈ వాతావరణాన్ని సద్వినియోగం చేసుకోని ప్రతి ఒక్కరితో సభ్యత్వాన్ని చేయించాలని గౌతమ్ రావు కోరారు. ప్రతి బూత్‌లో 200 మందికి తగ్గకుండా సభ్యత్వాన్ని చేయించాలని గౌతమ్ రావు తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర సంఘటన మంత్రి చంద్రశేఖర్ మాట్లాడుతూ బీజేపీని బూత్ స్థాయి నుండి బలోపేతం చేయాలని ఆ దిశగా భారీ స్థాయిలో సభ్యత్వాలను నమోదు చేయాలని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి కృష్ణయాదవ్, మాజీ ఎమ్మెల్యే ప్రేమ్ సింగ్ రాథోడ్, కార్పొరేటర్లు అమృత, ఉమా రమేష్ యాదవ్, సందీప్ సాయి, కృష్ణగౌడ్, యశ్వంత్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నా ప్రాణానికి ముప్పు ఉంది

- ఎస్ఎస్‌కే సమాజ్ కార్యనిర్వాహక అధ్యక్షుడు నగరి లక్ష్మి నారాయణ్



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

తమ సమాజ్ సభ్యులు సమాజ్‌లో కోటి ముప్పై లక్షల నిధులను కాజేయడంతో ప్రజలు వారిని బహిష్కరించడంతో కక్షగట్టి తనపై పలుమార్లు హత్యా యత్నాలు జరిగాయని శ్రీ సోమవంశి సాహస్రార్జున్ క్షత్రీయ సమాజ్ కార్యనిర్వాహక అధ్యక్షుడు నగరి లక్ష్మి నారాయణ్ ఆరోపించారు. శనివారం ఆయన మాట్లాడుతూ తాను శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని తమ సమాజ్ ఎస్ఎస్‌కే భవన్‌లో పూజలు చేయడానికి వెళ్లితే మాజీ కార్యదర్శి కాటిగర్ శంకర్, మాజి కోశాధికారి శివ్ రతన్, విశ్వనాథ్ సుమన్, కాటిగర్ ధరంవీర్, గంభీర్ సురేష్‌లు బలవంతంగా కార్యాల యంలోకి చొరబడి తీవ్ర భయభ్రాంతులకు గురి చేసి తనపై దాడికి పూనుకు న్నారని తెలిపారు. దీంతో తన కాలు ఫ్యాక్చర్ అయ్యిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఎస్ఎస్‌కే సమాజ్‌కు అధ్యక్షుడిగా ఉన్న కాటిగర్ శంకర్ తమ సంఘం నిధులు లక్షలో కొలగొట్టాడని దానితో పాటు శివ్ రతన్ కూడ తమ సమాజ్ డబ్బులు కాజేరన్న ఆరోపణలతో ఈ విషయమై గత ఏప్రిల్ మాసంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో వీరిని తమ సమాజ్ ప్రజల సమక్షంలో తొలగించడం జరిగిందని తెలిపారు. ఈ విషయం జీర్ణించుకోలేని వీరు తనపై ఇప్పటి వరకు పది సార్లు హత్యాయత్నాలకు పాల్పడ్డారని తెలిపారు. తమ సమాజ్ తరపున ఆలదుర్గ అమ్మవారి ఆలయ సమీపంలో తమ కుల సమాజ్ చెందిన ఆలయ నిర్మాణం, వసతి గృహాలు నిర్మిస్తున్నామని అందులోని డబ్బులు అదే విధంగా తమ సమాజ్ కొరకు కొన్న భూమిలోని డబ్బులు దాదాపు కోటి ముప్పై లక్షల రూపాయాల వరకు కాజేయడం జరిగిందని ఆయన ఆరోపించారు. ఈ విషయమై గత కొన్నినెలలుగా తమ సమాజ్ సభ్యుల ముందు లెక్కలు చూపమంటే నీళ్ళు మింగుతున్నారని ఇది జీర్ణించుకోలేక తనపై దాడులకు పాల్పడుతున్నారని తెలిపారు. ఈ విషయమై తనకు ఏమైన జరిగితే వారే బాధ్యులని అన్నారు. వీర్తి పై మంగళ్ హాట్ పోలీస్ స్టేషన్ లో తనకు ప్రాణహాని ఉన్నట్లు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఈ విషయమై తాను త్వరలో తెలంగాణ రాష్ట్ర డీజీపీ, నగర పోలీస్ కమిషనర్ తదితరులను కలుస్తానని చెప్పారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- ప్రిన్సిపాల్ ఎస్.పద్మావతి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గన్ ఫౌండ్రీ గవర్నమెంట్ మహబూబియా బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్. పద్మావతి అన్నారు. శనివారం కళాశాల ప్రాంగణంలో పేరుకు పోయిన చెత్తను తీసివేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని విద్యార్థులకు సూచించారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటాలని విద్యార్థుల కు సూచించారు. చెట్లే మానవాళికి ప్రాణం అన్నారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రమశిక్షణ పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు కుద్దిసేయా, నిర్మలా, జ్యోతి ,విజయలక్ష్మి, లక్ష్మీనారాయణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నియంతృత్వ పోకడలను నియంత్రించాలి

నవతెలంగాణ-ముషీరాబాద్

తెలంగాణ రాష్ట్ర కుర్ని సంక్షేమ సంఘంలో నియంతృత్వ పోకడలను నియంత్రించాలని ఆ సంఘం యువసేన రాష్ట్ర అధ్యక్షుడు కుర్ని శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను తన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కుర్ని యువసేన అధ్యక్షుడు కుర్ని శ్రీనివాస్ మాట్లాడుతూ.... బీసీ చేనేత సామాజిక వర్గానికి చెందిన వాళ్లమని, చేనేత వృత్తిగా ఉన్న కుర్ని (బీసీ-బీ క్రమ సంఖ్య 16) కు చెందిన వాళ్లమన్నారు. 2015 నుంచి ఇప్పటి వరకు నియంతృత్వంగా ఎన్నికలు నిర్వహించకుండా వారే సంఘాన్ని వారి గుప్పిట్లో పెట్టుకున్నారని విమర్శించారు. కొత్త కమిటీని ఎన్నుకోవాలని కుర్ని యువసేన యువత ఒత్తిడి తేగా నాలుగు గదుల మధ్య పిడికెడు మందితో కొత్త కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారని, దీనిని కుర్ని యువసేన తరపున విభేదించి ఎన్నికను బహిష్కరించామని శ్రీనివాస్ తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్యను, ఎమ్మెల్సీ కోదండరాంను కలసి వినతి పత్రం సమర్పించామన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేసి వెంటనే ఎన్నికలు జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు.

కబ్జాల కాలగర్భంలో కలిసిపోతున్న గ్రేటర్

- 44 ఏండ్లలో అనేక చెరువులు కబ్జాకు గురి
- జలవనరులను పరిరక్షణకు రంగంలోకి హైడ్రా
- బఫర్ జోన్.. ఎఫ్‌టీఎల్ అంటే.. ఏంటని పలువురి ఆరా..



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఒకప్పుడు లేక్‌సిటీగా పేరొందిన భాగ్యనగర ఖ్యాతి.. 'కబ్జాల' కాలగర్భంలో కలిసిపోతున్నది. గడిచిన 44 ఏండ్లలో అనేక చెరువులు 60 నుంచి 80 శాతం వరకు మరికొన్నైతే 100శాతం కనుమరుగైనట్లు నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్(ఎన్ఆర్ఎస్‌సీ) నివేదిక వెల్లడించింది. జలవనరులను పరిరక్షించుకోకపోతే భవిష్యత్‌లో హైదరాబాద్ పరిస్థితి ప్రశ్నార్థకంగా మారనుందన్న ఆందోళనతో ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో హైదరాబాదలో గత కొన్నిరోజులుగా అక్రమ కట్టడాల మీద హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్) స్పెషల్ ఫోకస్ పెట్టిన విషయం తెలిసిందే. ఈ జన్వాడ ఫామ్ హౌస్, ఎన్ కన్వెన్షన్ సెంటర్‌తోపాటు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న కట్టడాలపై హైడ్రా కొరడా ఝులిపిస్తోంది. ముఖ్యంగా చెరువులు, నాలాలు, కుంటల సమీపంలో వెలసిన అక్రమ నిర్మాణాలను తొలిగిస్తున్నారు. హైడ్రా చేపట్టిన ఆపరేషన్‌తో ప్రముఖుల గుండెల్లో గుబులు రేపుతోంది. హైడ్రా దూకుడుగా వెళ్తుండడంతో రాష్ట్రవ్యాప్తంగా ఆశక్తి నెలకొంది. ఈ క్రమంలో అసలు బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ అంటే ఏమిటని పలువురు ఆరా తీస్తున్నారు. .

ఎఫ్‌టీఎల్ అంటే..?

చెరువులు, జలాశయాలల్లో పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్య పరిధిని ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లెవల్) అంటారు. వర్షాకాలంలో వర్షం నీరుతో నిండినా లేదా వరద నీటితో నిండితే ఎఫ్‌టీఎల్ నిర్ధారిస్తారు. హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ ఎఫ్‌టీఎల్‌ను నిర్మాణ సమయంలో నిర్ధారించారు. వర్షం లేకున్నా ఆ ప్రాంతం ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వస్తోంది. ఎఫ్‌టీఎల్ పరిధిలో పట్టా భూములు ఉన్నా సరే, నీళ్ల లేని సమయంలో వ్యవసాయం చేసుకోవచ్చు. నీరు ఉంటే ఆ భూములను వదిలేయాల్సి ఉంటుంది. ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు చేపట్టొద్దనే కఠిన నిబంధన ఉంది.

బఫర్ జోన్ అంటే..?

నది పరీవాహక ప్రాంతంలోకి వరదనీరు సక్రమంగా వస్తూనే, కలుషితం కాకుండా బఫర్ జోన్‌ను ఏర్పాటు చేస్తారు. ప్రతి నీటి వనరును, విస్తీర్ణం ఆధారంగా బఫర్‌జోన్‌గా నిర్ధారిస్తారు. 25 హెక్టార్లు, అంతకుమించి విస్తీర్ణంలో ఉన్న చెరువు, జలాశయాలు బఫర్‌జోన్ నిర్ధారణకు 30 మీటర్లను ప్రామాణికంగా తీసుకుంటారు. జంట జలాశయాల పరిధి చుట్టూ ఎఫ్‌టీఎల్‌ను ఆనుకొని 30 మీటర్లు (వంద ఫీట్లు) బఫర్‌జోన్‌గా ఉంది. ఇక్కడ సాగు సంబంధిత కార్యకలాపాలు మాత్రమే చేపట్టాలి. ఎట్టి పరిస్థితుల్లో నిర్మాణాలు చేపట్టొద్దని నిబంధనల్లో స్పష్టంగా ఉంది.

సిటీ కళాశాల భవన పునరుద్ధరణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

- ప్రొఫెసర్ జి.హరగోపాల్



నవతెలంగాణ-ధూల్‌పేట్

శత వసంతాల ఘన చరిత్ర కలిగిన ప్రభుత్వ సిటీ కళాశాల భవనాన్ని పరిరక్షించటానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని సుప్రసిద్ధ సామాజిక వేత్త ప్రొఫెసర్ జి.హరగోపాల్ అన్నారు. ప్రభుత్వ సిటీ కళాశాలలో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో చారిత్రాత్మక భవనాలలో సిటీ కళాశాల భవనం విశిష్టమైనదని, ఈ ప్రాంత ఆత్మగౌరవానికి, విద్యా చైతన్యానికి సిటీ కళాశాల భవనం సమున్నత ప్రతీక అని ఆయన కొనియాడారు. ఇండో సార్సనిక్ శైలిలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన సిటీ కళాశాల భవనం ప్రస్తుతం కొంత శిథిలావస్థలో ఉన్నదని, ప్రభుత్వం చొరవ తీసుకుని దీనిని పునరుద్ధరిస్తే మరో యాభై సంవత్సరాలు సజీవంగా నిలబడుతుందని సూచించారు. తొలిదశ తెలంగాణ ఉద్యమం నుండి మలిదశ వరకు ఉద్యమ చైతన్యానికి చిహ్నం ఉన్న సిటీ కళాశాల భవనానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో తగిన మరమ్మత్తులు చేయాలన్నారు. తెలంగాణ నలుమూలలలోని గ్రామాల నుండి వచ్చిన విద్యార్థులు నాణ్యమైన విద్యను పొంది ఉన్నత స్థానాలలో స్థిరపడ్డారన్నారు. తాను కూడా సిటీ కళాశాల విద్యార్థినని దేశవిదేశాల సందర్శన సందర్భాలలో గర్వంగా చెప్పుకుంటానన్నారు. పూర్వ విద్యార్థుల కళాశాల అభివృద్ధిలో క్రియాశీలకంగా పాలు పంచుకుని నాక్‌లో అత్యుత్తమ గ్రేడ్ సాధించటానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మూసీ సుందరీకరణలో భాగంగా ఆ నది ఒడ్డునే జ్ఞాన శిఖరంలా నిలబడిన సిటీ కళాశాల భవనానికి కూడా పునర్వైభవాన్ని తీసుకురావాలని ప్రఖ్యాత పాత్రికేయులు పాశం యాదగిరి అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సిటీ కళాశాల భవనాన్ని హెరిటేజ్ భవనంగా గుర్తించి పునరుద్ధరణకు పూనుకోవాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బాల భాస్కర్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం డిగ్రీ ప్రవేశాలలో సిటీ కళాశాలదే అగ్రస్థానమని, ఎక్కువ మంది విద్యార్థులు సిటీ కళాశాలలో విద్యనభ్యసించటానికి ఇష్టపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు వెంకట్ రాజాం, దూరదర్శన్ విశ్రాంత ప్రోగ్రామ్ ఆఫీసర్ అనంత మోహన్, జనార్ధన్ రెడ్డి, ఆమంచి, డాక్టర్.నాగేశ్వర రావు తదితరులు కళాశాలకు అభివృద్ధికి సంబంధించిన చర్చలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్.విప్లవ్ దత్ శుక్లా, డాక్టర్. యాదయ్య డాక్టర్.కోయి కోటేశ్వర రావు, డాక్టర్. జె.నీరజ, డాక్టర్.భాస్కర్‌లు మాట్లాడారు.

ఏఎంహెచ్ఓ డా. వెంకట్ రమణకు ఘన సన్మానం..



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

జీహెచ్ఎంసీ గోషామాల్ సర్కిల్ -14 ఏఎంహెచ్ఓగా డాక్టర్ వెంకట్ రమణ ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఈ సందర్భంగా ఆయనను కలిసి పూలబొకే అందించి శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలుపుతున్న హెల్త్ సెక్షన్ జూనియర్ అసిస్టెంట్ టి .అనిల్ సింగ్, జననం అండ్ మరణం రికార్డు ఇన్‌చార్జి జె.రాజన్ కుమార్ తదితరులు

లైంగిక దాడికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలి

- ఐద్వా నగర కార్యదర్శి కె.నాగలక్ష్మీ



నవతెలంగాణ-ముషీరాబాద్

అస్సాంలో స్కూలుకు వెళ్లి వస్తున్న బాలికపై సామూహిక లైంగిక దాడికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని ఐద్వా నగర కార్యదర్శి కె.నాగలక్ష్మీ డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో ముషీరాబాద్ చౌరాస్తాలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగలక్ష్మి మాట్లాడుతూ..దేశవ్యాప్తంగా మహిళలపై బాలికలపై పెరుగుతున్న లైంగికదాడులతో మహిళలు తీవ్ర ఆందోళన చెందుతున్నారని, కలకత్తా లో వైద్య విద్యార్థినిపై జరిగిన లైంగిక దాడిపై దేశవ్యాప్తంగా ఒకవైపు ఆందోళనలు జరుగుతుండగానే అనేక రాష్ట్రాల్లో మహిళలపై ఈ ఘటనలు వెలుగు చూడటం ఆందోళనకరమన్నారు. అస్సాం లో స్కూలుకు వెళ్లి వస్తున్న 13 ఏండ్ల బాలికపై సామూహిక లైంగికదాడి చేసి అపస్మారక స్థితిలో ఉన్న బాలికను రోడ్డుపై పడవేశారని, మహారాష్ట్ర లోని బదళాపూర్ లో స్కూలులోని బాత్‌రూంలో బాలికలపై లైంగికదాడి ఘటన, అదే రాష్ట్రంలోని అకోలా లోని ఒక స్కూలులోని టీచరు పోర్న్ వీడియోలు చూస్తూ బాలికలపై లైంగికదాడులకు పాల్పడడం, తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. భేటీ బచావో అని చెప్పుతున్నా మోడీ ప్రభుత్వం.. మహిళపైనా లైంగిక దాడులు జరగకుండా చూడాల్సిన బాధ్యత కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందని ఇకనైనా ప్రభుత్వాలు మహిళలకు తగిన భద్రత కల్పించాలని కోరారు. ధర్నాలో ఐద్వా నగర అధ్యక్షురాలు ఏ పద్మ, నగర నాయకులు వై.వరలక్ష్మిలక్ష్మీ, పుష్ప,రాణి తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామం దినచర్యలో భాగం కావాలి

- ఎమ్మెల్యే ముఠా గోపాల్



నవతెలంగాణ-ముషీరాబాద్

ప్రతి ఒక్కరూ వ్యాయామాన్ని దినచర్యలో భాగం చేసుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని తెలంగాణ దశాబ్ది పార్క్‌లో 35 లక్షల వ్యయంతో నిర్మించిన ఓపెన్ జిమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రజల ఆహ్లాదకరమైన వాతావ రణంలో వ్యాయామం చేసుకునేందుకు వీలుగా అన్ని సదుపాయాలతో ఓపెన్ జిమ్ ప్రారంభించామని తెలిపారు. ప్రతి ఒక్కరూ నిత్య వ్యాయామంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. ప్రతి పార్కులో ఓపెన్ జిమ్ సౌకర్యంతో పాటు ఔషధ మొక్కలు పెంపుదలకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు ముఠా జైసింహ, చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సీతయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బబ్లు, ఎం దామోదర్ రెడ్డి, పి. రాజేంద్రప్రసాద్ గౌడ్, ఏ.కిషన్ రావు, నాగభూషణం, బాగ్‌లింగంపల్లి ఎస్ఐజి 2 వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రత్నాకర్ రెడ్డి, ఉపాధ్యక్షులు శంకర్, శేషయ్య, జార్జ్, రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి, ఎస్వీ రమణారావు, కోశాధికారి ఎం జె జోసెఫ్, ముచ్చ కుర్తి ప్రభాకర్, తదితర నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే ప్రపంచీకరణ విధానాలను అర్థం చేసుకోవాలి

ఎంట్రప్రెన్యూర్ షిప్‌పై రెండు రోజుల అవగాహన సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బాల భాస్కర్



నవతెలంగాణ-ధూల్‌పేట్

విద్యార్థి దశలోనే ప్రపంచీకరణ విధానాలను అర్థం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బాల భాస్కర్ అన్నారు. ప్రభుత్వ సిటీ కళాశాల కామర్స్ విభాగం, ఎంట్రప్రెన్యూర్ షిప్ డెవలప్ మెంట్ సెల్ ఆధ్వర్యంలో 23, 24 తేదీలలో రెండు రోజులపాటు విద్యార్థులకు ఎంట్రప్రెన్యూర్ షిప్ పైన అవగాహన సదస్సు జరిగింది. స్కిల్ ఇండియా వారి సహకారంతో సఫల్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాపార అవకాశాలు, మెళకువలు, ఆర్థిక వనరుల సమీకరణ, వ్యాపార నిర్వహణ, ప్రభుత్వం సహకార పథకాల గురించి అవగాహన కలిగించారు. విద్యార్థులలో స్వీయ ప్రేరణ, సమయ నిర్వహణ, వినియోగదారుల అవసరాలపై అవగాహన తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమం ఉద్దేశించి కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య బాల భాస్కర్ మాట్లాడుతూ.. విద్యార్థి దశలోనే ప్రపంచీకరణ విధానాలను అర్థం చేసుకుని నూతన వ్యాపార ఆలోచనలో, వాటి ప్రాముఖ్యత తెలుసుకోవడం అనేది చాలా అవసరం అని పేర్కొన్నారు. క్యూ కామర్స్, ఏఐ ఆధారిత వ్యాపారాలను మనం ప్రస్తుత సమాజంలో చూస్తున్నామని వాటికి అనుగుణంగా విద్యార్థులు కూడా ఎంటర్ ప్రెన్యూర్‌గా మారి, నలుగురికీ ఉపాధిని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కామర్స్ విభాగాధిపతి డాక్టర్. మల్లికార్జున్, డాక్టర్.ఝాన్సీ రాణి, డాక్టర్. శిరీష, డాక్టర్. భాస్కర్, ఇఫత్ ఉన్నిసా, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- కింగ్ కోఠి జిల్లా ఆస్పత్రి పీడియాట్రిక్ హెచ్ఓడి డా.సంతోష్ బాబు



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

సీజనల్ వ్యాధుల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని కింగ్ కోఠి జిల్లా ఆసుపత్రి పీడియాట్రిక్ హెచ్ ఓ డి డాక్టర్ సంతోష్ బాబు అన్నారు. శనివారం కింగ్ కోఠి జిల్లా ఆస్పత్రిలో ఆయన మాట్లాడుతూ.. వైరల్ ఫీవర్‌లు ఎక్కువగా వస్తున్నాయన్నారు. చిన్నారుల్లో డెంగ్యూ కేసులు నమోదవుతున్నాయన్నారు. చిన్నారుల్లో ఆస్తమా (అలర్జిక్ బ్రాకైటిస్) వైరల్ జ్వరాలతో వస్తున్నట్లు తెలిపారు. డెంగ్యూ దోమ కాటు ద్వారా వస్తుందన్నారు. డెంగ్యూ జ్వరంతో బాధపడే వారికి నూట రెండు జ్వరం ఉంటుందన్నారు. మూడు నాలుగు రోజులు అలానే ఉన్నట్లయితే వైద్యుని సంప్రదించాలని సూచించారు. డెంగ్యూ టెస్ట్ చేసి వ్యాధి నిర్ధారణ అయితే వెంటనే వైద్యం ప్రారంభించడం వల్ల త్వరగా కోలుకుంటారని తెలిపారు. టైఫాయిడ్, వైరల్ ఐపె టాటిస్ (కామెర్లు) ఈ వ్యాధులు అపరిశుభ్రత ఉండటం. నీరు కలుషితం కావడం వల్ల ఈ జబ్బులు వస్తాయని తెలిపారు. వీటిని అరికట్టాలంటే కాచి వడపోసిన నీరు తీసుకోవాలని సూచించారు. ఇంటి చుట్టుపక్కల ప్రాంతాలు పరిశుభ్రత పాటించాలని కోరారు. ఆస్పత్రికి వచ్చిన చిన్న పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేస్తున్నామన్నారు. తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు చిన్నపిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు.

ఆయుర్వేద వైద్యంతో వృద్ధులకు మేలు..



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

వృద్ధాప్యంలో సాధారణంగా వచ్చే అనారోగ్య సమస్యలకు ఆయుష్ వైద్య విధానాల ద్వారా సులువైన వైద్యం అందిస్తున్నారని గన్ ఫౌండ్రి డివిజన్ కార్పొరేటర్ డాక్టర్ సురేఖ ఓం ప్రకాష్ అన్నారు. శనివారం కింగ్ కోఠి జిల్లా ఆస్పత్రి ఆవరణలో గల ఆయుర్వేద పాలి క్లినిక్ సీనియర్ మెడికల్ ఆఫీసర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ డాక్టర్ సురేఖ ఓం ప్రకాష్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్రనాథ్, డిపార్ట్మెంట్ ఆఫ్ అడిషనల్ డైరెక్టర్ (ఎడి)డాక్టర్ వసంతరావు, నేషనల్ ఆయుష్ మిషన్ స్టేట్ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ అర్చనలు పాల్గొని ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ శిబిరంలో వృద్ధులకు రక్తపోటు, మధుమేహం, మోకాళ్ళ నొప్పులు బాధపడుతున్న వృద్ధులను వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఆయుర్వేద మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ రామదాస్, డాక్టర్ రమశ్రీదేవి, డీపీఎం వి శ్రావణ్, ఫార్మసిస్టు సంధ్య, రికార్డ్ అసిస్టెంట్ రవీందర్ రాజు, ఎంఎన్ఓ ఎస్ వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా రాజకీయ రిజర్వేషన్‌లలో బీసీ మహిళా కోటా ఇవ్వాలి

- ఎరుక సాహిత్య సాంస్కృతిక సామాజిక వేదిక అధ్యక్షురాలు దాసోజు లలిత



నవతెలంగాణ-ముషీరాబాద్

మహిళా రాజకీయ రిజర్వేషన్లలో బీసీ మహిళా కోటా ఇవ్వాలని ఎరుక సాహిత్య సాంస్కృతిక సామాజిక వేదిక అధ్యక్షురాలు దాసోజు లలిత డిమాండ్ చేశారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎరుక సాహిత్య సాంస్కృతిక సామాజిక వేదిక ఆధ్వర్యంలో జరిగిన మహిళా రాజకీయ రిజర్వేషన్లు బీసీ మహిళా కోటా అనే అంశం మీద రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో దాసోజు లలిత హాజరై మాట్లాడుతూ.. 2029లో జరగబోయే ఎన్నికలలో మహిళా రిజర్వేషన్లను అమలు చేయబోతుందనీ, అందులో బీసీ మహిళా కోటాను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇది పితృస్వామ్య సమాజ మని, మహిళలకు ఈ దేశాన్ని పాలించే అవకాశం ఇస్తే పేదరికం, అసమానతలు తొలిగిపోతాయన్నారు. వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జిలకర శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, ప్రముఖ సామాజిక ఉద్యమకారిణి రజిత మాట్లాడుతూ.. పురుషుల ఆధిపత్యం అన్నిచోట్లా కొనసాగుతుందని, మహిళలను రాజకీయాలలోకి ప్రోత్సహించాలన్నారు. మహిళా రాజకీయ చట్టాన్ని 2028 నుండే అమలు చేయాలని కోరారు. 2021లో చేపట్టాల్సిన జనగణను వాయిదా వేశారు. వెంటనే జనగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ మహిళా కోటా అంశం మీద రాష్ట్ర వ్యాప్తంగా సదస్సులు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నామినేటెడ్ పోస్టులలో మహిళలకు 33% పోస్టులు కేటాయించాలని దేశంలో మహిళల మీద జరుగుతున్న లైంగిక దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర హైకోర్టు అడ్వకేట్ వాసంతి, మంగ, ఆర్ఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు కరంగిని దుర్గారాని, పీసీసీ సెక్రెటరీ జి.రేణుక, క్రిష్ణవేణి, పావని, సోగరా బేగం, షహరాభాను, లక్ష్మీ, ప్రొఫెసర్ ప్రభంజన్ యాదయ్య, నాస్తిక్ రాకేష్, డా.చంద్రయ్య, గ్యార యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

'సుప్రీంకోర్టు ఇచ్చిన వర్గీకరణ తీర్పును ఉపసంహరించుకోవాలి'



నవతెలంగాణ-హిమాయత్ నగర్

ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన వర్గీకరణ తీర్పును వెంటనే ఉపసంహరించుకోవాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్ డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో శనివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ కేంద్ర ప్రభుత్వం, ఎ.రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణ అంశంపై ఆర్డినెన్స్ జారీ చేసే ప్రయత్నాన్ని వెంటనే మానుకోవాలని డిమాండ్ చేశారు. 'వర్గీకరణ అంతం..దళితుల పంతం' అనే నినాదంతో వర్గీకరణకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఉద్యమంలో భాగంగా సెప్టెంబర్ నెల 2న రాష్ట్రంలోని అన్ని మండల తహసిల్దార్ కార్యాలయాల ముట్టడి, 11వ తేదీన అధికార, ప్రతిపక్ష పార్టీల ప్రజా ప్రతినిధుల ఇండ్ల వద్ద నిరసన, 16వ తేదీన 33 జిల్లాల కలెక్టర్ కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలు, 27వ తేదీన 'ఛలో హైదరాబాద్' పేరుతో తెలంగాణ రాష్ట్ర సచివాలయం ఎదుట నిరసన, ఆందోళన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు.ఈ నిరసన కార్యక్రమాల్లో వివిధ దళిత రాజకీయ పార్టీలు, ఎస్సీ, ఎస్టీ, కుల, ప్రజా సంఘాల నేతలు పాల్గొని, పెద్ద ఎత్తున పోరాటం చేస్తారని ఆయన పేర్కొన్నారు.ఈ సమావేశంలో సమితి రాష్ట్ర అధ్యక్షులు గవ్వల శ్రీకాంత్, జాతీయ ప్రధాన కార్యదర్శి వడాల భాస్కర్, జాతీయ కార్యనిర్వాహక కార్యదర్శులు గోలి నరేష్, పి.మోహన్ రావు, రోజా లీలా తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాలను పూజించాలి

- వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రభు



నవతెలంగాణ-ముషీరాబాద్

మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను పూజించాలని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రభు పిలుపునిచ్చారు. శనివారం విద్యానగర్ లోని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) లో పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేసే ఉద్దేశంతో రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సహకారంతో కళాశాలలోని ఎన్ఎస్ఎస్ యూనిట్లు, ఇకో క్లబ్, డిపార్ట్మెంట్ ఆఫ్ బోటని ఆధ్వర్యంలో ఇకో ప్రిజర్వేషన్ వర్క్ షాప్ ను నిర్వహించడం జరిగింది. ఈ వర్క్ షాప్ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు మట్టి వినాయక విగ్రహాల తయారీపై పోటీలను నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ప్రభు, తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రాజెక్టు ఇంజనీర్ బి. నాగేశ్వరరావు మాట్లాడుతూ.. అందరూ మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను పూజించాలని వినాయక చవితి సందర్భంగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని పర్యావరణ అనుకూల వస్తువులను వినియోగించి, వినాయక చవితిని పర్యావరణ అనుకూల పండుగగా జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఈశ్వర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు పద్మజ, మహేష్, ఇకో క్లబ్ కన్వీనర్ అనురాధ , ఇంకో క్లబ్ మెంబర్లు నీరజ, శీబారాణి తదితరులు పాల్గొన్నారు.



కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో శ్రీకృష్ణ జన్మదిన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. పిల్లలు శ్రీకృష్ణ వేషాధారణతో ఆటలు పాటలతో అలరించటం జరిగింది. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ అశోక్ కుమార్, స్కూల్ టీచర్స్, పేరెంట్స్ తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-ముషీరాబాద్

'విద్యార్థులు ధర్మ మార్గంలో నడవాలి'



నవతెలంగాణ-హిమాయత్ నగర్

విద్యార్థి లోకమంతా జ్ఞాన మూర్తులై ధర్మ మార్గంలో నడవాలని శ్రీ చైతన్య టెక్నో స్కూల్ ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్ విద్యార్థులకు సూచించారు. శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం శ్రీ చైతన్య టెక్నో స్కూల్ నల్లకుంట బ్రాంచీలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల కు వ్యాస రచన, వ్యక్తిత్వ డ్రాయింగ్ పోటీలు నిర్వహిం చారు. విజేతలైన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. విద్యార్థిని, విద్యార్థులు బాల గోపాలుడు, గోపిక వేషధారణతో అందరిని ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డీన్ నీలగిరి, ఇన్‌చార్జిలు శాంతి, మాలతీ, రవి, మురళీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బతుకమ్మకుంట పక్కా ప్రయివేట్ పట్టా ల్యాండ్


- అక్కడ కుంటనే లేదు.. ఈ ల్యాండ్‌లోకి వచ్చి మాట్లాడటం హాస్యాస్పదం
- పెద్దలు వి.హనుమంతరావు ఎందుకు వెంటపడుతున్నారో అర్థం కావడం లేదు
- నేను కూడా హైడ్రా కమిషనర్‌కు అన్ని వివరాలు అందజేశాను
- ల్యాండ్‌లోపలకు వస్తే కేసులు తప్పవు
- మీడియాతో బీఆర్ఎస్ సీనియర్ నేత ఎడ్ల సుధాకర్ రెడ్డి



నవతెలంగాణ-అంబర్‌పేట:

అంబర్‌పేట మండల పరిధిలో గల బతుకమ్మకుంట స్థలం పక్కా ప్రయివేటు స్థలమని, అందులో ఎలాంటి కుంట లేదని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత ఎడ్ల సుధాకర్‌రెడ్డి అన్నారు. బతుకమ్మకుంట స్థలం దగ్గరకు వచ్చి అక్కడ కుంటను పునరుద్దరించాలని మాట్లాడటం హాస్యాస్పదమని పేర్కొన్నారు. శనివారం సాయంత్రం ఆయన బతుకమ్మకుంట స్థలం విషయమై మీడియాతో మాట్లాడారు. అంబర్‌పేట పెద్దలు, సీనియర్ కాంగ్రెస్ నేత వి. హనుమంతరావు గత 20 సంవత్సరాలుగా ఎందుకు ఈ స్థలం వెంటపడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. ఆ రాజ్యసభ సభ్యుడిగా, కాంగ్రెస్ పార్టీకి రాష్ట్ర అధ్యక్షుడుగా పని చేసిన ఆయన మొయిన్ చెరువును బతుకమ్మలు వేసేం దుకు అభివృద్ధి ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. తనకు, స్థల యజమానులకు మధ్యన సంప్రదింపులు నడుస్తున్నా యని, తాను పొజీషన్‌లో ఉన్నానని, ఇందులోకి ఎవరైనా వస్తే కేసులు తప్పవని హెచ్చరించారు. వి. హనుమంత రావు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను పిలిచి అక్కడ కుంట ను పునరుద్దరించాలని చెప్పడం అవివేకమన్నారు. తాను శనివారం హైడ్రా కమిషనర్‌కు పూర్తి వివరాలను అందజేశానని తెలిపారు. బతుకమ్మకుంట స్థలం విషయమై వి.హను మంతరావు తప్పుడు ప్రచారం చేయొద్దని, రెచ్చగొట్టొద్దని స్థలం లోపలకు వస్తే కేసులు తప్పవని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్‌వీ నాయకుడు జె.డి.రాహుల్ తదితరులు పాల్గొన్నారు.





పోరాటం ఆమెకు కొత్త కాదు. తన ఆటకు అడ్డుపడ్డ ఊరితో, బంధువులతో చిన్నతనంలోనే పోరాడింది. ఆపై క్రీడాకారిణుల జీవితాలతో ఆడుకునే రాజకీయ కామాంధులతో పోరాడింది. పారిస్ ఒలింపిక్స్‌లో దేశానికి ఒక్క బంగారు పతకమైనా అందించేందుకు ఆ రాత్రంతా తనతో తాను పోరాడింది. పతకాల పట్టికలో దేశాన్ని ముందుకు నిలపడానికి తన ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టింది. ఆమే వినేశ్ ఫోగాట్. తుదకు వంద గ్రాముల బరువు దేశం గుండెలు బరువెక్కేలా చేసింది. ఇదంతా ఎవరు పన్నిన కుట్రో..! ఆమె మాత్రం ఓడినా ప్రజల మనసు గెలిచింది. ఈ రోజు ఆ మల్ల యోధురాలి పుట్టిన రోజు సందర్భంగా ఆమె స్ఫూర్తిదాయక పరిచయం నేటి మానవిలో...

ప్రజల హృదయాలు గెలిచింది

వినేశ్ ఫోగట్ 1994 ఆగస్టు 25న హర్యానాలోని చర్కీ దాద్రిలో పుట్టింది. మల్లయోధుడు రాజ్‌పాల్ ఫోగట్ ఈమె తండ్రి. ఆమె చెల్లెలు ప్రియాంక ఫోగట్. గీతా ఫోగట్, రీతూ ఫోగట్, బబితా కుమారి వరుసకు ఈమెకు అక్క,చెల్లెళ్లు. వీరందరూ మల్లయోధులే. పెదనాన్న మహావీర్ సింగ్ ఫోగట్ దగ్గర వినేశ్ శిక్షణ తీసుకుంది. అయితే ఆడపిల్లలను కుస్తీ పోటీలకు పంపుతున్న వీరి కుటుంబం మొత్తం మొదట్లో గ్రామం నుండి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కోవలసి వచ్చింది. అయితే తండ్రి, పెదనాన్న ప్రోత్సాహంతో వినేశ్ ఊరితో పోరాటం చేసి మల్ల యోధురాలిగా రాష్ట్రానికి గొప్ప పేరు తీసుకొచ్చింది. ఇప్పుడు ఊరిలో వారందరికీ ఆ ఆడపిల్లలు ఆదర్శంగా నిలుస్తున్నారు. గ్రామీణ మహిళల పట్ల సమాజానికి ఉన్న అభిప్రాయాలను వీరు సాధించిన విజయాలు మార్చివేశాయి. 2018 డిసెంబర్ 13న, ఆమె జిందా జిల్లాకు చెందిన తోటి మల్లయోధుడు సోమవీర్ రాఠీని వివాహం చేసుకుంది. వీరిద్దరూ భారతీయ రైల్వేలో ఉద్యోగం చేస్తున్నారు.

నిజమైన దేశభక్తురాలు

2020లో 53 కిలోల బరువున్న రెజ్లర్ల పోటీల్లో పాల్గొన్న వినేశ్, 2024లో 50 కిలోల క్యాటగిరీలో పాల్గొంది. 50 కిలోల ఈవెంట్‌లో వినేశ్ పాల్గొంటే, మరో క్రీడాకారిణి 53 కిలోల ఈవెంట్‌లో పాల్గొంటుందని అధికారులు చెబితే ఏమాత్రం సందేహించకుండా క్రీడా స్ఫూర్తితో, దేశానికి ఇంకో పతకం వస్తే చాలని అంగీకరించి 50 కిలోల క్యాటగిరీలో పోటీకి దిగిన నిజమైన దేశభక్తురాలు వినేశ్. అయితే ఆమె స్థానంలో 53 కిలోల ఈవెంట్‌లో పాల్గొనాల్సిన యోధురాలు పోటీలో పాల్గొనకుండానే ఇంటి దారి పట్టింది. దీనంతటికి కారణం ఎవరు? ఇదంతా ఎందుకు జరిగింది? సెమీ ఫైనల్స్‌లో పాల్గొనేటప్పుడు 50 కిలోల లోపు వుండి, రాత్రికి రాత్రే 52.8 కిలోలకు ఎలా పెరిగింది?

మహిళా రెజ్లర్లకు అండగా...

2016లో 48 కిలోలు, 2020లో 53 కిలోలు, 2024లో 50 కిలోలు అనే మూడు వేర్వేరు బరువు తరగతుల్లో పోటీ చేసింది. 2019లో లారెస్ వరల్డ్ స్పోర్ట్స్ అవార్డులకు నామినేట్ అయిన ఆమె ఈ అవార్డుకు నామినెట్ అయిన మొదటి భారతీయురాలు. క్రీడల్లో అగ్ర భాగంలో ఉండటమే కాదు తన తోటి వారికి అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకునే మనస్తత్వం కాదు ఆమెది. కాబట్టే 2023లో అప్పటి ఇండియన్ రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు, బీజేపీ ఎంపి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ పలువురు మహిళా రెజ్లర్లను లైంగిక వేధింపులకు గురిచేయడంతో అతనికి వ్యతిరేకంగా ఢిల్లీలో భారత రెజ్లర్లు చేసిన పోరాటంలో ఆమె కీలకపాత్ర పోషించింది.

హృదయాలు జయించింది

వినేశ్‌ను పారిస్ ఒలింపిక్స్‌కు పంపడానికి డెబ్బై లక్షలు ఖర్చు చేశామని కేంద్ర క్రీడల మంత్రి, మహిళలు తమ బరువును అదుపులో పెట్టుకోకపోతే ఎలా అంటూ మరొకరు నోటికొచ్చినట్టు మాట్లాడారు. ఏ మాటల వెనుక ఎవరి ప్రయోజనం దాగుందో దేశ ప్రజలందరికీ బాగా తెలుసు. అందుకే ప్రముఖులతో పాటు, కోట్ల మంది వినేశ్‌కు అండగా నిలిచారు. మా హృదయాలను గెలిచావంటూ ఆమెను అభినందనలతో ముంచేశారు. ఇలా పతకాన్ని గెలవకపోయినా కోట్ల మంది హృదయాలు జయించింది. ఆధునిక సమాజంలో కూడా ఆడపిల్లలు అణచివేతకు గురవుతున్న తీరును నిరసిస్తూ, అందుకు ఆటలు కూడా మినహాయింపు కాదని, తన పోరాటం ద్వారా ఆమె తెలియచెప్తుంది. మార్పు కోసం నిత్య పోరాటం తప్పదని చెప్పేందుకు వినేశ్ జీవితమే చక్కటి ఉదాహరణ. అందుకే కోటానుకోట్ల యువతకు, మహిళలకు ఆమె స్ఫూర్తిగా నిలిచింది. ■

కుట్ర ఎవరిది..?

2024 ఒలింపిక్స్‌లో ఫైనల్‌కు చేరుకున్న మొదటి భారతీయ మహిళా రెజ్లర్ వినేశ్. ఒలింపిక్ ఛాంపియన్ యుయి సుసాకి ఓడించిన మొదటి అంతర్జాతీయ రెజ్లర్‌గా నిలిచింది. అయితే ఫైనల్స్ ఉదయం వెయిట్-ఇన్ సమయంలో నిర్ణీత బరువు కంటే 100 గ్రాములు ఎక్కువగా ఉందన్న సాకుతో పోటీకి అర్హత లేదు పొమ్మన్నారు. దీంతో న్యాయం కోసం ఆమె 'కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్'లో ఫిర్యాదు చేసింది. దీని వెనుక ఉన్నది ఎవరంటే కోటానుకోట్ల కళ్ళు ఒకేవైపు చూశాయి. తమను ప్రశ్నించినా, ఎదిరించినా ఎలా వెంటాడి వేధిస్తారో, ఎలా అణచివేస్తారో, ఎలా నిర్బంధిస్తారో, ఎంత క్రూరంగా వ్యవహరిస్తారో కళ్లెదుట స్పష్టంగా కనిపిస్తోంది. సాటి క్రీడాకారిణుల రక్షణ కోసం ఢిల్లీ వీధుల్లో ఏడాది పాటు ఎవరితో పోరాడిందో దేశానికి బాగా గుర్తుంది.

మూడు సార్లు ఒలింపిక్స్‌లో



వినేశ్ 2014, 2018, 2022 క్రీడలలో బంగారు పతకాలు గెలుచుకున్న విజేత. 2018 తర్వాత కామన్వెల్త్, ఆసియా క్రీడల్లో బంగారు పతకం గెలుచుకున్న భారతీయ మహిళా రెజ్లర్‌గా ఆమె నిలిచింది. ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో కూడా ఆమె రెండు కాంస్య పతకాలు గెలుచుకుంది. దేశ ఖ్యాతిని నిలపడానికి ఆమె చేసిన కృషి వల్లే 2016లో అర్జున అవార్డు దక్కేలా చేసింది. 2018లో పద్మశ్రీ అవార్డుకు నామినేట్ అయ్యేటట్లు చేసింది. మూడు సార్లు ఒలింపిక్స్‌లో పాల్గొంది. అంతర్జాతీయ పోటీల్లో ఇప్పటి వరకు ఐదు బంగారు, మూడు వెండి, ఏడు కాంస్య పతకాలు సాధించి, పారిస్ ఒలింపిక్స్‌లో పతకం గ్యారంటీ చేసుకుంది. దేశ ప్రజలు ఆశించినట్లు జరిగి వుంటే ఒలింపిక్స్‌లో మొదటి స్వర్ణం గెలిచిన యోధురాలిగా ఈ పాటికి కీర్తి ప్రతిష్ఠలను పొంది వుండేది.



2026 మార్చినాటికి మావోయిస్టులకు తెర

అంతర్రాష్ట్ర సమన్వయ సమావేశంలో అమిత్ షా



రాయ్‌పూర్: 2026 మార్చి నాటికి వామపక్ష తీవ్రవాదం నుంచి దేశాన్ని విముక్తి చేస్తామని కేంద్ర హెూంమంత్రి అమిత్ షా విశ్వాసం వ్యక్తం చేశారు. మావోయిస్టుల హింస ప్రజాస్వామ్యానికి సవాలుగా మారిందని ఆయన చెప్పారు. ఇప్పటివరకు 17 వేలమంది దీనికి బలయ్యారని తెలిపారు. ఈ నేపథ్యంలోనే మావోయిస్టుల అంతానికి బలమైన, పకడ్బందీ వ్యూహం అవసరమన్నారు. ఈ అంశంపై ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో శుక్రవారం నిర్వహించిన అంతర్రాష్ట్ర సమన్వయ సమావేశంలో కేంద్ర మంత్రి పాల్గొని మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశా, మధ్యప్రదేశ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మావోయిస్టు కార్యకలాపాలు తగ్గాయ్..

. 2004-14 వ్యవధితో పోలిస్తే 2014-24 మధ్యకాలంలో మావోయిస్టు సంబంధిత ఘటనల్లో 53 శాతం తగ్గుదల నమోదైనట్టు కేంద్రమంత్రి తెలిపారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేసేందుకు కేంద్రం కృషి చేస్తోందన్నారు. ఏకకాలంలో భద్రతా కార్యకలాపాలు, అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు తెలిపారు. ఎన్ఐఏ, ఈడీ వంటి కేంద్ర సంస్థలు మావోయిస్టు హింస నిర్మూలనకు కృషి చేస్తున్నాయని తెలిపారు.

ఆర్థిక సాయం చేయండి

(మొదటిపేజీ తరువాయి)

విడుదలతో పాటు విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి రావాల్సిన నిధుల గురించి విజ్ఞప్తి చేశామన్నారు. గత బీఆర్ఎస్ సర్కార్ పెద్ద మొత్తంలో బడ్జెటేతర రుణాలు చేసిందన్నారు. ఇందులో రూ.31,795 కోట్ల మేర అధిక వడ్డీకి తెచ్చిన రుణాలు ఉన్నాయని గుర్తుచేశారు. జీతాల కంటే ఎక్కువ మొత్తం అప్పులపై వడ్డీకే కట్టాల్సి వస్తోందన్నారు. అలా ఈ అప్పులు రాష్ట్ర ఖజానాపై తీవ్ర రుణ భారాన్ని మోపుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల వాటిని రీ షెడ్యూల్ చేసి కొంత ఉపశమనం కలిగించాలని కేంద్ర మంత్రిని కోరినట్టు చెప్పారు. దీంతో పాటు విద్యుత్ విషయంలో ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకి రావాల్సిన నిధుల గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. విభజన చట్టం ప్రకారం, తెలంగాణలో తొమ్మిది వెనకబడిన జిల్లాలకు రూ. 50 కోట్ల చొప్పున, ఏడాది రూ.450 కోట్లు విడుదల చేయాల్సి ఉందన్నారు. అయితే గత నాలుగేండ్లుగా ఈ నిధులు విడుదల కాలేదని, మొత్తం రూ. 1,800 కోట్ల బకాయి నిధుల్ని వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ విజ్ఞప్తులపై నిర్మల సీతారామన్ సానుకూలంగా స్పందించారని, త్వరలోనే కేంద్ర, రాష్ట్ర ఉన్నతాధికారులకు సమావేశాన్ని ఏర్పాటు చేసి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. కాగా ఢిల్లీ పర్యటనలో భాగంగా శనివారం మరోసారి పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గేను భట్టి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో పలు తాజా అంశాలపై చర్చించారు.

అనురాగ్ విషయంలో చట్ట ప్రకారమే చర్యలుండాలి

హైడ్రాకు హైకోర్టు సూచన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కొర్రేముల (వెంకటాపూర్)లోని నాదం చెరువు వద్ద ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి చెందిన అనురాగ్ యూనివర్సిటీ విషయంలో హైడ్రా చర్యలు చేపడితే.. అవి నిబంధనలకు అనుగుణంగా ఉండాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఏవైనా ఆక్రమణలుంటే.. వాటి తొలగింపు చర్యలు చట్ట పరిధిలోనే ఉండాలంటూ ఆదేశించింది. ఇందుకు సంబంధించి నోటీసులిచ్చాకే చర్యలు చేపట్టాలని సూచించింది. గాయత్రి ఎడ్యుకేషనల్ సొసైటీతోపాటు అనురాగ్ యూనివర్సిటీ ఇతర విద్యా సంస్థలు దాఖలు చేసిన హౌస్‌మోషన్ పిటిషన్‌ను శనివారం జస్టిస్ వినోద్ కుమార్ విచారించారు. నాదంచెరువులో అనురాగ్ వర్సిటీ ఆక్రమణలు ఏవైనా ఉంటే వాటి తొలగింపునకు హైడ్రా నేరుగా చర్యలు తీసుకోవద్దని ఆదేశించారు.

మహిళా నిరుద్యోగం పైపైకి..



జూన్ త్రైమాసికంలో మరింత పెరుగుదల

- పట్టణాల్లో ఉపాధి కరువు
- తగ్గిన శ్రామిక శక్తి

న్యూఢిల్లీ : భారత ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టిస్తున్నామని పదే పదే పేర్కొంటున్న మోడీ సర్కార్.. దీనికి భిన్నంగా దేశంలో మహిళా నిరుద్యోగం భారీగా పెరుగుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో పట్టణ ప్రాంతాల్లో మహిళల నిరుద్యోగం 9 శాతానికి ఎగిసిందని పిరియడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫ్ఎస్) గణంకాలు వెల్లడించాయి. ఇంతక్రితం మార్చి త్రైమాసికంలో ఇది 8.5 శాతంగా ఉంది. ఇదే సమయంలో 25.6 శాతంగా ఉన్న మహిళా శ్రామిక శక్తి.. గడిచిన ఏప్రిల్ త్రైమాసికంలో 25.2 శాతానికి పడిపోవడం ఆందోళనకరం. తక్కువ మంది మహిళలు పని కోసం చూస్తున్నప్పటికీ, కార్మిక మార్కెట్‌లు వారికి తగినంత ఉద్యోగాను సృష్టించలేక పోతున్నాయి. స్వయం ఉపాధిలో క్షీణత కారణంగా ఉద్యోగ రేటు తగ్గిందని పీఎల్ఎఫ్ఎస్ డేటా వెల్లడించింది.

స్వయం ఉపాధికి ఎసరు

ఆర్థిక వ్యవస్థలో డిమాండ్ లేకపోవడం స్వయం ఉపాధిని దెబ్బతీస్తోంది. 2024 మార్చి త్రైమాసికంలో స్వయం ఉపాధి పొందుతున్న మహిళల వాటా 41.3 శాతంగా ఉండగా.. ఇది ఏప్రిల్ త్రైమాసికంలో 40 శాతానికి పడిపోవడం మరింత ఆందోళనకర అంశం. సాధారణ కార్మికులుగా పని చేస్తున్న మహిళల వాటా సంబంధిత కాలంలో 6.5 శాతం నుంచి 6 శాతానికి తగ్గింది. పీఎల్ఎఫ్ఎస్ రిపోర్ట్‌లో అధికారిక, అనధికారిక రంగాల్లోని ఉపాధి అవకాశాలను పరిగణనలోకి తీసుకుంది. స్వయం ఉపాధిలో కార్మికులుగా పని చేస్తున్న మహిళల వాటాలో తగ్గుదల అనేది అనధికారిక రంగంలో అవకాశాలు క్షీణిస్తున్నయనడానికి ప్రాథమిక సంకేతాలని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

సివిల్ సూట్లను విచారించే అధికారం ఐటీడీఏ పీవోలకు లేదు

- అది చట్ట వ్యతిరేకం
- విచారణాధికారం కలెక్టర్లదే
- పెండింగ్ సూట్లను వారికే బదిలీ చేయాలి :

హైకోర్టు కీలక తీర్పు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఏజెన్సీ ప్రాంతాల్లో సివిల్ సూట్లను విచారించే అధికారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి (పీవో)కి లేదంటూ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. విచారణా పరిధిని ప్రభుత్వ అదనపు ఏజెంట్లుగా పీవోకు ఇవ్వడం చెల్లదని స్పష్టం చేసింది. జిల్లా కలెక్టర్లకు మాత్రమే ఆ అధికారం ఉంటుందని తెలిపింది. పెండింగ్‌లో ఉన్న సూట్లను కలెక్టర్లకు బదిలీ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. 'ఏజెన్సీ చట్ట నిబంధనలు-1924' ప్రకారం సివిల్ సూట్లను ప్రభుత్వ ఏజెంట్‌గా ఉండే కలెక్టర్లే విచారించాలని తెలిపింది. 2002లో ఉట్నూరు ఐటీడీఏ పీవోకు అదనపు ఏజెంట్‌గా సివిల్ సూట్లను విచారించే పరిధిని అప్పగిస్తూ ఉమ్మడి ఆదిలాబాద్ కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులను కోర్టు రద్దు చేసింది. ఆ ఉత్తర్వులు చట్టవిరుద్ధమని పేర్కొంది. ఒక సివిల్ వివాదంలో డాక్యుమెంట్లను చేతి రాత నిపుణులకు పంపాలన్న అభ్యర్థనను తిరస్కరిస్తూ అదనపు ఏజెంట్, ఉట్నూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి(పీవో) జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ అదిలాబాద్ జిల్లా ఉట్నూరు మండలం హస్నాపూర్ గ్రామానికి చెందిన చవన్ ప్రకాశ్ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై ఇరుపక్షాల వాదనలు విన్న జస్టిస్ కె.శరత్ కీలక తీర్పు వెలువరించారు.

ఇదేం పారదర్శకత ?

దొడ్డిదారిన ఉపాధ్యాయుల డిప్యుటేషన్

- రంగారెడ్డి జిల్లా డీఈవో ఉత్తర్వులు జారీ
- ఆందోళనలో టీచర్లు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పాఠశాలలు, కాలేజీల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు బదిలీలు, డిప్యూటేషన్, ఆన్ డ్యూటీ (ఓడీ) వంటి వాటిని పారదర్శకంగా నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకోసం ప్రత్యేకంగా ఓ పోర్టల్‌ను అందుబాటులోకి తేవాలని నిర్ణయించింది. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఆహ్వానించి వాటిని పరిశీలించడం కోసం ఉన్నతాధికారులతో కమిటీని కూడా నియమించింది. ఇందులో కళాశాల విద్యాశాఖ, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఉన్నత విద్యామండలి కార్యదర్శి, ఇంటర్ విద్యాశాఖ డైరెక్టర్ సభ్యులుగా ఉంటారనీ, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారని ప్రకటించింది. అయితే బదిలీలు, డిప్యూటేషన్, ఓడీ వంటివి పారదర్శకంగా జరుగుతాయని అందరూ ఆశించారు. కానీ దొడ్డిదారిన డిప్యూటేషన్ ఉత్తర్వులు వెలువడుతుండడం పట్ల ఉపాధ్యాయుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం చుక్కాపూర్ ఎంపీపీఎస్‌లో ఎస్జీటీగా పనిచేస్తున్న పి శ్రీదేవిని అదే జిల్లా సరూర్‌నగర్ మండలం బొమ్మనగండి ఎంపీయూపీఎస్‌కు డిప్యూటేషన్ మీద పంపిస్తూ రంగారెడ్డి జిల్లా డీఈవో పి సుశీందర్‌రావు ఈనెల 20న ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె ఇక్కడ రెండేండ్ల వరకు కొనసాగుతారని స్పష్టం చేశారు. ప్రతినెలా హాజరు వివరాలను చుక్కాపూర్ ఎంపీపీఎస్ హెడ్మాస్టర్‌కు సరూర్‌నగర్ మండలం ఎంపీయూపీఎస్ హెడ్మాస్టర్ ఇవ్వాలని సూచించారు. ఈ ఉత్తర్వులు వెంటనే అమల్లోకి వస్తాయని వివరించారు. పారదర్శకత అంటే ఇదేనా?అని ఉపాధ్యాయులు విద్యాశాఖ అధికారులను ప్రశ్నిస్తున్నారు. దొడ్డిదారిన ఉపాధ్యాయుల డిప్యూటేషన్ ఉత్తర్వులను జారీ చేయడం పట్ల ఉపాధ్యాయ సంఘాలు విమర్శిస్తున్నాయి. అందరి ఉపాధ్యాయులకు ఒకే విధానాన్ని పాటించాలనీ, దొడ్డిదారిన జారీ చేసిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి.

జేఎన్‌యూ విద్యార్థులపై ఖాకీ వీరంగం

ఖండించిన ఎస్ఎఫ్ఐ



నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

జేఎన్‌యూ విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు దాడికి పాల్పడ్డారు. ఎంసీఎంని పెంచడం, బరాక్ హాస్టల్‌ను పున్నప్రారంభించడం, జీఎస్‌గ్యాస్, జేఎన్‌యూఈఈలను పునరుద్ధరించడం, క్యాంపస్ స్థలాన్ని నిర్మించడం వంటి డిమాండ్‌లతో వందలాది మంది విద్యార్థులు కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ కార్యాలయం వరకు లాంగ్ మార్చ్ నిర్వహించారు. వీరిపై పోలీసులు విరుచుకుపడ్డారు. ఈడ్చిపడేశారు. అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ దాడిని ఎస్ఎఫ్ఐ ఖండించింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఢిల్లీ కార్యదర్శి, జేఎన్‌యూఎస్‌యూ మాజీ అధ్యక్షురాలు ఐషీ ఘోష్ మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ఉన్నత విద్యపై దాడి చేస్తోందని విమర్శించారు. స్కాలర్‌షిప్‌లలో కోత విధించడంతో పాటు కొన్నింటిని రద్దు చేస్తోందని దుయ్యబట్టారు. రిజర్వేషన్ విధానాల ఉల్లంఘన, భిన్నాభిప్రాయాలను అరికట్టడం వంటి అన్ని అంశాల్లో దేశవ్యాప్తంగా ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను ఉక్కిరిబిక్కిరి చేస్తోందని విమర్శించారు. ఐషీ ఘోష్‌తో పాటు జేఎన్‌యూఎస్‌యూ వైస్ ప్రెసిడెంట్ అవిజిత్ ఘోష్, జేఎన్‌యుయూ ఎస్ఎఫ్ఐ కార్యదర్శి సాగర్, ఇతర ఎస్ఎఫ్ఐ నేతలను అరెస్టు చేశారు.

విద్యార్థినుల భద్రతపై నిర్లక్ష్యం వహించొద్దు

రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కేంద్రం మార్గదర్శకాలు

నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

విద్యార్థినుల భద్రతపై నిర్లక్ష్యం వహించొద్దని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కేంద్ర విద్యా శాఖ మంత్రిత్వ శాఖ మార్గదర్శకాలు విడుదల చేసింది. విద్యా సంస్థల్లో విద్యార్థినుల రక్షణను పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించింది. లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ (పోక్సో) చట్టంతో సమానంగా మార్గదర్శకాలు విడుదల చేసింది. ప్రభుత్వ ప్రభుత్వ ఎయిడెడ్, ప్రయివేట్ పాఠశాలల్లో జవాబుదారీతనంగా ఉండాలని తెలిపింది. అంతేకాకుండా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో తీసుకున్న చర్యలను తెలపాలని కోరింది. పిల్లల భద్రత విషయంలో నిర్లక్ష్యం ఉండొద్దని, 'జీరో టోలరెన్స్ పాలసీ'తో ఉండాలని నొక్కి చెప్పింది. పాఠశాలకు పిల్లలు హాజరు కావడానికి, వారు తిరిగి ఇండ్లకు వెళ్లడానికి చర్యలు తీసుకోవాలని సూచించింది.

ఇంజనీరింగ్‌లో మిగిలిన సీట్లు 11,836

5.579 మందికి అంతర్గత స్లైడింగ్ ద్వారా సీట్ల కేటాయింపు

ఎప్‌సెట్ ప్రవేశాల కమిటీ కన్వీనర్ శ్రీదేవసేన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్ కాలేజీల్లో అంతర్గత స్లైడింగ్ (ఒకే కాలేజీలో బ్రాంచ్ మార్పు చేర్పులకు అవకాశం) ప్రక్రియలో భాగంగా శనివారం సీట్లు కేటాయించారు. ఈ మేరకు ఎప్‌సెట్ ప్రవేశాల కమిటీ కన్వీనర్, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన ఒక ప్రకటన విడుదల చేశారు. అంతర్గత స్లైడింగ్ కోసం 10,300 మంది 27,935 వెబ్‌ఆప్షన్లను నమోదు చేశారని వివరించారు. అంతర్గత స్లైడింగ్‌లో 11,836 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అయితే 5,579 మందికి అంతర్గత స్లైడింగ్ ద్వారా సీట్లు కేటాయించామని పేర్కొన్నారు. అలాట్‌మెంట్ ఆర్డర్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఈనెల 25 నాటికి అదే కాలేజీలో కేటాయించిన బ్రాంచ్‌లో రిపోర్టు చేయాలని సూచించారు. ఇంజినీరింగ్ కాలేజీల్లో ఇంకా 11,836 సీట్లు మిగిలిపోయాయని వివరించారు. ఇతర వివరాల కోసం https.://tgeapcet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు. రాష్ట్రంలో 175 ఇంజినీరింగ్ కాలేజీల్లో 86,943 సీట్లున్నాయని తెలిపారు. ఇంజినీరింగ్ తుదివిడత కౌన్సెలింగ్ ప్రక్రియలో 75,107 (86.4 శాతం) మందికి సీట్లు కేటాయించామని పేర్కొన్నారు. ఇంజినీరింగ్ కోర్సుల్లో ఇంకా 11,836 (13.6 శాతం) సీట్లు మిగిలాయని తెలిపారు. అయితే ఆ సీట్లను భర్తీ చేసేందుకు స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియను నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలిసింది.

ప్రజా పత్రికకు శుభాకాంక్షలు



నవతెలంగాణ-చంపాపేట్

ప్రజా పత్రిక నవతెలంగాణకు నా హృదయపూర్వక వార్షికోత్సవ శుభాకాంక్షలు. అంకితభావంతో పని చేస్తున్న విలేకరులు, సిబ్బంది ఈ పత్రికకు ఆయువు పట్టు. సమాజం పట్ల గౌరవంతో, ప్రజల పట్ల నిబద్ధతతో పని చేస్తున్న పత్రిక నవతెలంగాణ. ప్రజా కోణంలో వార్తలు, విశ్లేషణలు అందిస్తూ ఎప్పటికప్పుడు నూతన ఉత్తేజంతో నవతెలంగాణ పాఠకులకు చేరువవుతోంది. 9 సంవత్సరాలు పూర్తి చేసుకుని 10వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా పత్రిక ఉన్నతికి కారణమైన ప్రతి ఒక్కరికి అభినందనలు. భవిష్యత్తులో ఇది మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నాను.

-ఎల్బీనగర్ ట్రాఫిక్ డీసీపీ వి. శ్రీనివాసులు

నవతెలంగాణకు హార్ధిక శుభాకాంక్షలు



నవతెలంగాణ-చంపాపేట్

నవతెలంగాణ దినపత్రిక 9 సంవత్సరాలు విజయవంతంగా పూర్తి చేసుకుని, 10వ వసంతంలో అడుగు పెడుతుండడంతో నవ తెలంగాణ యాజమాన్యానికి, శ్రేయోభిలాషులకు నా ప్రత్యేక హార్ధిక శుభాకాంక్షలు. ఒక నిబద్ధతతో వార్తను వార్తగా ప్రజల వద్దకు తీసుకెళ్లడంలో ఎన్నో ఉన్నత మైన ప్రమాణాలను నవతెలం గాణ పాటిస్తోందన్నారు. మీడియా ఫోర్త్ ఎస్టేట్ అని మనం ఎప్పటినుంచో చదువుకున్నాం.. అప్పటి నుంచి సమాజంలో ప్రెస్ అనేది ఓ ఇంపార్టెంట్ రోల్ ప్లే చేస్తోంది. నవతెలంగాణ ప్రతి విలేకరీతో ఎంతో ఆత్మీయ బంధం ఉంటుంది. ప్రజలను చైతన్య పరుస్తూనే తన ధర్మాన్ని పాటిస్తోంది. జర్నలిజంలో ప్రొఫెషనలిజంతోపాటు మానవీయ కోణంలో వార్తా కథనాలను ప్రచురిస్తారన్నారు. అధికారులతో సైతం మంచి సంబంధాలను కొనసాగిస్తారు. నవతెలంగాణ విజయవంతంగా ముందుకెళ్లాలని కోరుకుంటున్నాను.

- ఎల్బీనగర్ ట్రాఫిక్ ఏసీపీ నవీన్ రెడ్డి.



ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చండి

- జేఏసీ తెలంగాణ లౌకిక ప్రజాస్వామ్య వేదిక..

నవ తెలంగాణ - బంజారాహిల్స్

ఎన్నికల సమయంలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే నెరవేర్చాలని జేఏసీ తెలంగాణ లౌకిక ప్రజాస్వామ్య వేదిక డిమాండ్ చేసింది.శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జస్టిస్ చంద్రకుమార్, మన్నారం నాగరాజు, సొహేరా బేగం, రాములు తదితరులు హాజరై మాట్లాడారు.

దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమించిన ఉద్యమకారుల పరిస్థితి ఉందన్నారు. రాష్ట్రం ఏర్పడి పదేండ్లు పూర్తయినా ఇప్పటికీ ఉద్యమకారులపై కేసులు ఉండటం విచారకరమన్నారు. స్వరాష్ట్రం సిద్ధించిన తర్వాత అక్రమ కేసులు పోయి సంతోషంగా జీవిద్దాం అనుకున్న వారి ఆశలు అడియాశలు అయ్యాయన్నారు. దేశంలోని ఇతర ప్రాంతాలలో ఆయా రాష్ట్రాల సాధన కోసం ఉద్యమించిన వారికి ప్రత్యేక గుర్తింపు, ప్రభుత్వం తరఫున పెన్షన్లు ఇతర సౌకర్యాలు కల్పించి గౌరవించారని చెప్పారు. అందుకు భిన్నంగా 60 ఏండ్ల పాటు సాగిన ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులు ఇప్పటికీ కేసులతో సతమతం అవుతున్నారని చెప్పారు. వీటికి తోడు అన్నట్టుగా రాష్ట్ర సాధన అనంతరం ప్రజాస్వామ్య విధంగా పాలించాలని డిమాండ్ చేసినందుకు తిరిగి కేసులు బుక్ చేశారని అన్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల సమయంలో ఉద్యమకారులకు 240 గజాల స్థలం ఇస్తామని, అమరవీర కుటుంబాలకు న్యాయం చేస్తామని, ఇతర హామీలు గుప్పించిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 8 నెలలు గడుస్తున్నా నుంచి ఎలాంటి చర్యలు మొదలు పెట్టలేదని మండిపడ్డారు. ఎనిమిది నెలలుగా ఉద్యమకారులను గుర్తించే ప్రక్రియను ప్రారంభించకపోవడం ముఖ్యమంత్రికి ఉద్యమకారులపై ఉన్న నిబద్ధత అర్థమవుతుందన్నారు. ఇప్పటికైనా మాజీ న్యాయమూర్తి చైర్మెన్ నిస్వార్థంగా ఉద్యమించిన ఉద్యమకారులు, ఆనాటి చరిత్రకు సాక్షాలుగా ఉన్న పాత్రికేయులతో పాటు ఇతరులచే ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసి ఉద్యమకారులను గుర్తించాలని డిమాండ్ చేశారు.

పేదల పక్షాన పోరాడే నవతెలంగాణ



నవతెలంగాణ-చంపాపేట్

విజయవంతంగా 9 వసంతాలు పూర్తి చేసుకుని 10వ వసంతంలోకి అడుగుపెడుతున్న నవతెలంగాణ దినపత్రికకు హార్ధిక శుభాకాంక్షలు. పేదల, కార్మికుల, కర్షక, బడుగుబలహీనుల పక్షాన నిలబడి ఈ 9సంవత్సరాలు విజయవంతంగా పూర్తిచేసుకోవడంలో ఎంతో కృషి ఉంది. పేదల పక్షాన నిలబడి వారి సమస్యలను నవతెలంగాణ దిన పత్రిక అధికారులకు, ప్రభుత్వానికి, సమాజం దృష్టి తీసుకు రావడం, తద్వార సమస్యలను పరిష్కరించే విధంగా వారు ప్రయత్నం చేయడం ఎంతో హర్షించ తగ్గ విషయం. నిర్భయంగా, నిజాన్ని నిష్పక్ష పాతంగా చాటుతున్న నవతెలంగాణ దినపత్రిక ముందుముందు ఎన్నో వసంతాలు పూర్తి చేసుకోవాలని ఆకాంక్షిస్తున్నాను.

- ఎల్బీనగర్ ట్రాఫిక్ సీఐ ఎండీ సర్వర్ అహ్మద్

ప్రజా గొంతుకగా నిలుస్తున్న నవతెలంగాణ



నవతెలంగాణ-చంపాపేట్

సమాజ మార్పు కోసం ప్రగతిశీల భావాలతో ముందుకు సాగుతూ.. ప్రజా ఉద్యమాలకు అండగా నిలబడుతూ.. పదో వసంతంలోకి ప్రవేశిస్తున్న నవతెలంగాణకు వార్షికోత్సవ శుభాకాంక్షలు. పేదల, కార్మికుల, కర్షక, బడుగుబలహీనుల పక్షాన నిలబడి ఈ 9సంవత్సరాలు విజయవంతంగా పూర్తిచేసుకోవడంలో ఎంతో కృషి ఉంది. నిజాలను నిర్భయంగా చెబుతూ ప్రజా గొంతుకగా నిలుస్తున్న ఏకైక పత్రిక నవతెలంగాణ దినపత్రిక. ప్రజా పక్షం వహిస్తూ, పాలక ప్రభుత్వ విధానాలను నిషితంగా విమర్శిస్తూ ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్న ఏకైక దినపత్రిక నవతెలంగాణ.

- ఎల్బీనగర్ ట్రాఫిక్ సీఐ నాగరాజు

















Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

భారత వృద్ధి తగ్గొచ్చు..!

- గోల్డ్‌మాన్ సాచ్స్ అంచనా

న్యూఢిల్లీ : భారత వృద్ధి రేటు అంచనాలకు కోత పెడుతూ అంతర్జాతీయ బ్యాంకింగ్ దిగ్గజం గోల్డ్‌మన్ సాచ్స్ ప్రకటన చేసింది. ప్రస్తుత, వచ్చే ఏడాదిలో ముందుగా ఊహించిన దాని కంటే దేశ జీడీపీ తగ్గొచ్చని విశ్లేషించింది. భారత వృద్ధి 2024లో 6.7 శాతంగా, వచ్చే ఏడాది 6.4 శాతానికి పరిమితం కావొచ్చని ఓ రిపోర్ట్‌లో తెలిపింది. కేంద్ర ప్రభుత్వం ఖర్చులను తగ్గించుకోవడానికి అధిక ప్రాధాన్యతనివ్వడం వల్ల జీడీపీపై ప్రతికూల ప్రభావం పడుతుందని గోల్డ్‌మాన్ సాచ్స్ ఆర్థికవేత్త సంతను సేన్‌గుప్తా వెల్లడించారు. సార్వత్రిక ఎన్నికలు జరగడంతో ఈ ఏడాది మొత్తం ప్రభుత్వం పెట్టే ఖర్చు భారీగా తగ్గిందన్నారు.

టెస్లా వైస్ ప్రెసిడెంట్ శ్రీలా రాజీనామా



న్యూయార్క్ : అమెరికన్ విద్యుత్ కార్ల దిగ్గజ కంపెనీ టెస్లా వైస్ ప్రెసిడెంట్ శ్రీలా వెంకటరత్నం రాజీనామా చేశారు. భారతీయ సంతతికి చెందిన శ్రీలా 11 ఏండ్లుగా టెస్లాలో పలు కీలక బాధ్యతలను నిర్వర్తించారు. ఫైనాన్స్ ఆపరేషన్ డైరెక్టర్‌గా తన ఉద్యోగం ప్రారంభించి వైస్ ప్రెసిడెంట్ స్థాయికి ఎదిగారు. 2019 నుంచి వైస్ ప్రెసిడెంట్‌గా పదోన్నతి పొందారు. తన కుటుంబం, స్నేహితులతో కాలం గడపటానికి రాజీనామా చేస్తోన్నట్లు ఆమె ప్రకటించడం విశేషం. తానూ టెస్లాలో చేరిన తర్వాత 700 బిలియన్ డాలర్ల కంపెనీగా అవతరించిందని, ఇది తనకు చాలా సంతోషాన్ని కలిగించిందన్నారు. ఈ మేరకు తన రాజీనామాను లింక్డిన్‌లో పోస్ట్ చేశారు. కొంతకాలం పాటు విరామం తర్వాతే కొత్త అవకాశాల కోసం అన్వేషిస్తానని పేర్కొన్నారు. తన ఈ ప్రయాణంలో ఎన్నో విజయాలు సాధించినట్టు తన పోస్టులో తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ నెలలోనే ముగ్గురు టాప్ ఎగ్జిక్యూటివ్‌లు టెస్లాను వీడటం గమనార్హం.

గుండె దడ ఫీచర్‌తో గెలాక్సీ వాచీలు



గూర్‌గావ్ : ప్రముఖ ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సామ్‌సంగ్ తన గెలాక్సీ వాచీల కోసం తన హెల్త్ మానిటర్ యాప్‌లో ఇర్రెగ్యులర్ హార్ట్ రిథమ్ నోటిఫికేషన్ (ఐహెచ్‌ఆర్‌ఎన్) ఫీచర్‌ను తీసుకొచ్చినట్లు తెలిపింది. ఇది గుండె లయలను గుర్తించడంలో సహాయపడుతుందని పేర్కొంది. యాప్‌లో ఉన్న బ్లడ్ ప్రెజర్, ఎలక్ట్రో కార్డియోగ్రామ్ మానిటరింగ్ ఫీచర్లు ఉంటాయని వెల్లడించింది. ఈ కొత్త ఫీచర్ వినియోగదారులకు హృదయ ఆరోగ్యంపై మరింత లోతైన పరిజ్ఞానాన్ని అందిస్తుందని పేర్కొంది. ఐహెచ్‌ఆర్‌ఎన్ ఫీచర్ గెలాక్సీ వాచ్ 7 అల్ట్రా, గెలాక్సీ వాచ్ 7, 6, 5, 4 సిరీస్‌లలో అందుబాటులో ఉంటుందని పేర్కొంది.

అమెజాన్ డెలివరీ భాగస్వాములకు విశ్రాంతి కేంద్రాలు

హైదరాబాద్ : తమ డెలివరీ భాగస్వాములకు విశ్రాంతి కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు అమెజాన్ ఇండియా తెలిపింది. ప్రాజెక్ట్ ఆశ్రయ్ పేరుతో దేశ వ్యాప్తంగా రాబోయే సంవత్సరాల్లో వీటిని అందుబాటులోకి తేనున్నట్టు పేర్కొంది. డెలివరీ అసోసియేట్‌ల ఆరోగ్యానికి మద్దతివ్వాలనే యోచనతో ఉద్యాస ఫౌండేషన్ సహకారంతో పలు మెట్రో నగరాల్లో అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొంది. ఇతర కంపెనీలకు చెందిన డెలివరీ ప్రతినిధులు కూడా ఈ కేంద్రాల్లో విశ్రాంతి తీసుకోవచ్చని పేర్కొంది. ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉండే ఈ కేంద్రాల్లో ఒకేసారి 15 మంది వరకు విశ్రాంతి పొందవచ్చని పేర్కొంది. అన్ని వసతులు ఉండే ఇచ్చట ఒక్కో డెలివరీ ప్రతినిధి రోజులో 30 నిముషాలు గడపవచ్చని తెలిపింది.

రూ.2వేల కోట్లతో ది స్క్వేర్ ప్రాజెక్టు

- ఐరా రియాల్టీ వెల్లడి

నవ తెలంగాణ - హైదరాబాద్ :



ఐరా రియాల్టీ కొత్తగా ఆదిబాట్లలో ది స్క్వేర్ పేరుతో విల్లా ప్రాజెక్టును చేపడుతోంది. దీన్ని శనివారం నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి లాంచనంగా ప్రారంభించారు. 13.5 ఎకరాలలో విస్తరించి ఉన్న ఈ ప్రాజెక్ట్ 3700 చదరపు అడుగుల విస్తీర్ణంతో విశాలమైన 131 యూనిట్ల 4బిహెచ్‌కె విల్లాలను కలిగి ఉందని ఐరా రియాల్టీ చైర్మన్ నర్సిరెడ్డి తెలిపారు. ప్రతి విల్లాలో ఇంటి ఆటోమేషన్, ల్యాండ్స్కేప్డ్ గార్డెన్లు, చెట్లతో కప్పబడిన మార్గాలు, ప్రశాంతమైన, అధునాతన జీవన వాతావరణంతో వీటిని అందుబాటులోకి తెస్తున్నామన్నారు. ఈ ప్రాజెక్టు విలువ రూ.2000 కోట్లుగా ఉంటుందన్నారు.

ఐపిఒకు హీరో మోటార్స్

న్యూఢిల్లీ : హీరో గ్రూప్‌నకు చెందిన ఆటో కాంపొనెంట్ సంస్థ అయిన హీరో మోటార్స్ ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ)కు రానుంది. ఇందుకోసం సెబీకి ప్రాథమిక పత్రాల (డీఆర్‌హెచ్‌పి)ను సమర్పించింది. ఈ ఇష్యూ ద్వారా రూ.900 కోట్ల నిధులు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. కంపెనీ ప్రమోటర్లు ఒపి ముంజల్ రూ.250 కోట్ల విలువైన షేర్లను ఒఎఫ్‌ఎస్ ద్వారా విక్రయించనున్నారు. ఈ సంస్థ ద్విచక్ర వాహనాలు, ఇ బైక్స్, ఆఫ్‌రోడ్ వాహనాలు, విద్యుత్, హైబ్రిడ్ తదితర వాహనాలకు ఇంజిన్లు, ట్రాన్స్‌మిషన్ పరికరాలను సమకూర్చుతుంది.

స్టాక్ మార్కెట్‌లో నష్టాలు.. యువకుడి ఆత్మహత్య



- క్షమించండంటూ సెల్ఫీ వీడియో

నవతెలంగాణ-నస్పూర్

స్టాక్ మార్కెట్లో ట్రేడింగ్ చేసి నష్టపోయిన యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలోని అరుణక్క నగర్‌లో జరిగింది. శ్రీరాంపూర్ ఎస్ఐ సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం.. అరుణక్కనగర్‌లో నివాసం ఉంటున్న నమ్మబాజీ శ్రీకాంత్(29) మూడేండ్ల నుంచి స్టాక్ మార్కెట్లో ట్రేడింగ్ చేస్తున్నాడు. అందులో తీవ్రంగా నష్టపోయి, అప్పుల పాలయ్యాడు. ఆ బాధ భరించలేక మొబైల్ యాప్స్ నుంచి లోన్లు తీసుకున్నాడు. అవీ కట్టలేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకున్నాడు. అతనికి భార్య, కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. అయితే, ఆత్మహత్యకు ముందు శ్రీకాంత్ సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. అందులో "అందరూ నన్ను క్షమించండి.. ట్రేడింగ్ ద్వారా అప్పుల పాలయ్యాను. యాప్స్‌లో లోన్లు తీసుకున్నాను. వాటిని తిరిగి చెల్లించలేకపోతున్నాను.. అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నా.. కుటుంబ సభ్యులను ఇబ్బంది పెట్టకండి.." అంటూ ఆ వీడియోలో పేర్కొన్నాడు.ఆన్‌లైన్ యాప్స్‌లో లోన్లు తీసుకోవడం, ట్రేడింగ్ చేసి.. ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయి విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని ఎస్ఐ సంతోష్ యువతకు సూచించారు. ట్రేడింగ్ చేసి మీరు కష్టపడి సంపాదించిన డబ్బులు ఎవరూ వృథా చేసుకోవద్దని చెప్పారు.

పలు రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు..

- ఐఎండీ హెచ్చరిక

న్యూఢిల్లీ : దేశంలోని పలు రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవనున్నాయని భారత వాతావరణ కేంద్రం హెచ్చరికలు జారీచేసింది. రాజస్థాన్, మధ్యప్రదేశ్, నాగాలాండ్, మణిపూర్, మిజోరాం, త్రిపుర రాష్ట్రాల్లో ఆదివారం భారీ వర్షాలు పడే అవకాశముందని శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. గుజరాత్‌లో ఆదివారం నుంచి మంగళవారం వరకు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది.

రహదారులు కాదు.. రక్తపుటేరులు

"స్కూల్ పిల్లలు, గ్రానైట్, నిర్మాణరంగ కార్మికులు, చిరుద్యోగులు, ఇతరత్రా వర్కర్లు రాకపోకలు సాగించే రోడ్డుమార్గాల్లో నిత్యం నెత్తురు చిందుతోంది. ఆ రహదారుల మీదుగానే ముగ్గురు మంత్రులు ఖమ్మం వచ్చిపోతున్నా ఆ రూట్ల తీరు మాత్రం మారట్లేదు.. రక్తపుటేరులు ఆగట్లేదు.." గతంలోనూ ఇదే పరిస్థితి. నగరం విస్తరిస్తున్నా రోడ్లు మాత్రం మారడం లేదు.

- ఖమ్మం సమీపంలోని రూరల్ మండలంలో రోడ్డు ప్రమాదాలు
- కాల్వొడ్డు నుంచి మద్దులపల్లి వరకు.. రాపర్తినగర్ నుంచి ఏదులాపురం రోడ్డు వరకు .
- ట్రాఫిక్ సూచికలు.. నియంత్రణ లేక ప్రమాదాలు..
- హామీగానే మిగిలిన డివైడర్లు, సెంట్రల్ లైటింగ్
- ముగ్గురు మంత్రులు ఇవే మార్గాల్లో రాకపోకలు సాగిస్తున్నా మారని తీరు

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి/ ఖమ్మంరూరల్

ఖమ్మం నుంచి హైదరాబాద్.. వరంగల్.. కోదాడ మీదుగా విజయవాడ వెళ్లాల్సిన రోడ్లలో నిత్యం రక్తం చిందుతోంది. ఖమ్మం నుంచి ఖమ్మం రూరల్ మండలంలోకి.. తిరిగి ఖమ్మంలోకి ప్రవేశించే రహదారుల్లో ప్రమాదాలు స్వాగతం పలుకుతున్నాయి. ముఖ్యంగా ఖమ్మం కాల్వొడ్డు మొదలు మద్దులపల్లి వరకు.. ఇటు బైపాస్‌రోడ్డులో రాపర్తినగర్ మొదలు ఏదులాపురం పెట్రోల్ బంక్, శ్రీ సిటీ వరకు నిత్యం రోడ్లు రక్తసిక్తమవుతున్నాయి. ట్రాఫిక్ నియంత్రణ, సూచికలు లేకపోవడం ఓ కారణమైతే.. రోడ్లపై డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ సౌకర్యం కల్పించకపోవడం మరో కారణం. ఎప్పటి



నుంచో ఈ మార్గాల్లో డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ సౌకర్యం కల్పిస్తామని హామీలు ఇస్తున్న ప్రభుత్వాలు.. వాటిని వాగ్దానాలకే పరిమితం చేశాయి.

నిత్యం ఆ మార్గాల్లో ఎక్కడో ఒకచోట నెత్తురు చిందాల్సిందే..!

నెత్తుటి జాడలు..

సరైన ట్రాఫిక్ నియంత్రికలు లేకపోవడం.. సూచనబోర్డులు, కనీసం రేడియం స్టిక్కర్లు కూడా లేకపోవడంతో ఈ రెండు రోడ్డుమార్గాల్లో అనేక దుర్ఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

- సరిగ్గా ఏడాదిన్నర క్రితం తన 8 ఏండ్ల కూతురిని తీసుకుని తండ్రి ఖమ్మంలోని స్కూల్‌కు బయలుదేరాడు. కరుణగిరి సమీపంలోని పెట్రోల్‌బంక్ వద్దకు రాగానే వెనుక నుంచి వేగంగా లారీ వచ్చి ఢీకొట్టింది. అంతే ఆ చిన్నారి బైక్ పై నుంచి కిందపడి అక్కడికక్కడే ప్రాణాలు వదిలింది. పుస్తకాలు చెల్లాచెదురుగా రోడ్డుపై పడ్డాయి. కాగితాలు ఎర్రబారాయి.
- ఈ ప్రమాదానికి కొద్దిరోజుల తర్వాత సరిగ్గా ఇక్కడే బైక్‌పై వెళ్తున్న భవన నిర్మాణ కార్మికున్ని కారు ఢీకొట్టింది. 'ఆయన రెక్కాడితే గానీ డొక్కాడని' ఆ కుటుంబం రోడ్డున పడింది. వెంట తీసుకెళ్తున్న టిఫిన్ బాక్స్ మూత ఊడటంతో రోడ్డంతా అన్నం.. నెత్తురుతో తడిసిన దృశ్యం చూసిన ప్రతి ఒక్కరికీ కంటనీరు తెప్పించింది.
- ఖమ్మంలోని హాస్టల్ ఉంటున్న తన కూతురి ఆరోగ్య పరిస్థితి బాగోలేదని ఫోన్ రావడంతో దంపతులు ఉదయాన్నే బైక్‌పై బయలుదేరారు. సరిగ్గా 8 గంటలకు ఏదులాపురం పెట్రోల్ బంక్ సమీపంలోకి రాగానే వెనుక నుంచి లారీ



ఢీకొట్టడంతో దంపతులిద్దరూ కిందపడిపోయారు. కుడివైపు రోడ్డుమీద భార్య, ఎడమవైపు రోడ్డు కింద భర్త పడిపోయారు. రోడ్డుమీద పడిన భార్య మీదుగా లారీ వెళ్లడంతో విలవిలాడుతూ భర్త చేతిలో ప్రాణాలు విడిచింది.
- కవల సోదరులను సైతం మద్దులపల్లి వద్ద రోడ్డు ప్రమాదం పొట్టన పెట్టుకుంది. పోలీస్ ఉద్యోగాల కోసం ప్రిపేరవుతున్న 22 ఏండ్ల కవల యువకులు, వారి స్నేహితుడు బైక్‌పై కూసుమంచి వెళ్తుండగా మద్దులపల్లి వద్ద టాటా ఏస్ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కవల సోదరులు దుర్మరణం పాలుకాగా.. వారి స్నేహితుడు ప్రాణాపాయంలో చిక్కుకున్నాడు.
- పొన్నెకల్లు వద్ద రోడ్డుపై డివైడర్లు ఏర్పాటు చేసినా రేడియం స్టిక్కర్లు లేకపోవడంతో అర్ధరాత్రి బైక్‌పై వెళ్తున్న బోరు డ్రిల్లింగ్ ఆపరేటర్, అతని స్నేహితుడు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఆపరేటర్ అక్కడికక్కడే మృతిచెందాడు.
- సరిగ్గా ఏడాదిన్నర క్రితం తన కుమారున్ని పరీక్ష కేంద్రం నుంచి తీసుకొని వస్తున్న ఓ జర్నలిస్టు బైక్‌ను బైపాస్‌రోడ్డు మున్నేరుబ్రిడ్జిపైన ఓ లారీ ఢీకొట్టింది. సుమారు వంద మీటర్ల దూరం వరకు బైక్‌ను అతన్ని లాక్కుని వచ్చింది. సరిగ్గా ఇదే సమయంలో ఆ మార్గంలో వస్తున్న అప్పటి ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి తన కాన్వాయ్‌ను ఆపి ప్రాణాపాయ స్థితిలో ఉన్న జర్నలిస్టును ఆస్పత్రికి తరలించారు.

ప్రాణాలు పోతున్నా.. హామీలు నెరవేరకపాయె..



గతంలో కందాల ఉపేందర్‌రెడ్డి పాలేరు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఈ మార్గాల్లో డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ సౌకర్యం కల్పిస్తానన్నారు. ఆ తర్వాత పాలేరు ఎమ్మెల్యేగా ఎన్నికైన పొంగులేటి శ్రీనివాసరెడ్డి రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఆయన నియోజకవర్గం నుంచి జిల్లా కేంద్రానికి రాకపోకలు సాగించాల్సి వస్తే ఈ రెండు రూట్లలోనే ప్రయాణించాల్సి ఉంటుంది. ఇక వ్యవసాయశాఖ, చేనేత, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నివాసం ఉండేది రూరల్ మండలంలోని బారుగూడెం పరిధిలో ఉన్న శ్రీ సిటీలోనే.. అక్కడి నుంచి ఆయన తన నియోజకవర్గ కేంద్రం ఖమ్మానికి ఈ రెండు మార్గాల్లోనే నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మొదలు వీఐపీలు సైతం ఖమ్మం వచ్చేది ఈ రెండు రూట్లలోనే కానీ ఈ రోడ్డుమార్గాల బాగోగులు ప్రభుత్వంలో ఉన్న వారికి పట్టడం లేదు. ఫలితం అనునిత్యం రోడ్డు ప్రమాదాలు. ఖమ్మంలోని పాతబస్టాండ్‌కు వెళ్లాలన్నా.. కొత్తబస్టాండ్‌కు చేరాలన్నా.. ఈ రెండు రహదారుల మీదుగానే పయనించాలి. ఖమ్మం మీదుగా రాజమండ్రి, భద్రాచలం, కొత్తగూడెం, చత్తీస్‌గఢ్ రాష్ట్రానికి వెళ్లే భారీ వాహనాలు సైతం ఈ రూట్లలోనే పయనిస్తుంటాయి. నిత్యం ఈ రోడ్డు మార్గాల్లో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా ట్రాఫిక్ సూచిక బోర్డులు కానీ, నియంత్రించే పోలీసు వ్యవస్థ గానీ ఇక్కడ ఎక్కడా ఉండకపోవడం గమనార్హం. ఈ మార్గాల్లో చోటుచేసుకుంటున్న ప్రమాదాలు.. అవి మిగుల్చుతున్న విషాదాలను తలచుకుంటే కండ్లు ద్రవిస్తున్నాయి.

డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి

ఈ రెండు మార్గాల్లో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ హామీలు హామీలుగానే మిగిలాయి. ఇప్పటికైనా మంత్రులు, అధికారులకు కనువిప్పు కలగాలి. ఇచ్చిన మాట ప్రకారం డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసి, రేడియం స్టిక్కర్లు, ట్రాఫిక్ సంకేతాలు ఏర్పాటు చేయాలి.



-బండి రమేశ్ , సీపీఐ(ఎం) పాలేరు డివిజన్ కార్యదర్శి

రుణమాఫీ చేయకుంటే అసెంబ్లీని ముట్టడిస్తాం

- షరతులు లేకుండా అందరికీ వర్తింపజేయాలి
- ఆర్మూర్‌లో రైతుల భారీ ధర్నా
- ఖమ్మంలో సీపీఐ(ఎం), రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన



నవతెలంగాణ- విలేకరులు

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయకుంటే అసెంబ్లీని ముట్టడిస్తామని రైతు ఐక్యకార్యాచరణ కమిటీ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. శనివారం నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలోని మామిడిపల్లి సెయింట్‌పాల్ స్కూల్ వద్ద రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో చలో ఆర్మూర్ కార్యక్రమంలో భాగంగా పెద్దఎత్తున నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రైతు ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు ప్రభాకర్, పి.తిరుపతిరెడ్డి, లింగారెడ్డి, దేగం యాదగౌడ్, నూతల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. ఎలాంటి షరతులూ లేకుండా ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు, ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రైతు ఐక్య కార్యాచరణ కమిటీ డిమాండ్

రుణమాఫీపై ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలంలో రైతు సంఘం, ఖమ్మం రూరల్ మండలం కాచిరాజుగూడెంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో రైతులు ప్రధాన రహదారిపై ఆందోళన చేపట్టారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్లలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అందరికీ పూర్తిగా షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వంశీకృష్ణ పాల్గొన్నారు. అశ్వారావుపేటలో రైతుసంఘం ఆధ్వర్యంలో రైతు వేదిక వద్ద ఆందోళన చేపట్టారు.

ఆత్మకూరులోనూ..

రుణమాఫీపై కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని, రాష్ట్రంలో సగం మందికి కూడా రుణమాఫీ చేయకపోవడం దారుణమని పరకాల మాజీ శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి అన్నారు. వరంగల్ జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో రైతులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట మేరకు ఎలాంటి షరతులూ లేకుండా రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

అమెరికాతో భారత్ రక్షణ ఒప్పందం

- పెంటగాన్‌లో లాయిడ్, రాజ్‌నాథ్ సింగ్ భేటీ

వాషింగ్టన్ : అమెరికాతో భారత్ తాజాగా మరో రక్షణ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, అమెరికా రక్షణ మంత్రి ఆస్టిన్ లాయిడ్‌తో కలసి పెంటగాన్‌లో ఒప్పందంపై సంతకాలు చేశారు. కీలకమైన జాతీయ భద్రతకు విషయంలో ఈ సెక్యూరిటీ ఆఫ్ సప్లై అరేంజ్‌మెంట్ (సోసా) ఒప్పందం ఒక ముఖ్యమైన మైలురాయి వంటిదని అమెరికన్ రక్షణ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. అమెరికా స్పాన్సర్డ్ సోసాలో భారత్ 18వ భాగస్వామిగా ఉంది. ఇప్పటికే బ్రిటన్, ఇజ్రాయిల్, వివిధ యూరోపియన్ యూనియన్ దేశాలు, ఆస్ట్రేలియా, దక్షిణ కొరియా తదితర దేశాలు ఈ సోసా లో చేరాయి. రక్షణ పరిశ్రమలో అమెరికా, భారత్ మధ్య సహకార విస్తరణకు 2023లో రూపొందించిన రోడ్ మ్యాప్‌లో భాగంగానే సోసా ఒప్పందంలో భారత్ చేరినట్లు అమెరికన్ రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. దీనిని ధ్రువీకరిస్తూ భారత రక్షణ మంత్రిత్వశాఖ శుక్రవారం ఒక ప్రకటన విడుదలజేసింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నాలుగు రోజుల అధికారిక పర్యటనలో భాగంగా అమెరికాకు చెందిన ప్రముఖ రక్షణ కంపెనీలతో చర్చలు జరిపారు. మేక్ ఇన్ ఇండియా కార్యక్రమాన్ని శ్రీఘ్రతరం చేసేందుకు భారత భాగస్వాము లతో కలిసి పనిచేసేందుకు రావాల్సిందిగా వారిని ఆహ్వానించామని రాజ్‌నాథ్ సింగ్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. అమెరికా రక్షణ పరిశ్రమ అధిపతులతో యుఎస్ఐఎస్‌పిఎఫ్ (యుఎస్ ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్ ఫోరమ్) బోర్డు సభ్యులతో జరిపిన విందు సమావేశంలో విజన్ 2047లో అమెరికన్ కంపెనీల నుండి వచ్చే పెట్టుబడులు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. అమెరికా రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్‌తో భేటీ తరువాత అమెరికా జాతీయ భద్రతా సలహాదారు సులివాన్‌తో చర్చించారు. ఇరు దేశాల మధ్య రక్షణ సహకారాన్ని విస్తృతం చేయడంపై చర్చించారు.

అదృశ్య గోదావరిపై ఆరేళ్ల క్రితమే నివేదిక

- 4 అంశాలపై 29 సంవత్సరాల అధ్యయనం
- ఇద్దరు ముఖ్యమంత్రులకు నివేదించిన నిపుణులు
- అయినా పట్టించుకోని పాలకులు

అమరావతి : గోదావరి జలాలు నదీ గర్భంలోనే పెద్ద ఎత్తున అదృశ్యమౌతున్నాయంటూ ప్రజాశక్తి ప్రచురించిన కథనం కలకలం రేపింది. నీటిపారుదల శాఖ వర్గాలతో పాటు, ఆ రంగానికి చెందిన నిపుణుల్లో చర్చనీయాంశమైంది. ఇప్పటికే వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఉండటంతో ప్రాజెక్టు భవితవ్యంపై కూడా ఆందోళన వ్యక్తమవుతోంది. మరోవైపు, గోదావరిలో పెద్ద మొత్తంలో నీళ్లు అదృశ్యమౌతున్నాయంటూ కేంద్ర జలవనరుల సంఘం రూపొందించిన నివేదిక కనీసం ఆరు సంవత్సరాల క్రితం రాష్ట్ర ప్రభుత్వానికి అందినట్లు సమాచారం. నిజానికి అంతకు కొన్ని సంవత్సరాల ముందే ఈ సమాచారం ప్రభుత్వానికి అందిందని తెలిసింది.



ఎంత నీరు మాయం...?

అత్యధికంగా 15.08.1983 న కోయిదా వద్ద 58,616 క్యూసెక్కుల ప్రవాహం నమోదు కాగా, అక్కడికి 53 కిలోమీటర్ల దూరం ఉన్న పోలవరం వద్ద 40,176 క్యూసెక్కుల నీటి ప్రవాహం మాత్రమే నమోదైంది.

అంటే,17,900 క్యూసెక్కుల (55 టిఎంసిలు) నీరు మాయమైంది. 29 సంవత్సరాల కాలంలో ఒక్కరోజులో లీకేజి అయిన నీటిలో ఇది అత్యధికం! ఈ అధ్యయనం ఆధారంగా భారీ వరద ప్రవాహం ఉన్న సమయంలో సగటున రోజుకు 28 టిఎంసీల నీరు నష్టపోతున్నట్లు నిపుణులు లెక్క తేల్చారు.



మా టీచర్ మాకే కావాలి..

- తల్లిదండ్రులతో కలిసి విద్యార్థుల రాస్తారోకో
- డిప్యూటేషన్ రద్దు చేయాలని డిమాండ్

నవతెలంగాణ-దుబ్బాకరూరల్

నెల రోజుల కిందట తమ పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయురాలిని డిప్యూటేషన్ పేరుతో వేరే గ్రామానికి పంపారని.. ఆ ఉపాధ్యాయురాలని తమ పాఠశాలలోనే కొనసాగించాలని విద్యార్థులు నిరసన చేపట్టారు. తల్లిదండ్రులతో కలిసి జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట భూంపల్లి మండల పరిధిలోని చిట్టాపూర్ ప్రైమరీ పాఠశాలకు నెల రోజుల కిందట ఉపాధ్యాయురాలు భాగ్యలక్ష్మి బదిలీపై వచ్చారు. అయితే, ఆమెను డిప్యూటేషన్ పేరుతో మరో గ్రామానికి ఉన్నతాధికారులు పంపారు. దాంతో.. టీచర్‌ను తమ పాఠశాలలోనే కొనసాగించాలని కోరుతూ.. విద్యార్థులు, తల్లిదండ్రులు, చిట్టాపూర్ గ్రామస్తులు రామాయంపేట-సిద్దిపేట జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భాగ్యలక్ష్మి టీచర్‌ను తమ పాఠశాలకే కేటాయించాలని డిమాండ్ చేశారు. డిప్యూటేషన్‌ను వెంటనే రద్దు చేయాలని డీఈవో, ఎంఈఓను కోరారు. సుమారు గంటపాటు ట్రాఫిక్ జామ్ కావడంతో పోలీసులు ఘటనా స్థలానికి వచ్చారు. వారితో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు.

బుల్డోజర్లతో ఇండ్ల కూల్చివేత ఆందోళనకరం

- మల్లికార్జునఖర్గే, ప్రియాంకగాంధీ

న్యూఢిల్లీ : మైనారిటీలను బీజేపీ లక్ష్యంగా చేసుకుంటోందని, బుల్డోజర్లతో వారి ఇండ్లను కూల్చివేయడం అన్యాయమని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే విమర్శించారు. శనివారం ఈ మేరకు సోషల్ మీడియా ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'ఒకరి ఇంటిని కూల్చివేయడం. వారి కుటుంబాన్ని నిరాశ్రయులను చేయడం అమానవీయం, అన్యాయం. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మైనారిటీలపై పదే పదే దాడులు జరగడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. రూల్ ఆఫ్ లా ప్రకారం పరిపాలించే సమాజంలో ఇలాంటి చర్యలకు చోటు లేదు. పౌరులలో భయాన్ని కలిగించడానికి బుల్డోజింగ్‌ను ఉపయోగించడాన్ని కాంగ్రెస్ తీవ్రంగా ఖండిస్తుంది. అరాచకం సహజ న్యాయాన్ని భర్తీ చేయదు. నేరాలపై కోర్టులు తీర్పులిస్తాయి. ప్రభుత్వం ప్రాయోజిత బలవంతం ద్వారా కాదు' అని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు. భోపాల్‌లో పోలీసు అధికారులను లక్ష్యంగా చేసుకుని రాళ్లదాడికి పాల్పడిన ఘటనలో నిందితుడైన కాంగ్రెస్ నేత హాజీ షెహజాద్ అలీ బంగ్లాను అధికారులు ఇటీవల కూల్చేసిన నేపథ్యంలో ఖర్గే ఈ మేరకు స్పందించారు.

బుల్డోజర్ న్యాయం ఆమోదయోగ్యం కాదు : ప్రియాంకగాంధీ

మధ్యప్రదేశ్‌లోని చత్తార్‌లో నిరసనలో పాల్గొన్న వ్యక్తి ఇంటిని కూల్చివేయడం ఆమోదయోగ్యం కాదని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకగాంధీ పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో ఆమె పోస్ట్ చేశారు. 'నేరారోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి నేరం చేస్తే కోర్టు వారిని శిక్షిస్తుంది. అతనిని శిక్షించడం, వారి ఇంటిని కూల్చివేయడం అంటే చట్టాన్ని పాటించకపోవడమే. ప్రభుత్వాలు నేరస్థుల్లా ప్రవర్తించకూడదు. బుల్డోజర్‌తో న్యాయం చేయడం ఆమోదయోగ్యం కాదు. కూల్చివేతలు వెంటనే ఆపేయాలి' అని ఆమె పేర్కొన్నారు.

చెరువులో మునిగి గ్యాంగ్‌రేప్ నిందితుడి మృతి

- తప్పించుకునే ప్రయత్నంలో మరణించాడన్న పోలీసులు

గౌహతి: అస్సాం నగావ్ జిల్లాలో ట్యూషన్ నుంచి ఇంటికెళ్తున్న పదో తరగతి విద్యార్థినిపై లైంగికదాడి కేసులో నిందితుడు చెరువులో మునిగి శనివారం మరణించాడు. పోలీసుల కథనం ప్రకారం ఈ కేసులో ముగ్గురు నిందితుల్లో తఫుజల్ ఇస్లాం పోలీసులకు చిక్కాడు. మిగిలిన ఇద్దరూ పరారీలో ఉన్నారు. క్రైం సీన్ రీక్రియేట్ చేసేందుకు పోలీసులు నిందితుడిని శనివారం తెల్లవారుజామున 4 గంటలకు సంఘటనా స్థలానికి తీసుకెళ్లారు. పోలీసుల నుంచి తప్పించుకునే క్రమంలో నిందితుడు చెరువులో దూకాడు. ఎస్‌డీఆర్‌ఎఫ్ దళాలు రెండు గంటల పాటు గాలించిన తర్వాత నిందితుడి మతదేహం దొరికింది. చేతులకు ఉన్న బేడీలను.. కానిస్టేబుల్ నుంచి లాగేసి.. పరుగెత్తి, నిందితుడు చెరువులో దూకినట్లు ఓ పోలీసు అధికారి చెప్పారు. తమ కానిస్టేబుల్‌కు కూడా గాయాలయ్యాయని తెలిపారు. కోచింగ్ క్లాస్ నుంచి సైకిల్‌పై తిరిగి వస్తున్న సమయంలో బైక్‌పై వచ్చిన ముగ్గురు దుండగులు అడ్డగించి, 14 ఏండ్ల బాలికపై చెరువు వద్ద లైంగికదాడికి పాల్పడ్డారని పోలీసులు చెప్పారు. ఆ ప్రాంతంలో బాలిక అపస్మారక స్థితిలో వుండగా, స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే.

దీపిక

తెలంగాణ పరిచయాంశాలు/చరిత్ర పూర్వయుగం

తెలంగాణ పరిచయాంశాలు

- ఆరు దశాబ్దాల పాటు జరిపిన సుదీర్ఘ పోరాట ఫలితం నూతన తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది.
- భారతదేశంలో 29వ రాష్ట్రంగా తెలంగాణ రాష్ట్రం 2014, జూన్ 2న ఏర్పడింది.
- ఉద్యమ చరిత్రకు స్వస్తిపలికి ఒక నూతన అభివృద్ధి శకానికి శ్రీకారం చుట్టింది తెలంగాణ రాష్ట్రం.
- మాతృభాష తెలుగైనప్పటికీ 1948 వరకు తెలుగు వాడుకలో లేదు.
- ప్రభుత్వ వ్యవహారాల విషయంలో గానీ పాఠశాల విద్యాభ్యాసంలో గానీ ఉర్దూ భాష వాడుకలో ఉండేది.
- గ్రామాధికారుల, భూస్వాముల మత దురహంకారుల దౌష్ట్యాన్ని ఎదురించి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకై తమ ప్రాణాలనే అర్పించిన ఘనత తెలంగాణ రైతులు, కార్మికులు, సామాన్య ప్రజలకు దక్కింది.
- తెలుగు ప్రజలు ఎక్కడున్నా అందరూ ఒకే గొడుగు కిందకి రావాలనే ఆశయం తెలంగాణ ప్రజలను స్వాగతించినప్పటికీ, మంత్రివర్గ పదవుల్లో, ఉద్యోగ నియామకాల్లో తమపట్ల, తమ ప్రాంతం పట్ల చూపిన వివక్షత, సమాన గౌరవ ప్రతిపత్తులు ఇవ్వలేదని ప్రజలలో, నాయకులలో గట్టిగా నాటుకోంది. దీని పర్యవసానమే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి దారి తీసింది.

తెలంగాణ పద ఆవిర్భావం

- తెలంగాణ అనే పదం అత్యంత ప్రాచీనమైంది.
- తెలంగాణలో జీవనదైన గోదావరిని 'తెలివాహ నది'గా పిలుస్తారు. అందువలన ఈ నది పరీవాహక ప్రాంతంలో నివసించే ప్రజలను త్రిలింగులుగా పిలిచేవారు.
- కాలక్రమంగా త్రిలింగ దేశంగానూ, తెలంగాణగానూ పేరు ఏర్పడింది.
- మలి మౌర్యుల కాలంలో వచ్చిన గ్రీకు రచనలులో కూడా ఈ పేరు కన్పిస్తుంది
- రాజ శాసనాల్లో త్రిలింగ, తిలింగ, తెలంగ అనే శబ్దాలను విరివిరిగా వాడారు.
- తెలంగాణ పదాన్ని సార్ధకం చేసి స్థిరపరిచిన ఘనత కాకతీయానంతర రచయితలకు దక్కింది.
- కాకతీయుల కాలంనుండి జరిగిన ముస్లిం దండయాత్రల కారణంగా తెలంగాణ అనే పేరు వ్యవహారికంగా మారింది.

తెలంగాణ పదం - శాసన ఆధారాలు

- క్రీ.శ.1417లో తెల్లాపూర్ (సంగారెడ్డి జిల్లా) శాసనంలో తెలంగాణ అనే పదం కన్పిస్తుంది.
- ప్రతాప రుద్రగణపతి వెలిచర్ల శాసనంలో, శ్రీకృష్ణ దేవరాయల తిరుమల చిన్న కంచి శాసనాల్లో తెలంగాణ పదం స్పష్టంగా పేర్కొనబడింది.
- కాకతీయుల కాలంలో కొన్ని బ్రాహ్మణ శాఖలను తెలంగాణ్యులు అనే వారు అంటే తెలంగాణకు చెందిన వారిగా పిలిచేవారు.
- తెలంగాణ పదంలో 'ఆణెము' అంటే దేశము కాబట్టి గోలకొండ స్థాపన సమయంలో కూడా తెలంగాణ పదంలో వాడకం బాగా ప్రాచుర్యాన్ని పొందింది.
- ఈ విధంగా నేటి తెలంగాణ అనే పదం రూపురేఖలు దిద్దుకుంటూ ఆవిర్భవించింది.


తెలంగాణ చారిత్రక ప్రాముఖ్యత

- తెలంగాణ చరిత్రకు విశేష ప్రాముఖ్యత ఉంది.
- చరిత్ర పూర్వ యుగం నుంచి సమకాలీన చరిత్ర వరకూ ఈ ప్రాముఖ్యత విస్తరించింది.
- పాత రాతి యుగానికి చెందిన పనిముట్లు ఆవాస స్థలాలు, తెలంగాణ రాష్ట్రంలోని పెద్దపల్లి జిల్లాలోని రామగుండం, గోదావరిఖని ప్రాంతాల్లో లభ్యమయ్యాయి.
- మానవ నాగరికతా ప్రగతి పథంలో ప్రధాన భూమిక వహించిన పాత, మధ్య, నవీన శిలాయుగాల సంస్కృతులకు తెలంగాణ రాష్ట్రం ఒక కేంద్ర బిందువుగా ఉంది.
- క్రీ.పూ. 6వ శతాబ్దంలో ఏర్పడిన జన పదాలలో ఒకటైన అస్మక జనపదం, నిజామాబాద్ ప్రాంతంలో ఉంది. అస్మక జనపదానికి నేటి బోధన్ రాజధానిగా ఉండేది.
- గౌతమ బుద్ధుని కాలంలో తెలంగాణ ప్రాంతం విశేషంగా విలసిల్లింది.
- శాతవాహనుల జన్మస్థలం నిజామాబాద్ ప్రాంతమని, మొదట ఇక్కడ స్థిరపడిన తర్వాతనే అమరావతి ప్రాంతాలకు వెళ్లారని ఆచార్య పరబ్రహ్మ శాస్త్రి గారి అభిప్రాయం.
- తెలంగాణలోని కొండాపురం (కొండాపూర్) శాతవాహనుల టంక శాల నగరం అని మల్లంపల్లి సోమశేఖర శర్మగారు చెప్పారు.
- వరంగల్లు సమీపంలో సాద్వవాహన పేరుతో కొన్ని నాణేలు లభ్యం అయ్యాయి.
- ఇక్ష్వాకుల వంశస్థుడైనా శాంత మూలుడు అస్మక, ములక ప్రాంతాలను (ప్రాచీన తెలంగాణ పేర్లు) జయించాడని బి.ఎస్.శాస్త్రిగారు తెలిపారు.
- విష్ణుకుండినుల కాలంలో తెలంగాణ ప్రాంతం ప్రభావం పెరిగింది. వీరు రాజ్య విస్తరణలో భాగంగా తమ స్వస్థలమైన తెలంగాణను వదిలి మహబూబ్‌నగర్, నల్గొండ ప్రాంతాల నుంచి తూర్పు దిశగా వేంగీకి చేరుకున్నారు.
- చాళుక్యుల కాలంలో ప్రసిద్ధి చెందిన భవభూతి క్రీ.శ. 7,8 శతాబ్దాల్లో తెలంగాణ ప్రాంతంలోనే వర్ధిల్లాడు.
- వేములవాడ చాళుక్యులు (క్రీ.శ. 750-973) మధ్య కాలంలో బోధన్, వేములవాడ కేంద్రాలుగా పశ్చిమోత్తర తెలంగాణ ప్రాంతమును పరిపాలించారు. దీన్ని 'సపాద లక్షదేశం'గా వ్యవహరించేవారు.
- గోదావరి నదికి దక్షిణాన, మంజీరా నది నుంచి మహాకాళేశ్వరం వరకూ వ్యాపించిన భూభాగాన్ని 'పోదనపాడు' అని వ్యవహరించేవారు.
- కళ్యాణీ చాళుక్యులు, కందూరు చోడుల కాలంలో సాంస్కృతికంగా, రాజకీయంగా తెలంగాణ ప్రాంతం అభివృద్ధి చెందింది.
- నల్గొండ దుర్గం, యాదాద్రి జిల్లాలోని కొలనుపాక, ఖమ్మం జిల్లాలోని నేలకొండపల్లి వంటి ప్రాంతాల ప్రస్తావన నాటి శాసనాల్లో విరివిగా కన్పిస్తుంది.
- తొలి కాకతీయులతో పాటు, ముదిగొండ చాళుక్యులు, పొలవాస నాయకులు, కందూరి చోడులు తెలంగాణలోని వివిధ ప్రాంతాలను పరిపాలించారు.
- కాకతీయుల యుగం నుండి కుతుబ్‌షాహీలు, అసఫ్ జాహీల పరిపాలనా కాలం వరకు, జరిగిన రాజకీయ, ఆర్థిక, సామాజిక సాంస్కృతిక పరిణామాలు తెలంగాణకు తిరుగులేని చారిత్రక ఉనికి, ప్రాధాన్యతను సంతరించి పెట్టాయి.
- చరిత్ర పూర్వ యుగం నుండి ఆధునిక యుగం వరకు తెలంగాణ చరిత్ర గర్వించదగ్గ విశిష్టత ఉంది.

తెలంగాణ చరిత్ర ఆధారాలు

- చరిత్రను పునర్నించడానికి గల ఆధారాలను ప్రధానంగా లిఖిత పూర్వక ఆధారాలు, పురావస్తు ఆధారాలుగా విభజించారు.
- భాష, లిపి లేకుండా అనేక వేల సంవత్సరాలు మానవులు జీవించారు. లిపి లేని దశను చరిత్ర పూర్వ యుగంగా పిలుస్తారు.

తెలంగాణ చరిత్ర - సంస్కృతి



- చరిత్ర పూర్వయుగ కాలానికి సంబంధించిన వివరాలు తెలుసు కోవడానికి పురావస్తు ఆధారాలు మాత్రమే ఉపయోగపడతాయి.

పురావస్తు ఆధారాలు

- నివాస స్థలాలకు సంబంధించిన అవశేషాలు, లేదా కట్టడాలు, శాసనాలు, నాణేలను పురావస్తు ఆధారాలుగా పరిగణిస్తారు.

సాహిత్య ఆధారాలు

- సాహిత్య లేదా లిఖిత పూర్వక ఆధారాలు ఏ ప్రాంతపు చరిత్ర తెలుసుకోవడానికైన ముఖ్యమైన ఆధారం.
- లిఖిత ఆధారాలను స్వదేశీ, విదేశీ రచనలుగా విభజించారు.
- స్వదేశీ రచనలను లౌకిక, మతపరమైన గ్రంథాలుగా వ్యవహరిస్తారు.

స్వదేశీ రచనలు

- మత గ్రంథాలలో వైదిక, బౌద్ధ, జైన గ్రంథాలు ప్రాచీన తెలంగాణ చరిత్రకు ఆధారాలు. ఉదా: ఆచార్య నాగార్జునుని రచనలు, వేములవాడ చాళుక్య రాజు రెండో అరికేసరి ఆస్థానకవి పంప రచించిన ప్రముఖ గ్రంథం 'ఆది పురాణం'.
- లౌకిక గ్రంథాలు ఆనాటి సామాజిక, ఆర్థిక స్థితిగతులు, రాజకీయ పరిస్థితులు పరిపాలనాంశాలు తెలియజేస్తాయి.
- పంప కవి రచించిన 'విక్రమార్క విజయం', విద్యానాథుడు రచించిన "ప్రతాపరుద్ర యశోభూషణం" అప్పటి సమాజ ఆర్థిక స్థితిగతులు తెలియజేస్తున్నాయి.
- కౌటిల్యుని 'అర్థశాస్త్రం'లోని అంశాలను సూక్ష్మంగా పరిశీలిస్తే దక్షిణాపథ వర్తక వ్యాపారాలను గూర్చి ప్రస్తావించిన అధ్యాయాల్లో, తెలంగాణకు సంబంధించిన ఆర్థిక స్థితిగతులు కనిపిస్తాయి..

విదేశీ రచనలు

- క్రీ.శ. తొలి శతాబ్దంలో వచ్చిన గ్రీకు రచనలు ప్రత్యక్షంగా, పరోక్షం గాను తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన విషయాలు తెలియ చేస్తాయి.
- ఉదాహరణకు "ఎర్ర సముద్రపు దినచర్య" అనే గ్రంథంలో తెలంగాణ ప్రాంతం నుండి ఆంధ్రా కోస్తా ప్రాంతానికి ఏ విధంగా వస్తువుల ఎగుమతులు, దిగుమతులు జరుగుతున్నవో తెలియజేస్తుంది.

తెలంగాణ మధ్యయుగ చరిత్రకు సంబంధించిన సాహిత్యాధారాలు

- ప్రొఫెసర్ హెచ్.కె. షేర్వానీ రచించిన 'ది కుతుబ్‌షాహీస్ ఆఫ్ గోల్కొండ'.
- డా.యస్.వెంకటరమణయ్య మరియు శ్రీమల్లంపల్లి సోమశేఖర శర్మ రచించిన 'ది కాకతీయాస్ ఆఫ్ వరంగల్'
- యజ్దాని (ఎడిటెడ్) 'ఎర్లీ హిస్టరీ ఆఫ్ ది డక్కన్, సంపుటి-II, భాగం-IX
- మారేమండ రామారావ్ 'కాకతీయ సంచిక'.
- పి.శ్రీనివాసాచార్ 'పొలిటికల్, సోషల్ అండ్ రెలిజియస్ కండిషన్స్ ఆఫ్ ది దక్కన్ అండర్ ది కాకతీయాస్' ఇన్ ది ప్రొసీడింగ్స్ ఆఫ్ ది హైదరాబాద్ ఆర్కియోలాజికల్ అండ్ హిస్టారికల్ సొసైటీ, జనవరి టు ఆగస్టు 1941, మొదలైనవి మధ్యయుగానికి సంబంధించిన సాహిత్యాధారాలు.

తెలంగాణ ఆధునిక చరిత్రకు ఆధారాలు

- ఆధునిక తెలంగాణ చరిత్ర అంతా అసఫ్ జాహీల పాలనతో నిండి ఉంది.
- ప్రభుత్వ శాఖల కార్యకలాపాలు, ఉత్తర ప్రత్యుత్తరాలు, పారశీక, అరబిక్ భాషల పదజాలం, ఉర్దూ భాషలో ఉండేవి.
- ఆసఫ్ జాహీల పాలనకు సంబంధించిన సాహిత్య ఆధారాలు చాలా ఉన్నాయి.
- సుబేదారీ రికార్డులు, ప్రభుత్వ శాఖలకు సంబంధించిన రెవెన్యూ రికార్డులు, అడ్మినిస్ట్రేటివ్ రిపోర్ట్స్, అగ్రికల్చరల్ స్టాటిస్టిక్స్, ఇండ స్ట్రియల్ స్టాటిస్టిక్స్, సెన్సెస్ రిపోర్ట్స్, విలేజ్ లిస్ట్స్, స్టాటిస్టికల్ ఆబ్జెక్స్, ఎకనామిక్ సర్వే రిపోర్ట్స్ మొదలగునవి ఉన్నాయి.
- వరంగల్ సుబా (విభజన పూర్వపు వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలు) పైన డా.వి. రామకృష్ణారెడ్డి 1987లో "ది ఎకనామిక్ డెవలప్మెంట్ ఆఫ్ హైదరాబాద్ స్టేట్" 1911-1950 అనే గ్రంథాన్ని వెలువరించారు.
- మెదక్ సుబా (విభజన పూర్వపు మెదక్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాలు) కు సంబంధించి, ఆచార్య వి. రామకృష్ణారెడ్డి మేజర్ రీసెర్చి ప్రాజెక్ట్ చేపట్టి, "సోషల్ అండ్ ఎకనామిక్ డైనమిక్స్ ఆఫ్ మెదక్ సుబా ఆఫ్ ఫార్మర్ హైదరాబాద్ స్టేట్, 1905 1950 ఎ.డి.ను అగ్రికల్చర్ డెవలప్మెంట్ ఆఫ్ మెదక్ సుబా ఆఫ్ ఫార్మర్ హైదరాబాద్ స్టేట్, 1905-1950 ఎ.డి.ను వరుసగా 2012, 2014 ల్లో ప్రాజెక్ట్ రిపోర్ట్స్ తీసుకొని వచ్చారు.
- శ్రీ.యస్. కేశవ అయ్యంగార్ ఆర్థిక సర్వేలను జరిపి "ఎకనామిక్ ఇన్వెస్టిగేషన్స్ ఇన్ ది హైదరాబాద్ స్టేట్, 1929-30, రూరల్ ఎకనామిక్ ఎన్క్వరీస్ ఆఫ్ హైదరాబాద్ స్టేట్, 1949-51లను అందించడం జరిగింది.
- టెనెన్సీ కమిటీ రిపోర్ట్ (1940), రిపోర్ట్ ఆన్ అగ్రికల్చరల్ ఇన్‌డెటెడ్‌నెస్ (1937), ది బ్యాంకింగ్ ఎన్క్వైరీ కమిటీ రిపోర్ట్ (1930), ది. అగ్రేరియన్ రిఫార్మ్స్ కమిటీ రిపోర్ట్ (1949), రాయల్ కమిషన్ రిపోర్ట్ ఆన్ జాగీర్ అడ్మినిస్ట్రేషన్ అండ్ రిఫార్మ్స్ (1947) వస్తాయి.
- హైదరాబాద్ రాష్ట్రంలో వచ్చిన ఉద్యమాలు, ప్రజా సామాజిక ఉద్యమాలు, రైతాంగ పోరాటం, స్వాతంత్ర్య పోరాటం, విలీనోద్యమాన్ని గురించి వీటిలో పాల్గొన్న నాయకులు వారి రచనలు ఆధునిక తెలంగాణకు సంబంధించిన అంశాలు తెలియ జేస్తున్నాయి.
- పోరాట నాయకులు (రచనలు చేసిన వారు) రావి నారాయణరెడ్డి, డి. వెంకటేశ్వరరావు, సురవరం ప్రతాపరెడ్డి, శ్రీ మాడపాటి హనుమంతరావు, మందముల నర్సింగరావు, యమ్.బసవపున్నయ్య మొదలైన వారు రచనల ద్వారా విలువైన సమాచారాన్ని అందించారు.
- ఆధునిక తెలంగాణకు సంబంధించిన సమాచారం అందించిన పత్రికలు గోలకొండ పత్రిక, దక్కన్ క్రానికల్, మీజాన్, ది హిందు, రయ్యత్, సంచికలు : హైదరాబాద్ ఇన్ఫర్మేషన్, ది హైదరాబాద్ బులెటిన్, ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ మొదలైనవి.
- హైదరాబాద్ డిస్ట్రిక్ గెజిటీర్స్, 1931-1936, యమ్.వి. రాజగోపాల్, ఆంధ్రప్రదేశ్ డిస్ట్రిక్ గెజిటీర్స్ 1976, ఇంపీరియల్ గెజిటీర్ ఆఫ్ ఇండియా, ప్రావిన్షియల్ సిరీస్, హైదరాబాద్ స్టేట్, 1909.
- యస్. రమేషన్ (ఎడిటెడ్) ది ఫ్రీడమ్ స్ట్రగుల్ ఇన్ హైదరాబాద్, నాలుగు సంపుటాలు, 1966, ఆధునిక తెలంగాణ చరిత్రకు సంబంధించిన కీలక సమాచారాన్ని అందిస్తున్నాయి.

తెలంగాణ చరిత్రకు వ్యక్తిగత రచనలు


- యస్.హెచ్. బిల్గ్రామి మరియు సి. విల్‌మోట్‌లు రచించిన "హిస్టారికల్ అండ్ డిస్క్రిప్టివ్ స్కెచ్ ఆఫ్ హిజ్ హైనెస్ ది నిజామ్స్ డొమినియన్స్, 1983.
- ఎ.ఐ.ఖురేషి, 'ది ఎకనామిక్ డెవలప్‌మెంట్ ఆఫ్ హైదరాబాద్' సంపుటి-1, 1941.
- జె.డి.బి. గ్రిబుల్ 'ఏ. హిస్టరీ ఆఫ్ ది దక్కన్ సంపుటి-1', 1896.
- క్రిస్టఫ్ వాన్ ఫ్యూరర్ అండ్ హైమండార్ఫ్ / ది అబోరిజనల్ ట్రైబ్స్ ఆఫ్ హైదరాబాద్.

పురావస్తు ఆధారాలు

- వివిధ ప్రాంతాలలో జరిపిన తవ్వకాలలో లభించిన భౌతిక అవశేషాలను పురావస్తు ఆధారాలంటారు.
- చరిత్ర పూర్వ యుగానికి చెందిన (ప్రాచీన, నవీన శిలాయుగానికి) నివాస స్థలాలు, మృణ్మయ పాత్రలు, సమాధులు మొదలైనవి ఆధారాలుగా ఉపయోగపడతాయి.
- ప్రాచీన శిలాయుగ ఆవాసాలు తెలంగాణలో ఎక్కువగా కన్పిస్తాయి. కుమ్రంభీం జిల్లాలోని ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలోని లక్సెట్టిపేట, నాగర్ కర్నూల్ జిల్లాలోని అమ్రాబాద్, పెద్దపల్లి జిల్లాలోని రామగిరి, నల్గొండ జిల్లాలోని ఏలేశ్వరం, నార్కెట్‌పల్లి, యాదాద్రి జిల్లాలోని వలిగొండ వంటి ప్రాంతాల్లో లభ్యమయ్యాయి.
- నవీన శిలాయుగానికి సంబంధించిన బూడిద దిబ్బలు, రాతి పనిముట్లు, కుండ పెంకులు తెలంగాణ అంతట లభ్యమయ్యాయి.
- మెగాలిథిక్ లేదా బృహత్ శిలాయుగానికి చెందిన సమాధులు హైదరాబాద్ (కొండాపూర్, బోయినపల్లి) విభజన పూర్వపు నల్గొండ, కరీంనగర్ ప్రాంతాలలో కన్పిస్తాయి. ■

"విద్య విద్యార్థులను వారి సంస్కృతి, సామాజిక వాస్తవికత నుండి దూరం చేయకూడదు. బంధాన్ని బలోపేతం చేయాలి. పౌర బాధ్యతలను అందించాలి. సామాజిక సామరస్యాన్ని పెంపొందించాలి" అని అంటారు మహాత్మాగాంధీ. తల్లిదండ్రులు మొదలుకొని కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, సమాజం వరకు అన్నిచోట్ల కూడా సామాజిక బాధ్యతను పెంపొందించే అంశాలను పిల్లలకు నేర్పాలి. తమ వారితో పాటు, ఇరుగుపొరుగు కష్టసుఖాల్లో కూడా పాలుపంచుకునే సహాయక గుణం పిల్లలకు అలవడేలా చూడాలి. పేద, ధనికా తేడా లేకుండా అందరూ ఒక్కటేనన్న సమానత్వ భావన పెంపొందించబడాలి. అంటరానితనపు ఛాయలు కనబడకుండా కుల, మత, వర్గ రహిత వాతావరణం ఇంటా, బయటా నెలకొల్పబడాలి.

చదువే కాదు సామాజిక బాధ్యతనూ నేర్పాలి



వరగంటి అశోక్
9493001171

"వినయం లేని విద్య,
సుగుణం లేని రూపం,
ఉపయోగం లేని ధనం,
శౌర్యం లేని ఆయుధం,
ఆకలి లేని భోజనం,
పరోపకారం చేయని జీవితం..

వ్యర్థమైనవి అంటారు భారతీయ తత్త్వవేత్త స్వామి వివేకానంద. మనిషి అనేవాడు రూపంలో, జ్ఞానంలో, సంపదలో ఎంత ఉన్నత స్థాయిలో ఉన్నప్పటికీ గుణం, వినయం, ఉపకార భావన, మానవతా విలువలు లేకపోతే ఆ మనిషి అధముడే. నేర్చుకున్న జ్ఞానం మనిషికి ఉపాధిని ఇవ్వడమే కాదు.. తన వ్యక్తిత్వం ఉన్నతంగా రూపుదిద్దుకోవడానికి, సమాజం పట్ల సానుకూల దృక్పథం ఏర్పడడానికి దోహదపడేదిగా ఉండాలి. సంపాదించిన డబ్బుతో విలాసవంత మైన జీవనం గడపడమే పరమావధికాకుండా.. ఆకలితో అలమటిస్తున్న పేదల క్షుద్బాధ తీర్చేదిగా, అవసరమైన వారికి ఆపన్నహస్తం అందించేందుకు సిద్ధం చేసేదిగా ఉండాలి.

మనిషి సంఘజీవి. పుట్టుక నుండి మొదలుపెట్టి.. కుటుంబం, స్నేహితులు, పాఠశాల, సమాజం, ప్రకృతి, పరిసరాలు తదితరుల నుండి నిరంతరం ఎంతో కొంత నేర్చుకుంటూ తన ప్రయాణం సాగిస్తాడు. ఈ నేర్చుకునే క్రమంలో విద్యార్థి అభ్యసన సరైన దృక్పథంతో సాగితే ఉత్తమ పౌరులు, సమాజ శ్రేయస్సు కోరే మనుషులు ఆవిష్కరించబడతారు. అభ్యసన సరైన దిశగా సాగకపోతే స్వార్థపరులు, మూఢులు, వినాశకారులు తయారవుతారు. అందుకే విద్యను అందించే కేంద్రాలు విద్యార్థిని సంపూర్ణవంతమైన పౌరుడిగా రూపొందించే కార్ఖానాలుగా పరిణామం చెందాలి. చదువుతోపాటు సామాజిక విలువలను అలవర్చే ఉత్పత్తి కేంద్రాలుగా రూపాంతరం చెందాలి. ఈ మార్పు కుటుంబం నుండి మొదలై సమాజం వరకు వ్యాపించాలి.

పుట్టిన బిడ్డకు మొదటి గురువులు అమ్మానాన్నలే. మాటలు, నడక, నడవడిక నేర్పించాల్సిన ఆదిగురువులు తమ సంతతిని ప్రతీ అంశాన్ని , అనుభవాన్ని వాస్తవిక దృష్టితో చూసే విధంగా తయారు చేయాలి. భౌతికవాద దృక్పథాన్ని అలవర్చుకునేలా ప్రేరేపించాలి. అబద్ధాలు, అర్థసత్యాలు, ఊహాగానాలతో కూడిన కాకమ్మ కథలు, మాయలు- మంత్రాలు, దైవిక - అదైవిక అభూత కల్పనల వంటి అంశాలు చెప్పి, పిల్లల మనస్సులో అవాస్తవపు బీజాలు నాటే పురాతన సంస్కృతినుండి బయటపడాలి. అనంతమైన సృష్టి రహస్యాలు, చరాచర పదార్థాల గమనం, జీవుల పరిణామ క్రమం, మానవ ఆవిర్భావం, చారిత్రక ఆధారాలు, సాంకేతిక అభివృద్ధి వంటి అంశాలను పిల్లల స్థాయికి అనుగుణంగా కథనాలుగా చెప్పాలి, వివరించాలి. అంటరానితనం, అస్పృశ్యత అంటే ఏంటో పిల్లలకు తెలియకుండా, వారి దరిదాపుల్లోకి రాకుండా ఉండేవిధంగా తమ నడవడిక ఉండాలి. ఇంట్లో పెద్దలపట్ల తల్లిదండ్రుల ప్రవర్తన, పిన్నల పైన వారు చూపే ఆప్యాయత ఆదర్శప్రాయంగా ఉండాలి. ఇరుగుపొరుగు వారితో చూపే సఖ్యత, కుల- మతాల అంతరాలు లేకుండా సోదరభావంతో మెలిగే తీరు పిల్లలకు మార్గదర్శకంగా ఉండాలి.

ఇక..పాఠశాలకు వచ్చే విద్యార్థికి చదువుతో పాటు క్రమశిక్షణ అలవడేలా ఉపాధ్యాయులు కృషి చేయాలి. కుటుంబ వ్యవస్థ, సమాజం పట్ల సానుకూలమైన ఆలోచనలు రేకెత్తించాలి. ప్రకృతి నియమాలు, చలన సూత్రాలపై సునిశితమైన వైఖరిని నేర్పించాలి. మన సంస్కృతి సాంప్రదాయాలలో అంతర్లీనంగా దాగి ఉన్న శాస్త్రీయ ఆలోచనలు, ప్రజలు పాటిస్తున్న మూఢాచారాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించాలి. పిల్లలు శారీరకంగానూ, మానసికంగానూ దృఢత్వం పొందేలా తర్ఫీదునిచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి ఉపాధ్యాయులు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం, కష్టాల్లో కొట్టుమిట్టాడుతున్న అభాగ్యులకు ఆసరాగా నిలవడం పిల్లలకు అలవడాలి. ఆరోగ్యానికి హానికరమైన, సమాజానికి చీడగా దాపురించిన దురలవాట్లను వ్యతిరేకించాలి. మార్పుదిశగా ఆలోచించాలి. వీటన్నింటి కోసం పాఠశాల, ఉపాధ్యాయులు నిరంతరం శ్రమించాలి.

విద్యార్థుల భావి జీవితానికి భరోసానిచ్చేలా, ఉపాధి కల్పనకు అవకాశం కల్పించేలా సిలబస్ రూపొందించబడాలి. అంధ విశ్వాసాలు, అభూత కల్పనలను ప్రోత్సాహించే పాఠ్యాంశాలను తొలగించి వాస్తవిక దృక్పథం, శాస్త్రీయ ఆలోచనలు, రాజ్యాంగ లక్ష్యాలను పెంపొందించే అంశాలను పాఠ్యాంశాలుగా పెట్టాలి. చదువే చదువు పిల్లలకు ఉద్యోగావకాశాలు కల్పించడమే కాదు, స్వయం ఉపాధిని పొందేలా ప్రభుత్వాలు సిలబస్ లో తగు మార్పులు చేయాలి. విద్యారంగానికి బడ్జెట్లో పుష్కలమైన నిధులు కేటాయించి పురోగామి లక్షణాలు కలిగిన భావిభారత నిర్మాతల అంకురార్పణకు పునాది వేయాలి. స్నేహితులు, యువకులు, పెద్దలు, సమాజం కూడా పిల్లలపై గణనీయమైన ప్రభావం చూపుతుంది. తమకన్నా వయసులో పెద్దవారైన గ్రామంలోని యువకుల నడవడిక, అలవాట్లు, తమ కుటుంబం లేదా ఇరుగుపొరుగు ఇండ్లలోని పెద్దల నిత్యకృత్యాలు పిల్లల మనస్తత్వం, ప్రవర్తనలో మార్పును చూపిస్తాయి. పెద్దలు, యువకులు దురలవాట్లకు బానిసై తమ ఆరోగ్యం, కుటుంబ జీవనాన్ని నాశనం చేసుకుంటుంటే.. అది చూసి, వారి అడుగుజాడల్లో నడిచే పిల్లలు కూడా సమాజానికి చీడ పురుగులుగా ఉద్భవిస్తారు. అలా కాకుండా సన్మార్గంలో పయనిస్తూ, సమాజ శ్రేయోభిలాషులుగా వ్యవహరిస్తుంటే, బాధ్యతను ప్రదర్శిస్తుంటే.. ముందు తరాలకు సలక్షణాలు, సామాజిక బాధ్యత కలిగిన వారసత్వాన్ని అందించినవారవుతారు.



"విద్య విద్యార్థులను వారి సంస్కృతి, సామాజిక వాస్తవికత నుండి దూరం చేయకూడదు. బంధాన్ని బలోపేతం చేయాలి. పౌర బాధ్యతలను అందించాలి. సామాజిక సామరస్యాన్ని పెంపొందించాలి" అని అంటారు మహాత్మాగాంధీ. తల్లిదండ్రులు మొదలుకొని కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, సమాజం వరకు అన్నిచోట్ల కూడా సామాజిక బాధ్యతను పెంపొందించే అంశాలను పిల్లలకు నేర్పాలి. తమ వారితో పాటు, ఇరుగుపొరుగు కష్టసుఖాల్లో కూడా పాలుపంచుకునే సహాయక గుణం పిల్లలకు అలవడేలా చూడాలి. పేద, ధనికా తేడా లేకుండా అందరూ ఒక్కటేనన్న సమానత్వ భావన పెంపొందించబడాలి. అంటరానితనపు ఛాయలు కనబడకుండా కుల, మత, వర్గ రహిత వాతావరణం ఇంటా, బయటా నెలకొల్పబడాలి. అంధ విశ్వాసాలకు ఆస్కారం లేకుండా, వాస్తవిక దృక్పథం అలవర్చే కరికులంతో కూడిన విద్యా విధానం రావాలి. పాఠ్యాంశాలతో పాటు సామాజిక విలువలు, శాస్త్రీయ ఆలోచనలు, హేతువాద దృక్పథం పెంపొందించేలా బోధన కొనసాగాలి. అప్పుడే కుటుంబం, పాఠశాల, సమాజం అనే కార్ఖానాల్లో ఉత్పత్తి చేయబడే విద్యార్థులు అనబడే నాణ్యమైన సరుకులు ఈ సమాజానికి, ఈ దేశానికి ఉపయోగపడే ఉన్నతమైన పౌరులుగా రూపొందించబడతారు.నూతన సమాజ ఆవిష్కరణలో భాగస్వాములవుతారు. ■

దీపిక

అసమానతలు..ప్రమాణికాలు..కొలమానాలు!



మామిడి నారాయణ
9441066032

పంజాబ్, హర్యానా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఎస్సీ రిజర్వేషన్ల కోసం వేసిన కమిషన్లు ఫలితాలు తీసుకొస్తున్నాయి. కర్నాటకలో 2005 సదాశివ కమిషన్, తమిళనాడులో 2008 జనార్దన్ కమిషన్, ఉత్తరప్రదేశ్ లో 2001 హుకుం సింగ్ కమిషన్, మహారాష్ట్రలో 2003 లహూజీ కమిషన్ ప్రకారం వర్గీకరణ చేసుకునేందుకు ఆగష్టు ఒకటో తారీఖున సుప్రీంకోర్టు తీర్పు రూపంలో మార్గం సుగమమైంది. చేవెళ్ల డిక్లరేషన్ సభలో " ఎస్సీలతోపాటు ఎస్టీ రిజర్వేషన్లను కూడా పంచుతాం, పంచాయితీ తెంచుతాం" అని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు రాగానే వర్గీకరణను అమలు చేస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, అవసరమైతే ఆర్డినెన్స్ ద్వారా తక్షణమే అమలు చేస్తామని ఒక అడుగు ముందుకేసి తెలంగాణ ముఖ్యమంత్రి ప్రకటించారు. అయితే అసమానతలను ప్రామాణిక కొలమానాల కచ్చితమైన డేటా అధారంగా శాస్త్రీయంగా వర్గీకరణ చేయాలని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. మానవ పరిణామ క్రమంలో సమాజంలో వచ్చిన మార్పులు అసమానతలు చాలా బయటపడ్డాయి. 'ఒకే కుటుంబంలో ఇద్దరు అన్నదమ్ముల మధ్యనే వ్యత్యాసాలు ఉన్నప్పుడు కులాల మధ్య వ్యత్యాసాలు ఉండవా' అనేది కులవాదుల అభిప్రాయం. అయితే ప్రాచీన కాలంలో బలవంతులు బలహీనులను బానిసలుగా చేసుకొని అధిపత్యం చేసేవారని చరిత్ర చూస్తే అర్థం చేసుకోవచ్చు. రానురానూ ఆధిపత్యం వర్ణ వ్యవస్థగా రూపాంతరం చెందినట్లుగా కూడా అనేక చారిత్రక ఆధారాలున్నాయి. ఆధునిక కాలంలో మేధో చైతన్యం కలిగినవారు తమ నైపుణ్యాలతో, ఎత్తుగడలతో వివిధ వర్గాలను తమ అధీనంలో ఉంచుకోవాలని ప్రయత్నిస్తారు. ఇప్పటివరకు జరిగిందిదే.వర్గీకరణ అంశంపై పేదల పక్షాన పోరాడే ఒకటి,రెండు పార్టీలు మినహా ఎవరికి స్పష్టత లేదు.రాజకీయాల కొలమానంగానే దీన్ని బలపరుస్తున్నారు. కానీ సామాజిక కోణంలో వ్యత్యాసాల్ని,అసమానతల్ని రూపుమాపేలా వర్గీకరణ ఉండాల్సిన అవసరం ఉన్నది.



రిజర్వేషన్ల వర్గీకరణ విద్యా, ఉద్యోగ రంగాల్లో తగుప్రాతినిధ్యం కోసం చేశామని వాదించిన ప్రభుత్వాలు, ఉమ్మడి రాష్ట్రం రెండుగా విడిపోయిన తర్వాత ఎస్సీ కులాల ప్రగతి, ప్రతినిధ్యంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో గణనీయమైన తేడాలున్నాయి. ఎస్సీలతో పాటుగా ఎస్టీ ఉపకులాలకు రిజర్వేషన్ల విభజన "పరిమాణాత్మక, ప్రదర్శించదగిన డేటా" ఆధారంగా నిర్వహించాలని, "ఇష్టాలు లేదా రాజకీయ ప్రయోజనాల కోసం" కాదు అని సుప్రీంకోర్టు చాలా స్పష్టంగా చెప్పింది.అందుకు ఎస్సీ,ఎస్టీ కులాలను, వర్గీకరణ గ్రూపుల నిర్ధారణకు కొలమానాలుగా ముందుగా జనాభా లెక్కలు చేపట్టాలనే వాదన ఇప్పుడు ముందుకొచ్చింది. ఇది అవసరం కూడా.

మనదేశంలో 1882లో మొదటగా విలియం హంటర్ మహాత్మా జ్యోతిరావు పూలే బ్రహ్మణేతరులకు ఉద్యోగాల్లో రిజర్వేషన్ విధాన ప్రతిపాదన చేశారు. 1892 మధ్యకాలంలో కొల్హాపూర్ మహారాజు ఛత్రపతి సాహు మొదటిసారిగా బ్రహ్మణేతరులకు ఉద్యోగాల్లో బాగస్వామ్యం కల్పించారు. 1902లో దాన్ని చట్టబద్ధం చేసి యాభై శాతానికి పెంచుతూ చట్టం చేశారు. 1909లో బ్రిటిషువారు తమపాలనలో భారతీయులకు చట్టసభల్లో అవకాశం కల్పిస్తూ చట్టం చేశారు. 1921 సెప్టెంబర్ 16 జస్టిస్ పార్టీ తొలిసారిగా బ్రిటిషు వారి చట్టాన్ని ఆమోదించడంతో ప్రజల చేత ఎన్నుకోబడిన మొదటి సంస్థగా చరిత్రకెక్కింది. 1932 రౌండ్ టేబుల్ సమావేశానంతరం సిక్కులు, ముస్లింలు, క్రైస్తవులకు ప్రత్యేక ప్రాతినిధ్యం కల్పించబడింది. స్వాతంత్ర్యానాంతరం దేశంలో అస్పృశ్యత ఆధారంగా 1954 నుండి ఎస్సీ,ఎస్టీలకు అనంతరం కమిషన్ రిపోర్ట్ సూచనలతో వెనుకబాటుతనం ఆధారంగా 1970 సెప్టెంబర్ 23 నుండి జీవో నెం 1793 ద్వారా వెనుకబడిన కులాలకు రిజర్వేషన్లు అమలు చేస్తున్నారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలలో వివిధ కులాలవారు తమను కూడా రిజర్వేషన్ల పరిధిలో చేర్చాలని ఉద్యమాలు చేస్తూనే ఉన్నారు. గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల్లో పాటిధర్, గుర్జర్ల ఉద్యమాలు అందుకు ఉదాహరణలు.కానీ వాటి లక్ష్యాలు నేరవేరలేదు.

1975లో పంజాబ్ ప్రభుత్వం తమ రాష్ట్రంలో 32శాతం జనాభా కలిగిన ఎస్సీ కులాలకు ఉన్నటువంటి 25 శాతం రిజర్వేషన్లను, ఎ,బి అను రెండు కేటగిరిలుగా విభజించింది. 1994లో హర్యానా రాష్ట్రంలో 20శాతం జనాభా కలిగిన ఎస్సీ కులాలకు ఉన్న 20శాతం రిజర్వేషన్లను ఎ,బి కేటగిరిలుగా, 1997 జూన్ 6న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎస్సీలకు ఉన్న 15శాతం రిజర్వేషన్లను ఎబిసిడి నాలుగు కేటగిరిలుగా విభజించింది. ఇవి చెన్నయ్య అనే వ్యక్తి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన చట్టాన్ని హైకోర్టులో సవాలు చేయగా, చట్టం సరైనదేనని చెప్పిన తీర్పుపై సుప్రీం కోర్టులో అప్పీల్ చేయగా అర్టికల్ 341లో జోక్యం చేసుకునే అధికారం రాష్ట్రాలకు లేదని వర్గీకరణ చట్టం చెల్లదని 2004 నవంబర్‌లో ఐదుగురు జడ్జిల సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు చెప్పింది. దాంతో దావింధర్ సింగ్ అనే వ్యక్తి, పంజాబ్ ప్రభుత్వం చేసిన వర్గీకరణ చట్టాన్ని పంజాబ్ హైకోర్టులో సవాల్ చేయగా చట్టాన్ని కొట్టి వేసింది. పంజాబ్ ప్రభుత్వం వెంటనే ఇవి చెన్నయ్య కేసు తీర్పుపై సుప్రీంకోర్టులో అప్పీల్ చేయగా ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు కర్నాటక రాష్ట్రం, అనుకూల వ్యతిరేక సంఘాలు మొత్తం 22 మంది పిటిషన్ దారులమని కేసులో భాగస్వాములయ్యారు. 20ఏండ్ల సుదీర్ఘకాలం తర్వాత ఏడుగురు జడ్జిల ధర్మాసనం ఆగష్టు ఒకటిన ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలుపుతూ తీర్పును వెలువరించింది.ఇది ఆహ్వానించదగిగ పరిణామం. అయితే ఇందులో అసమానతలు, కొలమానాలు, వర్గీకరణకు సంబంధించిన అంశాలు చాలా లోతుగా అధ్యాయనం చేయాల్సిన అవసరమైతే ఉన్నది.

రిజర్వేషన్ల వర్గీకరణ విద్యా, ఉద్యోగ రంగాల్లో తగుప్రాతినిధ్యం కోసం చేశామని వాదించిన ప్రభుత్వాలు, ఉమ్మడి రాష్ట్రం రెండుగా విడిపోయిన తర్వాత ఎస్సీ కులాల ప్రగతి, ప్రతినిధ్యంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో గణనీయమైన తేడాలున్నాయి. ఎస్సీలతో పాటుగా ఎస్టీ ఉపకులాలకు రిజర్వేషన్ల విభజన "పరిమాణాత్మక, ప్రదర్శించదగిన డేటా" ఆధారంగా నిర్వహించాలని, "ఇష్టాలు లేదా రాజకీయ ప్రయోజనాల కోసం" కాదు అని సుప్రీంకోర్టు చాలా స్పష్టంగా చెప్పింది.అందుకు ఎస్సీ,ఎస్టీ కులాలను, వర్గీకరణ గ్రూపుల నిర్ధారణకు కొలమానాలుగా ముం దుగా జనాభా లెక్కలు చేపట్టాలనే వాదన ఇప్పుడు ముందుకొచ్చింది. ఇది అవసరం కూడా. బీహార్‌లో కులగణన చేపట్టిన తర్వాత కులాల మధ్య తారతమ్యాలు వెలుగుచూశాయి. అయితే సుప్రీంకోర్టు పేర్కొన్నట్లు సహజ సమన్యాయ సూత్రం పాటించేలా వర్గీకరిస్తే విమర్శలకు తావుండదు. ■